
‘ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 164

మంగళవారం 3-9-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పతకాల మోత..

పారిస్ పారాలింపిక్స్‌లో సోమవారం భారత క్రీడాకారులు 7 పతకాలతో అదరగొట్టారు. బ్యాడ్మింటన్‌లో నితేశ్, జావెలిన్ త్రోలో సుమిత్ స్వర్ణ పతకాలు గెలిచారు. బ్యాడ్మింటన్‌లోనే సుహాస్, తులసిమతి రజత పతకాలు నెగ్గగా... మనీషాకు కాంస్యం లభించింది. డిస్కస్ త్రోలో యోగేశ్ రజతం సాధించాడు. ఆర్చరీ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో శీతల్ దేవి-రాకేశ్ జోడీకి కాంస్యం లభించింది. - 14లో

న్యూస్‌రీల్

ఇదెక్కడి బుల్డోజర్ న్యాయం?



బుల్డోజర్ న్యాయంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. పలు రాష్ట్రాల్లోని బుల్డోజర్ సంస్కృతిపై అసహనం వ్యక్తం చేసింది. క్రిమినల్ కేసుల్లో నిందితులైన వారి ఇళ్లను కొన్ని రాష్ట్రాల్లో బుల్డోజర్లతో కూల్చివేయడంపై ఆందోళన వ్యక్తం చేసింది.

- వివరాలు 6లో

సాగుకు భారీ ఊతం



వ్యవసాయ రంగానికి ఊతమివ్వడంతోపాటు ఆహార భద్రతను పెంచే లక్ష్యంతో రూ.14 వేల కోట్లతో ఏడు నూతన సాగు పథకాలకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ప్రధాని మోదీ సారథ్యంలో ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

- వివరాలు 6లో

ఆప్ ఎమ్మెల్యే అరెస్ట్



ఢిల్లీ వక్ఫ్ బోర్డులో అవకతవకలతోపాటు ఆదాయానికి మించి ఆస్తుల కేసులను ఎదుర్కొంటున్న ఢిల్లీ ఆప్ ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్‌ను ఈడీ అరెస్ట్‌చేసింది. సోమవారం ఉదయం ఆరింటికే అమానతుల్లా ఇంటికి చేరుకున్న ఈడీ అధికారులు చాలా సేపు సోదాలు చేశారు.

- వివరాలు 6లో



ఖమ్మం వెంకటేశ్వర నగర్‌లో బురదనీటిలో సామగ్రిని శుభ్రం చేసుకుంటున్న వరద బాధితులు

- సోమవారం వాన కాస్త తెరిపినిచ్చినా తగ్గని ముంపు ప్రభావం
- ఖమ్మంలో సర్వం మున్నేరార్పణం.. కట్టుబట్టలతో మిగిలిన జనం
- వరంగల్, నల్లగొండ జిల్లాల్లోనూ చాలా చోట్ల వరద విధ్వంసం
- వరద తాకిడికి కూలిపోయిన ఇళ్లు.. తడిసిపోయిన సామగ్రి, నిత్యావసరాలు
- వందల గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లు.. నీట మునిగిన పంటలు
- జనావాసాల్లో నిలిచిన నీటిని తొలగిస్తున్న ప్రభుత్వ యంత్రాంగం

వరద విధ్వంసం

భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో జనజీవనం అస్తవ్యస్తం

- ఖమ్మం జిల్లాలో బాధితులకు డ్రోన్లతో ఆహార పొట్లాల పంపిణీ
- క్షేత్రస్థాయిలో ఉంటూ పరిస్థితిని సమీక్షిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రులు
- వర్షాలతో దెబ్బతిన్న జిల్లాల్లో పర్యటిస్తున్న సీఎం రేవంత్ బృందం
- ముందస్తు సమాచారం లేకనే వరదల్లో చిక్కుకున్నామంటున్న బాధితులు

సాక్షి, హైదరాబాద్/ సాక్షి నెట్‌వర్క్: మూడు రోజుల పాటు కురిసిన కుండపోత వానలు రాష్ట్రంలో విధ్వంసం సృష్టించాయి. వందల గ్రామాలకు వెళ్లే రహదారులు కొట్టుకుపోయాయి. అనేక చోట్ల చెరువులు, కాలువలకు గండ్లు పడ్డాయి. లక్షల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ఏకబిగిన కురిసిన వానలతో జనావాసాల్లోకి వరదలు పోటెత్తడంతో వేలాది ఇళ్లు నీటమునిగాయి. సామగ్రి, నిత్యావసరాలు పాడైపోయాయి. ద్విచక్రవాహనాలు, కార్లు దెబ్బతిన్నాయి. సోమవారం మధ్యాహ్నం సమయానికి వర్షాలు తగ్గుముఖం పట్టినా.. వరదలు ఇంకా తగ్గలేదు. ఈ క్రమంలో పోలీసులు, డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ఖమ్మం జిల్లాలో మిగతా 2వ పేజీలో ▶

రూ.5,438 కోట్ల నష్టం

- తక్షణ తాత్కాలిక ఉపశమనంగా ఈ నిధులివ్వాలని ప్రధానిని కోరాం: రేవంత్
- వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా 4–5 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి
- 16 మంది ప్రాణాలు కోల్పోయారు
- వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుంది.. ఆందోళన వద్దు
- వ్యాపార, స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలి
- వచ్చే ఐదారు రోజులు అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- ఖమ్మం, సూర్యాపేటలో వర్షాలు, వరదలపై సీఎం సమీక్ష
- ఖమ్మంలో వరద ముంపు ప్రాంతాల్లో పర్యటన.. బాధితులకు పరామర్శ



ఖమ్మంలో వరద బాధితురాలిని పరామర్శిస్తున్న సీఎం రేవంత్

సాక్షి ప్రతినిధి, ఖమ్మం/సాక్షి ప్రతినిధి, నల్లగొండ: గత మూడు రోజులుగా వర్షాలు, వరదలతో రాష్ట్రంలో రూ.5,438 కోట్ల నష్టం వాటిల్లిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సర్వం కోల్పోయిన రాష్ట్ర ప్రజలను ఆదుకునేందుకు తక్షణ తాత్కాలిక ఉపశమనంగా ఈ నిధులను మంజూరు చేయాల్సిందిగా ప్రధానమంత్రిని, కేంద్ర హోం శాఖ మంత్రిని కోరామని మిగతా 2వ పేజీలో ▶

జాతీయ విపత్తుగా ప్రకటించండి

ప్రధాని మోదీకి సీఎం రేవంత్ విజ్ఞప్తి

- వర్షాలు, వరదలతో వాటిల్లిన భారీ నష్టం పరిశీలనకు రాష్ట్రానికి రావాల్సిందిగా ఆహ్వానం
- వర్షాలు, వరదలపై సమీక్షలో సీఎం కీలక నిర్ణయాలు
- మృతుల కుటుంబాలకు ఇచ్చే పరిహారం రూ.4 లక్షల నుంచి 5 లక్షలకు పెంపు
- ఎన్డీఆర్ఎఫ్ తరహాలో టీజీడీఆర్ఎఫ్ ఏర్పాటుకు నిర్ణయం



2లో



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్న దృశ్యం

శ్రీరాంసాగర్ 41 గేట్లు ఎత్తివేత

- పోటెత్తిన ఎగువ గోదావరి
- కడెం, శ్రీరాంసాగర్, ఎల్లంపల్లికి కొనసాగుతున్న వరద ఉధృతి
- సింగూరు, నిజాంసాగర్‌కు సైతం భారీ వరద
- ఎల్లంపల్లి నుంచి కాళేశ్వరం బరాజ్‌లకు నీటి విడుదల

- వివరాలు 5లో

లక్షల ఎకరాల్లోని పంటలు వరదలోనే...

- భారీ వర్షాలు, వరదలతో రాష్ట్రవ్యాప్తంగా నీటమునిగిన 15 లక్షల ఎకరాల పంటలు
- 4.15 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా తేల్చిన వ్యవసాయ శాఖ
- వరి, పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, కంది సహా ఇతరత్రా పంటలకు తీవ్ర నష్టం



3లో

హైదరాబాద్-విజయవాడ రాకపోకల పునరుద్ధరణ

- రామాపురం క్రాస్ రోడ్డు నుంచి ఒక మార్గంలో వాహనాలకు అనుమతి
- హైదరాబాద్-విజయవాడ రైల్వేమార్గంలో కొనసాగుతున్న మరమ్మతు పనులు
- మొత్తంగా 126 రైళ్లు, 512 బస్సుల రద్దు
- పాలేరువాగు వంతెనను పరిశీలించిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



16లో

ఆ వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం



- సీనియర్ ఐఏఎస్ స్మితా సబర్వాల్ దివ్యాంగులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమైనవని హైకోర్టు అభిప్రాయపడింది. ఓ అధికారిగా ఆమె ఎవరి రిజర్వేషన్లను తొలగించలేదని, ఆమె వ్యాఖ్యలతో దివ్యాంగుల రిజర్వేషన్లు తొలగించడం కూడా జరగలేదని స్పష్టం చేసింది. -12లో

ఉన్నత స్థానాల్లోని వారు బాధ్యతగా ఉండాలి

- న్యాయమూర్తులు, న్యాయవాదులను రాజకీయాల్లోకి ఎందుకు లాగుతారు?
- కవితకు బెయిల్‌పై కాంగ్రెస్ సోషల్ మీడియాలో వచ్చిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు అసంతృప్తి
- ‘ఓటుకు కోట్లు’ కేసును వేరే రాష్ట్రానికి బదిలీచేయాలన్న పిటిషన్‌పై విచారణ సందర్భంగా వ్యాఖ్యలు
- ఆ కేసులో తెలంగాణ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి, ఇతర నిందితులకు నోటీసులు
- విచారణ రెండు వారాల పాటు వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరైన సమయంలో తెలంగాణ కాంగ్రెస్ సోషల్ మీడియా ఖాతాల్లో పెట్టిన పోస్టులపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఉన్నత స్థానాల్లో ఉండేవారు బాధ్యతగా వ్యవహరించాలని వ్యాఖ్యానించింది. రాజకీయాల్లోకి న్యాయమూర్తు లు, న్యాయవాదులను ఎందుకు లాగుతారని సీఎం రేవంత్‌రెడ్డి తరఫు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, సిద్ధార్థ లూత్రాలను ప్రశ్నించింది. న్యాయమూర్తులు, న్యాయవాదులపై పోస్టులకు సంబంధించి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

‘ఓటుకు కోట్లు’ను వేరే రాష్ట్రానికి బదిలీ చేయండి

‘ఓటుకు కోట్లు’ కేసును హైదరాబాద్ నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని, కవిత బెయిల్ సమయంలో న్యాయవ్యవస్థ స్వతంత్రతపై సీఎం రేవంత్ వివాదాస్పద కామెంట్లు చేశారని పేర్కొంటూ బీఆర్ఎస్ నేతలు జగదీశ్‌రెడ్డి, ఇతరులు దాఖలు చేసిన ఇంటర్ లోకేటరీ అప్లికేషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం మిగతా 12వ పేజీలో ▶

రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- వరదలతో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్
- ఇళ్లు కోల్పోయిన వారికి రూ.5 లక్షలు ఇవ్వాలి
- భారీ వర్ష సూచన ఉన్నా కుంభకర్ణ నిద్రలో ప్రభుత్వం
- ప్రభుత్వం అవిశ్రాంతంగా చర్యలు చేపట్టిందన్న రాహుల్ వ్యాఖ్యలపై ధ్వజం



3లో

ఇదండీ సంగతి



ఇంతటితో అన్ని కార్యక్రమాలు సమాప్తం!

‘కన్నీటి’ వరద

బెజవాడను ముంచేసిన బుడమేరు, బాబు అలసత్వం

ఎటుచూసినా హాహాకారాలు.. అంతా హృదయ విదారకం



విజయవాడలోని సింగ్‌నగర్‌లో ఆహారపొట్లాలు, పాలు, తాగునీటి కోసం వరద బాధితుల అవస్థలు

12లో

- ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బాధితులు బిక్కుబిక్కు
- ముంపులోనే పలు కాలనీలు.. 7- 8 అడుగుల మేర నీళ్లు
- చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళల పరిస్థితి దయనీయం
- రెండు రోజులుగా వరదలో చిక్కుకుని విలవిల
- తాగునీరూ అందించలేని దుస్థితి.. ముంపులో పునరావాస కేంద్రాలు
- ముందస్తు సమాచారం ఇవ్వకుండా మమ్మల్ని ముంచారు
- ఇప్పుడు టూరిస్టుల్లా ఫొటోల కోసం వచ్చారని మంత్రులపై బాధితుల ఆగ్రహం
- వరదల్లో చిక్కుకున్నవారు 4.5 లక్షల మందికిపైనే.. ఇప్పటికీ 2.5 లక్షల మందికిపైగా జల దిగ్బంధంలోనే

ముమ్మాటికీ మానవ తప్పిదమే



విజయవాడలోని సింగ్‌నగర్‌లో బాధితురాలిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

12లో

- చంద్రబాబు తన ఇంటిని కాపాడుకోవడానికే విజయవాడను ముంచేశారు
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ధ్వజం
- గతంలో ఎన్నడూ చూడని విపత్తు.. బాధితులను వారి ఖర్మకు వదిలేశారు
- గత నెల 28నే కృష్ణా బేసిన్‌లో అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించింది
- శ్రీశైలం, సాగర్, పులిచింతల ఖాళీ చేసి ఫ్లడ్ కుషన్ ఉంచడంలో ప్రభుత్వం విఫలం



ఖమ్మంలోని వెంకటేశ్వర్ నగర్‌లో వరద నీరు రావడంతో బురదమయమైన ఇంటిని సర్దుకుంటున్న ఓ మహిళ



వర్షపు నీటితో మునిగిపోయిన మానుకోట పట్టణం



ఖమ్మంలోని పెద్దమ్మ గుడి వద్ద ఇంటిని కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన బాధితులు

తెలుగు రాష్ట్రాల్లో వరదలపై రాహుల్ ఆవేదన

ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు సంతాపం



సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, వరదలపై ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. వరదల కారణంగా ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు సోమవారం ఆయన 'ఎక్స్'లో సంతాపం ప్రకటించారు. తన ఆలోచనలు అన్నీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలతోనే ఉన్నాయని పేర్కొన్నారు. సహాయక చర్యల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కోవడంతోపాటు.. పునర్నిర్మాణ ప్రక్రియకు తెలంగాణ ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తోందన్నారు. వరదల కారణంగా నష్టపోయిన వారందరికీ సాధ్యమైనంత త్వరగా పునరావాస ప్యాకేజీని ప్రకటించాలని ఆయన కేంద్రం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలను కోరారు.

తెలుగు రాష్ట్రాల్లో నష్టం కలచివేసింది

మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు

వ్యక్తిగత పింఛను నుంచి రెండు రాష్ట్రాల సీఎంఆర్‌ఎఫ్‌కు రూ. 5లక్షల చొప్పున సాయం



సాక్షి, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు, వరదల కారణంగా ప్రజలకు కలుగుతున్న ఇబ్బందుల పట్ల మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు విచారం వ్యక్తం చేశారు. తన వ్యక్తిగత పింఛను నుంచి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయ నిధులకు రూ.ఐదు లక్షల చొప్పున సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. కుండపోత వర్షాలు, ఉధృతమైన వరదలతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో వాటిల్లుతున్న నష్టం తనను తీవ్రంగా కలచివేసిందని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తాను ప్రధాని మోదీకి ఫోన్ చేసి రెండు రాష్ట్రాల్లో ప్రస్తుత పరిస్థితిని వివరించి, వెంటనే ఆదుకోవాలని విజ్ఞప్తి చేయగా.. రెండు రాష్ట్రాలకు తగిన సహాయ సహకారాలు అందజేస్తామని ప్రధాని హామీ ఇచ్చారని వెల్లడించారు. తనకుమారుడు ఎం.హర్షవర్ధన్ నిర్వహిస్తున్న ఫౌండేషన్ తరఫున ఏపీ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 2.5 లక్షలు, తెలంగాణ సీఎం సహాయ నిధికి రూ. 2.5 లక్షలు అందజేశారని తెలిపారు. తన కుమార్తె దీపా వెంకట్ ఆధ్వర్యంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ నుంచి రెండు రాష్ట్రాల సీఎంల సహాయ నిధికి రూ. 2.5 లక్షల చొప్పున ఇచ్చినట్లు వెల్లడించారు.

దేశవ్యాప్తంగా సాధారణంకంటే అధిక వర్షపాతం

తెలంగాణలో 29 శాతం.. ఏపీలో 43 శాతం అధిక వర్షపాతం



సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో దేశవ్యాప్తంగా సాధారణం కంటే 7 శాతం అధికంగా వర్షపాతం నమోదయినట్లు భారత వాతావరణ శాఖ వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ ఒకటి వరకు 707.4 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఏకంగా 759.2 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసిందని వివరించింది. దేశంలోని 14 రాష్ట్రాల్లో సాధారణం కన్నా భారీ వర్షాలు కురిశాయని, అందులో రెండు తెలుగు రాష్ట్రాలున్నాయని తెలిపింది. తెలంగాణలో 581.2 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం కన్నా 29 శాతం అధికంగా 751.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, ఆంధ్రప్రదేశ్‌లో 373.6 మిల్లీమీటర్లకు గానూ 534.3 మిల్లీమీటర్లు అంటే 43 శాతం అధికంగా వర్షపాతం నమోదైందని వెల్లడించింది. తెలంగాణలో ఏడు జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురవగా, ఏపీలో నాలుగు జిల్లాల్లో అతి భారీ వర్షాలు పడినట్లు వివరించింది. అలాగే భారీ వర్షాల జాబితాలో తెలంగాణలో 11, ఏపీలో 21 జిల్లాలున్నట్లు తెలిపింది. మిగతా జిల్లాల్లో సాధారణ వర్షపాతం ఉందని పేర్కొంది. దేశంలో అతిభారీ వర్షాలు కురిసిన జిల్లాలు అధికంగా తమిళనాడులో 19, రాజస్తాన్‌లో 14 జిల్లాలు ఉన్నాయని వెల్లడించింది.

రూ.5,438 కోట్ల నష్టం

▶ మొదటి పేజీ తరువాయి

వెల్లడించారు. వారు సంపూర్ణ సహకారం అందించేందుకు సుముఖత వ్యక్తం చేశారని చెప్పారు. రాష్ట్రంలో పరిస్థితిని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దృష్టికి కూడా తీసుకెళ్ళామని తెలిపారు. కేంద్రం వెంటనే కనీసం రూ.2 వేల కోట్లు అయినా విడుదల చేసేలా కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం కూడా పెద్దన్న పాత్రలో సాయం చేయాలని కోరారు. రాష్ట్రంలో నాలుగు నుంచి ఐదు లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, 16 మంది ప్రాణాలు కోల్పోయారని సీఎం చెప్పారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ సమీపంలో వరద తాకిడితో గండిపడిన ఎస్సీపీ కాల్వను సోమవారం ఆయన పరిశీలించారు. ఆ తర్వాత పాలేరు రిజర్వాయర్ అలుగు, దెబ్బతిన్న ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారి, అక్కడే పంట పొలాలను పరిశీలించారు. అనంతరం ఖమ్మం రూరల్ మండలంలోని రాజీవ్ గృహకల్ప వద్ద ముంపునకు గురైన బాధితుల ఇళ్లను సందర్శించి వారిని పరామర్శించారు. ఆపై ఖమ్మంలోని మున్నేటి సమీపాన ఉన్న బొక్కలగడ్డ, మంచికంటి నగర్‌ల్లో వరద ఉధృతిని పరిశీలించి బాధితులతో మాట్లాడారు. అనంతరం కలెక్టరేట్‌లో వరద పరిస్థితిపై సమీక్షించారు. అంతకుముందు సూర్యాపేట జిల్లా మోతె మండలం నామవరం వద్ద మంత్రులు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగంతో ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పంట, ఆస్తి నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాగర్ ఎడమకాలువ తెగడం వల్ల వాటిల్లిన నష్టంపైనా ఆరా తీశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు.

అండగా నిలిచేందుకే వచ్చాం

'ఖమ్మం జిల్లాలో మున్నేరు, పాలేరు, ఆకేరు పోటెత్తడంతో పాలేరు, మధిర, ఖమ్మం నియోజకవర్గాలకు ఊహించని ఉపద్రవం జరిగింది. రెండు రోజుల నుంచి కంటిమీద కునుకు లేకుండా మంత్రులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, కలెక్టర్లు, పోలీసు అధికారులు పని చేస్తున్నారు. తక్షణం స్పందించడం ద్వారా నష్టాన్ని తగ్గించాం. ప్రజలు ఆవేదనతో ఉన్నప్పుడే ప్రభుత్వం వెళ్లి వారి బాధలు వినాలనే ఉద్దేశంతో జిల్లాలకు వచ్చాం. ప్రభుత్వం అండగా ఉంటుందనే విశ్వాసాన్ని ప్రజలకు కల్పిస్తున్నాం. 80 ఏళ్లలో మున్నేరుకు ఇంత పెద్ద వరద ఎప్పుడూ రాలేదని స్థానిక ప్రజలు చెప్పారు. సూర్యాపేట జిల్లాలో 21 చెరువులు తెగిపోయాయి. 15 గ్రామాల నుంచి 420 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 20 వేల ఎకరాల్లో పంట నీట మునిగింది. 7 పశువులు చనిపోగా, 7 పక్కా ఇళ్లు, 33 కచ్చా ఇళ్లు కూలిపోయాయి. వరదల్లో చిక్కుకుని ఇద్దరు చనిపోయారు. వరద బాధితులకు అండగా ఉండి ఆదుకుంటాం. ఆందోళన చెందవద్దు. భేషజాలకు పోకుండా కేంద్ర ప్రభుత్వంతో కూడా మాట్లాడి సాయం కోరాం. తక్షణమే దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించాలని కూడా అడిగాం. మేం కూడా రాష్ట్రంలోని యంత్రాంగాన్ని పూర్తిగా అప్రమత్తం చేశాం. వరద సహాయక చర్యల్లో పాల్గొనాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చాం..' అని సీఎం రేవంత్ తెలిపారు.

నష్టపోయిన ప్రతి ఇంటికీ రూ.10 వేల తక్షణ సాయం

'ఎక్కడో ఉన్న ఎన్డీఆర్‌ఎఫ్ బృందాల కోసం ఎదురు చూస్తూ సమయం వృథా కాకుండా ఉండేందుకు



కూసుమంచి మండలంలో జాతీయ రహదారిపై నుంచి పాలేరు వరద పరిస్థితిని సీఎం రేవంత్ రెడ్డికి వివరిస్తున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి

తెలంగాణ డీఆర్‌ఎఫ్ ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలో 8 చోట్ల 100 మంది చొప్పున యూనిట్లను పెట్టనున్నాం. వర్షాల కారణంగా నష్టపోయిన ప్రతి ఇంటికీ తక్షణ సాయంగా రూ.10 వేలు ఇస్తున్నాం. ఖమ్మం జిల్లాలో ఇళ్లలో నీరు చేరి నిత్యావసర వస్తువులు పాడైన ప్రతి ఇంటికి రూ.10 వేలు ఇస్తున్నాం..' అని ముఖ్యమంత్రి తెలిపారు.

అధికారుల సెలవులు రద్దు

'రాబోయే ఐదారు రోజులు అధికారులు అప్రమత్తంగా ఉండాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవాలి. వరదల కారణంగా వ్యాధులు ప్రబలే ప్రమాదమున్నందున వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. పోలీసులు కూడా వరద సహాయక చర్యల్లో పాల్గొనాలి. వరదల దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ సిబ్బంది సెలవులు రద్దు చేస్తున్నాం. ఎవరైనా విధులకు హాజరు కాకపోతే వారి వివరాలను నమోదు చేయాలి. తక్షణ సహాయం కోసం అధికారులు నివేదికలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపాలి.

ప్రతిఒక్కరూ ప్రజలకు అండగా నిలవాలి

ప్రజలను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత. వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కూడా బాధితులను ఆదుకోవాలి. విపత్కర పరిస్థితుల్లో రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ ప్రజలకు అండగా నిలబడాలి. వరదల వల్ల నష్టపోయిన ప్రజల సహాయార్థం మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సీఎం సహాయ నిధికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయం. ఇలాగే స్వచ్ఛంద సంస్థలు, ఇతరులు ఎవరైనా సీఎం సహాయనిధికి విరాళాలు అందిస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుంది. వరద ముంపుపై ప్రభుత్వానికి మీడియా కూడా సహకరించాలి. కొన్ని పార్టీలకు చెందిన మీడియా పోకడలు మారకపోతే ప్రజలే చూస్తారు..' అని రేవంత్ అన్నారు.

పక్క రాష్ట్రంలో ప్రతిపక్ష నేత ప్రజల వద్దకు వెళ్తున్నారు..

'ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అర్ధరాత్రి కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నారన్నారు. ఢిల్లీలో ఉన్న ఉత్తమ్ కూడా హుటాహుటిన వచ్చారు. పక్క రాష్ట్రంలో ప్రతిపక్ష నేత ప్రజల వద్దకు వెళ్లి వరదల్లో నష్టపోయిన వారిని పరామర్శిస్తున్నారు. తెలంగాణలో మాత్రం ప్రతిపక్ష నేత మౌనముద్ర దాల్చారు. కేటీఆర్ అమెరికాలో ఎంజాయ్ చేస్తూ మంత్రులు పనిచేయడం లేదని విమర్శిస్తున్నారు. జాతీయ విపత్తుగా ప్రకటించాలని బీఆర్‌ఎస్ ఎందుకు అడగడం లేదు? కల్వకుంట్ల కుటుంబం దోచుకున్న రూ.లక్షల కోట్ల సొమ్ములో రూ.వెయ్యి కోట్లో.. రూ.రెండు వేల కోట్లో బాధితులకు సహాయంగా ఇవ్వొచ్చు కదా?..' అని రేవంత్ అన్నారు.

ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుంది: భట్టి

వరద విపత్తుతో నష్టపోయిన ప్రజలు ఆందోళన చెందొద్దని, ప్రజలకు ఏ కష్టం వచ్చినా ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ప్రజల్లోకి వెళ్లి సమస్యలు తెలుసుకోవడం మర్చిపోయిన గత పాలకులు సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసే విధంగా విమర్శించడం తగదన్నారు. భారీ వర్షాలపై రాష్ట్ర ప్రభుత్వం హైఅలర్ట్‌గా ఉండటంతో పెద్ద ఉపద్రవం వచ్చినప్పటికీ పెద్ద ఎత్తున ప్రాణ నష్టం సంభవించలేదని అన్నారు.

ప్రతి కుటుంబాన్నీ ఆదుకుంటాం: పొంగులేటి

వరదలతో నష్టపోయిన ప్రతి కుటుంబాన్నీ ఆదుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. 85 ఏళ్ల క్రితం మున్నేరు వద్ద 35 అడుగుల మేర వరద ప్రవహించిందని, మళ్లీ ఇప్పుడు 35 అడుగులు దాటిందని చెప్పారు. మున్నేరు ప్రళయం ధాటికి వేల కోట్ల నష్టం జరిగిందన్నారు. వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించడం కోసం హెలికాప్టర్ తెప్పించే ప్రయత్నం చేసినా వాతావరణం అనుకూలించలేదని తెలిపారు. వరదలను కూడా ప్రతిపక్ష పార్టీలు రాజకీయం చేస్తున్నాయని విమర్శించారు.

ఊహించని ఉపద్రవం: తుమ్మల

కనీ వినీ ఎరుగని విధంగా మున్నేరు ప్రళయం వచ్చిందని, ఇది ఊహించని ఉపద్రవం అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అతి తక్కువ సమయంలోనే 47 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని చెప్పారు. రెండు అంతస్తుల భవనాలు కూడా నీటమునిగాయని తెలిపారు.

ప్రభుత్వం ఆదుకుంటుంది: కోమటిరెడ్డి

వర్షాలు, వరదల్లో మరణించిన వారి కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హామీ ఇచ్చారు. మున్నేరు ముంపునకు గురైన వారి పరిస్థితి చూస్తే కన్నీళ్లు వచ్చాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఆవేదన చెందారని, మున్నేరు ఉధృతికి సంబంధించి టీవీలో వార్తలు చూసిన తర్వాత తాను కూడా ఖమ్మం రావాలనుకున్నట్లు తెలిపారు. అంతలా ఖమ్మంలో వర్ష బీభత్సం కొనసాగిందన్నారు.

ఉద్రిక్తత నడుమ సీఎం పర్యటన

ఖమ్మంలోని మున్నేరు పరీవాహక ప్రాంతం బొక్కల గడ్డలో సీఎం పర్యటన సందర్భంగా, ఆయన రాకముందు వరద బాధితులు కొందరు సీఎం డౌన్ డౌన్, ముగ్గురు మంత్రులు డౌన్ డౌన్ అని నినాదాలు చేస్తూ రోడ్డుకు అడ్డంగా తడిసిన సామగ్రి వేసి నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు వారిని చెదరగొట్టారు. అనంతరం భారీ భద్రత నడుమ మంచికంటినగర్ మీదుగా సీఎం పర్యటన కొనసాగింది. మధ్య మధ్యలో కూడా కొందరు నిరసన తెలపగా పోలీసులు చెదరగొట్టారు. ఇక ఖమ్మం రూరల్ మండలం కరుణగిరి రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో తురకకుమారి, అన్నపూర్ణమ్మ ఇళ్లకు వెళ్లి జరిగిన నష్టంపై సీఎం ఆరా తీశారు. అయితే తమకు వరద సహాయం మరింత పెంచి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ బాధిత మహిళలు కొందరు ఆయన కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. ఓపెన్ టాప్ జీపు పైనుంచి బాధితులతో మాట్లాడిన సీఎం.. వెళ్తున్న క్రమంలో ఆయనను అడ్డుకుని త్వరగా సాయం అందించాలని కోరడంతో, అన్నిరకాలుగా ఆదుకునేందుకు కృషి చేస్తామని రేవంత్ హామీ ఇచ్చారు.

మంత్రి పొంగులేటి ఇంట్లో బస

సాయంత్రం నాలుగున్నర గంటలకు ఖమ్మం జిల్లాకు చేరుకున్న ముఖ్యమంత్రి.. వరద ప్రాంతాల్లో పర్యటన అనంతరం కలెక్టరేట్‌లో రాత్రి 8 గంటల వరకు సమీక్ష జరిపారు. ఆ తర్వాత ఖమ్మంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇంటిలో రాత్రి బస చేశారు. మంగళవారం ఉదయం ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గంగారం తండాలో నూనావత్ మోతీలాల్ కుటుంబాన్ని సీఎం పరామర్శించనున్నారు. మోతీలాల్‌తో పాటు ఆయన కుమార్తె అశ్విని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్తూ మహబూబాబాద్ జిల్లాలో ఆకేరు వరద నీటిలో చిక్కుకుని మృతి చెందిన విషయం విదితమే. కాగా వారి కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం మహబూబాబాద్ జిల్లాలోని డోర్నకల్, మహబూబాబాద్ ప్రాంతాల్లో వరద ముంపు ప్రాంతాలను మంత్రులతో కలిసి పరిశీలించనున్నారు.

వరద విధ్వంసం

▶ మొదటి పేజీ తరువాయి

తొలిసారిగా డ్రోన్ల సాయంతో వరదలో చిక్కుకున్న ప్రజలకు ఆహార పొట్లాలను అందించారు. భారీ వర్షాలతో ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట జిల్లాల్లో ఎక్కువ నష్టం జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు కలసి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు తమ జిల్లాల్లో పర్యటిస్తూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 110 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి.. 4వేల మందిని వాటిలోకి తరలించారు.

ఖమ్మం సర్వం మున్నేరార్పణం

భారీ వరదలతో ఖమ్మం జిల్లాలోని మున్నేరు పరీవాహక ప్రాంతం అల్లకల్లోలమైంది. వరద తాకిడితో పదులకొద్దీ ఇళ్లు నేలమట్టం అయ్యాయి. వందలాది ఇళ్ల పైకప్పులు, గోడలు కూలిపోయాయి. ఇళ్లలో ఉన్న వస్తువులతోపాటు ద్విచక్ర వాహనాలు, కార్లు కూడా కొట్టుకుపోయాయి. ఒక్కసారిగా వచ్చిన వరదతో లోతట్టు ప్రాంత ప్రజలు కట్టుబట్టలతో పునరావాస కేంద్రాలకు చేరారు. ఖమ్మం నగరంతోపాటు పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మంరూరల్ మండల పరిధిలో ఇళ్లు దెబ్బతిన్నాయి. ఫ్రిడ్జ్‌లు, టీవీలు, ఇతర ఎలక్ట్రానిక్ సామాగ్రి తడిసి దెబ్బతిన్నాయి. ఖమ్మంలోని మోతీనగర్‌లో ఓ కుటుంబం దాచుకున్న బంగారం, డబ్బులు వరదనీటిలో కొట్టుకుపోయాయి. ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద 250కిపైగా లారీలు నీట మునిగిపోయాయి. ఒక్కో లారీ మరమ్మతుకు రూ.లక్షకుపైగా ఖర్చవుతుందని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు జిల్లాలోని ఆకేరు వాగు పొంగి తిరుమలాయపాలెం మండలాన్ని ముంచెత్తింది. పాలేరు వరదతో కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఖమ్మం నగరంలో రామన్నపేట, వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్, సారథినగర్, మామిళ్లగూడెం, బొక్కలగడ్డ, కాల్వొడ్డు, నయాబజార్, మంచికంటి నగర్, మోతీనగర్, పెద్దమ్మతల్లిగుడి రోడ్డు, ప్రకాశ్‌నగర్, దంసలాపురం కాలనీ.. ఖమ్మంరూరల్ మండలంలోని పోలేపల్లి, సాయిగణేష్‌నగర్, కరుణగిరి, పెద్దతండా ప్రాంతాలు, చింతకాని, ముదిగొండ, మధిర, ఎర్రుపాలెం మండలాల్లోని పలు గ్రామాల్లో తీవ్ర నష్టం జరిగింది. మున్నేరు వరద తగ్గడంతో అధికారులు సహాయక చర్యలు ముమ్మరం చేశారు. రోడ్లపై ఉన్న బురదను తొలగిస్తున్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులు ఇళ్లకు చేరుకొని అన్నీ శుభ్రం చేసుకుంటున్నారు.

యంత్రాంగం విఫలమవడంతోనే..

మున్నేరు వరద విషయంలో ప్రజలను అప్రమత్తం చేయడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. గత ఏడాది కూడా జూలై 26 అర్ధరాత్రి నుంచి రెండు రోజుల పాటు మున్నేరు పరీవాహక ప్రాంతాన్ని వరద ముంచింది. ఆ సమయంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తూ, పునరావాస కేంద్రాలకు తరలించారు. కానీ ఈసారి అదే తరహాలో మున్నేరుకు భారీ వరద వస్తున్నా.. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడంలో విఫలమయ్యారని స్థానికులు మండిపడుతున్నారు.

జల విలయంలోనే మహబూబాబాద్!

భారీ వర్షాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో, అందులోనూ మహబూబాబాద్ జిల్లాలో తీవ్ర విధ్వంసం జరిగింది. నెల్లికుదురు మండలం రావిరాల మొదలుకొని వందలాది గ్రామాలు నీట మునిగాయి. చాలా గ్రామాల చుట్టూ ఇంకా వరద కొనసాగుతుండటంతో జలదిగ్బంధంలోనే ఉండిపోయాయి. ప్రజలు ఇళ్లలో తడిసిపోయిన సామగ్రిని చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తేరుకోని తొగర్రాయి, కూచిపూడి గ్రామాలు

సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో అంతరగంగ వరదతో కకావికలమైన తొగర్రాయి, కూచిపూడి గ్రామాలు సోమవారం కూడా తేరుకోలేదు. ఆ రెండు గ్రామాలు 70శాతానికిపైగా మునగడంతో.. ప్రజలు నిత్యవసర వస్తువులతోపాటు పంట పొలాలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయారు. తొగర్రాయి, కూచిపూడి, గణపవరంలలో వెయ్యికి పైగా వ్యవసాయ మోటార్లు కొట్టుకుపోయినట్టు రైతులు వాపోతున్నారు.

రాష్ట్రంలో వరదల నష్టం రూ.5,438 కోట్లు

శాఖ	నష్టం (రూ.కోట్లలో)
రహదారులు (ఆర్అండ్‌బీ)	2,362
విద్యుత్ రంగం	175
పంట నష్టం (4.15 లక్షల ఎకరాలు)	415
నీటిపారుదల (మరమ్మతులు)	629
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి	170
వైద్యారోగ్యం	12
పశు సంవర్థక	25
పురపాలక శాఖ	1,150
ఇతర విభాగాలు, ఆస్తుల నష్టం	500

(సీఎం కార్యాలయం విడుదల చేసిన మేరకు వివరాలు)



మిగిలింది కట్టుబట్టలే!

ఈ ఫొటోలో కనిపిస్తున్నది సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం నారాయణపురం చెరువు పక్కన ఉన్న మోహనరావు ఇల్లు. ఇంటి ముందు ఎయిర్ కంప్రెషర్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. శనివారం సాయంత్రం భారీ వర్షాలతో చెరువు కట్ట తెగడంతో నీరంతా ముంచెత్తింది. మోహన్‌రావు, ఆయన భార్య, ఇద్దరు కుమారులు పరుగెత్తి ప్రాణాలు కాపాడుకున్నారు. కానీ ఇల్లు దెబ్బతిన్నది, సామగ్రి అంతా కొట్టుకుపోయింది. కట్టుబట్టలే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఏ ఇల్లు చూసినా ఇదే దుస్థితి



మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రావిరాల గ్రామంలో వరద బీభత్సానికి అన్ని ఇళ్లలో బియ్యం, నిత్యావసరాలు, ఇతర సామగ్రి అంతా తడిసి పాడైపోయాయి. ''తినడానికి తిండి గింజలు లేకుండా పోయి బతకలేని పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం ఆదుకుని నిరుపేద కుటుంబాలను చేరదీయాలి'' అని గ్రామానికి చెందిన రాస యాకన్న కోరుతున్నాడు. తడిసిపోయిన బియ్యాన్ని బయటపడేస్తూ తన ఆవేదన వ్యక్తం చేశాడు.

ఫారంలో ఒక్క కోడీ మిగల్లేదు..: మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో బెజ్జం సమ్మయ్య, ఎస్కే అమీర్ కలిసి కోళ్లఫారం నడుపుతున్నారు. ఆదివారం భారీ వర్షంతో ఫారంలోకి వరద ముంచెత్తింది. ఒక్కటీ మిగలకుండా రెండున్నర వేల కోళ్లు మృతి చెందాయి. ''ఒక్కో కోడి కేజీన్నర బరువుదాకా పెరిగింది. నాలుగైదు రోజుల్లో కంపెనీ వారికి అప్పగించాల్సి ఉంది. అలాంటిది నోటిదాకా వచ్చిన కూడును వరద లాగేసింది..'' అని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

జాతీయ విపత్తుగా ప్రకటించండి

ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

- వర్షాలు, వరదలతో వాటిల్లిన భారీ నష్టం పరిశీలనకు రాష్ట్రానికి రావాల్సిందిగా ఆహ్వానం
- వర్షాలు, వరదలపై సమీక్షలో ముఖ్యమంత్రి కీలక నిర్ణయాలు
- మృతుల కుటుంబాలకు ఇచ్చే పరిహారం రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంపు

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలు, వరదలతో రాష్ట్రంలో భారీ ప్రాణ, ఆస్తి నష్టంతో పాటు లక్షల ఎకరాల్లో పంట నష్టం సంభవించినందున జాతీయ విపత్తుగా ప్రకటించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. నష్టాన్ని పరిశీలించడానికి స్వయంగా రాష్ట్రానికి రావాలని ఆహ్వానించారు. ఈ మేరకు ప్రధానిని కోరుతూ లేఖ రాయాలని సీఎస్‌ను ఆదేశించారు. భారీ వర్షాలు, వరదలపై సోమవారం హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులు డి.శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి



సోమవారం వరదలపై సమీక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రం మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి, సీఎస్ శాంతి కుమారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, వేం నరేందర్‌రెడ్డి ఇతర ఉన్నతాధికారులు

ఆయన సమీక్ష నిర్వహించారు. రైల్వే లైన్లు కొట్టుకుపోవడం, పదుల సంఖ్యలో రోడ్లు, చెరువులకు గండ్లు పడడం, విద్యుత్ స్తంభాలు నేలకొరగడం, భారీ ఆస్తి నష్టాలు చోటుచేసుకున్న నేపథ్యంలో ప్రధానిని రాష్ట్ర పర్యటనకు ఆహ్వానించాలని చెప్పారు.

ఇళ్లు కూలినవారికి ఇందిరమ్మ ఇళ్లు

వర్షాలు, వరదలతో మరణించిన వ్యక్తుల కుటుంబాలకు అందించే పరిహారాన్ని రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలకు, పాడి పశువులకిచ్చే పరిహారాన్ని రూ.37,500 నుంచి రూ.50 వేలకు, మేకలు, గొర్రెలకిచ్చే పరిహారాన్ని రూ.4 వేల నుంచి రూ.5 వేలకు పెంచుతూ ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. (ఈ మేరకు పరిహారం పెంచుతూ విపత్తుల నిర్వహణ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది) తక్షణమే ఈ మేరకు పరిహారం అందించాలని ఆదేశించారు. ఇళ్లు కూలిన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలన్నారు. కంటింజెన్సీ ఫండ్ కింద ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లా కలెక్టర్లకు రూ.5 కోట్ల చొప్పున తక్షణమే విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు.

పంట నష్టంపై కేంద్రానికి నివేదిక పంపండి

ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రంలో లక్షన్నర ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నాయని సీఎంకు అధికారులు వివరించారు. అయితే 4 లక్షల ఎకరాలకు పైగా పంటలు నష్టపోయినట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో తక్షణమే క్షేత్ర స్థాయిలో పరిశీలించి వాస్తవ అంచనాలను రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. పూర్తిగా దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం అందించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పంట నష్టం వివరాలతో కేంద్రానికి సమగ్ర నివేదిక పంపించి కేంద్ర బృందాలను పరిశీలనకు రప్పించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.

యువ పోలీసులకు ఎన్డీఆర్‌ఎఫ్ తరహాలో శిక్షణ

ఎన్డీఆర్‌ఎఫ్ నుంచి తక్షణ సహాయం ఎందుకు అందడం లేదని సీఎం ప్రశ్నించగా, మన విజ్ఞప్తి ఆధారంగా వాళ్ల దగ్గరగా ఉన్న బలగాలను పంపుతారని, ఇందుకు సమయం పడుతుందని అధికారులు బదులిచ్చారు. భవిష్యత్తులో విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తెలంగాణ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (టీజీడీఆర్‌ఎఫ్)ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. రాష్ట్రంలోని 8 పోలీస్ బెటాలియన్లలోని యువ పోలీసులకు ఎన్డీఆర్‌ఎఫ్ తరహాలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఇలాంటి బృందాలను ఏర్పాటు చేసుకున్న ఒడిశా, గుజరాత్ రాష్ట్రాల విధానాలను అధ్యయనం చేయాలని, అక్కడి వారితో శిక్షణ ఇప్పించాలని సూచించారు.

కూలీలకు బియ్యం, పప్పులు ఇవ్వండి

హైదరాబాద్ నగరంలో చిన్న అవాంఛనీయ సంఘటన జరగడానికి వీల్లేదని సీఎం ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీటి సరఫరా, పారిశుధ్యం విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి సమస్యలొచ్చినా వెంటనే పరిష్కరించాలని చెప్పారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలన్నారు. రోజూ కూలికి వెళ్లే వారు పనులు లేక ఇళ్ల దగ్గరే ఉండిపోతారని, అలాంటి వారిని గుర్తించి బియ్యం, పప్పుల వంటి నిత్యావసరాలు పంపిణీ చేయాలని ఆదేశించారు.

ఆ జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయండి

అకస్మాత్తుగా భారీ వర్షాలు కురవడానికి కారణాలను సీఎం వాతావరణ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఊహించిన దానికంటే ఎక్కువ వర్షాలొచ్చాయని, గతంలో ఐదేళ్లు, పదేళ్లకోసారి ఇలాంటి వర్షాలు వచ్చేవని, ఇటీవల తరచుగా కురుస్తున్నాయని, దీనిపై మరింత అధ్యయనాలు జరుగుతున్నాయని వారు తెలిపారు. ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో రెండు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశముందని వివరించారు. దీంతో ఆయా జిల్లాల కలెక్టర్లు, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే సహాయక శిబిరాలకు తరలించాలని సీఎం సూచించారు.

క్లుప్తంగా...

ప్రాణ నష్టానికి ప్రభుత్వానిదే బాధ్యత

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో సర్కారు విఫలం: జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో వరదల కారణంగా సంభవించిన మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి అన్నారు. వరదల్లో చిక్కుకుని మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, పార్టీ నేత గట్టు రామచందర్‌రావుతో కలసి సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు ప్రభుత్వం ప్రజల మధ్య ఉండాలన్నారు. కానీ ఖమ్మంలో బాధితులు ప్రభుత్వ సాయం కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సి వచ్చిందన్నారు. చివరకు గజ ఈతగాళ్లకు ప్రజలే డబ్బులు ఇచ్చి ప్రాణాలు కాపాడుకున్నారన్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా 20 జిల్లాల పరిధిలో వర్ష ప్రభావం ఉన్నా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నా ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఆయన అన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు ఇవ్వాలి

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌



సాక్షి, హైదరాబాద్‌: భారీ వర్షాలు, వరదలతో మరణించిన వారి కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని బీజేపీనేత, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. వరదల వల్ల దెబ్బతిన్న రోడ్లు, బ్రిడ్జిలను వెంటనే పునరుద్ధరించాలని సోమవారం ఆయన ఒక ప్రకటనలో కోరారు. నిర్వాసితులకు వరద సహాయక కేంద్రాలలో అన్ని వసతులతో పాటు, భోజన సదుపాయాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్లు నీటమునిగిన వారికి నిత్యావసర వస్తువులు అందజేయాలన్నారు. వరదలు తగ్గుముఖం పట్టిన వెంటనే పంటపొలాలను పరిశీలించి పరిహారం ఇవ్వాలని కోరారు. కోతకు గురైన పొలాలను సరిచేయడానికి ప్రభుత్వమే ఆర్థిక సాయం అందించాలని.. పశువులు, గొర్రెలు, మత్స్యసంపద నష్టాలను అంచనా వేసి వారికి కూడా నష్టపరిహారం అందజేయాలని విజ్ఞప్తిచేశారు. ప్రభుత్వ యంత్రాంగంతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు కూడా ప్రజలకు సహాయం చేయాలని ఈటల పిలుపునిచ్చారు.

బీఆర్‌ఎస్‌ బురద రాజకీయాలు: దానం



సాక్షి, హైదరాబాద్‌: వర్షాలు, వరదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉంటే వారి పక్షాన నిలిచి కష్టసమయంలో అండగా నిలవాల్సిన ప్రతిపక్షపార్టీ ప్రభుత్వాన్ని దూషించడమే పనిగా పెట్టుకోవడం సరైంది కాదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే దానం నాగేందర్‌ విమర్శించారు. బీఆర్‌ఎస్‌ నేతలు బురద రాజకీయాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. గాంధీభవన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో టీపీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ బి.మహేశ్‌కుమార్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్‌ చల్లా నర్సింహారెడ్డి, ఖైరతాబాద్‌ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డితో కలసి ఆయన మాట్లాడారు. వర్షాల కారణంగా తీవ్ర నష్టం జరిగిందని, ఈ తరుణంలో కాంగ్రెస్‌ స్థానిక నేతలు ప్రజలకు సాయం చేయాలని కోరారు. ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌ మాట్లాడుతూ...జిల్లా కలెక్టర్లను సంప్రదిస్తూ సీఎం ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకుంటున్నారని చెప్పారు. సీఎంతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలందరూ రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితులను సమీక్షిస్తున్నారని చెప్పారు.



వైఎస్‌ఆర్‌కు నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

వైఎస్సార్‌కు సీఎం నివాళి

సాక్షి, హైదరాబాద్‌: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నివాళులర్పించారు. సోమవారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మాజీ మంత్రి పి.సుదర్శన్‌రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డిలతో కలిసి వైఎస్‌ చిత్రపటానికి పూలమాలలు వేసిన రేవంత్, ఆయన ఉమ్మడి రాష్ట్ర అభివృద్ధి కోసం చేసిన కృషిని స్మరించుకున్నారు. గాంధీభవన్‌లో కూడా రాష్ట్ర కాంగ్రెస్‌ నేతలు వైఎస్సార్‌కు ఘనంగా నివాళులర్పించారు. మాజీ మంత్రి, ఖైరతాబాద్‌ ఎమ్మెల్యే దానం నాగేందర్, టీపీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ బి.మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్‌ నేతలు జి.నిరంజన్, చల్లా నర్సింహారెడ్డి, రోహిణ్‌రెడ్డి, మెట్టు సాయికుమార్, కేతూరి వెంకటేశ్‌ తదితరులు వైఎస్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్‌ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, పేదలకు ఇళ్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, రుణమాఫీ లాంటి ప్రజోపయోగ కార్యక్రమాలతో పేదల గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు.



దిగుబడి బాగా వస్తుందనుకుంటే..

ఇసుక మేటలు వేసిన పొలం మధ్య నిలబడిన ఈయన మహబూబాబాద్‌ జిల్లా నర్సింహులపేటకు చెందిన రైతు బేతమల్ల రమేశ్‌. బంధం చెరువు కింద 2.20 ఎకరాల్లో వరి సాగుచేశాడు. అప్పు తెచ్చి రూ. 80 వేల పెట్టుబడి పెట్టాడు. 40 రోజుల క్రితం నాట్లు వేయగా చేను ఏపుగా పెరిగింది. ఈసారి దిగుబడి బాగా వస్తుందని సంబురపడ్డాడు. కానీ భారీ వర్షాలతో బంధం చెరువుకు గండిపడి రమేశ్‌ పొలాన్ని ముంచెత్తింది. ఇసుకమేటలతో నిండిన తన పొలాన్ని చూసి రమేశ్‌ కన్నీటిపర్యంతమయ్యాడు. ఇప్పుడు ఇంకెక్కడి నుంచి అప్పు తేవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



రూ. 40 వేలు ఆకేరు పాలు

ఈ రైతు పేరు రమావత్‌ శ్రీను. తిరుమలాయపాలెం మండలం రమణా తండాకు చెందిన ఈయన రూ. 40 వేల పెట్టుబడి ఖర్చుతో 2 ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. జూన్‌ ప్రారంభంలోనే పత్తి గింజలు నాటగా పత్తి ప్రస్తుతం కాత దశలో ఉంది. మరో పంట నెలలో చేతికి అందుతుందని శ్రీను అనుకుంటుండగా ఆదివారం ఆకేరు వాగు ముంచెత్తడంతో చేనును ముంచెత్తింది. వరద తగ్గాక సోమవారం వెళ్లే సరికి పత్తి చేనులోని మొక్కలన్నీ నేలవాలి నామరూపాల్లేకుండా పోయాయి. దీంతో ఏం చేయాలో పాలుపోక శ్రీను కన్నీరుమున్నీరవుతున్నాడు.



సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని నారాయణపురం చెరువు కట్ట తెగడంతో పొలాల్లో పడిన గుంతలు

లక్షల ఎకరాల్లోని పంటలు వరదలోనే...

- భారీ వర్షాలు, వరదలతో రాష్ట్రవ్యాప్తంగా నీటమునిగిన 15 లక్షల ఎకరాల పంటలు
- 4.15 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా తేల్చిన వ్యవసాయ శాఖ
- పత్తికి పచ్చదోమ ప్రమాదం.. రంగు మారనున్న వరి

సాక్షి, హైదరాబాద్‌/సాక్షి, నెట్‌వర్క్‌: రాష్ట్రంలో కుండపోత వర్షాలు, వరదలకు లక్షల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. రెండు మూడు రోజులుగా పంటలన్నీ నీళ్లలోనే నానుతున్నాయి. అన్ని జిల్లాల్లో కలిపి 15 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు నీటమునిగినట్లు వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. అందులో 4.15 లక్షల ఎకరాల మేర నష్టం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించింది. పంట నష్టం జరిగిన రైతులకు ఎకరాకు రూ. 10 వేల చొప్పున నష్టపరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో త్వరలో పూర్తిస్థాయి నష్టాన్ని అంచనా వేస్తామని అధికారులు అంటున్నారు.

వరి రైతు విలవిల..

వరదల వల్ల వరి, పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, కంది సహా ఇతరత్రా పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వర్షాల దెబ్బకు అధికంగా మహబూబాబాద్, ములుగు, ఖమ్మం, నల్లగొండ, నాగర్‌కర్నూలు, మహబూబ్‌నగర్, హన్మకొండ, భద్రాద్రి కొత్తగూడెం, జనగాం జిల్లాల్లో పంటలు నీటమునిగాయి. నాట్ల దశలోనే వరి ఉండటంతో రైతులకు తీవ్రమైన నష్టం వాటిల్లనుంది.

పెరగనున్న చీడపీడల బెడద..

అధిక వర్షాల వల్ల వివిధ పంటల్లో కొన్ని రకాల చీడపీడల ఉధృతి అధికంగా ఉంటుందని ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్న వరి, పత్తి, మొక్కజొన్న, సోయాచిక్కుడు, కంది, పెసర, మినుము వంటి పంటల్లో ప్రస్తుతం ఉన్న దశలో కొన్ని రకాల చీడపీడలు ఆశించే అవకాశం ఉందన్నారు. వరి పంట పసుపు రంగులోకి మారుతుందని.. కొనల నుంచి తెల్లటి చారలు ఏర్పడతాయన్నారు. అలాగే పత్తిలో పచ్చ దోమ అధికమవుతుందని.. ఎండు తెగులు కూడా ఎక్కువ అయ్యే అవకాశం ఉందన్నారు. సోయా చిక్కుడు పంట కాత దశలో ఉన్నందున వేరు కుళ్ల, ఎండు తెగులు ఆశించే అవకాశం, కాయలుపై పక్షి కన్ను తెగులు, ఆకులపై కొన్ని రకాల శిలీంద్రాల వల్ల ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

4 ఎకరాల్లో ఇసుక మేటలు



నాకు 13 ఎకరాలు పొలం ఉంది. మరో 16 ఎకరాలు కౌలుకు తీసుకున్నా. మొత్తం వరి సాగు చేశా. ఇప్పటికే ఎకరానికి రూ. 20 వేల చొప్పున పెట్టుబడి పెట్టా. భారీ వర్షాల కారణంగా పోతిరేణికుంట చెరువు నీరంతా 4 ఎకరాల పొలాన్ని ముంచెత్తడంతో ఇసుక మేటలు వేశాయి. కొన్నిచోట్ల పొలం కోతకు గురైంది.

– దేవరం ప్రభాకర్‌రెడ్డి, రైతు, హుజూర్‌నగర్, సూర్యాపేట జిల్లా

వివిధ జిల్లాల్లో వరద నష్టం ఇలా..

- ఖమ్మం జిల్లాలో ఆకేరు, పాలేరు పొంగిపొర్లడం, మున్నేరు, వైరాకు భారీ వరద పోటెత్తడంతో వేలాది ఇళ్లు నీట మునిగాయి. కొన్ని ఇళ్లు కూలాయి. 37,716 మంది రైతులకు చెందిన 57,410 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలో మొత్తం రూ. 11,99,65,000 వరకు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. జిల్లావ్యాప్తంగా 38 చెరువులు ఉప్పొంగాయి. 180 వరకు చేపల చెరువులు పొంగిపొర్లాయి. దీంతో సుమారు రూ. 4.20 కోట్ల విలువైన 3,500 టన్నుల మత్స్య సంపదకు నష్టం జరిగింది. ఏదులాపురం సెక్షన్‌లో 11 కేవీ టవర్, 1,935 స్తంభాలు దెబ్బతిన్నాయి. నాలుగు సబ్‌స్టేషన్లలో నీరు నిలిచింది.
- ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో 60 వేల ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. మహబూబాబాద్‌ జిల్లాలో 78, జనగామలో 8, వరంగల్‌లో 2, జయశంకర్‌ భూపాలపల్లిలో 8, ములుగులో 6, హనుమకొండలో 2 చెరువులు కలిపి మొత్తం 104 చెరువులకు గండ్లు పడ్డాయి.
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వరదల్లో చిక్కుకొని ఇద్దరు మరణించగా వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా ప్రకారమే నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో 22,344 ఎకరాల్లో వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. సూర్యాపేట జిల్లాలో 23 చోట్ల రోడ్లు తెగిపోగా, 35 రోడ్లు దెబ్బతిన్నాయి. మరో 15 చెరువుల కట్టలు తెగిపోయినట్లు జిల్లా యంత్రాంగం గుర్తించింది.
- ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా 7,746 ఎకరాల్లో వరి, పత్తి, వేరుశనగ తదితర పంటలకు నష్టం వాటిల్లింది. సుమారు 140 వరకు ఇళ్ల ధ్వంసమవగా 10 ప్రాంతాల్లో రోడ్లు కోతకు గురయ్యాయి.
- ఉమ్మడి మెదక్‌ జిల్లాలో సుమారు 2 వేల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. రోడ్లు దెబ్బతిన్నాయి. కాలువలకు గండి పడింది. అక్కడక్కడ కుంటల కట్టలు తెగిపోయాయి. గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి.



ఖమ్మం రూరల్‌ మండలంలో మిర్చి తోటలో ఇసుక మేట



వరదల కారణంగా ఖమ్మం పట్టణంలోని పెద్దమ్మ గుడి ప్రాంతంలో చనిపోయిన జీవాలను చూసి రోదిస్తున్న యజమాని

అప్రమత్తంగా ఉండండి

11 జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్షలో సీఎస్‌ శాంతికుమారి



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. మంగళవారం కూడా దాదాపు 11 జిల్లాల్లో భారీ వర్షాలుంటాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఆయా జిల్లాల కలెక్టర్లతో సోమవారం సమీక్షించారు. ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కొమురం భీం ఆసిఫాబాద్, మెదక్, మేడ్చల్‌–మల్కాజిగిరి, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఆమె టెలికాన్ఫరెన్స్‌ ద్వారా ఆయా జిల్లాల్లో వరదల పరిస్థితి, పునరావాస, సహాయక చర్యలను అడిగి తెలుసుకున్నారు.

జాగ్రత్తలు తీసుకోండి: భారీ వర్షాలు కురిసే అవకాశమున్న జిల్లాల కలెక్టర్లు ముందస్తు ప్రణాళిక రూపొందించుకొని ఏ విధమైన ఆస్తి, ప్రాణనష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎస్‌ శాంతికుమారి స్పష్టం చేశారు. స్థానిక పరిస్థితుల దృష్ట్యా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించే విషయమై జిల్లా కలెక్టర్లే నిర్ణయించుకోవాలన్నారు. స్వర్ణ, కడెం ప్రాజెక్టుల గేట్లను తెరవడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని నిర్మల్‌ కలెక్టర్‌ను ఆదేశించారు. కలెక్టరేట్‌లలో కంట్రోల్‌ రూంలు 24/7 పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో డీజీపీ జితేందర్, విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌ కుమార్, ఫైర్‌ సర్వీసుల డీజీ నాగిరెడ్డి, నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌ జీవన్‌ పాటిల్‌ పాల్గొన్నారు.

వరదలతో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి

- ఇళ్లు కోల్పోయిన వారికి రూ.5 లక్షలు ఇవ్వాలి
- బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ డిమాండ్‌



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు కేవలం రూ.5 లక్షలు నష్టపరిహారం ప్రకటించటం అన్యాయమని..రూ.25లక్షలు పరిహారం ప్రకటించాలని బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ డిమాండ్‌ చేశారు. గతంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌ వరదల్లో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు రూ. 25 లక్షలు పరిహారం అందిస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. వరదల కారణంగా ఇళ్లు కోల్పోయిన వారికి రూ.2.5లక్షల నుంచి రూ.5లక్షల వరకు పరిహారం ఇవ్వాలన్నారు.

భారీ వర్ష సూచన ఉన్నా కుంభకర్ణ నిద్రలో ప్రభుత్వం

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నేరపూరిత నిర్లక్ష్యం ఫలితంగా ఓ యువ శాస్త్రవేత్తతో పాటు సుమారు 20 మంది వరదల్లో ప్రాణాలు కోల్పోయారని కేటీఆర్‌ ధ్వజమెత్తారు. తెలంగాణ జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందని హైదరాబాద్‌ వాతావరణ కేంద్రం ఆగస్టు 27న ప్రకటించినా కాంగ్రెస్‌ ప్రభుత్వం కుంభకర్ణ నిద్రలో ఉందన్నారు. 'ఒక మంత్రి హెలికాప్టర్లు దొరకలేదంటాడు. మరొక మంత్రి, ఈ రాష్ట్రానికి సీఎం లేనట్టు పక్క రాష్ట్ర సీఎంకు ఫోన్‌ చేస్తాడు. మూడో మంత్రి ఫొటోలకు పోజులకే పరిమితమవుతాడు. జరగాల్సిన నష్టమంతా జరిగాక పూల డెకరేషన్‌ స్టేజీ మీద కూర్చొని వరదల మీద సమీక్ష చేసే 'చీఫ్‌ మినిస్టర్‌'ఉల్టా చోర్‌ కొత్వాల్‌కో డాంటే అన్నట్టు వరదలొస్తే సాయం చేయకుండా ప్రతిపక్షం ఏం చేస్తుందని ప్రశ్నిస్తాడు' అని కేటీఆర్‌ మండిపడ్డారు.

ఎస్‌ఎన్‌డీపీతోనే హైదరాబాద్‌కు వరద ముప్పు తప్పింది

విజన్‌ ఉంటే విపత్తులను కూడా సమర్థంగా ఎదుర్కోవచ్చని బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన 'ఎస్‌ఎన్‌డీపీ'ని రూపించిందని బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ అన్నారు. కొద్దిరోజులుగా హైదరాబాద్‌లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నా..లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా కాపాడటంలో ఎస్‌ఎన్‌డీపీ (స్ట్రాటజిక్‌ నాలా డెవలప్‌మెంట్‌ ప్రోగ్రాం) కీలకపాత్ర పోషించిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రాహుల్‌గాంధీ ట్వీట్‌పై కేటీఆర్‌ ఆగ్రహం

భారీవర్షాలు, వరదల కారణంగా తెలంగాణలో ఏర్పడిన పరిస్థితులు తనను ఆవేదనకు గురిచేశాయని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తెలంగాణ ప్రభుత్వం అవిశ్రాంతంగా చర్యలు చేపట్టిందంటూ రాహుల్‌గాంధీ చేసిన ట్వీట్‌పై కేటీఆర్‌ ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. బాధపడుతున్నట్టుగా ప్రకటనలు చేస్తే సరిపోదని రాహుల్‌కు సూచించారు. తెలంగాణలో సహాయక కార్యక్రమాలను ఎంత చిత్తశుద్ధితో చేస్తున్నారో లేదో తెలుసుకుంటే ప్రభుత్వ నిర్వాకం తెలిసేదని వ్యాఖ్యానించారు.

నేటి బీజేపీ సభ్యత్వ నమోదు వాయిదా

కొత్త తేదీని త్వరలో ప్రకటిస్తాం
బీజేపీ నేత ఎస్‌.రాంచందర్‌రావు

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో మంగళవారం ప్రారంభించాల్సిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం వాయిదా పడిందని ఆ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్సీ ఎస్‌.రాంచందర్‌రావు వెల్లడించారు. రాష్ట్రంలో భారీ వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్న నేపథ్యంలో అధిష్టానం సూచన మేరకు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. సభ్యత్వ నమోదుకు సంబంధించి కొత్త తేదీని త్వరలోనే వెల్లడిస్తామని సోమవారం ఆయన తెలిపారు. భారీవర్షాలు, వరదలతో తలెత్తిన పరిస్థితులను ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా దృష్టికి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ తీసుకెళ్లారన్నారు.

కేంద్రం నుంచి అవసరమైన సహాయం: కేంద్రమంత్రి నడ్డా

సాక్షి, హైదరాబాద్‌: కేంద్రం నుంచి రాష్ట్రానికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని కేంద్ర మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ.నడ్డా తెలిపారు. ఇప్పటికే ఉన్న ఎన్డీఆర్‌ఎఫ్‌ బృందాలకు తోడుగా అదనంగా మరిన్ని బలగాలు పంపిస్తామని భరోసా ఇచ్చారు. తెలంగాణలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదలపై ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఫోన్‌ చేసి రాష్ట్ర పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు.

శవ రాజకీయాల్లో బీఆర్‌ఎస్‌ దిట్ట

- సర్కార్‌ సహాయ చర్యలను చూడలేని కబోదులు: సీతక్క



సాక్షి, హైదరాబాద్‌: కష్టకాలంలో చేయూతనివ్వాల్సింది పోయి మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఇతర బీఆర్‌ఎస్‌ నేతలు వరదల్లో బురద రాజకీయాలు చేస్తున్నారని పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి సీతక్క మండిపడ్డారు. బీఆర్‌ఎస్‌ నేతలు క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాలను తెలుసుకోలేని, సర్కార్‌ చేపడుతున్న సహాయక చర్యలను చూడలేని కబోదులు అని ధ్వజమెత్తారు. ప్రజల కష్టాలు, నష్టాలు వాటి విలువ కేసీఆర్‌ కుటుంబానికి తెలియదని సోమవారం ఆమె ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. 'రాష్ట్రంలో ఇంత విపత్తు సంభవిస్తే ఒక్క బీఆర్‌ఎస్‌ కీలక నేత క్షేత్ర స్థాయిలో లేరు. కానీ శవ రాజకీయాలు చేయడంలో మాత్రం దిట్టలు' అని విమర్శించారు. 'వరదల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షలు పరిహారంగా ప్రకటించింది. గతంలో ఇచ్చిన రూ.4 లక్షలకు అదనంగా మరో లక్ష కలిపి ఇస్తున్నాం. బీఆర్‌ఎస్‌ అధికారంలో ఉన్నప్పుడు వరద బాధితులకు రూ.25 లక్షలు ఎందుకివ్వలేదు? 'కొండగట్టు బస్సు ప్రమాదంలో 63 మంది చనిపోతే కనీసం సంతాపం చెప్పలేదు. రైతులు చనిపోతే పైసా పరిహారం ఇవ్వలేదు. నిరుద్యోగ అభ్యర్థులు చనిపోతే కనీసం ఓదార్పు లేదు. ఇప్పుడేమో శవరాజకీయాలు చేస్తున్నారు' అని మండిపడ్డారు.

సోషల్‌ మీడియాలో బతికేస్తున్న కేటీఆర్, హరీశ్‌

ప్రతిపక్షాల విమర్శలు అర్థరహితం

- బీఆర్‌ఎస్‌ పాలకుల మాదిరి గడీల్లో పడుకోలేదు
- ప్రజల మధ్యే ఉండి సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నాం
- వైఎస్సార్‌కు నివాళులర్పించాక మీడియాతో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క



వైఎస్‌ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి తుమ్మల

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ప్రతిపక్షాలు ప్రజాప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు పనికిమాలినవని.. వాళ్లు చేసిన పాపాలపై నిలదీస్తారనే భయంతో ప్రజల్లోకి వచ్చే ధైర్యం లేక ట్విటర్, ఫేస్‌బుక్, వాట్సాప్‌ వేదికగా బీఆర్‌ఎస్‌ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు రాజకీయంగా బతికేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. అనుకోని విధంగా వచ్చిన ఈ విపత్తును ఎదుర్కొనేలా రాష్ట్ర ప్రభుత్వం హైఅలర్ట్‌గా ఉన్నందునే రాష్ట్రంలో ఎక్కడా ప్రాణనష్టం జరగలేదని వెల్లడించారు. ఖమ్మంలోని కాంగ్రెస్‌ జిల్లా కార్యాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్‌ వైఎస్‌.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో భట్టి పాల్గొన్నారు. వైఎస్సార్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించాక డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్ష నేతలకు పని లేదని.. వారు చేస్తున్న విమర్శలను ప్రజలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. గత బీఆర్‌ఎస్‌ పాలకుల మాదిరిగా తాము గడీల్లో పడుకోలేదని, ప్రజల మధ్యే ఉండి సహాయక చర్యలు చేపట్టామని తెలిపారు. గత బీఆర్‌ఎస్‌ పాలనలో కొద్దిపాటి వర్షం పడితే జంట నగరాలు మునిగిపోయాయని, కానీ ఇంత పెద్ద విపత్తు వచ్చినా హైదరాబాద్‌ నేడు సురక్షితంగా ఉందంటే తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా ఫలితమేనని భట్టి తెలిపారు.

భారీ వర్షాలు, వరదతో నిరాశ్రయులైన వారికి తక్షణమే నిత్యావసర సరుకులను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు.

సహాయక చర్యల్లో ఆ మంత్రులు విఫలం

- 9 మంది ఎమ్మెల్యేలున్నా.. 9 మందిని కాపాడలేకపోయారు
- ప్రజల కన్నీళ్లు తుడవకుండా ప్రతిపక్షాలపై విమర్శలా: హరీశ్‌



సాక్షి, హైదరాబాద్, చేగుంట(తూప్రాన్‌): ఖమ్మం జిల్లాలో తొమ్మిది మంది కాంగ్రెస్‌ ఎమ్మెల్యేలను గెలిపిస్తే వరదల్లో చిక్కుకున్న 9 మందిని కూడా కాపాడలేకపోయారని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు. సోమవారం మెదక్‌ జిల్లా చేగుంటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వాతావరణశాఖ హెచ్చరికలు చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే అనేక మంది మృత్యువాతపడ్డారని పేర్కొన్నారు. వర్షాలతో 16 మంది మృతి చెందినట్లు ప్రభుత్వం చెబుతున్నా.. తమ వద్ద ఉన్న సమాచారం ప్రకారం 31 మంది మృతి చెందారని తెలిపారు. ఖమ్మంలో కాపాడమని కోరుతున్న వరద బాధితులపై పోలీసులు లాఠీచార్జి చేయడం దారుణమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు సహాయక చర్యలు చేపట్టడం మానేసి బీఆర్‌ఎస్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని నిందించారు.

ప్రతీ ఎకరాకు రూ.10వేల పరిహారమివ్వాలి

ఓ వైపు ప్రజలు ఆపదలో ఉంటే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రాజకీయాలు మాట్లాడుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. ప్రజల కన్నీళ్లు తుడవకుండా ప్రతిపక్షాల మీద విమర్శలు చేస్తున్నారని ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ ఎకరాకు రూ.10వేల పరిహారం చెల్లించాలని డిమాండ్‌ చేశారు. కాగా, శాసన మండలి మాజీ సభ్యులు, ప్రొఫెసర్‌ నాగేశ్వర్‌పై సోషల్‌ మీడియా వేదికగా బీజేపీ చేస్తున్న దాడిని హరీశ్‌రావు ఖండించారు.



సంతోషం అనేది అత్తరు లాంటిది.
నీ మీద కొంతయినా చిందకుండా ఇతరుల మీద దాన్ని చల్లలేవు.
- రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి
మంగళవారం, 3 సెప్టెంబర్ 2024

మార్పు మేలు చేస్తుందా?

కొన్ని నిర్ణయాలంతే! అధికారపక్షం స్వాగతిస్తుంటుంది, ప్రతిపక్షాలు విమర్శిస్తుంటాయి. హర్యానా అసెంబ్లీ ఎన్నికల తేదీని అక్టోబర్ 1 నుంచి 5కు మారుస్తూ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) తీసుకున్న నిర్ణయం విషయంలోనూ అదే జరిగింది. సెలవుల వల్ల ఓటింగ్ తగ్గకూడదనే భావనతో సరైన నిర్ణయం తీసుకున్నారంటూ అధికారంలో ఉన్న బీజేపీ, ఉనికి కోసం పోరాడుతున్న ప్రతిపక్షం 'ఇండియన్ నేషనల్ లోక్‌దళ్' హర్షం వ్యక్తం చేశాయి. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ మాత్రం ఇదంతా ఓటమి భయంతో ప్రచారం గడువు పెంచుకొనేందుకు బీజేపీ ఆడిస్తున్న తేదీ మార్పు నాటకం అంటోంది. ఈ నెల 18 నుంచి అక్టోబర్ మొదటి వారంలోగా సాగే ఈ విడత అసెంబ్లీ ఎన్నికల్లో హర్యానాతో పాటు జమ్మూ కశ్మీర్‌లోనూ పోలింగ్ జరగనుంది. ఒక్కో రాష్ట్రం ఒక్కోలా దృష్టిని ఆకర్షిస్తున్నా, హర్యానాలో అధికార బీజేపీకి ఎదురుగాలి వీస్తున్న నేపథ్యంలో తేదీ మార్పు కథ ఆసక్తి రేపుతోంది.

వ్యవసాయ రంగంలో సంక్షోభం, రైతుల నిరసనలు – డిమాండ్లపై ప్రభుత్వ వ్యవహారశైలి, పారిశ్రామికీకరణలో హర్యానా వెనుకబాటు, అంతకంతకూ పెరుగుతున్న నిరుద్యోగం, మహిళా రెజ్లర్ల ఆందోళన, వివాదాస్పద అగ్నిపథ్ పథకం లాంటి అనేక అంశాలు హర్యానాలో బీజేపీకి ఎదురుగాలి వీచేలా చేస్తున్నాయి. వర్గపోరుతో సతమతమవుతున్నప్పటికీ కాంగ్రెస్ కొంత ముందంజలో ఉందని కథనం. ఈ పరిస్థితుల్లో పోలింగ్ తేదీ మార్పు ప్రశ్నలు లేవనెత్తింది. అసోజ్ అమావాస్య పుణ్యతిథి ఉన్నందున ఓటింగ్ తేదీని మార్చాలని ఆలిండియా బిష్ణోయ్ మహాసభ అభ్యర్థనలు చేసిందనీ, వాటిని దృష్టిలో ఉంచుకొనే ఈ మార్పు చేపట్టామనీ ఎన్నికల సంఘం చెబుతోంది. కేంద్రంలోని అధికార బీజేపీ చెప్పినట్టు ఎన్నికల సంఘం నడుచుకుంటోందనీ, హర్యానాలో విజయంపై అనుమానాలు ఉన్నందున పోలింగ్‌కు మరింత గడువు కోసమే బీజేపీ ఈ తేదీ మార్పు చేయించిందనీ ప్రతిపక్షాల ఆరోపణ. సహజంగానే కౌంటింగ్ తేదీ మారింది. ఇప్పుడు హర్యానాతో పాటు జమ్మూ – కశ్మీర్ అసెంబ్లీ ఓట్ల లెక్కింపు అక్టోబర్ 4న కాక 8న జరగనుంది.

నిజానికి, సాంస్కృతిక, ధార్మిక ఉత్సవాలకు అడ్డు రాకుండా పోలింగ్ తేదీలను మార్చడమనేది కొత్తేమీ కాదు. ఎన్నికల సంఘం గతంలోనూ ఆ పని చేసింది. గురు రవిదాస్ జయంతికి భక్తులు వారణాసికి వెళతారనే కారణంతో 2022లో పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్ని వారం పాటు వాయిదా వేశారు. అదే ఏడాది మణిపూర్‌లో సైతం క్రైస్తవుల ఆదివారం ప్రార్థనల రీత్యా ఎన్నికల తేదీని మార్చారు. ఇక, నిరుడు 2023లో దేవుథని ఏకాదశి రోజున రాష్ట్రంలో సామూహిక వివాహాలు జరుగుతాయి గనక రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలను ఆ రోజు నుంచి మార్చారు. ఇటీవలే కాదు... పుష్కర కాలం క్రితం 2012లోనూ బారావఫాత్ (మిలాద్ ఉన్ నబీ) కారణంగా ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికల తేదీని మార్చారన్నది గమనార్హం. తాజాగా హర్యానాలో తేదీ మార్పునకు మరో కారణమూ ఉందని అధికార వర్గాలంటున్నాయి. ముందుగా ప్రకటించిన పోలింగ్ తేదీ ప్రకారమైతే... సెప్టెంబర్ 30వ తేదీ ఒక్క రోజు గనక సెలవు పెడితే, ఆ రాష్ట్రంలో వరుసగా ఆరు రోజులు సెలవులు వచ్చే పరిస్థితి. దానివల్ల పలువురు సెలవు పెట్టి, ఓటింగ్‌కు దూరంగా ఊళ్ళకు వెళ్ళే ప్రమాదం ఉంది. కొత్త పోలింగ్ తేదీతో ఆ అలసత్వాన్ని తప్పించి, ఓటింగ్ శాతాన్ని పెంచవచ్చనేది అధికారుల కథనం.

మరీ ఇన్ని తెలిసిన ఎన్నికల సంఘం ముందుగానే ఈ అంశాలన్నీ ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదన్నది ప్రశ్న. ఎన్నికల తేదీలను ఖరారు చేస్తున్నప్పుడే ఇలాంటివన్నీ దృష్టిలో పెట్టుకొని కసరత్తు చేయాల్సిన బాధ్యత దానికి ఉంది. హర్యానాలో ఆ పని ఎందుకు చేయలేకపోయిందో ఈసీ జవాబు చెప్పాలి. అసలు రాజ్యాంగబద్ధ సంస్థ అయినప్పటికీ ఎన్నికల సంఘాన్ని తమ చేతిలో సాధనంగా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీలు వాడుకుంటున్నాయన్న విమర్శ చాలా కాలంగా ఉన్నదే. ఆ ఆరోపణలు అంతకంతకూ పెరుగుతుండడమే విషాదం. పైగా, ఈ ఏడాది ప్రథమార్ధంలో జరిగిన సార్వత్రిక ఎన్నికలు, కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికల సంఘం వ్యవహారశైలి పైన, ఈవీఎంల పని తీరు పైన తీవ్రమైన ఆరోపణలు రావడం తెలిసిందే. ఇప్పటికీ వాటికి సంతృప్తికరమైన సమాధానం ఇవ్వని ఈసీ ఇప్పుడిలా వ్యవహరించడం లేనిపోని అనుమానాల్ని మరింత పెంచుతోంది. వ్యవస్థలు పారదర్శకంగా లేవని తేటతెల్లమవుతున్న పరిస్థితి ఆందోళన రేపుతోంది.

ఇలాంటి పరిస్థితుల్లో నరం లేని నాలుకతో మాట్లాడే పార్టీల పాపం కూడా లేకపోలేదు. ప్రస్తుతం హర్యానా విషయంలో చెరొకవైపు నిలబడ్డ బీజేపీ, కాంగ్రెస్‌లు రెండూ... రెండేళ్ళ క్రితం 'ఆమ్ ఆద్మీ పార్టీ' (ఆప్) నుంచి గట్టిపోటీ ఉన్న పంజాబ్ ఎన్నికల వేళ మాత్రం ఒకే తాటి మీద నిలవడం విచిత్రం. అప్పట్లో గురు రవిదాస్ జయంతి గనక పోలింగ్ తేదీని మార్చాలంటూ రెండు పార్టీలూ కోరాయి. ఎన్నికల సంఘం ఆ కోరికను మన్నించింది. కానీ, పోలింగ్‌ను వాయిదా వేయించినంత మాత్రాన ఫలితం మారలేదు. ఆ పార్టీలకేమీ కలసి రాలేదు. ఆప్ ప్రభంజనంలో అవి కొట్టుకుపోయాయి. ఎన్నికల బరిలో పరిస్థితులు పోటాపోటీగా ఉన్న సందర్భంలో నాలుగు రోజులు అదనంగా ప్రచారానికి లభించడం కీలకమే. కానీ, ఎవరిని గద్దె దింపాలి, ఎవరిని పీఠమెక్కించాలన్న అంశంపై ప్రజలు ముందే ఓ స్పష్టమైన నిర్ణయానికి వచ్చి ఉంటారు. ఒకవేళ ఉద్దేశపూర్వకంగా పోలింగ్ తేదీని నాలుగైదు రోజులు అటో ఇటో మార్చినా ఫలితం ఉంటుందనుకోవడం పిచ్చి భ్రమ. అప్పుడు పంజాబ్‌కైనా, ఇప్పుడు హర్యానాకైనా అదే వర్తిస్తుంది. ఈ తర్కాన్ని మార్చిపోయి దింపుడు కళ్ళం ఆశతో ఉంటే ఉపయోగం లేదని గుర్తించాలి. కారణమేమైనప్పటికీ తేదీ మార్పు వల్ల ఓటింగ్ శాతమంటూ పెరిగితే ప్రజాస్వామ్యానికి మంచిదే. కానీ, అది ఏ పార్టీకి ఉపకరిస్తుందన్నదే బేతాళప్రశ్న.

గిరిజనుల భూమి గిరిజనులకే!

అభిప్రాయం



సి.హెచ్. విద్యాసాగర్‌రావు

ప్రధాన జీవన స్రవంతిలో ఆదివాసీ ప్రజల అస్తిత్వం, గౌరవం, కృషి ఏ మేరకు గుర్తింపునకు నోచుకున్నాయి అనేదాన్నిబట్టి ఆ జాతి సమగ్ర మూర్తిమత్వం అర్థమవుతుంది. అల్లూరి సీతారామరాజు, రాంజీ గోండ్, కొమురం భీం లాంటి యోధులు 'జల్', 'జంగల్', 'జమీన్' పేరిట వారి హక్కుల సాధన కొరకు పోరాడి ప్రాణాలర్పించారు. అయితే స్వతంత్ర భారతదేశంలో గిరిజనుల కోసం చేసిన చట్టాలు నిర్వీర్యమయ్యాయి. చొరబాటుదారులు అడవి ద్వారాలు తీశారు. ఆదిమ జాతీయులకు వారి భూమి వారికి దక్కకుండా పోవడం క్షమించరానిది. ప్రభుత్వాలు, పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు ఆలోచించి ఒక ఆమోదయోగ్యమైన కార్యాచరణను రూపొందించుకోకపోతే ఆందోళనకరమైన పరిస్థితులు అనివార్యమవుతాయని గత ఉద్యమాల చరిత్ర చెబుతోంది.

మాతృమూర్తైనా, మాతృభాషైనా, మాతృదేశమైనా పలికేటప్పుడు వేరువేరుగా వినిపించినా ఆ మూడింటి అంతఃసూత్రం ఒకటే బంధం. తల్లి గర్భాలయంలో మనం నేర్చుకున్న మనదైన భాషలో మాతృదేశంలో తొలి అడుగు మోపే నవజాత శిశువుకు ఈ మూడింటి అస్తిత్వం అనివార్యంగా ఇవ్వబడుతుంది. ఇలాంటిదే ఒక జాతికి కూడా ఉంటుంది. అదే మూలవాసీ సంస్కృతి. ప్రధాన జీవన స్రవంతిలో ఆదివాసీ ప్రజల అస్తిత్వం, గౌరవం, కృషి ఏ మేరకు గుర్తింపునకు నోచుకున్నాయి అనేదాన్నిబట్టి ఆ జాతి సమగ్ర మూర్తిమత్వం అర్థమవుతుంది.

సుద్దాల అశోక్‌తేజ రాసిన 'కొమురం భీముడో' అన్న సినీ గేయం కొత్త ఆలోచనల్ని రేకెత్తిస్తుంది. అడవి తల్లి తన గిరిజన సంతానాన్ని ఆత్మ గౌరవ బావుటా ఎగురెయ్యాలని సందేశాత్మకంగా చేసిన హెచ్చరికలను స్పష్టం చేసేవిధంగా ఈ పాట సాగింది. వారి హక్కుల కోసం వారే ఉద్యమించాలనే ఉద్వేగాన్ని నింపుతుంది. ఈ పాట ప్రతి గిరిజనుడిని అగ్ని కణంలా వెంటాడింది. దేశంలో గిరిజన ప్రాంతాలున్న అన్ని రాష్ట్రాలలో వారి భాషలోకి తర్జుమా చేసి వినిపించాలనే ప్రణాళికతో అక్కడి నాయకులు ముందుకుపోతున్నారు.

'మన సంస్కృతి మూలాల్ని నాశనం చేస్తున్న విదేశీయుల మీద నా పోరాటం' అన్నారు బిర్సా ముండా. నూరేళ్ళ జీవితానుభవంతో 25 ఏళ్లు బతికి ధిక్కార హెచ్చరికను వినిపించి, బ్రిటిష్‌వాళ్ల గుండెల్లో ఫిరంగులు పేల్చాడు. ఆయన జయంతి నవంబర్ 15న 'జన్ జాతీయ దివస్'గా జరుపుకొంటున్నాం. బిర్సా ముండా చిత్రపటాన్ని పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో ఉంచడంతో పాటు, రాంచీ విమానాశ్రయానికి, ఇంకా ఎన్నో సంస్థలకు ఆ వీరుని పేరు పెట్టడం జరిగింది. అల్లూరి సీతారామరాజు, రాంజీ గోండ్, కొమురం భీం లాంటి యోధులు 'జల్', 'జంగల్', 'జమీన్' పేరిట వారి హక్కుల సాధన కొరకు పోరాడి ప్రాణాలర్పించారు. బ్రిటిష్ పాలనలో మొత్తం 75 సార్లు గిరిజన తిరుగుబాట్లు జరిగాయంటే వారి చైతన్యం ఎంత గొప్పదో అర్థం చేసుకోవాలి.

తెలంగాణా గవర్నరు జిష్ణుదేవ్ వర్మ ఈ మధ్యన తెలంగాణ గిరిజన ప్రాంతాలలో పర్యటించడం ముదావహం. గిరిజనులకు బాసటగా నిలవడానికి 'యాక్ట్ 1/70'ని రూపొందించుకున్నాం. అందులో ఉన్న సెక్షన్ 3(1)(ఎ) ప్రకారం, వివాదాలు తేలేంతవరకు షెడ్యూల్డ్ ప్రాంతాలలో ఉన్న భూమి గిరిజనులదిగానే భావించబడుతుంది. ఈ మధ్యన గవర్నరు పర్యటించిన ప్రాంతం ఆ కోవకే చెందుతుంది. వారికి అధికారులు ఏ మేరకు పరిస్థితులను విశదీకరించారో గానీ, రాజ్యాంగంలోని 'షెడ్యూల్ 5' ప్రకారం గవర్నరుకు విశేషాధికారాలు ఉంటాయి. ఇది వజ్రాయుధం లాంటిది.

డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 'రాజ్యాంగం ఎంత మంచిదైనా దాన్ని అమలు పరిచేవాళ్ళు చెడ్డవాళ్లైతే అది కూడా చెడ్డది కావడం ఖాయం. రాజ్యాంగం ఎంత చెడ్డదైనా దాన్ని అమలు పరిచేవాళ్ళు మంచివాళ్లైతే



అది కూడా మంచిదవటం అంతే ఖాయం' అన్నారు. మన రాజ్యాంగ సంవిధాన మౌలిక నిర్మాణం ఎంతో గొప్పది. సామాజిక అణచివేతకు గురైనవారి అభ్యున్నతి కోసం తోడ్పడడమే రాజ్యాంగంలోని రిజర్వేషన్ల లక్ష్యం.

స్వాతంత్ర్యానంతరం పాలకులు ఆదివాసీలను చేరడానికి ముఖ్యంగా మూడు ఆలోచనలు చేశారు. ఏకాంతవాసం, కలిసిపోవటం, అభ్యున్నతి. 1958లో మన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఈ కలిసిపోవటాన్ని ఎంచుకున్నారు. అంటే ఆదివాసీలతో కలిసి వారిని అభివృద్ధి పరచాలని. ఆదివాసీలను దోపిడీ నుంచి కాపాడాలని, రక్షణగా నిలవాలని, వారికి సంక్షేమ పథకాలు రూపొందింపజేయాలని భావించి 'పంచశీల'ను ఎంచుకున్నారు. ఆ తరువాత యాక్ట్ డి.ఎఫ్. 1970 చట్టం తీసుకొచ్చారు. గిరిజనుల భూమిని, అటవీ సంపదను ఇది కవచంలాగా కాపాడుతుందని ఊదరగొట్టారు. కానీ ఆ చట్టాలు నిర్వీర్యం అయ్యాయి. చొరబాటుదారులు అడవి ద్వారాలు తీశారు.

తెలంగాణాలో నిజాం కాలంలో దీనికోసం హైమన్ డార్ఫ్‌ని తన సలహాదారుగా నియమించుకున్నారు. ఎన్నో సంస్కరణలు చేశామనుకున్నారు. కానీ 1948 అనంతరం ఏర్పడిన ప్రభుత్వాలు ఈ దిశగా పెద్దగా చర్యలు తీసుకోలేదు. 1976, '77లో ఆదిలాబాద్‌లోని ఉట్నూరు ప్రాంతాన్ని సందర్శించినప్పుడు విస్తుపోయే వాస్తవాలెన్నో వెలుగులోకి వచ్చాయి. సంపన్నతే చుట్టరికంగా మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రా ప్రాంతాల నుండి వచ్చిన ధనికులు గిరిజనుల భూమిని ఆక్రమించుకొని, అసలు హక్కుదారులైన గిరిజనులను అక్కడ నుండి తరిమేశారనీ, దాంతో వారు దూరంగా వచ్చి తలదాచుకున్నారనీ, ఇప్పుడు ఆ స్థలాల నుండి కూడా అటవీ అధికారులు వేరే ప్రాంతాలకు వెళ్ళాలని బెదిరిస్తున్నారనీ గిరిజనులు చెప్పుకొచ్చారు.

ఇదంతా వింటుంటే చరిత్రలోని చివరి మొఘల్ రాజు బహదూర్ షా జాఫర్ కథ గుర్తొస్తోంది. 1857 తిరుగుబాటు అణచివేయబడి బ్రిటిష్ సైన్యం చేతిలో ఆయన ఓడిపోయిన తరువాత రెండు గజాల భూమి తన భారతదేశంలో తనకు దొరకలేదనీ, ఆ బాధతోనే తన చివరి రోజుల్లో బర్మాలోనే గడుపుతూ అక్కడే ఖననం చేయబడ్డాడనీ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి గిర్‌గ్లానీ తన ఉపన్యాసంలో ఉట్టంకించటం గుర్తొస్తోంది. ఇక్కడ మనం చర్చించాల్సిన అంశం ఒకటుంది. రాజ్యాంగంలోని 5వ, 6వ షెడ్యూళ్ళ ద్వారా గవర్నర్లకు విశేష అధికారాలే కల్పించారు. వారి జీవన స్రవంతిని, సంస్కృతి, వైవిధ్యాలను రక్షిస్తూ తమకు నచ్చిన రీతిలో జీవించే విధంగా గవర్నర్లు రెగ్యులరైజేషన్ ద్వారా పరిపాలించే అధికారాలను ఈ అధికరణలు ఇవ్వడం జరిగింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే గిరిజనులు, వారి భూములపై హక్కుల అంశంపై అధ్యయనం చేయడానికి ల్యాండ్ కమిటీని నియమించింది. ఆ కమిటీ నివేదికను 2005 ఆగస్టు 15న జె.ఎస్. గిర్‌గ్లానీ ఆనాటి శాసనసభకు సమర్పించారు. అందులో ఎన్నో భయంకర నిజాలు, గిరిజనేతరులు కబళించిన భూవివరాలు వెల్లడయ్యాయి. అదేవిధంగా ఆంధ్ర ప్రాంతంలోని గిరిజన ప్రాంతాల కోసం ఐఏఎస్ మూర్తి గారిని నియామకం చేసింది ప్రభుత్వం. వీరి నివేదికలో కేంద్రంలో కొంతమంది ఉన్నతాధికారులు అసలు 5వ షెడ్యూల్‌నే రాజ్యాంగం నుంచి ఎత్తివేయాలని ప్రభుత్వానికి సూచించినట్లు ఒక ఆశ్చర్యకరమైన అంశం వెలుగులోకి వచ్చింది. ఈ రెండు నివేదికలు 'రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్' ద్వారానే బహిర్గతమయ్యాయి తప్ప, అసలు శాసనసభ మెట్లు ఎక్కలేదన్నది నిజం.

తెలంగాణ గవర్నర్ పర్యటించిన ములుగు జిల్లా గోవింద రావు పేట మండలంలోని గిరిజనుల భూముల అన్యాక్రాంతం గురించి ప్రభుత్వం నియమించిన కమిటీ 25 సంవత్సరాల క్రితమే నివేదిక లిచ్చినా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. ట్రైబల్ రెగ్యులేషన్ యాక్ట్ కింద వేలాది ఎకరాలు అన్యాక్రాంతమైనాయనీ, వాటిని గిరిజనులకు అప్పగించాలనీ తీర్పులిచ్చినా చలనం లేదు. తరతరాల నుండి జరిగిన అన్యాయాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన 'ఫారెస్ట్ రైట్ యాక్ట్ 2006' కూడా నిరర్థకంగా మారింది. బిహార్‌లో గిరిజన యోధుడు బిర్సా ముండా త్యాగాన్ని శ్లాఘిస్తూ ఏళ్ల తరబడి గిరిజనుల హక్కుల కోసం పోరాడుతున్న డాక్టర్ ఫెలిక్స్ పెడల్‌ను ఇక్కడ ఉదాహరణగా చెప్పుకోవాలి. ఈయన ఎంతో చరిత్ర ఉన్న చార్లెస్ డార్విన్ మునిమనవడు. ఆయన నుండి స్ఫూర్తిని పొందాలి.


'ఆజాద్ కా అమృతోత్సవ్' దేశమంతటా జరుపుకొంటున్న శుభ వేళ ఆదిమ జాతీయులకు మాత్రం వారి భూమి వారికి దక్కకుండా పోవడం క్షమించరానిది. ఏ చర్యలు తీసుకున్నామని వివిధ ప్రభుత్వాలు, ప్రభుత్వ యంత్రాంగాలు, వివిధ రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు ఆలోచించాలి. దృఢ సంకల్పంతో ఒక ఆమోదయోగ్యమైన కార్యాచరణను రూపొందిచుకోకపోతే ఆందోళనకరమైన పరిస్థితులు అనివార్యమవుతాయని గత ఉద్యమాల చరిత్ర స్పష్టం చేస్తోంది.

వ్యాసకర్త మహారాష్ట్ర మాజీ గవర్నర్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

నీలో విశ్వం



ఉపనిషత్తులు ఏ సందేహమూ లేని విశ్వాసంగా ఇతర దేవుళ్ల కంటే ఫలానా దేవుడు గొప్పవాడని బోధించవు. బదులుగా స్వీయ చింతన ద్వారా నీ స్వీయ అంశను అన్ని ప్రాణుల్లోనూ, మొత్తం విశ్వంలోనూ కనుగొనమని చెబుతాయి.

– డేవిడ్ ఫ్రాలే, వేదాచార్యుడు

వాయిదా వద్దు...



పనులను తర్వాతికి వాయిదా వేయొద్దు. తర్వాత మనుషులు మారిపోతారు. మాటలు చెప్పకుండా ఉండిపోతాయి. అవకాశాలు జారిపోతాయి. తర్వాత అనేది ఎప్పటికీ కాకుండా పోతుంది. ((పశ్చాత్తాపం పీడిస్తుంది. జీవితం ముందుకు సాగిపోతుంది.))

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

ప్రాణ కవచం



మొబైల్ ఫోన్లను కాపాడుకోవడానికి జనాలు వాటికి కవర్లు వేస్తారు. కానీ చాలా మంది డ్రైవింగ్ చేసేటప్పుడు హెల్మెట్లు, సీట్ బెల్టులు మాత్రం ధరించరు. సీట్ బెల్టులు ధరించడం వల్ల మరణపు రిస్కు 25 శాతం తగ్గుతుందని డబ్ల్యూహెచ్ఓ చెబుతోంది.

– రేవంత్ హిమత్‌సింగ్‌కా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

కరుణ ఎందుకంటే...



కరుణ ఎందుకు ముఖ్యమని కొలంబియా యూనివర్సిటీ ప్రొఫెసర్ అడిగారు. ప్రపంచానికి తన సమస్య లేమితో తెలుసు, పరిష్కారాలూ తెలుసు. పరిష్కర్తలకూ, బాధితులకూ మధ్య అంతరం పెరుగుతూనే ఉంది. దీనివల్ల నైతిక బాధ్యత, జవాబుదారీతనం, త్వరితంగా స్పందించడం లేకుండాపోయాయి. కరుణ ఈ అంతరాన్ని పూడ్చగలదు.

– కైలాష్ సత్యార్థి, నోబెల్ గ్రహీత

తప్పదు పోరాటం



భావ స్వేచ్ఛ అనేది ఎల్లవేళలా, అన్ని ప్రాంతాల్లో ప్రమాదంలోనే ఉంది. అందుకే దాన్ని కాపాడుకోవడానికి ఎప్పుడూ, అంతటా బలంగా పోరాడుతూనే ఉండాలి.

– కాన్‌స్టంటిన్ కిసిన్, వ్యాఖ్యాత

మన ప్రయోజనం ముఖ్యం!

అభిప్రాయం



సంగిరెడ్డి హనుమంత రెడ్డి

ఇండో–పసిఫిక్ ప్రాంతంలో చైనా నిరోధ పోటీ దేశంగా ఇండియా వ్యవహరించేలా చేయడం అమెరికా విధానం. ఈ ప్రాంతంలో చైనా వ్యతిరేక కూటమిని బలోపేతం చేసేందుకు అమెరికా దాని మిత్ర దేశాలు అనేక రహస్య ప్రణాళికలను సిద్ధం చేశాయి.

అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఎన్నికల ఫలితాలపై మోదీని అభినందించి నప్పుడు చర్చించిన అంశాల్లో అమెరికా, భారత్‌ల మధ్య బలమైన రక్షణ బంధం అగ్రస్థానంలో ఉంది. అమెరికా–భారత సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత దృఢతరం చేయడం, ఇండో–పసిఫిక్ ప్రాంతంలో పారదర్శక స్వేచ్ఛా భాగస్వామ్య దార్శనికతను ముందుకు తీసుకెళ్లడం ప్రధాన లక్ష్యాలుగా వీరి సంభాషణ సాగిందని అమెరికా పాలక వర్గాలు పేర్కొన్నాయి.

జపాన్, ఆస్ట్రేలియాలు భాగస్వాములుగా ఇండియాతో అమెరికా ఏర్పాటు చేసిన చతుష్టయ వేదిక (క్వాడ్) ఈ ప్రయోజనాల కోసమే. ఈ పరస్పర భద్రతా సంస్థను రూపొందించిన తర్వాత... అమెరికా, ఇండియాలు ఇటీవలి కాలంలో సమాచార భాగస్వామ్యం, సాంకేతికత బదిలీ ద్వారా తమ రక్షణ, భద్రత భాగస్వామ్యాన్ని బలపర్చాయి. రెండు దేశాలు క్రమం తప్పకుండా సంయుక్త సైనిక విన్యాసాల్లో పాల్గొన్నాయి. చైనాకు స్పష్టమైన సందేశం పంపాయి. తమ వివాదాస్పద సరిహద్దులో 2020 జూన్ చైనా–భారత్ ప్రతిష్టంభన... భారత్–అమెరికా సైనిక సహకారాన్ని గరిష్ఠ స్థాయికి చేర్చింది. రెండు దేశాల భాగస్వామ్య భద్రత బలోపేతానికీ, రక్షణ పరికరాల సంయుక్త అభివృద్ధికీ, ఉత్పత్తికీ 2023లో ఇరుపక్షాలూ అంగీకరించాయి. సింగపూర్‌లో 2024, మే 31– జూన్ 2 మధ్య జరిగిన షాంగ్రి–లా రక్షణ సదస్సులో అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్, "ఇండియాతో మా ప్రస్తుత బంధం మన (అమెరికా–సింగపూర్) మధ్య ఇప్పటిదాకా ఉన్న బంధంతో సమానమైంది. ఇంకా మెరుగైంది" అన్నారు.

అయినా చైనా వ్యతిరేక అమెరికా భౌగోళిక రాజకీయ క్రీడలో భారత్ బంటు పాత్ర పోషిస్తుందని అనుకోవడం అమాయకత్వం. చైనాతో ఏ ప్రత్యక్ష ఘర్షణకు దిగకుండా ఇండియా జాగ్రత్తగా ఉంది. అంబానీ, అదానీలు చైనా 5/6జీ టెలికాం పరికరాలను కొన్న తర్వాత చిన్న చైనా వస్తువులను నిషేధించారు. రెండు దేశాల మధ్య అవసర వాణిజ్యాన్ని పెంచారు. సైనికంగా చైనా తన కంటే బలమైందని, చైనాతో కయ్యానికి దిగితే అమెరికా ఆయుధాలు అమ్ముతుంది కానీ సాయంచేయదని ఇండియాకు తెలుసు. ఎన్నికల ముందు, ఒక ఇంటర్వ్యూలో చైనాతో భారత్ సంబంధాల ప్రాముఖ్యాన్ని మోదీ నొక్కిచెప్పారు. సరిహద్దులో సాగుతున్న ప్రతిష్టంభనను ఇరు దేశాలు వెంటనే పరిష్కరించుకోవాలని అన్నారు.

బలమైన, స్థిరమైన చైనా–భారత సంబంధాలు ఇరుపక్షాల ప్రయోజనాలకు అవసరం. రెండు దేశాలు ప్రజల ప్రాథమిక ప్రయోజనాలను, అవసరాలను, పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ముందుకు సాగి, తమ సంబంధాల అభివృద్ధిని ఆరోగ్యకర సుస్థిర మార్గంలో కొనసాగించగలవు. అమెరికా పట్ల ఇండియా దృక్పథం మారింది. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరుగుతున్నాయని చెబుతూనే వాటిని ఆపించమని అమెరికాను కోరింది. బంతిని అమెరికా ఆటస్థలానికి నెట్టింది. కానీ బంగ్లాదేశ్‌పై ప్రత్యక్ష కార్యాచరణకు దిగలేదు. ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనాకు తాత్కాలిక ఆశ్రయం ఇచ్చింది. బీజేపీకి సొంత ఆధిక్యత తగ్గింది. మోదీ తొలిసారి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. కొంత దూకుడు తగ్గింది. ఈ నేపథ్యంలో చైనా వ్యతిరేక అమెరికా ఆటలో పావు కావడానికి మోదీ సిద్ధంగా ఉండకపోవచ్చు.

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి ׀ 9490 20 4545

చేజారిన క్షణాలను తిరిగి పట్టగల దిట్ట!

కామెంట్



కరణ్ థాపర్

నట్వర్ సింగ్‌ను నేను నా జీవితం మొత్తమ్మీద దాదాపు పూర్తిగా ఎరిగి ఉన్నప్పటికీ, మొదటిసారి నాకాయన గురించి తెలియవచ్చింది మాత్రం బహుశా 1976లో అనుకుంటాను. అప్పుడాయన లండన్‌లో ఇండియాకు డిప్యూటీ హైకమిషనర్‌గా ఉన్నారు. నేనప్పుడు కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలోని 'ఇండియా సొసైటీ' ప్రెసిడెంటుగా, ఆ హోదాను విశ్వవిద్యాలయ సంఘాధ్యక్ష పదవికి ఒక సోపానంగా మలుచుకుంటూ ఉన్నాను. ఆ సమయంలో ఎమర్జెన్సీ కారణంగా ఇండియా అక్కడొక చర్చనీయ వివాదాస్పద అంశమై ఉంది. ఇండియాను సమర్థించటం నట్వర్ సింగ్ బాధ్యతగా ఉండేది.


ఆ బాధ్యతను నెరవేర్చటం కోసమే నేను ఆయనను ఒకనాడు ఇండియా సొసైటీ సమావేశానికి ఆహ్వానించాను. ఆ సమావేశానికి ఆయన మెరిసిపోతున్న, ఆకర్షణీయమైన 500 బ్రోచర్లతో సాయుధుడై వచ్చారు. "ఈ దెబ్బతో మీ సభ్యత్వానికి ఒప్పుదల చేకూరుతుంది" అని తన మెర్సిడెస్ కారు నుంచి దిగుతూ, విశాలమైన నవ్వుతో హాస్యమాడారు. మేము ఆయనను డిన్నర్ కోసం పెంబ్రోక్ కాలేజ్‌కు తోడ్కొని వెళ్లాం.

అప్పుడు తలెత్తింది ఇబ్బందికరమైన పరిస్థితి! ఆయన ప్రసంగాన్ని వినేందుకు ఎవరూ రావటం లేదని సూప్‌తో మా డిన్నర్ మొదలైనప్పటి నుండి నాకు వరుసగా సమాచారం అందుతూనే ఉంది. ఆయన ప్రసంగించవలసి ఉన్న హాలు అలాగే ఖాళీగా ఉండిపోయింది. డిన్నర్ అయ్యాక, కాఫీ కూడా సేవించాక చివరికి మేము హాలు దగ్గరికి వెళ్లాం. అప్పటికీ అది ఎవరూ లేకుండా ఉంది. నిశ్శబ్దం కూడా వినిపించేంత నిశ్శబ్దంగా ఉంది అక్కడ.

"ఆహ్, గొప్ప గుర్తింపునకు ఇది శిక్ష విధింపు!" అన్నారు నట్వర్ సింగ్. సొసైటీకి చెందిన ఇతర అధికారులకు, నాకు సిగ్గుతో తల కొట్టేసినట్లయింది. నోట మాట లేకుండా ఉండిపోయింది ఆయన కాదు, మేము. ఆయన మాత్రం "అబ్బాయిలూ! మీ కోసం ఒక డ్రింక్ కొనేందుకు నాకిది చక్కటి అవకాశం. మీ కాలేజ్ బార్ మూసి ఉండదనే అనుకుంటున్నాను" అని మమ్మల్ని ఆహ్వానించారు.

దాదాపు 2 గంటలపాటు ఆయన మాతో ఉండిపోయారు. అన్ని రౌండ్‌లను ఆయనే మా కోసం ఖరీదు చేశారు. ఆయనే ఎక్కువ సేపు మాట్లాడారు. మేము చిత్తరువులమై ఉన్నాం. అనేక అంశాలపై వృత్తాంతాల సహితంగా, వినోదభరితంగా మాట్లాడగలిగిన వ్యక్తి నట్వర్. గొప్ప హాస్యస్ఫూర్తి ఉండేది. అయితే ఎమర్జెన్సీ గురించి మాత్రం ఆయన మాట్లాడలేదని ప్రత్యేకంగా చెప్పే పని లేదు. దానికి ఆయన చింతించి ఉంటారని నేను అనుకోను. మాకైతే అసలు చింతే లేదు.

దశాబ్దాల తర్వాత నేను, ఆయన దాదాపుగా స్నేహితులుగా ఉన్నప్పుడు ఆయన విదేశీ వ్యవహారాల మంత్రి అయ్యారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక మర్నాడు తెల్లారే ఆయనకు నేను ఫోన్ చేశాను. "హార్డ్ టాక్ ఇండియా' ప్రోగ్రాం కోసం బీబీసీ వరల్డ్ సర్వీస్ మిమ్మల్ని ఇంటర్వ్యూ చేయాలని అనుకుంటోంది" అని చెప్పాను. "మీకు సమ్మతమేనా?" అని అడిగాను. ఆయన తిరస్కరిస్తారని నేను అనుకోలేదు. వాస్తవానికి ఆయన కూడా అలా చేయలేదు. మా సంభాషణ ముగిసిన ఐదు నిముషాల తర్వాత తిరిగి ఆయన కాల్ చేశారు.



విలక్షణ 'దౌత్య నేత' నట్వర్ సింగ్

"నేను ఇ.ఎం. ఫార్‌స్టర్ (బ్రిటిష్ నవలా రచయిత) స్నేహితుడినని మీరు బీబీసీకి చెప్పారా?" అని నన్ను అడిగారు. నేను చెప్పలేదు. అది ముఖ్యమైన విషయమని నేను అనుకోలేదు. కానీ అది నట్వర్‌కు ముఖ్యం. ఇంకా చెప్పాలంటే, విదేశీ వ్యవహారాల మంత్రి అవటం కంటే అది ఆయనకు ముఖ్యమైనట్లుగా కనిపించింది. ఇతర రాజకీయ నాయకుల కంటే ఆయన ఎంత భిన్నమైనవారో నాకు తొలిసారి అర్థమైంది. వారిలో చాలామందికి ఫార్‌స్టర్ ఎవరో కూడా తెలియదు.

తను సాధించిన అనేకానేక విజయాలలో నట్వర్ సింగ్ బహుశా తను రాసిన పుస్తకాల గురించే అత్యంత గర్వంగా చెప్పుకుంటారని నేను చెప్పగలను. తన భార్య తాతగారిపై ఆయన రాసిన జీవిత చరిత్ర 'మహారాజా భూపీందర్ సింగ్'ను చదవటం ఒక హృదయాస్వాదన. కానీ ఆయన రాసిన విమర్శనాత్మక రచనలు మరింత కళాత్మకమైనవని అంటాన్నేను. మీరు డేగా, లేక పావురమా అని ఒకసారి నేను ఆయన్ని అడిగినప్పుడు: "నేను నడుపుతున్నది విదేశీ వ్యవహారాల శాఖను. రక్తం ఓడే పంజరాలను కాదు..." అని అలవోకగా బదులిచ్చారు ఆయన.

నట్వర్ సింగ్‌కు ముందు విదేశాంగ మంత్రిగా ఉన్న జస్వంత్ సింగ్ ఎప్పుడూ నెమ్మదిగా, నియంత్రణగా ఆచితూచి మాట్లాడేవారు. దానిపై నట్వర్ ఒకసారి: "ఆయన మాటల్లోని మందగమనం ఆయన ఆలోచనల్లోని గాఢతకు సంబంధించినది కాదు" అన్నారు. ఆయన అలా అన్నారని తెలిసి జస్వంత్ సింగ్ సైతం హాయిగా నవ్వుకున్నారు. నట్వర్‌వి చతుర్లే కానీ విసుర్లు కావు. అవి ఎప్పుడూ అభ్యంతరకరంగా, మనసును గాయపరిచేలా ఉండవు. నవ్విస్తాయి తప్ప నొప్పించవు.

నట్వర్‌కు గాడ్జెట్‌లు అంతగా అనువైనవి కాకపోవటంలో ఆశ్చర్యం లేదు. మొబైల్ ఫోన్‌లు ఆయన్ని అయోమయంలో పడేస్తాయి. ఓసారి దూరదర్శన్ స్టూడియోలో కిక్కిరిసి ఉన్న ఆడియెన్స్ ముందు నట్వర్ పాల్గొన్న ఒక చర్చా కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారంగా రికార్డ్ అవుతున్నప్పుడు ఆయన మొబైల్ ఫోన్ మోగటం మొదలు పెట్టింది. ఆ సమయంలో మాట్లాడుతూ ఉన్న సీతారాం ఏచూరి తన మాటలకు విరామం ఇచ్చి, నట్వర్ ఆ కాల్‌ను నొక్కేయటం కోసం ఎదురు చూస్తూ ఉన్నారు. కానీ నట్వర్‌కు తన ఫోన్ ఎక్కడుందో కనిపించలేదు. జేబులు వెతుక్కున్నారు. కింద పడిందా అని చూశారు. తర్వాత నిస్సహాయంగా మా అందరి వైపు చూశారు. ఆలోపు ఫోన్ మోత అంతకంతకూ పెద్దదవుతూ వచ్చింది.

చివరికి నట్వర్ తన ఫోన్‌ని కనిపెట్టగలిగారు. "ఎత్తి, మాట్లాడండి" అన్నారు సీతారాం చాలా చీకాగ్గా. "బహుశా సోనియా అయుంటారు" అని, వెంటనే "కాదు, నా భార్య" అన్నారు నట్వర్ పొంగులాంటి నవ్వుతో ఫోన్‌ని స్విచాఫ్ చేస్తూ. స్టూడియోలోని ఆడియెన్స్ ఒక్కసారిగా ఆహ్లాదకారాలు చేశారు.

నిజానికి ఆ కాల్ ఆయన డ్రైవర్ నుంచి వచ్చింది. భార్య నుంచి ఫోన్ వచ్చిందని చెబితే మరింత హాస్యభరితంగా ఉంటుందని నట్వర్‌కి తెలుసు. అందుకే అలా చెప్పారు. మరీ ముఖ్యంగా, అలా చెప్పటం అన్నది ఫోన్ మోతతో బిగదీసుకుపోయిన చర్చను, ఆడియెన్స్‌ను తేలికపరుస్తుంది. చేజారిన క్షణాలను తిరిగి పొందటం ఎలాగో తెలిసిన సహజమైన నైపుణ్యం నట్వర్‌కు ఉంది. ఇది ఆయనలోని అత్యంత ఫలవంతమైన లక్షణాలలో ఒకటి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** అమావాస్య ఉ.6.11 వరకు, తదుపరి భాద్రపద శుద్ధ పాడ్యమి, **నక్షత్రం:** పుబ్బ రా.2.49 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** ఉ.9.18 నుండి 11.02 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.17 నుండి 9.05 వరకు, తదుపరి రా.10.51 నుండి 11.39 వరకు, **అమృతఘడియలు:** రా.7.50 నుండి 9.34 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.48, **సూర్యాస్తమయం:** 6.11.

క్లుప్తంగా...

మాజీ సర్పంచ్‌ల పరిస్థితి దారుణం: శ్రీనివాస్‌గౌడ్

- పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్నా తాజా మాజీ సర్పంచ్‌ల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ...గ్రామాభివృద్ధి కోసం పనులు చేసిన సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించడం లేదన్నారు. దీంతో సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.1,300 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, కేంద్రం నుంచి పంచాయతీలకు విడుదలైన రూ.600 కోట్లు ఏమయ్యాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల్లో ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. పెద్ద కాంట్రాక్టర్లను పక్కన పెట్టి వారంలోగా సర్పంచ్‌లకు ఇవ్వాల్సిన బిల్లులు వెంటనే విడుదల చేయాలని లేదంటే ఇందిరాపార్కు వద్ద నిరసన చేపడతామని హెచ్చరించారు.

జార్ఖండ్ కాంగ్రెస్ వార్ రూం చైర్మన్‌గా సంతోశ్ కుమార్



సాక్షి, న్యూఢిల్లీ: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ వార్ రూం చైర్మన్‌గా తెలంగాణకు చెందిన యువనేత కె.సంతోశ్ కుమార్ నియమితులయ్యారు. ప్రస్తుతం యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శిగా ఉన్న సంతోశ్‌కు పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కొత్తగా జార్ఖండ్ ఎన్నికల బాధ్యతల్ని అప్పగించారు. ఈ మేరకు సోమవారం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. 2003 నుంచి కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేసిన సంతోశ్ కుమార్ 2019 నుంచి 2022 వరకు యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో ఛత్తీస్‌గఢ్, అండమాన్ నికోబార్, సిక్కింలకు ఇన్‌చార్జిగా పనిచేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్ర ఆద్యంతం రాహుల్‌తో కలసి పాదయాత్ర చేశారు.

ఈఎన్‌సీ గణపతిరెడ్డి రాజీనామా



సాక్షి, హైదరాబాద్: రోడ్లు భవనాల (ఆర్ అండ్ బీ) విభాగం ఇంజనీర్ ఇన్ చీఫ్ ఐ.గణపతిరెడ్డి (జాతీయ రహదారులు) సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామాను ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్‌రాజ్‌కు అందజేశారు. 2017లోనే రెగ్యులర్ పోస్టు నుంచి రిటైర్ అయిన గణపతిరెడ్డి సర్వీసును ఏడేళ్లుగా పొడిగిస్తూ వచ్చారు. గణపతిరెడ్డి ఆధ్వర్యంలోనే ప్రగతిభవన్, రాష్ట్ర సచివాలయంతోపాటు రాష్ట్రంలో నూతన కలెక్టరేట్లు, ఆస్పత్రుల నిర్మాణం జరిగింది. అయితే వరంగల్‌లో నిర్మిస్తున్న నూతన ఆస్పత్రి భవన నిర్మాణానికి సంబంధించి అంచనాల పెంపుపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించిన నేపథ్యంలో గణపతిరెడ్డి తన పదవికి రాజీనామా చేయటం ప్రాధాన్యతను సంతరించుకుంది.

48 గంటల్లో కులగణనకు రూట్ మ్యాప్ ప్రకటించాలి

- కలెక్టరేట్ ముట్టడిలో జాజుల హెచ్చరిక



కులగణన డిమాండ్‌పై జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో జాజుల తదితరులు

లక్డీకాపూల్ (హైదరాబాద్): సమగ్ర కులగణన చేపట్టడానికి 48 గంటల్లోగా రూట్ మ్యాప్ ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని లేదంటే ఈ నెల మూడో వారంలో లక్షలాది మందితో హైదరాబాద్‌ను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. సోమవారం లక్డీకాపూల్‌లో బీసీ జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్ చారి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం జరిగింది. అనంతరం జాజుల జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమగ్ర కులగణనకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు గత 8 నెలలుగా వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం కాలయాపన చేస్తున్న నేపథ్యంలో భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఆందోళనకు దిగామన్నారు. బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే గ్రామ పంచాయతీల ఎన్నికలకు వెళ్లాలన్నారు. లేకపోతే గణేశ్ ఉత్సవాలు ముగిసిన వెంటనే లక్షలాది మందితో హైదరాబాద్‌ను దిగ్బంధం చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలోని బీసీ నేతలు, మంత్రుల ఇండ్లను ముట్టడిస్తామని జాజుల హెచ్చరించారు.

బడుల్లో బురద మేట

- పలు జిల్లాల్లో పాఠశాలలను ముంచెత్తిన వరద
- తడిసి ముద్దయిన రికార్డులు.. కొన్నిచోట్ల నీటిపాలు
- మరో వారం దాకా కుదుటపడటం కష్టమే
- వరద ప్రాంతాల్లో స్కూళ్లకు నేడూ సెలవు ప్రకటించిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాలు ప్రభుత్వ విద్యాసంస్థలను ముంచెత్తాయి. పలు జిల్లాల్లోని పాఠశాలల్లో బురద మేటలు వేసింది. కొన్నిచోట్ల విద్యార్థులు, ఉపాధ్యాయుల రికార్డులు తడిసి ముద్దవగా ఇంకొన్ని చోట్ల వరదలో రికార్డులు కొట్టుకుపోయాయి. ఖమ్మం పట్టణంలోని దాదాపు అన్ని స్కూళ్లకు వరద తీవ్రత ఎక్కువగా ఉంది. వర్షం తీవ్రత తగ్గినా వారంపాటు సాధారణ పరిస్థితులు నెలకొనే అవకాశం కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మంగళవారం కూడా సెలవు ప్రకటించారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల పరిస్థితిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులు డీఈవోలను ఆదేశించారు.

అన్ని చోట్లా అదే పరిస్థితి

- ఖమ్మం నయాబజార్ ప్రభుత్వ పాఠశాల మున్నేరుకు సమీపంలో ఉంటుంది. మున్నేరు ఉప్పొంగడంతో నీరంతా స్కూల్‌ను ముంచెత్తింది. ఆదివారం రాత్రి స్కూల్లోకి మోకాళ్లలోతు వరకు వరద చేరినట్లు స్థానికులు చెప్పారు. దీంతో అడ్మినిస్ట్రేషన్ రూంలోని పలు రికార్డులు కొట్టుకుపోయినట్టు స్కూల్ టీచర్ ఒకరు పేర్కొన్నారు.
- నిర్మల్ జిల్లా ముథోల్ మండల కేంద్రంలోని సాయిమాధవ నగర్ కాలనీలోని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల పూర్తిగా జలదిగ్బంధమైంది. – హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం కొండపర్తి ప్రభుత్వ పాఠశాల చుట్టూ వరద చేరింది. గదుల్లోనూ వరదనీరు ఉండటంతో కొన్ని రోజులపాటు క్లాసుల నిర్వహణ కష్టమని టీచర్లు అంటున్నారు.
- మెదక్ జిల్లా కొల్చారం మండలం రంగంపేట ఉన్నత పాఠశాల ముందు వరదనీరు నిలిచింది. తరగతి గదుల్లోని గోడలకు చెమ్మ ఏర్పడింది. సాధారణ పరిస్థితి వచ్చే దాకా క్లాసులు నిర్వహించడం కష్టమేనని ఉపాధ్యాయులు అంటున్నారు. క్లాసులు నిర్వహించినా కొన్ని రోజులపాటు విద్యార్థులు హాజరుకావడం కష్టమేనని స్థానికులు చెబుతున్నారు.
- సూర్యాపేట జిల్లాలోని పలు స్కూళ్లలోకి వరద తగ్గినా బురద కొన్ని రోజులు ఉండే వీలుంది. ఈ నేపథ్యంలో కొన్ని రోజులపాటు తరగతుల నిర్వహణ కష్టమని టీచర్లు అంటున్నారు.



కురవి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో పరిస్థితి


ఇంజనీరింగ్ స్పాట్‌కు మరోరోజు గడువు పెంపు

వరదలు ముంచెత్తిన నేపథ్యంలో ఇంజనీరింగ్ కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను మరోరోజు పొడిగించాలని అధికారులు నిర్ణయించారు. వాస్తవానికి సోమవారంతో స్పాట్ ముగించాల్సి ఉంది. ఇప్పటివరకు 2 వేల మంది విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లు పొందారు. కొన్నిచోట్ల రహదారులు తెగిపోవడంతో విద్యార్థులు కాలేజీలకు రాలేని పరిస్థితి ఉన్నట్లు అధికారుల దృష్టికి తెచ్చారు. మరోవైపు ఉస్మానియా, జేఎన్‌టీయూహెచ్ పరిధిలో జరగాల్సిన పరీక్షలను యథావిధిగా నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

శ్రీరాంసాగర్ 41 గేట్లు ఎత్తివేత

పోటెత్తిన ఎగువ గోదావరి

- కడెం, శ్రీరాంసాగర్, ఎల్లంపల్లికి కొనసాగుతున్న వరద ఉధృతి
- ఎల్లంపల్లి నుంచి కాళేశ్వరం బరాజ్‌లకు నీటి విడుదల
- కాళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో వరద



కడెం ప్రాజెక్ట్ నుంచి దిగువకు వెళ్తున్న నీళ్లు

సాక్షి, హైదరాబాద్/నెట్‌వర్క్: పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో కడెం వాగుతోపాటు ఎగువన గోదావరికి వరద పోటెత్తింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా, సోమవారం ఉదయం 10 గంటలకు 1,95,767 క్యూసెక్కుల వరద రాగా, నీటినిల్వ 71.85 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టు నిండుకుండలా మారడం, ఎగువ నుంచి ఉధృతంగా వరద వస్తుండడంతో ఉదయం 10:30 గంటలకు 8 గేట్లు ఎత్తి 25వేల క్యూసెక్కుల నీటిని దిగువన గోదావరిలోకి విడుదల చేశారు. ఎగువ నుంచి వరద పెరుగుతున్న కొద్దీ క్రమంగా మరిన్ని గేట్లు ఎత్తుతూ వెళ్లారు. రాత్రి పదిగంటలకు 3 లక్షల క్యూసెక్కులకు పైగా వరద వస్తుండగా, ప్రాజెక్టులో 72.9 టీఎంసీలను నిల్వ చేస్తూ మొత్తం 41 గేట్లు ఎత్తి 2.65లక్షల క్యూసెక్కుల నీటిని కిందకు విడుదల చేస్తున్నారు.

- కడెం ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 7.6 టీఎంసీలు కాగా, 49,763 క్యూసెక్కుల వరద వస్తుండడంతో 5.41 టీఎంసీల నిల్వలు కొనసాగిస్తూ 18 గేట్లు ఎత్తి కిందికి విడుదల చేస్తున్నారు.
- శ్రీరాంసాగర్ నుంచి విడుదలవుతున్న వరదకు కడెం జలాలు తోడుకావడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద ఉధృతి 2,92,815 క్యూసెక్కులు పెరిగింది. ప్రాజెక్టు గరిష్ట నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, 15.02 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ 2,64,787 క్యూసెక్కుల నీటిని గేట్ల ద్వారా కిందికి విడుదల చేస్తున్నారు. దీంతో దిగువన ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌లకు వరద ఉధృతి భారీగా పెరిగింది. సుందిళ్ల బరాజ్‌కు 3.68లక్షలు, అన్నారం బరాజ్‌కు 6.61లక్షలు, మేడిగడ్డ బరాజ్‌కు 6.79లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, వచ్చింది వచ్చినట్టు విడుదల చేస్తున్నారు. దిగువన ఉన్న సమ్మక్క సాగర్‌కు 4.45 లక్షలు, సీతమ్మసాగర్‌కు 3.13లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, వచ్చింది వచ్చినట్టు విడుదల చేస్తున్నారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి వరద మొదటి ప్రమాద హెచ్చరిక చేరువకు వెళుతోంది. సోమవారం రాత్రి 12. గంటల సమాయానికి 12.010 మీటర్లకు చేరింది. తెల్లవారే సరికి మరింత వరద పెరగనుంది. కాగా, మొదటి ప్రమాద హెచ్చరిక 12.210 మీటర్లు, డేంజర్ లెవల్ 13.460 మీటర్లు వరకు నమోదు అయితే లోతట్టు గ్రామాలు జలమయమవుతాయి. 1986లో కాళేశ్వరం వద్ద 15.75 మీటర్ల ఎత్తు, 2022 జూలై 14న 16.72మీటర్ల ఎత్తులో నీటి మట్టం నమోదైంది.

సింగూరు, నిజాంసాగర్‌కు జలకళ

గోదావరి ఉపనది మంజీరలోనూ వరద ఉధృతి మరింతగా పెరగడంతో సింగూరు, నిజాంసాగర్ ప్రాజెక్టులు నిండుకుండలా మారుతున్నాయి. సింగూరు ప్రాజెక్టు గరిష్ట నీటినిల్వ సామర్థ్యం 29.917 టీఎంలు కాగా, ప్రస్తుతం 23,942 క్యూసెక్కుల వరద వస్తుండగా, నిల్వలు19.22 టీఎంసీలకు చేరాయి.

- నిజాంసాగర్ నిల్వ సామర్థ్యం 17.8 టీఎంసీలు కాగా 48,800 క్యూసెక్కుల వరద వస్తుండడంతో నిల్వలు 9.16 టీఎంసీలకు చేరాయి. వరద ఇలానే కొనసాగితే మరో ఐదు రోజుల్లో ఈ రెండు ప్రాజెక్టులు పూర్తిగా నిండే అవకాశముంది.

మిడ్‌మానేరుకు గ్రావిటీ ద్వారా ఎస్సారెస్పీ జలాలు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తిగా నిండడంతో ఎల్లంపల్లి జలాశయం నుంచి నీటిని మిడ్‌మానేరులోకి నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా ఎత్తి పోయాల్సిన అవసరం లేకుండా పోయింది. రెండు పంప్‌హౌస్‌లలో పంపింగ్ బంద్ చేసి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఫ్లడ్ ఫ్లో కెనాల్ ద్వారా 7000 క్యూసెక్కుల నీటిని గ్రావిటీతో మిడ్‌మానేరు జలాశయా నికి తరలిస్తున్నారు. అక్కడి నుంచి అనంతగిరి జలాశయానికి, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌లకు నీళ్లను ఐదు దశల్లో పంపింగ్ చేస్తున్నారు.

ఎగువన శాంతించిన కృష్ణమ్మ... దిగువన ఉగ్రరూపం

- జూరాల 40 గేట్లు, శ్రీశైలం ప్రాజెక్టు 10 గేట్లు, సాగర్ 26 గేట్ల ద్వారా నీటి విడుదల

పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు తెరిపి ఇవ్వడంతో ఎగువన కృష్ణమ్మ శాంతించింది. మూడు రోజులుగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలు తోడు కావడంతో దిగువన కృష్ణానది ఉగ్రరూపాన్ని కొనసాగిస్తోంది. సోమవారం సాయంత్రం 6 గంటలకు ప్రకాశం బరాజ్‌కు వస్తున్న 11,27,30 క్యూసెక్కుల వరదను వచ్చింది వచ్చినట్టు గేట్ల ద్వారా సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఎగువన మహారాష్ట్రలోని ఆల్మట్టి జలాశయానికి 70 వేలు, నారాయణపూర్ జలాశయానికి 30 వేల క్యూసెక్కులకు వరద తగ్గిపోయింది. దీంతో తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు సైతం 3.21లక్షల క్యూసెక్కులకు వరద తగ్గిపోగా, 40 గేట్లు ఎత్తి 3.2లక్షల క్యూసెక్కులను కిందకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 4.89 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా.. 5.52 లక్షల క్యూసెక్కుల నీటిని 10 గేట్లు ఎత్తి కిందకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 5.40 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, వచ్చింది వచ్చినట్టు 26 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ దిగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుకు 5.48 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, 5.43 లక్షల క్యూసెక్కులను దిగువన ఉన్న ప్రకాశం బరాజ్‌కు విడుదల చేస్తున్నారు. దీంతో మంగళవారం నాటికి ప్రకాశం బరాజ్‌కు వరద ఉధృతి తగ్గే అవకాశముంది.



అలుగుపారుతున్న డిండి ప్రాజెక్టు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కురుస్తున్న వర్షాలకు దుందుభి వాగు పరవళ్లు తొక్కుతుండడంతో నల్లగొండ జిల్లాలోని డిండి ప్రాజెక్టు నిండి సోమవారం అలుగు పోసింది. వర్షాధారంపైనే ఆధారపడిన ఈ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి 50 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి (36 అడుగులు) చేరుకుంది. హైదరాబాద్ – శ్రీశైలం రహదారి మధ్యలో ఉన్న డిండి ప్రాజెక్టు అలుగుపారుతున్న అందాలను తిలకించేందుకు స్థానికులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలి వస్తున్నారు.

మూసీ ప్రాజెక్టు ఏడు గేట్లు ఎత్తివేత



మూసీనదికి వరద పోటెత్తడంతో నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని మూసీ ప్రాజెక్టు ఏడు గేట్లు ఎత్తి వరదనీటిని దిగువకు వదులుతున్నారు. 4.46 టీఎంసీ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యంగల మూసీ రిజర్వాయర్‌లో 3.58 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

గుర్రంగడ్డను సందర్శించిన కలెక్టర్

- త్వరలోనే బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోశ్

సాక్షి ఎఫెక్ట్

గద్వాల: దీవి గ్రామమైన గుర్రంగడ్డ వాసులు పడుతున్న ఇబ్బందులను 'సాక్షి' దినపత్రిక 'గుర్రంగడ్డ.. కష్టాల అడ్డా'అనే శీర్షికతో వెలుగులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. 'సాక్షి'కథనానికి స్పందించిన కలెక్టర్ బీఎం సంతోశ్ సోమవారం ఎస్పీ శ్రీనివాస్‌రావు, ఇతర అధికారుల బృందంతో కలిసి గుర్రంగడ్డను సందర్శించారు. బీచుపల్లి నుంచి బోటులో ప్రయాణం చేసి గ్రామాన్ని చేరుకున్న ఆయన.. గ్రామం మొత్తం కలియదిరిగారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వానాకాలంలో గ్రామం నుంచి బయటకు రావాలంటే బోటు ద్వారానే రావాల్సిన పరిస్థితి ఉందని, రాత్రి వేళలో అత్యవసర వైద్యం, ఇతర పనుల కోసం వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్‌తో గ్రామస్తులు ఏకరువు పెట్టుకున్నారు. అదేవిధంగా గ్రామంలో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవని వైద్యారోగ్య సబ్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రం, శానిటేషన్ నిర్వహణ వంటి సమస్యలు ఉన్నాయని వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ప్రధానంగా రవాణాకు సంబంధించి ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించేలా త్వరితగతిన బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. వైద్యపరంగా అవసరమైన ఏర్పాట్లు, అంగన్‌వాడీ కేంద్రం, శానిటేషన్ నిర్వహణ ఇతర సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ సిద్దప్ప, తహసీల్దార్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

డిండి వాగులో చిక్కుకున్న చెంచులు

అచ్చంపేట రూరల్, మోర్తాడ్ (బాల్కొండ): నల్లగొండ జిల్లా డిండి మండలం గోనబోయినపల్లికి చెందిన పది మంది చెంచులు సోమవారం అచ్చంపేట మండలం బొమ్మనపల్లి సమీపంలోని డిండి వాగులో చేపల వేటకోసమని వచ్చి చిక్కుకుపోయారు. చేపలు పట్టుకుని తిరిగి వెళ్లే క్రమంలో ఒక్కసారిగా వరద ఉధృతి పెరగడంతో చెంచులు గట్టిగా కేకలు వేశారు. సమీప పొలాల రైతులు గమనించి గ్రామస్తులకు సమాచారం అందించారు. అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్, ఎస్‌ఐ రాములు, సిద్దాపూర్ పోలీసు సిబ్బంది గ్రామస్తుల సాయంతో వాగులో చిక్కుకున్న చెంచుల సమీపానికి వెళ్లారు. కానీ వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో రాత్రి 9.30 గంటల వరకు వారిని ఒడ్డుకు తీసుకురాలేదు. చెంచులను సురక్షితంగా రక్షించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

ఆశ్రమంలో చిక్కుకున్న ముగ్గురిని కాపాడిన ఎన్‌డీఆర్‌ఎఫ్

నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం తడపాకల్, మెండోరా మండలం సావెల్ మధ్య దీవిలాంటి ప్రదేశంలోని సాంబయ్య ఆశ్రమం పూర్తిగా పెద్దవాగు వరద నీటిలో చిక్కుకు పోయింది. దీంతో ఆశ్రమంలో ఉన్న ముత్తెన్న, నారాయణ, సంతోష్ తమను కాపాడాలని ఆర్తనాదాలు చేశారు. పోలీసులిచ్చిన సమాచారంతో హైదరాబాద్ నుంచి హుటాహుటిన చేరుకున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు చిన్న పడవలో వెళ్లి ఆ ముగ్గురిని ఆశ్రమం నుంచి సురక్షితంగా బయటకు తీసుకు వచ్చారు.

కడసారి అశ్వినిని చూసేందుకు..

- ఆకేరు వాగుకి బలైన యువ శాస్త్రవేత్త, ఆమె తండ్రికి అంత్యక్రియలు
- ప్రభుత్వం పట్టించుకోలేదని ఎమ్మెల్యేను నిలదీసిన కుటుంబీకులు



రోదిస్తున్న గంగారం తండా మహిళలు

కారేపల్లి, మరిపెడ: ఆకేరు వాగు ఉధృతికి బలైన యువ శాస్త్రవేత్త అశ్విని, ఆమె తండ్రి నూనావత్ మోతీలాల్ అంత్యక్రియలు స్వస్థలమైన ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గంగారంతండాలో సోమవారం నిర్వహించారు. కుమార్తెను శంషాబాద్ విమానాశ్రయంలో దింపేందుకు బయల్దేరి మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం వద్ద ఆకేరు వాగులో తండ్రీకూతుళ్లు గల్లంతైన సంగతి తెలిసిందే. ఆదివారం రాత్రే అశ్విని మృతదేహం గంగారం తండాకు చేరుకోగా, సోమవారం మోతీలాల్(55)మృతదేహన్ని ఆకేరు వాగు సమీప పంటపొలాల్లో పోలీసులు గుర్తించి తండాకు తీసుకొచ్చారు. ఇంటి వద్ద తండ్రీకుమార్తెల మృతదేహాలను పక్కపక్కన ఉంచగా ఉజ్వల భవిష్యత్ ఉన్న సైంటిస్ట్ అశ్వినిని ఆకేరు వాగు మింగేసిందంటూ కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కడసారి చూసేందుకు గ్రామస్తులు, చుట్టుపక్కల ఊళ్ల ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చారు. ఇద్దరి మృతదేహాలను ట్రాక్టర్‌పై తీసుకెళ్లి వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, మృతదేహాల వద్ద నివాళులర్పించేందుకు వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌రాగా వాగులో గల్లంతై మృతదేహాలు లభించక తాము నరకయాతన పడినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదని కుటుంబ సభ్యులు నిలదీశారు. తాను అధికారులతో సమీక్షించానని, వాతావరణం అనుకూలించక హెలికాప్టర్ తీసుకొచ్చి కాపాడలేక పోయామని సర్దిచెప్పారు. ఆతర్వాత తక్షణ సాయం కింద రూ.50వేలు అందజేశారు.

యాకూబ్ మృతదేహం లభ్యం..



యాకూబ్

కూసుమంచి: ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ వరద ప్రవాహానికి ఆదివారం నాయకన్‌గూడెం సమీపాన నివసించే షేక్ యాకూబ్ కుటుంబం గల్లంతైన విషయం విదితమే. ఈ ఘటనలో యాకూబ్ కుమారుడు షరీఫ్‌ను పోలీసులు, స్థానికులు రక్షించగా యాకూబ్–సైదాబీ దంపతులు మాత్రం వరద ప్రవాహంలో గల్లంతయ్యారు. సోమవారం చేపట్టిన గాలింపుల్లో వారి ఇంటికి కొద్ది దూరంలో ఈత చెట్టుకు చిక్కుకున్న యాకూబ్ మృతదేహం బయటపడగా అధికారులు బయటకు తీయించారు. అయితే, ఆయన భార్య సైదాబీ ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది, యాకూబ్ మృతదేహం వద్ద రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాళులర్పించి ఆయన కుమారులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

నాకు ఏమీకాదని చెప్పి..



మా ఇంటి చుట్టూ వరదనీరు చేరింది. ఎప్పటిలాగే వచ్చినా కాసేపటికి తగ్గుతుందని అనుకున్నాం. కానీ అది ఇంత భారీగా వస్తుందనుకోలేదు. అయినప్పటికీ క్షేమంగా బయటపడుతామనే భావించాం. ఇల్లు ఎక్కి ప్రాణాలు కాపాడుకుందామని అనుకున్నాం. కానీ వరదకు ఇల్లు కూలిపోయింది. నాకు ఏమీ కాదని ధైర్యం చెప్పిన అమ్మానాన్న కళ్లముందే నీటిలో కొట్టుకుపోయారు. అదృష్టవశాత్తూ నేను ప్రాణాలతో బయటపడ్డాను. అమ్మానాన్న కూడా ఎక్కడో ఒక చోట క్షేమంగా నాలాగే దొరుకుతారనుకున్నా. కానీ ఇంతటి ఘోరం జరుగుతుందనుకోలేదు. – షరీఫ్, యాకూబ్ కుమారుడు

వాగు దాటుతూ.. కొట్టుకుపోయి ఓ వ్యక్తి మృతి

బీబీపేట: కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం మంథని దేవునిపల్లి గ్రామానికి చెందిన కామటి నర్సయ్య (65) జనగామ, మాందాపూర్ గ్రామాల మధ్య ప్రవహిస్తున్న ఎడ్లకట్ట వాగు దాటుతూ వరద ఉధృతికి కొట్టుకుపోయాడు. సోమవారం అక్కడే పంట పొలాల మధ్య మృతదేహం లభించింది. ఓ వైన్ షాప్ వద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తోన్న నర్సయ్య ఆదివారం ఉదయం తన కూతురు దగ్గరికి బస్వాపూర్ గ్రామానికి వెళ్తూ వరద ఉధృతికి మృత్యువాత పడ్డాడు.

బీజేపీ, కాంగ్రెస్... నువ్వా నేనా?



హరియాణాలో సంకుల సమరం • బీజేపీ కంచుకోటల్లో కాంగ్రెస్ పాగా

ఒకట్రెండు చోట్ల జేజేపీ గట్టి పోటీ • ప్రధాన ప్రాంతాల్లో ఓటు షిఫ్టే కీలకం

హరియాణా అసెంబ్లీ ఎన్నికల బరిలో అధికార బీజేపీ, కాంగ్రెస్ నువ్వా, నేనా అన్నట్టుగా తలపడుతున్నాయి. అయితే ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మెరుగైన ప్రదర్శనతో జోరుమీదున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికార పార్టీకి ముచ్చెమటలే పట్టిస్తోంది. దీనికి తోడు ప్రభుత్వ వ్యతిరేకత, రైతుల ఆగ్రహం వంటివి బీజేపీని కుంగదీస్తున్నాయి. వీటిని గరిష్ఠంగా సొమ్ము చేసుకునే ప్రయత్నాలకు హస్తం పార్టీ పదును పెడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రాంతాలవారీగా చూస్తే పలు కంచుకోటల్లో బీజేపీకి ఎదురుగాలి వీస్తోంది. ఆయా ప్రాంతాల్లో ఆ మేరకు ఒకవైపు కాంగ్రెస్, మరోవైపు స్థానిక పార్టీ జేజేపీ పుంజుకుంటూ కమలానికి గట్టి సవాలు విసురుతున్నాయి. ఈ నేపథ్యంలో రాజకీయంగా కీలకమైన ప్రాంతాల్లో ఈసారి 'ఓటు షిఫ్టు' ఎలా ఉండనుందన్నది తుది ఫలితాలను శాసించే అవకాశాలు కన్పిస్తున్నాయి... - సాక్షి, నేషనల్ డెస్క్

బీజేపీ నేల చూపులు...

2019 హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఆధిపత్యం ప్రదర్శించిన బీజేపీ, ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం కీలక అసెంబ్లీ స్థానాల పరిధిలో ఓట్ల శాతాన్ని బాగా కోల్పోయింది. ఉదాహరణకు ఫిరోజ్‌పూర్ జిర్కా, నూహ్ అసెంబ్లీ స్థానాల పరిధిలో బీజేపీకి ఏకంగా 16 శాతం చొప్పున ఓట్లు తగ్గాయి. మరోవైపు నారాయణ్‌గఢ్ వంటి చోట్ల పార్టీ ఓటు శాతం 14 శాతానికి పైగా పెరిగినా పెద్దగా లాభం లేకపోయింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 10 స్థానాలకు పదింటినీ ఒడిసిపట్టగా తాజా ఎన్నికల్లో వాటిలో సగం సీట్లకు కోత పడింది.

కాంగ్రెస్ పైపైకి...

కాంగ్రెస్ మాత్రం ఈ లోక్‌సభ ఎన్నికల్లో పలు అసెంబ్లీ స్థానాల పరిధిలో ఓట్ల శాతాన్ని భారీగా పెంచుకుని లాభపడింది. 2019 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఆ పార్టీకి అంబాలా కంటోన్మెంట్ స్థానంలో ఏకంగా 39.8 శాతం, అంబాలా సిటీలో 36.6 శాతం చొప్పున ఓట్లు పెరిగాయి! ఓట్ల శాతం తగ్గిన అసెంబ్లీ స్థానాల్లోనూ కాంగ్రెస్‌కు చెప్పుకోదగ్గ నష్టం జరగకపోవడం విశేషం. ఉదాహరణకు పంచ్‌కులలో 4.5 శాతం, కాల్కాలో 2 శాతం మాత్రమే ఓట్లు తగ్గాయి. దాంతో 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటూ గెలవలేక చతికిలపడ్డ కాంగ్రెస్, తాజా ఎన్నికల్లో ఐదు స్థానాలను కైవసం చేసుకుంది.

కాంగ్రెస్ భారీగా పుంజుకుంటున్న కీలక ప్రాంతాలు: బాగ్రీ, జాట్‌లాండ్

వీటిలో 2019 అసెంబ్లీ ఎన్నికల కంటే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఆదరణ పెరిగింది.

బీజేపీ గట్టి పోటీ ఎదుర్కొంటున్న కంచుకోటలు: అహిర్వాల్, జీటీ రోడ్ బెల్ట్

ఈ రెండు ప్రాంతాల్లో ఇప్పటికీ బీజేపీ ఆధిపత్యమే సాగుతున్నా 2019 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ ఓట్ల శాతంలో తగ్గుదల నమోదైంది.

బీజేపీకి ఓట్లు బాగా తగ్గిన ప్రాంతం: బ్రజ్

అహిర్వాల్, జీటీ రోడ్ బెల్ట్ ప్రాంతాల్లో బీజేపీ పటిష్ఠంగానే కన్పిస్తున్నా జాట్‌లాండ్, బాగ్రీల్లో కాంగ్రెస్ దూసుకుపోతోంది. బ్రజ్ ప్రాంతంలో ఇరు పార్టీలూ గట్టిగా తలపడుతున్నాయి. దాంతో అందరి దృష్టీ అక్టోబర్ 5న జరిగే పోలింగ్ మీదే ఉంది!

హరియాణాలో గత రెండు ఎన్నికల్లో ప్రాంతాలవారీగా పార్టీల ప్రదర్శన

ప్రాంతం	అసెంబ్లీ స్థానాలు	కాంగ్రెస్: 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆధిపత్యం	కాంగ్రెస్: 2019 అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గిన స్థానాలు	బీజేపీ: 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆధిపత్యం	బీజేపీ: 2019 అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గిన స్థానాలు
అహిర్వాల్	11	01	02	10	08
బాగ్రీ	15	12	03	03	05
బ్రజ్	12	06	04	06	07
జీటీ రోడ్ బెల్ట్	26	05	08	17	14
జాట్‌లాండ్	26	18	14	08	06
మొత్తం	90	42	31	44	40

ప్రస్తుత పరిస్థితి...

పోలింగ్‌కు ఇంకా నెల రోజులే ఉన్న తరుణంలో బీజేపీ, కాంగ్రెస్ రెండూ తమ కంచుకోటలపై పట్టు మరింత పెంచుకోవడంతో పాటు బలహీనపడుతున్న ప్రాంతాల్లో నష్టాలను కట్టడి చేయడంపై ప్రధానంగా దృష్టి సారించాయి. అయితే క్రమంగా బలపడుతున్న జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) నుంచి రెండు పార్టీలకూ గట్టి పోటీ ఎదురవుతోంది. ముఖ్యంగా జాట్‌లాండ్, బాగ్రీ ప్రాంతాల్లో జేజేపీ జోరు మీదుంది. ఈ నేపథ్యంలో హరియాణాలో ఈ దఫా అసెంబ్లీ ఎన్నికలు ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంత హోరాహోరీగా సాగడం ఖాయంగా కన్పిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీలవారీ ఓటింగ్ శాతాన్ని బట్టి చూసినా అదే తేటతెల్లమవుతోంది. అదే ట్రెండు కొనసాగితే 2019లో మాదిరిగానే ఈసారి కూడా హంగ్ అసెంబ్లీ ఏర్పడ్డా ఆశ్చర్యం లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జాట్‌లాండ్, బాగ్రీ ప్రాంతాల్లో ఎవరిది పై చేయి అవుతుందనే దాన్ని బట్టి తుది ఫలితం ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు.

అంకెల్లో...

- 90 అసెంబ్లీ స్థానాలకు గాను 2024 లోక్‌సభ ఎన్నికల్లో 74 స్థానాల పరిధిలో బీజేపీ ఓట్ల శాతం కాస్తో కూస్తో పెరిగింది.
- కానీ 16 అసెంబ్లీ స్థానాల పరిధిలో బీజేపీకి ఓట్ల శాతం బాగా తగ్గింది.
- దాంతో 2019 ఎన్నికలతో పోలిస్తే ఏకంగా 5 లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్‌కు బీజేపీ కోల్పోయింది.
- మరోవైపు కాంగ్రెస్ బాగా పుంజుకుంది. పోటీ చేసిన 81 సీట్లకు గాను 68 చోట్ల ఓట్ల శాతాన్ని బాగా పెంచుకుంది.
- దాంతో 13 అసెంబ్లీ స్థానాల పరిధిలో ఓట్ల శాతం కాస్త తగ్గినా ఏకంగా 5 లోక్‌సభ సీట్లు ఒడిసిపట్టగలిగింది.

23వ లా కమిషన్ ఏర్పాటు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం సోమవారం 23వ లా కమిషన్‌ను ఏర్పాటు చేసింది. మూడేళ్ల కాలపరిమితితో దీన్ని ప్రకటించింది. 22వ లా కమిషన్ పదవీకాలం ఆగస్టు 31న ముగియడంతో సోమవారం అర్ధరాత్రి కొత్త లా కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ కేంద్ర న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్‌ను జారీచేసింది. ఒక చైర్‌పర్సన్, మెంబర్ సెక్రటరీతో కలిపి నలుగురు సభ్యులు ఉంటారని పేర్కొంది. వీరందరూ లా కమిషన్‌లో పూర్తికాలపు బాధ్యతలు నిర్వర్తిస్తారు. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు మూడేళ్ల పాటు, లేదా జడ్జీలుగా తమ పదవీకాలం పూర్తయ్యేవరకు లా కమిషన్‌లో పూర్తికాలపు సభ్యులుగా ఉంటారని వెల్లడించింది. న్యాయశాఖ కార్యదర్శి, శాసనవ్యవహారాల కార్యదర్శులు లా కమిషన్‌లో ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఉంటారు.

ఆప్ ఎమ్మెల్యే అమానతుల్లా అరెస్ట్



న్యూఢిల్లీ: ఢిల్లీ వక్ఫ్ బోర్డులో అవకతవకలతోపాటు ఆస్తులకు మించి ఆదాయం కేసులను ఎదుర్కొంటున్న ఢిల్లీ ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోమవారం అరెస్ట్‌చేశారు. వక్ఫ్‌బోర్డులో అక్రమాలపై సీబీఐ, ఆస్తులకు మించి ఆదాయం కేసులో ఢిల్లీ ఏసీబీ ఈయనపై కేసులు మోపడం తెల్సిందే. సోమవారం ఉదయం ఆరింటికే ఓఖ్లా ప్రాంతంలోని అమానతుల్లా ఇంటికి చేరుకున్న ఈడీ అధికారులు చాలాసేపు సోదాలు చేశారు. ఆ తర్వాత ఆయనను అరెస్ట్ చేస్తున్నట్లు ప్రకటించారు. తొలుత సోదాల నిమిత్తం ఈడీ అధికారులు ఇంటికొచ్చినపుడు పెద్దసంఖ్యలో సీఆర్‌పీఎఫ్, ఢిల్లీ పోలీసు బలగాలు ముందు జాగ్రత్తగా అక్కడ మోహరించాయి. ఈడీ అధికారులు రావడాన్ని ఆయన తన 'ఎక్స్' ఖాతాలో ఒక వీడియో పోస్ట్‌చేశారు. ఇటీవల శస్త్రచికిత్స పూర్తిచేసుకున్న తన అత్తగారి మంచం పక్కన ఆయన మాట్లాడటం, తర్వాత గేటు బయట ఈడీ అధికారులతో మాట్లాడుతున్నట్లు ఆ వీడియోలో ఉంది. అయితే గతంలో 14 సమన్లను ఆయన బేఖాతరు చేసినందుకే తప్పని పరిస్థితుల్లో అరెస్ట్‌చేయాల్సి వచ్చిందని ఈడీ ప్రకటించింది. సుప్రీంకోర్టు ఆదేశించడంతో గతంలో కేవలం ఒకే ఒక్కసారి తమ ఎదుట హాజరయ్యారని ఈడీ గుర్తుచేసింది. 2018–2022 కాలంలో వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ ఉన్నపుడు బోర్డులో చట్టవ్యతిరేకంగా నియామకాలు చేపట్టి అందుకు ప్రతిఫలంగా అమానతుల్లా భారీ నగదు సంపాదించి, ఆ మొత్తాలను తన అనుచరుల పేరిట స్థిరాస్తులు కొన్నారని ఈడీ ఆరోపించింది. వక్ఫ్ ఆస్తులను చట్టవ్యతిరేకంగా లీజుకు ఇచ్చారని ఈడీ ఆరోపించింది. అరెస్ట్ తర్వాత ఈడీ ఆయనను ఢిల్లీలోని స్పెషల్ జడ్జి రాకేశ్ సయాల్ ఎదుట హాజరుపరిచింది. జడ్జి అమానతుల్లాను నాలుగు రోజుల కస్టడీకి అనుమతించారు. పార్టీ ఎమ్మెల్యే అరెస్ట్‌పై ఆప్ ఆగ్రహం వ్యక్తంచేసింది. '' బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడే ప్రతి ఒక్కరిని గొంతు నొక్కడమే ఈడీకి ఉన్న ఏకైక పని. నోరు నొక్కడం సాధ్యంకాని సందర్భాల్లో ఇలా జైల్లో పడేస్తారు'' అని ఆప్ నేత మనీశ్ సిసోడియా అన్నారు.

కుల గణనపై పిటిషన్‌కు సుప్రీం 'నో'

న్యూఢిల్లీ: వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం సామాజిక– ఆర్థిక కులగణన చేపట్టేలా కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. కులగణన అనేది కేంద్ర ప్రభుత్వం అధికార పరిధిలోని అంశమని తేల్చిచెప్పింది. పిటిషనర్ పి.ప్రసాద్ నాయుడు తన వ్యాజ్యాన్ని ఉపసంహరించుకునేందుకు జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్.ఎన్.వి. భాటిల ధర్మాసనం అనుమతించింది. 'ఈ అంశంలో మేమేం చేయగలం. ఇది ప్రభుత్వ అధికార పరిధిలోని అంశం. విధానపరమైన నిర్ణయం' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పలు దేశాలు కులగణన చేశాయని, భారత్ ఇంకా చేపట్టలేదని పిటిషనర్ తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది రవిశంకర్ జంధ్యాల కోర్టు దృష్టికి తెచ్చారు. ఇందిరా సాహ్నీ తీర్పు 1992 (మండల్ కమిషన్ తీర్పు) సామాజిక–ఆర్థిక సర్వే, కులగణన క్రమం తప్పకుండా జరగాలని పేర్కొందని తెలిపారు. ఈ అంశంలో జోక్యం చేసుకోలేమని, పిటిషన్‌ను కొట్టివేస్తున్నామని ధర్మాసనం జంధ్యాలకు తెలిపింది. కోర్టు మనోగతాన్ని అర్థం చేసుకున్న జంధ్యాల పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని కోరగా.. ధర్మాసనం అనుమతించింది.

ఆర్.జి.కర్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ అరెస్టు

కోల్‌కతా: ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌ను సోమవారం సీబీఐ అరెస్టు చేసింది. కాలేజీలో ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలపై నమోదైన కేసులో సీబీఐ ఘోష్‌ను అదుపులోకి తీసుకుంది. ఆగస్టు 9వ తేదీన ఆర్.జి.కర్ ఆసుపత్రిలోనే పీజీ ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం జరిగిన విషయం తెలిసిందే. కోల్‌కతా హైకోర్టు ఆదేశాల మేరకు వైద్యురాలి కేసును, ఆర్థిక అవకతవకల కేసును సీబీఐ దర్యాప్తు చేస్తోంది. దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలకు, వైద్యుల సమ్మెకు కారణమైన వైద్యురాలి హత్య కేసులో సీబీఐ సోమవారం సందీప్ ఘోష్‌ను 15వ రోజు ప్రశ్నించింది. సాల్ట్‌లేక్‌లోని సీబీఐ ఆఫీసులో విచారించింది. అనంతరం అవినీతి వ్యతిరేక విభాగం కార్యాలయం ఉన్న నిజామ్ ప్యాలెస్ ఆఫీసుకు తరలించి సందీప్ ఘోష్‌ను అరెస్టు చేసింది. సందీప్ ఘోష్ హయాంలో పలు ఆర్థిక అక్రమాలు జరిగాయని ఆర్.జి.కర్ కాలేజీ మాజీ డిప్యూటీ సూపరింటిండెంట్ డాక్టర్ అక్తర్ అలీ ఫిర్యాదు చేశారు.

మదురో విమానం సీజ్

వాషింగ్టన్: వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో విమానాన్ని అమెరికా సీజ్ చేసింది. వెనిజులాపై అమెరికా విధించిన ఆంక్షలను ఉల్లంఘిస్తూ ఈ విమానాన్ని సమకూర్చుకున్నారని, ఇతర క్రిమినల్ అభియోగాలతో మదురో విమానాన్ని డొమినికన్ రిపబ్లిక్‌లో అమెరికా స్వాధీనం చేసుకుంది. దాన్ని సోమవారం ఫ్లోరిడాకు తరలించింది. వెనిజులా– అమెరికాల మధ్య చాలాఏళ్లుగా సంబంధాలు బెడిసికొట్టాయి. వెనిజులాపై ఆర్థిక ఆంక్షలే కాకుండా పలుఇతర ఆంక్షలను కూడా అమెరికా విధించింది. వెనిజులాలో బతుకు దుర్భరమై లక్షల మంది మెక్సికో–అమెరికా సరిహద్దు ద్వారా అగ్రరాజ్యంలోకి ప్రవేశిస్తున్నారు. ఇటీవలి వివాదాస్పద అధ్యక్ష ఎన్నికల్లో మదురో విజయానికి సంబంధించి సందేహాలను వ్యక్తం చేస్తూ అమెరికా వెనిజులా నుంచి నిర్దిష్ట పోల్ డేటాను కోరింది. వెనిజులాకు చెందిన ఈ డసాల్ట్ ఫాల్కన్ 900 విమానం ఖరీదు రూ.109 కోట్లు. కొద్దినెలలుగా ఇది డొమినికన్ రిపబ్లిక్‌లో ఉందనే సమాచారంతో రంగంలోకి దిగిన అమెరికాకు చెందిన వివిధ ప్రభుత్వ ఏజెన్సీలు మదురో విమానాన్ని స్వాధీనం చేసుకొని ఫ్లోరిడాకు తరలించాయి. అమెరికా దీన్ని జప్తు చేసుకొనేందుకు చర్యలు చేపట్టింది.

బిభవ్ కుమార్‌కు బెయిల్



న్యూఢిల్లీ: వంద రోజులకుపైగా కస్టడీలో ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్‌కు ఎట్టకేలకు సుప్రీంకోర్టులో సోమవారం బెయిల్ లభించింది. రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలివాల్‌పై భౌతిక దాడి కేసులో బిభవ్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్ట్‌చేయడం తెల్సిందే. ఈ కేసులో నేరాభియోగాలను దర్యాప్తు సంస్థ ఇప్పటికే కోర్టుకు సమర్పించిన నేపథ్యంలో కేసు దర్యాప్తుకు బిభవ్ ఎలాంటి ఆటంకం కల్గించబోడని భావిస్తూ ఆయనకు బెయిల్ మంజూరుచేస్తున్నట్లు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం తెలిపింది. '' కేసు దర్యాప్తు పారదర్శకంగా, స్వేచ్ఛగా జరగాలంటే సాక్షులను ఎలాంటి ప్రభావానికి లోనుకాకుండా కాపాడుకోవాల్సి ఉందని ప్రాసిక్యూషన్ చేసిన వాదనలతో మేం ఏకీభవిస్తున్నాం. అయితే నిందితుడికి బెయిల్ ఇచ్చికూడా వేరే మార్గాల్లోనూ సాక్షులను కాపాడొచ్చు. కేసులో దర్యాప్తు ముగిసింది. చార్జ్‌షీట్ కూడా వేశారు. 100 రోజులకుపైనే నిందితుడు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈ దశలో బెయిల్ ఇవ్వడం సబబే'' అని కోర్టు వ్యాఖ్యానించింది. అయితే కేసు కీలకదశలో ఉన్న ఈ తరుణంలో బెయిల్ ఇవ్వొద్దని ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదించారు. గాయాలు చాలా చిన్నవి, ఈ కేసుకు కఠిన సెక్షన్లు వర్తించవు అని బిభవ్ తరఫున హాజరైన సీనియర్ లాయర్ అభిషేక్ మను సింఘ్వీ వాదించారు. సాక్షులను బిభవ్ బెదిరిస్తారన్న ప్రభుత్వ వాదనల నేపథ్యంలో కోర్టు పలు షరతులు విధించింది. '' బిభవ్‌ను మళ్లీ ముఖ్యమంత్రికి వ్యక్తిగత సహాయకుడు వంటి పదవుల్లో నియమించకూడదు. ముఖ్యమంత్రి కార్యాలయంలో ఎలాంటి అధికారిక పనులు అప్పగించకూడదు. సీఎం ఆఫీస్, ఇంటికి ఈయన వెళ్లొద్దు. ఈ కేసుపై బహిరంగంగా ఏమీ మాట్లాడకూడదు'' అని కోర్టు పలు షరతులు విధించింది.

యువత, సరిహద్దు గ్రామాలపై దృష్టి పెట్టండి

సభ్యత్వ నమోదుపై బీజేపీ శ్రేణులకు ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ: బీజేపీలోకి కొత్తసభ్యులను చేర్పించేందుకు వినూత్నంగా ఆలోచించాలని పార్టీ శ్రేణులను ప్రధాని మోదీ కోరారు. సరిహద్దుల్లోని గ్రామాలను బీజేపీకి పెట్టని కోటలుగా మార్చాలని, గిరిజనులు, 18–25 ఏళ్ల గ్రూపు యువతపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. సోమవారం ఆయన దేశవ్యాప్త పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో బీజేపీ మొట్టమొదటి సభ్యత్వాన్ని పార్టీ చీఫ్ జేపీ నడ్డా ప్రధాని మోదీకి అందజేశారు. కార్యక్రమంలో కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షాలతోపాటు పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలైతే గరిష్ఠంగా బీజేపీ నుంచే మహిళా అభ్యర్థులు ఎన్నిక య్యేలా సభ్యత్వ నమోదు సాగాలని మోదీ సూచించారు.

ఇదెక్కడి బుల్డోజర్ న్యాయం?

నిందితుడైతే ఇల్లు కూల్చేస్తారా

- చట్ట ప్రక్రియ పాటించరా?
- పలు రాష్ట్రాల తీరుపై సుప్రీంకోర్టు సీరియస్
- మార్గదర్శకాలను రూపొందిస్తామని స్పష్టీకరణ



సాక్షి, న్యూఢిల్లీ: బుల్డోజర్ న్యాయంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఓ వ్యక్తి నిందితుడు అయినంత మాత్రాన అతడి ఇల్లు కూల్చేస్తారా? అని నిలదీసింది. పలు రాష్ట్రాల్లోని బుల్డోజర్ సంస్కృతిపై అసహనం వ్యక్తం చేసింది. క్రిమినల్ కేసుల్లో నిందితులైన వారి ఇళ్లను కొన్ని రాష్ట్రాల్లో బుల్డోజర్లతో కూల్చివేయడంపై ఆందోళన వ్యక్తం చేసింది. సమస్యలు పరిష్కరించడానికి బుల్డోజర్ న్యాయం సరికాదని, ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయడానికి మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉందని పేర్కొంది. 'నిందితుడైనంత మాత్రాన అతని ఇల్లు కూల్చేస్తారా? ఒకవేళ అతన్ని దోషిగా న్యాయస్థానం తేల్చినా.. ఇల్లు కూల్చడానికి వీల్లేదు. దానికి చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలి' అని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. పలు రాష్ట్రాల్లో ఇళ్ల కూల్చివేతపై దాఖలైన వేర్వేరు పిటిషన్లను సోమవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం విచారించింది. ''ఆరోపణలు ఉన్నంత మాత్రాన ఇల్లు ఎందుకు కూల్చివేయాలి. దోషి అయినప్పటికీ ఇల్లు కూల్చివేయలేం'' అని జస్టిస్ బీఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు. దీంతోపాటు అనధికార నిర్మాణాలను, ఆక్రమణలను కోర్టు రక్షించదని, అయితే వీటికి కొన్ని మార్గదర్శకాలు అవసరమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇలాంటి సమస్యలకు పరిష్కారాలు అందజేయాలని ఇరుపక్షాలను ధర్మాసనం కోరింది. ఆయా ప్రతిపాదనలు సీనియర్ న్యాయవాది నచికేత జోషికి సమర్పించాలని, వాటిని క్రోడీకరించి కోర్టుకు అందజేయాలని సూచించింది. నిందితుల స్థిరాస్తుల ధ్వంసాన్ని అడ్డుకోవడానికి తాము అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకాలను జారీచేస్తామని తెలిపింది.

రోడ్లను ఆక్రమిస్తే గుడులైనా వదలం..

ఏదైనా నేరంలో ప్రమేయం ఉన్నంత మాత్రాన.. అతని స్థిరాస్తి కూల్చివేతకు అది భూమిక కాబోదని ఇదివరకే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌లో స్పష్టం చేశామని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విన్నవించారు. మున్సిపల్ నిబంధనలను లేదా అక్కడి ప్రాధికార సంస్థ నిబంధనలను ఉల్లంఘిస్తేనే.. కూల్చివేతలు ఉంటాయని అందులో స్పష్టం చేశామని యూపీ తరఫున హాజరైన మెహతా తెలిపారు. యజమాని క్రిమినల్ కేసుల్లో నిందితుడనే కారణంతో ఏ స్థిరాస్తిని కూల్చివేయబోమన్నారు. 'మీరు ఇదే వాదనకు కట్టుబడి ఉన్నామంటే.. మేము దీన్ని రికార్డు చేసుకుంటాం. అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీచేస్తాం. రహదారులపై ఎలాంటి ఆక్రమ నిర్మాణాన్ని, ఆక్రమణలనూ మేము రక్షించబోవడం లేదు. రహదారులపై గుడులున్నా వదిలి పెట్టబోం' అని ధర్మాసనం పేర్కొంది. 'కూల్చివేతలు చట్టానికి లోబడి ఉండాలి. కానీ చట్టాన్ని అతిక్రమించి జరగడమే చూస్తున్నాం' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను సెప్టెంబరు 17కు వాయిదా వేసింది.

శంభూ ఉద్యమరైతుల గోడు వినేందుకు కమిటీ

సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ: గత 200 రోజులుగా పంజాబ్, హరియాణా సరిహద్దులోని శంభూ సరిహద్దు వద్ద ఉద్యమం కొనసాగిస్తున్న రైతుల సాధక బాధకాలను పట్టించుకునేందుకు సర్వోన్నత న్యాయస్థానం ముందుకొచ్చింది. ఇందుకోసం పంజాబ్, హరియాణా హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ నవాబ్ సింగ్ నేతృత్వంలో అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటుచేసింది. నిరసనబాట పట్టిన రైతన్నల సమస్యలను వినాలని, నెలల తరబడి రహదారిపై నిలిపిన వారి ట్రాక్టర్లు, ట్రాలీలు తదితరాలను హైవేల నుంచి తొలగించేందుకు రైతులను ఒప్పించాలని కమిటీకి కోర్టు సూచించింది. కమిటీ వారం రోజుల్లోపు తొలి భేటీ జరపాలని సుప్రీంకోర్టు జడ్జీలు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం ఆదేశించింది. ఫిబ్రవరి 13వ తేదీ నుంచి శంభూ వద్ద ప్రభుత్వం ఏర్పాటుచేసిన బారికేడ్లను తొలగించాలంటూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ హరియాణా ప్రభుత్వం వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు పై విధంగా స్పందించింది. ఈ కమిటీకి సలహాలు, సూచనలు చేసేందుకు పంజాబ్, హరియాణా రాష్ట్ర ప్రభుత్వాలకు పూర్తి స్వేచ్ఛనిస్తున్నట్లు కోర్టు స్పష్టంచేసింది. పిటిషన్ తదుపరి విచారణను అక్టోబర్ 14వ తేదీకి వాయిదావేసింది.

సుప్రీంకోర్టులో విజయ్‌నాయర్‌కు ఊరట



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో ఎక్సయిజ్ పాలసీలో అవకతవకల కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ మాజీ కమ్యూనికేషన్స్ విభాగం ఇన్‌ఛార్జ్ విజయ్ నాయర్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. దాదాపు 23 నెలలుగా విచారణ ఖైదీగా జైలులో గడుపుతున్న నాయర్‌కు సుప్రీంకోర్టులో సోమవారం బెయిల్ లభించింది. మద్యం విధానంలో అక్రమాల్లో మనీ లాండరింగ్ కోణంలో దాఖలైన కేసులో నాయర్‌ను ఈడీ 2022 నవంబర్ 13వ తేదీన అరెస్ట్ చేయడం తెల్సిందే. '' కేసులో కఠినమైన చట్టాల ప్రమేయం ఉన్నాసరే ప్రతి ఒక్కరి వ్యక్తిగత స్వేచ్ఛా హక్కు పరిరక్షించబడాల్సిందే'' అని నాయర్‌కు బెయిల్ సందర్భంగా జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిల ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'బెయిల్ ఒక నియమం, తప్పనిసరి పరిస్థితుల్లో విచారణ ఖైదీగా జైలుకు పంపడం అనేది ఒక మినహాయింపు మాత్రమే' అనే చట్టబద్ధ సూత్రాన్ని కోర్టు మరోసారి గుర్తుచేసింది. ఆప్ నేత, ఢిల్లీ మాజీ డెప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, బీఆర్ఎస్ నాయకురాలు కె.కవితలకు సుప్రీంకోర్టు బెయిల్ ఇచ్చిన సందర్భంగా ఇదే సూత్రాన్ని కోర్టు వర్తింపజేయడం తెల్సిందే.

డ్రోన్లు, మిస్సైళ్ల పేలుళ్లతో దద్దరిల్లిన కీవ్

కీవ్: రష్యా మరోసారి ఉక్రెయిన్‌పైకి విరుచుకుపడింది. కీవ్‌పైకి పెద్ద సంఖ్యలో డ్రోన్లు, బాలిస్టిక్, క్రూయిజ్ మిస్సైళ్లను ప్రయోగించింది. కీవ్ గగనతల వ్యవస్థలు వీటిని అడ్డుకోవడంతో శకలాలు పడి పలు చోట్ల అగ్ని ప్రమాదాలు సంభవించాయి. వివిధ ఘటనల్లో ముగ్గురు గాయపడగా రెండు కిండర్ గార్టెన్ స్కూళ్లు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. వేసవి సెలవుల తర్వాత సోమవారం నుంచే మళ్లీ స్కూళ్లు తెరి చారు. ఉత్సవాలను సైతం రద్దు చేశారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం దాకా రష్యా 35 క్షిపణులు, 26 షహీద్ డ్రోన్లను ప్రయోగించిందని ఉక్రెయిన్ తెలిపింది.

మసీదుల్లోకి వచ్చి కొడతాం

బీజేపీ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు

ముంబై: రామ్‌గిరి మహరాజ్‌ను ఎవరైనా ఏమైనా అంటే.. 'మీ మసీదుల్లోకి వచ్చి.. ఒకరి తర్వాత ఒకరిపై దాడి చేస్తాం. జాగ్రత్త!' అని ముస్లింలను మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే నితేశ్ రాణే హెచ్చరించారు. ఇస్లాంపై, ప్రవక్తపై అమర్యాదకర వ్యాఖ్యలు చేశారంటూ రామ్‌గిరి మహరాజ్‌పై పలు కేసులున్నాయి. ఆయనకు మద్దతుగా సభల్లో మాట్లాడుతూ రాణే ముస్లింలను హెచ్చరించారు. రామ్‌గిరి మహరాజ్‌కు ఎవరైనా హాని తలపెడితే తీవ్ర పర్యవసానాలను ఎదుర్కొనాల్సి ఉంటుంది బీజేపీ ఎమ్మెల్యే అన్నారు. రాణే బెదిరింపుల వీడియో వైరల్‌గా మారింది. రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని అహ్మద్‌నగర్ పోలీసులు నితేశ్ రాణేపై రెండు కేసులు నమోదు చేశారు.

సాగుకు భారీ ఊతం

ఆహారభద్రతకు మరింత ఊపు

- 7 పథకాలకు కేంద్రం ఆమోదం
- రూ.14,000 కోట్ల వ్యయం
- రూ.2,817 కోట్లతో డిజిటల్ అగ్రికల్చర్ మిషన్



న్యూఢిల్లీ: వ్యవసాయ రంగానికి ఊతమివ్వడంతో పాటు ఆహార భద్రతను మరింత పెంచే లక్ష్యంతో రూ.14 వేల కోట్లతో ఏడు నూతన సాగు పథకాలకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో సోమవారం జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దేశవ్యాప్తంగా రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచడమే వీటి లక్ష్యమని కేంద్ర ఐటీ, సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. కేబినెట్ నిర్ణయాలను ఆయన మీడియాకు వెల్లడించారు. తాజా పథకాలు సాగులో మరిన్ని పరిశోధనలతో పాటు సహజ వనరుల నిర్వహణ, వ్యవసాయ రంగంలో డిజిటైజేషన్ తదితరాలకు మరింత దోహదపడతాయని తెలిపారు.

ఆ ఏడు పథకాలివే...

1. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ (రూ.2,817 కోట్లు). 2. ఆహార, పౌష్టిక భద్రత (రూ.3,979 కోట్లు). 3. వ్యవసాయ విద్య, నిర్వహణ (రూ.2,291 కోట్లు). 4. ఉద్యాన ప్రణాళిక (రూ.860 కోట్లు). 5. పశు ఆరోగ్య నిర్వహణ, ఉత్పాదకత (రూ.1,702 కోట్లు). 6. కృషీ విజ్ఞాన కేంద్రాల బలోపేతం (రూ.1,202 కోట్లు). 7. సహజ వనరుల నిర్వహణ (రూ.1,115 కోట్లు).

ప్రతి రైతుకూ డిజిటల్ ఐడీ!

వ్యవసాయ రంగంలో డిజిటల్ ఇన్నొవేషన్లకు మరింత మద్దతిచ్చేందుకు ఉద్దేశించిన డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌కు రూ.2,817 కోట్లను కేటాయించారు. దీనికి మొత్తమ్మీద రూ.20,817 కోట్లు కేటాయించాలన్నది లక్ష్యం. ఇందులో భాగంగా డిజిటల్ మౌలిక సదుపాయాల (డీపీఐ) మెరుగుదల, డిజిటల్ విధానంలో సాధారణ సాగు అంచనాల సర్వే (డీజీసీఈఎస్) అమలుతో వంటి ఐటీ ఆధారిత చర్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపడతాయి. దీని కింద అగ్రిస్టాక్, కృషీ డెసిషన్ సపోర్ట్ సిస్టం, సాయిల్ ప్రొఫైల్ మ్యాపింగ్ పేరిట మూడు డీపీఐలను రూపొందించనున్నారు. ''వ్యవసాయ రంగానికి సంబంధించిన అన్నిరకాల సమాచారాన్నీ విశ్వసనీయమైన రీతిలో నిరంతరం రైతులకు అందుబాటులో ఉంచేందుకు ఇవి తోడ్పడతాయి. వ్యవసాయ రంగంలో డిజిటల్ విప్లవమే దీని లక్ష్యం'' అని కేంద్రం వెల్లడించింది. 'అగ్రిస్టాక్'లో భాగంగా ప్రతి రైతుకూ ఆధార్ మాదిరిగా ఒక డిజిటల్ ఐడీ కేటాయిస్తారు. దీన్ని రైతు గుర్తింపు (కిసాన్ కీ పెహచాన్)గా పేర్కొంటారు. అందులోకి లాగిన్ అయిన మీదట సాగుకు సంబంధించిన సమస్త సమాచారమూ అందుబాటులో ఉంటుంది. రాష్ట్ర భూ రికార్డులు, పంట సాగుతో పాటు పథకాలు, భూములు, కుటుంబం తదితర వివరాలన్నింటినీ చూడవచ్చు. ప్రతి సీజన్‌లోనూ రైతులు సాగు చేసిన పంటల వివరాలను మొబైల్ ఆధారిత భూసర్వేల ద్వారా ఇందులో ఎప్పటికప్పుడు నమోదు చేస్తారు. అంటే ఇది డిజిటల్ పంట సర్వే లాంటిది'' అని వివరించింది. దీనికోసం ఇప్పటిదాకా కేంద్ర వ్యవసాయ శాఖతో 19 రాష్ట్రాలు ఒప్పందం కుదుర్చుకున్నట్టు వెల్లడించింది.

రూ.26 వేల కోట్లతో వాయుసేనకు 240 ఏరో ఇంజన్లు

వైమానిక దళానికి సుఖోయ్–30ఎంకేఐ యుద్ధ విమానాల కోసం రూ.26 వేల కోట్లతో హెచ్‌ఏఎల్ నుంచి 240 ఏరో ఇంజన్లు సమకూర్చుకునేందుకు కూడా భద్రత వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. వచ్చే ఏడాది మొదలై ఎనిమిదేళ్లలో హెచ్‌ఏఎల్ వీటిని పూర్తిస్థాయిలో అందజేస్తుందని కేంద్రం ఒక ప్రకటనలో పేర్కొంది.

కేంద్ర కేబినెట్ ఇతర నిర్ణయాలు:

- గుజరాత్‌లోని సనంద్‌లో రోజుకు 63 లక్షల చిప్స్ తయారీ సామర్థ్యంతో కూడిన సెమీ కండక్టర్ల యూనిట్ ఏర్పాటుకు కైన్స్ సెమీకాన్ చేసిన ప్రతిపాదనకు ఆమోదం. దీని అంచనా వ్యయం రూ.3,307 కోట్లు.
- 309 కిలోమీటర్ల ముంబై–ఇండోర్ నూతన రైల్వే లైన్‌కు కేబినెట్ పచ్చజెండా ఊపింది.
- స్వచ్ఛ ఆర్థిక వ్యవస్థ లక్ష్యసాధనకు 14 సభ్య దేశాలతో కూడిన ఇండో పసిఫిక్ ఎకనమిక్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ ప్రాస్పరిటీ (ఐపీఈఎఫ్) భేటీలో చేసిన ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తెలిపింది.

ధిల్లాన్ ఇంటి వద్ద కాల్పులు



వాంకూవర్: కెనడాలోని వాంకూవర్‌లో పంజాబీ గాయకుడు ఏపీ ధిల్లాన్ నివాసం వద్ద కాల్పుల ఘటన కలకలం రేపింది. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనకు తమదే బాధ్యతని లారెన్స్ బిష్ణోయ్–రోహిత్ గోదార గ్యాంగ్ ప్రకటించుకుంది. విక్టోరియా దీవిలో ఉన్న ధిల్లాన్ నివాసం వద్ద సెప్టెంబర్ ఒకటో తేదీ రాత్రి తుపాకీ కాల్పుల శబ్దాలు వినిపించినట్లు స్థానిక మీడియా తెలిపింది. ఘటనపై అధికారికంగా ఎటువంటి ప్రకటనా వెలువడలేదు. వాంకూవర్‌తోపాటు టొరంటోలోని ఉడ్‌బ్రిడ్జ్ వద్ద కాల్పులు జరపాలని తాము పథకం వేసినట్లు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ అనంతరం సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు వైరలవుతోంది. బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌తో సంబంధాలు తెంచేసుకోవాలని, హద్దుల్లో మసలుకోకుంటే కుక్క చావు తప్పదని ధిల్లాన్‌ను అందులో హెచ్చరించింది.

కొండచరియలు విరిగి ఇద్దరు మహిళలు మృతి

కాట్రా/జమ్మూ: జమ్మూకశ్మీర్ లోని రియాసీ జిల్లాలోని వైష్ణోదేవి ఆలయంనూతన కాలిబాటపై కొండచరియలు విరిగి పడిన ఘటనలో ఇద్దరు మహిళలు చని పోగా, ఐదేళ్ల బాలిక తీవ్రంగా గాయపడింది. సోమవారం మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో భవన్ ప్రాంతానికి మూడు కిలోటర్ల దూరంలోని పాంచి వద్ద ఈ విషాదం చోటు చేసుకుంది. వైష్ణోదేవి ఆలయానికి వెళ్తున్న భక్తులు ఇనుప నిర్మాణం వద్ద సేద తీరుతుండగా కొండచరియలు విరిగి విరిగిపడ్డాయని రియాసీ డిప్యూటీ కమిషనర్ విశేష్ పాల్ మహాజన్ చెప్పారు. బండరాళ్లు పడటంతో ఆ ఇనుప నిర్మాణం సైతం దెబ్బతిందని చెప్పారు. బాధితులంతా యూపీ, పంజాబ్‌లకు చెందిన వారన్నారు. ప్రమాదం నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా ఆ మార్గంపై భక్తుల రాకపోకలను నిలిపివేశామన్నారు. సీనియర్ అధికారులు ఘటనాస్థలికి చేరుకుని, సహాయక చర్యలు చేపట్టారని ఆయన వివరించారు.

సాక్షి హైదరాబాద్

మంగళవారం ׀ 3 ׀ సెప్టెంబర్ ׀ 2024



దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం పంజగుట్ట చౌరస్తాలో ఆయన విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కాంగ్రెస్ నేత రోహిన్‌రెడ్డి తదితరులు

గరిష్ఠం/కనిష్ఠం
24.0/22.0

వాతావరణం
నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది. గరిష్ఠంగా 24, కనిష్ఠంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



ఇంకా వరద నీటిలోనే మోకిల్లలోని లా పలోమా విల్లాస్

వదలని వానమ్మ..!

- ఉదయం నుంచి చిరుజల్లులు
- జంట జలాశయాలకు తగ్గిన వరద
- జలదిగ్బంధంలో గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు

సోమవారం తెల్లవారుజామున 9.7 సెం.మీ. వర్షపాతం నమోదు



వరద నీటిలోనే వెస్టర్న్ గ్రీన్ విల్లాస్...

సాక్షి, సిటీబ్యూరో: నగరాన్ని వానమ్మ వదలడం లేదు. మూడు రోజులుగా వెంటాడుతూనే ఉంది. సోమవారం తెల్లవారుజామున భారీగా కురిసిన వర్షం ఉదయం తర్వాత చిరు జల్లులుగా మారింది. భారీ నుంచి అతి భారీ వర్ష సూచనతో విద్యాసంస్థలకు సెలవు కొనసాగగా, ఐటీ ఉద్యోగులు వర్క్ ఫ్రం హోమ్ విధులు నిర్వహించారు. అత్యవసర పనులుంటే తప్ప నగరవాసుల పెద్దగా బయటికి వెళ్లలేదు. దీంతో రోడ్లపై జనసంచారం బాగా తగ్గింది. జలమండలి, జీహెచ్ఎంసీ ప్రత్యేక బృందాలు రంగంలో దిగి ప్రధాన రోడ్లపైనున్న వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాయి. ఉన్నతాధికారులు సైతం క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తుండటంతో నగర శివార్లకు వరద ప్రవాహం బాగా పెరిగింది. దీంతో గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు జలదిగ్బంధానికి గురయ్యాయి. అయితే జంట జలాశయాలకు మాత్రం వరద ప్రవాహం కొంత మేర తగ్గుముఖం పట్టింది.

10 సెంటీ మీటర్లు

మహానగరంలో తెల్లవారుజామున అత్యధికంగా గచ్చిబౌలిలో 9.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రాంతంలో 8.5, ఎంఎటీఎస్ లింగంపల్లి 8.5, హెచ్ఎంటీ హిల్స్ 8.0, బాలాజీ నగర్ 7.5, కేపీహెచ్‌బీ 7.4, చందానగర్ 7.3, యూసుఫ్‌గూడ 6.9, మాదాపూర్ 6.8, హఫీజ్‌పేట 6.6, ఖాజాగూడ 6.4, బోరబండ 6.4, సరూర్‌నగర్ 6.2, బంజారాహిల్స్‌లో 6.1 వర్షపాతం నమోదైంది.

ఎస్ఎన్‌డీపీ పూర్తయితేనే...

వరుస వర్షాలతో లోతట్టుప్రాంతాల్లోని కాలనీలు, బస్తీల్లోకి వరద ముంచెత్తుతోంది. ఇళ్లలోకి నీరు రావడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పలేదు. ముఖ్యంగా కూకట్‌పల్లి, ముషీరాబాద్, టోలిచౌకి, ఎల్బీనగర్, మల్కాజిగిరి ప్రాంతాల్లో ఈ ముప్పు ఎక్కువగా కనిపిస్తోంది. గతంతో పోలిస్తే కాలనీలు, బస్తీల్లో ముంపు సమస్య కొంత తగ్గింది. కాగా, ఎస్ఎన్‌డీపీ(వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం) కింద చేపట్టిన పనులు కూడా ఇందుకు మరో కారణంగా కనిపిస్తోంది. 2020లో కురిసిన భారీ వర్షాలకు నెలలపాటు నగరంలోని వివిధ ప్రాంతాల ప్రజలు తేరుకోలేకపోయారు.

ఆ ఇక్కట్లు తొలగించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఎస్ఎన్‌డీపీ పనులు 60 శాతానికిపైగా పూర్తి కావడంతో ఆ మేరకు ఇప్పుడు ఇబ్బందులు తగ్గాయి. వరద సమస్యల పరిష్కారం కోసం 69.48 కి.మీ. మేర నాలాల ఆధునీకరణతోపాటు బాక్స్ డ్రెయిన్ల ఏర్పాటు చేయాల్సి ఉండగా, వాటిల్లో 42.48 కి.మీ. మేర పనులు పూర్తయ్యాయి. ఇందులో జీహెచ్ఎంసీ పరిధిలో చేపట్టిన 50.54 కి.మీ. పనుల్లో 35.69 కి.మీ. మేర పూర్తయ్యాయి. శివార్లలో 18.94 కి.మీ. పనులు చేపట్టగా 10.22 కి.మీ. మేర పూర్తయ్యాయి. మిగతా పనుల పూర్తికి ఆయా ప్రాంతాల్లో ఆస్తుల సేకరణ సమస్యగా మారినట్లు అధికారులు తెలిపారు. దాంతోపాటు జీహెచ్ఎంసీ ఖజానాలో తగిన నిధులు లేకపోవడం, నాలాల్లో పూడికతీత పనులు పూర్తికాకపోవడం వల్ల కూడా ముంపు ముప్పు పూర్తిగా తొలగిపోలేదు.

జంట జలాశయాల నీటిమట్టాలు..



గండిపేట

ఉస్మాన్‌సాగర్

పూర్తి స్థాయి నీటిమట్టం	:1,790.00 అడుగులు (3.900 టీఎంసీలు)
ప్రస్తుత నీటిమట్టం	: 1,785.10 అడుగులు (2.851 టీఎంసీలు)
ఇన్‌ఫ్లో	: 3,000 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: నిల్

హిమాయత్‌సాగర్

పూర్తి స్థాయి నీటిమట్టం	: 1,763.50 అడుగులు (2.970 టీఎంసీలు)
ప్రస్తుత నీటిమట్టం	: 1,759.50 అడుగులు (2.215 టీఎంసీలు)
ఇన్‌ఫ్లో	: 1,500 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: నిల్



హిమాయత్‌సాగర్

ఎస్ఎన్‌డీపీతోనే ముప్పు తప్పింది: కేటీఆర్

గతంలో కేసీఆర్ ప్రభుత్వం ముందుచూపుతో చేపట్టిన ఎస్ఎన్‌డీపీ వల్లే నగరంలో ముంపు సమస్యల్లేకపోవడం సంతృప్తినిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఎస్ఎన్‌డీపీ పనుల వల్లే వరద సమస్య నుంచి తప్పించుకున్నామంటూ ముంపు ప్రభావిత ప్రాంత ప్రజలు చెబుతున్నారని తెలిపారు. విజన్ ఉంటే విపత్తులను కూడా సమర్థంగా ఎదుర్కోవచ్చని ఎస్ఎన్‌డీపీతో వెల్లడైందన్నారు. సమైక్య రాష్ట్రంలో ఉన్నప్పుడు భారీ వర్షాలు, వరదలు వచ్చిన ప్రతీ సందర్భంలోనూ హైదరాబాద్‌లోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యేవని, కాలనీల్లోని ఇళ్లలోకి వరదనీరు చేరి పేద, మధ్యతరగతి ప్రజల జనజీవనం అస్తవ్యస్తంగా మారేదని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక్క పైసా సహకారం లేకున్నా, రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే ఎస్ఎన్‌డీపీ పనులు చేపట్టడం మరో ప్రత్యేకత అని వెల్లడించారు. ఎస్ఎన్‌డీపీలో భాగంగా పాడైపోయిన పాత నాలాల పునరుద్ధరణతోపాటు కొత్త నాలాల నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేశామన్నారు. ఈ సందర్భంగా నాడు ఎస్ఎన్‌డీపీ పనుల్లో భాగస్వాములైన ప్రతిఒక్కరికీ కేటీఆర్ అభినందనలు తెలిపారు.

17న సామూహిక గణేశ్ నిమజ్జనం

భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి



మాట్లాడుతున్న గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు రాఘవరెడ్డి

పంజగుట్ట: ఈ నెల 17వ తేదీన కనీవినీ ఎరుగని రీతిలో 45వ సామూహిక గణేశ్ నిమజ్జన కార్యక్రమం వినాయక సాగర్‌లో నిర్వహించనున్నట్లు భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉపాధ్యక్షుడు వైకుంఠం, కార్యదర్శులు డాక్టర్ శశిధర్, కె.మహేందర్, కోశాధికారి శ్రీరామ్ వ్యాస్, సలహాదారు కరోలీమాల్‌తో కలిసి ఆయన మాట్లాడారు. గణేశ్ ఉత్సవాలకు నిధుల కొరత లేకుండా ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తామని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. పోలీసు, విద్యుత్ శాఖలకు మండప నిర్వాహకులు తమ వివరాలు ఇస్తే సరిపోతుందని, ఎలాంటి అనుమతులు అవసరం లేదన్నారు. మండపాల ఉచిత విద్యుత్‌కు ప్రభుత్వం అనుమతించిందని పేర్కొన్నారు. గతేడాది లక్షా 25 వేల విగ్రహాలు నిమజ్జనం కాగా, ఈసారి లక్షా 40 వేలకు పెరగవచ్చని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలోని 34 చెరువులు, రంగారెడ్డి, రాచకొండల్లోని 100 కుంటల్లో నిమజ్జనానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. 250 గణేష్ యాక్షన్ టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిమజ్జనానికి 50 లక్షల మంది ప్రత్యక్షంగా హాజరయ్యే అవకాశం ఉందన్నారు.

కట్టుదిట్టమైన భద్రత అవసరం

గణేశ్ ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ నేపథ్యంలో ఎస్సైలకు సిటీ కొత్వాల్ దిశానిర్దేశం



సాక్షి, సిటీబ్యూరో: గణేశ్ మండపాలు, నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో పర్యటించి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా బందోబస్తు, భద్రతాచర్యలు చేపట్టాలని సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్సై)లకు నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి దిశానిర్దేశం చేశారు. గణేశ్ ఉత్సవాలు, మిలాద్–ఉన్–నబీ పండుగలను ప్రశాంతంగా నిర్వహించడానికి నిర్వాహకులు, పీస్ కమిటీలు, ఇతర ప్రభుత్వ విభాగాలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. వినాయక ఉత్సవాలు, మిలాద్–ఉన్–నబీ పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో ఆయన సోమవారం ఎస్సైలతో కీలక సమావేశం నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (టీజీ సీసీసీ) జరిగిన ఈ సమీక్షాసమావేశంలో నగర కమిషనరేట్ పరిధిలోని శాంతిభద్రతలు, ట్రాఫిక్ విభాగాలకు చెందిన దాదాపు 300 మంది ఎస్సైలు పాల్గొన్నారు. కొత్వాల్ మాట్లాడుతూ పోలీసులు సర్వకాల సర్వావస్థల్లోనూ బాధితుల పక్షపాతిగానే ఉండాలన్నారు. సమావేశంలో అదనపు పోలీసు కమిషనర్(శాంతిభద్రతలు) విక్రమ్‌సింగ్ మాన్, సంయుక్త కమిషనర్ (పరిపాలన) గజరావ్ భూపాల్, డిప్యూటీ పోలీసు కమిషనర్(స్పెషల్ బ్రాంచ్) ఎస్.చైతన్యకుమార్ పాల్గొన్నారు. కాగా, మిలాద్–ఉన్–నబీ ఊరేగింపునకు అనుమతి ఇవ్వాలని మర్కజీ మిలాద్ జులూస్ కమిటీ కొత్వాల్‌కు లేఖ అందించింది.

లక్ష మట్టి విగ్రహాల పంపిణీకి శ్రీకారం

సాక్షి, సిటీబ్యూరో: వినాయక చవితి సందర్భంగా లక్ష మట్టి విగ్రహాల పంపిణీకి హెచ్ఎండీఏ శ్రీకారం చుట్టింది. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు నగరంలోని 33 ప్రాంతాల్లో లక్ష విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. స్వచ్ఛంద, కార్పొరేట్ సంస్థల ఉద్యోగులకు సైతం ఈ విగ్రహాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 4, 5, 6 తేదీల్లో జూబ్లీహిల్స్, ఆరోగ్యశ్రీ, సైలెంట్ వ్యాలీ విల్లాస్, బంజారాహిల్స్ రోడ్ నెంబర్–10, ఐఏఎస్ క్వార్టర్స్, కేబీఆర్ పార్కు, సోమాజిగూడ ప్రెస్ క్లబ్, బల్కంపేట్ ఎల్లమ్మ టెంపుల్, జూబ్లీహిల్స్ టూప్స్ రెస్టారెంట్, పెద్దమ్మగుడి, మెహదీపట్నం రైతుబజార్, హైటెక్ సిటీ శిల్పారామం, కూకట్‌పల్లి మెట్రో క్యాష్ అండ్ క్యారీ, ఉప్పల్ శిల్పారామం, సికింద్రాబాద్ గణేశ్ టెంపుల్, మైత్రీవనం హెచ్ఎండీఏ కార్యాలయం, ట్యాంక్‌బండ్, సెక్రెటేరియెట్, ఎన్టీయార్ గార్డెన్, సరూర్‌నగర్ ప్రియదర్శిని పార్కు, వనస్థలిపురం రాజీవ్‌గాంధీ పార్కు, కుందన్‌బాగ్ ఐఏఎస్ కాలనీ, దుర్గం చెరువు, నారాయణగూడ మెల్కొటే పార్కు, సఫిల్‌గూడ వాయిపురి రిక్రియేషన్ సెంటర్, పాతబస్తీ వేదిక్ ధర్మ ప్రకాశ్ స్కూల్, మాదాపూర్ మైండ్ స్పేస్ జంక్షన్, నవదీప్త, తార్నాక కమర్షియల్ కాంప్లెక్స్, నాగోల్ ఇందుఅరణ్య ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నారు. పలు కాలనీలు, గేటెడ్‌కమ్యూనిటీలకు మొబైల్ వాహనాల ద్వారా వీటిని సరఫరా చేయనున్నారు. పర్యావరణహితంగా వేడుకలను నిర్వహించుకొనేందుకు హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో 2017 నుంచి మట్టి విగ్రహాల పంపిణీ కొనసాగుతోంది.

విగ్రహాల పంపిణీ వివరాల కోసం కింది ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

హెచ్ఎండీఏ ఈఈ కె.శంకర్ :	98499 09845
డిప్యూటీ ఈఈ జి.విక్రమ్ :	98490 31531

సీఎన్జీ కొరత..!

డిమాండ్‌కు తగ్గట్టు లేని సరఫరా

- గ్యాస్ కిట్ల వాహనాలకు తిప్పలు
- బంకుల్లో నో స్టాక్ బోర్డులు
- కిలోపై అదనంగా బాదుడు

సాక్షి, సిటీబ్యూరో: మహానగరాన్ని సీఎన్జీ(కంప్రెస్డ్ నేచరల్ గ్యాస్) కొరత వెంటాడుతోంది. పెట్రోల్, డీజిల్ ధరల మోతతో సీఎన్జీ వైపు మొగ్గు చూపి గ్యాస్‌కిట్లు అమర్చుకున్న వాహనదారులకు ఇప్పుడు గ్యాస్ కష్టాలు తప్పడం లేదు. రెండు, మూడేళ్లుగా వాహనాల సంఖ్య పెరుగుతుండటంతో సీఎన్జీ గ్యాస్‌కు డిమాండ్ బాగా పెరిగింది. మరోవైపు సరిపడా గ్యాస్ సరఫరా లేక ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బంకుల్లో లోడ్ నింపిన మూడు, నాలుగు గంటల్లోనే నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తుండటం గమనార్హం.

వెనక్కి వెళ్లలేక

సీఎన్జీ నుంచి తిరిగి పెట్రోల్, డీజిల్ వైపు వెళ్లడం వాహనదారులకు తలకు మించిన భారంగా తయారైంది. రూ.20 వేల నుంచి 40 వేల వరకు ఖర్చు చేసి తమ వాహనాలకు సీఎన్జీ కిట్లు అమర్చుకున్నారు. మరికొందరు సీఎన్జీ కిట్స్ గల వాహనాలను కొనుగోలు చేశారు. తాజాగా సీఎన్జీ కొరత వీరిని తీవ్రంగా కలచివేస్తోంది.

నాలుగు లక్షలపైనే...


మహానగరంలో నాలుగు లక్షలపైనే వాహనాలు సీఎన్జీ, ఆటో గ్యాస్, లిక్విడ్, ఎల్పీజీ గ్యాస్‌ను వినియోగిస్తున్నట్లు అంచనా. ఆటో గ్యాస్, లిక్విడ్ గ్యాస్‌కు కొరత లేనప్పటికీ సీఎన్జీ అరకొరగా అందుబాటులో ఉంది. అయితే మదర్ స్టేషన్ నుంచే పూర్తిస్థాయిలో గ్యాస్ సరఫరా కావడం లేదని తెలుస్తోంది. సాధారణంగా గ్యాస్ స్టేషన్లకు ప్రతీరోజు ఐదు వేల ఆటోలు, వెయ్యి వరకు కార్ల తాకిడి ఉంటుంది.

మైలేజ్ అధికమే..

సీఎన్జీ వాహనాల మైలేజ్ అధికంగా ఉంటుంది. పెట్రోల్, డీజిల్ వాహనాలు లీటర్‌కు 15 నుంచి 20 కిలో మీటర్ల వరకు మైలేజీ ఇస్తే, సీఎన్జీ, ఆటో గ్యాస్, ఎల్పీజీ కిలోకు 22 కి.మీ. నుంచి 28 కి.మీ వరకు మైలేజీ వస్తుందని వినియోగదారులు పేర్కొంటున్నారు. గ్రేటర్ పరిధిలో 560పైగా పెట్రోల్ బంకులు ఉండగా, ప్రత్యేకంగా 80కుపైగా సీఎన్జీ స్టేషన్లు ఉన్నాయి.

పదమూడేళ్ల నుంచి...

సరిగ్గా పదమూడేళ్ల క్రితం హైదరాబాద్‌లో ప్రజారవాణాకు వినియోగించే 85 వేల ఆటోలు, 7,500 బస్సులు, 20 వేలకుపైగా ట్యాక్సీలకు సగటున రోజుకు 7,62,500 కిలోల (1.067 ఎంఎంఎస్‌సీఎండీ) సీఎన్జీ అందించే లక్ష్యంలో బీజీఎల్ సంస్థ కార్యకలాపాలకు శ్రీకారం చుట్టింది. తొలిదశలో మేడ్చల్, హకీంపేట, కంటోన్మెంట్ డిపోలకు చెందిన 350 ఆర్టీసీ బస్సులకు సీఎన్జీ పంపిణీ చేస్తామని ప్రకటించింది. కానీ, కొద్దిరోజులు 164 బస్సులకు సరఫరా చేసినా ప్రస్తుతానికి బస్సుల సంఖ్య 135కు పరిమితమైంది. దీంతో 215 బస్సులు డిపోల్లోనే మూలుగుతున్నాయి. హైదరాబాద్‌లో పూర్తిస్థాయిలో సీఎన్జీని అందుబాటులోకి తెచ్చే ప్రక్రియ అంతంత మాత్రంగా తయారైంది. శామీర్‌పేట మదర్ స్టేషన్ ఏర్పాటు చేసి సీఎన్జీని అందుబాటులోకి తెచ్చినప్పటికీ కొంతకాలంగా గ్యాస్ కొరతతో గ్రిడ్ నుంచి స్టేషన్లకు డిమాండ్‌కు తగిన సరఫరా చేయలేకపోతోంది.



సిటీ ఖాళీ!

- రోడ్లపై సోమవారం కనిపించని రద్దీ
- విద్యాసంస్థలకు సెలవూ ఓ కారణం

సాక్షి, సిటీబ్యూరో: వర్షం కురిసినప్పుడు చూడాలి రాజధాని రాజసం! అడుగడుగునా ట్రాఫిక్ రద్దీ.. గంటల తరబడి వాహనాల ప్రతిష్టంభన.. షరామామూలే కదా! అయితే తాజా పరిస్థితి అందుకు భిన్నం. శనివారం నుంచి సిటీని వర్షం వదలకున్నా ఈసారి ఆ ప్రభావం కనిపించలేదు. ఆదివారం సెలవు దినమైనప్పటికీ సోమవారమూ నగరంలోని రోడ్లపై వాహనాలు అంతంత మాత్రంగానే కనిపించాయి. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రభుత్వం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించింది. మరోపక్క అనేకమంది వ్యక్తిగత వాహనాలైన బైక్‌లు, కార్లు వీడి ఆర్టీసీ బస్సులు, ఎంఎంటీఎస్, మెట్రో రైల్ వంటి ప్రజారవాణా వ్యవస్థల్ని ఆశ్రయించారు. మరోపక్క ఆంధ్రప్రదేశ్‌తోపాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలకు పలుచోట్ల రోడ్లు, రైల్వే ట్రాక్‌లు తెగిపోయాయి. దీంతో పెద్ద సంఖ్యలు బస్సులు, రైళ్లు రద్దు కావడంతోపాటు నగరానికి రాకపోకలు తగ్గాయి. సాఫ్ట్‌వేర్ కంపెనీలు సైతం తమ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోం ఇవ్వడంతో సైబరాబాద్ పరిధిలోనూ ట్రాఫిక్ ఎక్కువగా కనిపించలేదు.

మూడు రోజుల్లో 191 ఫిర్యాదులు

నగరంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) బృందాలు నిర్విరామంగా శ్రమించాయి. దీనికి శని, ఆది–సోమవారాల్లో మొత్తం 191 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో 166 చెట్లు కూలడానికి సంబంధించినవే. రోడ్లపై నీటినిల్వకు సంబంధించి మిగిలిన 25 ఫిర్యాదులు వచ్చాయి. విపత్తులప్పుడు సేవలు అందించే డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్)ను ప్రభుత్వం హైడ్రాలో విలీనం చేసింది. దీంతో రెస్క్యూ ఆపరేషన్లను ఇప్పుడు హైడ్రా చేపడుతోంది. సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని మౌలాలీలో చెట్టు కూలడానికి సంబంధించిన శనివారం హైడ్రాకు తొలి ఫిర్యాదు వచ్చింది. 52 నిమిషాల్లోనే అక్కడికి చేరుకొని తొలగింపు పనులను పూర్తి చేసింది.

చెరువుల నోటిఫికేషన్లకు చర్యలు తీసుకోండి

కలెక్టర్లను ఆదేశించిన హెచ్ఎండీఏ కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: హెచ్ఎండీఏ పరిధిలోని చెరువుల విస్తీర్ణం, ఇతర వివరాలకు సంబంధించిన నోటిఫికేషన్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ సంబంధిత అధికారులకు సూచించారు. చెరువుల నోటిఫికేషన్లకు సంబంధించి హెచ్ఎండీఏ పరిధిలోని రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి, సంగారెడ్డి, హైదరాబాద్, సిద్దిపేట, మెదక్, యాదాద్రి– భువనగిరి జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అడిషనల్ కలెక్టర్ల(స్థానిక సంస్థలు)తో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రిలిమినరీ, ఫైనల్ నోటిఫికేషన్ల పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. నవంబర్ ఒకటో తేదీలోగా అన్ని చెరువులకు సంబంధించిన నోటిఫికేషన్ల పనులు పూర్తి కావాలని ఆదేశించారు.

ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు జరిగిన పనుల వివరాలిలా ఉన్నాయి

- సర్వే చేసిన చెరువులు: 65
- జిల్లాల నుంచి అందిన ప్రిలిమినరీ నోటిఫికేషన్లు: 269
- పబ్లిష్ అయిన ప్రిలిమినరీ నోటిఫికేషన్లు: 30
- పరిశీలనలో ఉన్న ప్రిలిమినరీ నోటిఫికేషన్లు: 239
- జిల్లాల నుంచి అందిన ఫైనల్ నోటిఫికేషన్లు: 51
- పరిశీలనలో ఉన్న ఫైనల్ నోటిఫికేషన్లు: 51



గండిపేటను సందర్శించిన జలమండలి ఈడీ

భారీ వర్షాల నేపథ్యంలో వివరాలు ఆరా



సాక్షి, సిటీబ్యూరో: భారీ వర్షాల నేపథ్యంలో ఉస్మాన్‌సాగర్(గండిపేట) జలాశయాన్ని జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఈడీ జలాశయం గురించి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన మానవ నిర్మిత కట్టడమైన ఉస్మాన్‌సాగర్ గేట్లు ఆటోమేషన్‌లో కాకుండా ఇప్పటికీ మ్యాన్యువల్ పద్ధతిలోనే నిర్వహిస్తున్నట్లు సంబంధిత అధికారులు వివరించారు. ఇప్పటివరకు కురిసిన వర్షాలతో జలాశయం ఇన్‌ఫ్లో వివరాలతోపాటు అక్కడి పరిస్థితినిపై ఆయన ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి కలెక్టర్ శశాంక, జలమండలి సీజీఎం రవీందర్ రెడ్డి, జీఎం డేవిడ్ రాజ్, రెవిన్యూ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజిద్దాం..

పోస్టర్ ఆవిష్కరించిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

లక్డీకాపూల్: ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ముద్రించిన 'మట్టి వినాయకులను పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం... చెరువులను కాపాడుదాం' అంటూ తయారు చేసిన పోస్టర్లను మేయర్ ఆవిష్కరించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వినాయక చవితి పండగకు ఉచితంగా మట్టి వినాయకులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.



మట్టి వినాయకుని పూజిద్దాం అన్న పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న మేయర్ విజయలక్ష్మి

ప్రతినెలా పది పాఠశాలల సందర్శన

ప్రత్యేక అధికారులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దిశానిర్దేశం

సాక్షి, సిటీబ్యూరో: ప్రత్యేక అధికారులు ప్రతినెలా పది ప్రభుత్వ పాఠశాలలను తప్పనిసరిగా సందర్శించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక అధికారుల సమావేశంలో పాఠశాలల సందర్శన వివరాలను సమీక్షించారు. ప్రత్యేక అధికారులు పాఠశాలలను సందర్శించినప్పుడు అకాడమిక్ గైడెన్స్ రిజిస్టర్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రిజిస్టర్ అప్‌డేట్, ఎమ్ఎస్‌ఓలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు అందులో సంతకం చేసినారా లేదా అని పరిశీలించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల నాణ్యతను పరిశీలించాలని, ఎఫ్ఎల్ఎన్ చూడాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలలోని విద్యార్థులు సరిగా చదవగలుగుతున్నారో, లేదో పరిశీలించాలన్నారు. పాఠశాలల్లో టీచర్ల కొరత ఉందా అని కలెక్టర్ ఆరా తీశారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను త్వరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరివన్, వెంకటాచారి, లా ఆఫీసర్ వీరబ్రహ్మాచారి, జిల్లా అధికారులు పెరిక యాదయ్య, ఆశన్నా, కోటాజీ, ఆర్.రోహిణి, పవన్ కుమార్, సీపీఓ డాక్టర్ సురేందర్, రమేష్, ఏవో సదానందం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

'ఐరస్ట్ రోడ్ సేఫ్టీ' ప్రాజెక్ట్‌కు ప్రధాని మోదీ ప్రశంసలు



దేశవ్యాప్తంగా అమలు చేయాలని సూచన

- తెలంగాణ ప్రభుత్వం, ట్రిపుల్‌ఐటీ, ఇంటెల్ కష్టానికి ప్రతిఫలం
- రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్
- ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ 27వ ఫౌండేషన్ డే కార్యక్రమం

రాయదుర్గం: తెలంగాణ ప్రభుత్వం, ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్, ఇంటెల్ సంస్థ సంయుక్తంగా రూపొందించిన 'ఐరస్ట్ రోడ్ సేఫ్టీ ప్రాజెక్ట్‌'ను దేశ ప్రధాని నరేంద్రమోదీ ప్రశంసించడమేగాక దానిని దేశవ్యాప్తంగా అమలు చేయాలని సూచించారని రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ అన్నారు. సోమవారం గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో ట్రిపుల్ ఐటీ 27వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జయేష్ రంజన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం, ట్రిపుల్‌ఐటీ, ఇంటెల్ సంస్థల సమష్టి కృషికి ఈ ప్రశంస నిదర్శనమని పేర్కొన్నారు. ట్రిపుల్‌ఐటీ అనేక పారామీటర్లలో అత్యధిక ర్యాంక్‌ను కలిగి ఉండటం, ఏఐలో దేశంలోని అత్యుత్తమ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్‌లలో ఒకటిగా గుర్తింపు పొందడం సంతోషంగా ఉందన్నారు. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పిజే నారాయణన్ మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ సిల్వర్ జూబ్లీ వేడుకల గ్రాండ్ ఫినాలే ఘనంగా ముగిసిందన్నారు. వృత్తిలో రాణిస్తూ సమాజానికి, ఇనిస్టిట్యూట్‌కు గణనీయమైన సేవలు అందించిన పూర్వ విద్యార్థులను అవార్డులతో సత్కరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, అధికారులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులకు అత్యుత్తమ అవార్డుల ప్రదానం కార్యక్రమంలో భాగంగా 2024 గాను అలుమిని ఔట్‌స్టాండింగ్ సర్వీస్–2024 అవార్డును విపుల్‌కేడియా, సౌజన్యలంకాలకు జయేష్‌రంజన్, ప్రొఫెసర్ పీజేనారాయణన్ చేతుల మీదుగా అవార్డులను అందజేశారు.

లేబాకు నారాయణ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజన వితరణ

సాక్షి, సిటీబ్యూరో: దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర రెడ్డి, తన తండ్రి లేబాకు నారాయణ రెడ్డి వర్ధంతి సందర్భంగా లేబాకు నారాయణ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, డా.బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ విద్యార్థి సేవా విభాగం డైరెక్టర్ డా.ఎల్.విజయ కృష్ణా రెడ్డి (ఎల్వీకే) ఆధ్వర్యంలో ఎస్ఆర్ నగర్‌లోని ఆశ్రయ్ ఆకృతి సంస్థ విద్యార్థులకు భోజనం వితరణ చేశారు. సోమవారం నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో ఎల్వీకే మాట్లాడుతూ.., తన తండ్రి పేరిట ఏర్పాటు చేసిన ట్రస్టు ఆధ్వర్యంలో వివిధ సందర్భాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా స్వయంగా విద్యార్థులకు భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు లేబాకు తేజశ్విని తదితరులు పాల్గొన్నారు.



పోషకాహార సవాళ్లపై వినూత్న వ్యూహాలు

'అందరికీ పోషకాహారం'కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సుల్తాన్‌బజార్: పౌష్టికాహారంపట్ల సామాజిక ప్రవర్తనను మార్చడానికి 'పోషణ్ అభియాన్'వినూత్న వ్యూహాలతో ముందుకు సాగుతోందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. పోషకాహారంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన బుర్రకథ, పల్లెసుద్దులు వంటి జానపద కళారూపాలను వీక్షించానని, ఈ ప్రయత్నం ఎంతో అభినందనీయమన్నారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్(సీబీసీ) నిర్వహించిన ఐదురోజుల ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ అండ్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్ 'అందరికీ పోషకాహారం'ను సోమవారం కోఠిలోని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీబీసీ అడిషనల్ డైరెక్టర్ శ్రుతిపాటిల్ భారతీయుల కోసం తాజా ఆహార మార్గదర్శకాలు, స్థూల, సూక్ష్మ పోషకాల ప్రాముఖ్యత, ఆహార లేబుళ్లను చదివే పద్ధతులు వంటి అంశాలను హైలైట్ చేస్తూ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను గవర్నర్ వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తహీనతను ఎదుర్కోవడం, విటమిన్లు అధికంగా ఉండే ఆహారాన్ని తినడం వంటి సందేశాలను కళారూపాల ద్వారా అందించడం స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను పౌష్టికాహారం, విద్యను అందించే సంపూర్ణ హబ్‌లుగా మార్చడానికి ప్రయత్నిస్తోందన్నారు. భారతదేశం వైవిధ్యభరితమైన దేశమని, వివిధ రకాల సంస్కృతులు, భాషలు ఉన్నాయని, పౌష్టికాహారానికి సంబంధించిన సమాచారం వారికి చేరవేయడం పెద్ద సవాలు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషిన్ సైంటిస్ట్ డాక్టర్ జి.భానుప్రకాష్‌రెడ్డి, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ ఎం.విజ్జులత లతోపాటు శిశు సంక్షేమ శాఖ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పౌష్టికాహార ఉత్పత్తులను పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

వర్షాల నేపథ్యంలో..

శిథిల భవనాలు, సెల్లార్లపై చర్యలు

సాక్షి,సిటీబ్యూరో: నగరంలో కురుస్తున్న వరుస వర్షాలతో శిథిలభవనాలు, సెల్లార్ల తవ్వకాలపై జీహెచ్ఎంసీ అప్రమత్తమైంది. క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కమిషనర్ ఆమ్రపాలి టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. ప్రమాదకరంగా ఉన్న శిథిల భవనాల్లోని వారిని ఖాళీ చేయించి, భవనం పరిసరాల్లో ప్రజలు సంచరించకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. దాంతోపాటు అలాంటి వాటి కూల్చివేత చర్యలు చేపట్టాలన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయి పనుల్లో నిమగ్నమయ్యారు. సెల్లార్ల పనులు పురోగతిలో ఉన్న ప్రాంతాల్లో తగిన భద్రత చర్యలు తీసుకోవాల్సిందిగా బిల్డర్లకు సూచిస్తున్నారు. సెల్లార్లకు పరిసరాల్లో ఉన్న కార్మికుల శిబిరాలను అక్కడి నుంచి తొలగిస్తున్నట్లు టౌన్ ప్లానింగ్ విభాగం పేర్కొంది.



తాజా లెక్కల మేరకు..

- గుర్తించిన శిథిల భవనాలు:597
- కూల్చివేసినవి: 354
- యజమానులు మరమ్మ తులు చేపట్టినవి: 109
- నివాసితులను ఖాళీ చేయించిన భవనాలు: 135
- సీల్ వేసిన భవనాలు: 3
- మిగతా వాటిల్లో నివసిస్తున్నవారిని ఖాళీ చేయాల్సిందిగా కౌన్సిలింగ్ నిర్వహించారు.
- సెల్లార్ల తవ్వకాలు గుర్తించిన 181 ప్రాంతాల్లోనూ అవసరమైన చర్యలు చేపట్టినట్లు టౌన్ ప్లానింగ్ విభాగం తెలిపింది.

గంజాయి విక్రేతల అరెస్ట్

మేడ్చల్‌రూరల్: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను మేడ్చల్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన జగదీష్ సాహూ, ఘనాపూర్‌తండాకు చెందిన నూనావత్ రాజ్‌కుమార్ అదే ప్రాంతానికి చెందిన జగదీష్ బెహ్రా వద్ద 500 గ్రాముల గంజాయి కొనుగోలు చేసి నగరానికి తీసుకువచ్చారు. అందులో కొంత తాము వాడుకుని మిగిలిన 370 గ్రాముల గంజాయిని విక్రయిస్తుండగా సమాచారం అందుకున్న మేడ్చల్ పోలీసులు దాడి చేసి జగదీశ్‌సాహూ, నూనావత్‌రాజ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి గంజాయి, సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న జగదీష్ బెహ్రాను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

లారీ ఢీకొని తమ్ముడు మృతి

అక్కకు తీవ్రగాయాలు

మేడ్చల్‌రూరల్: బైక్‌పై వెళుతున్న అక్క,తమ్ముళ్లను లారీ ఢీకొన్న ఘటనలో తమ్ముడు మృతి చెందగా, అక్క తీవ్రంగా గాయపడిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన మీసాల చిన్నయ్య కుటుంబం మేడ్చల్ పట్టణంలోని పాత గ్రామ పంచాయతీ సమీపంలో నివాసం ఉంటూ కూలీలుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం ఉదయం చిన్నయ్య కుమారుడు దుర్గాప్రసాద్, కుమార్తె నాగలక్ష్మి బైక్‌పై గుండ్లపోచంపల్లికి వెళుతుండగా పట్టణంలోని సీజన్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను వెనుక నుంచిలారీ ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన దుర్గాప్రసాద్, నాగలక్ష్మిలను స్థానికులు శ్రీకర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ దుర్గాప్రసాద్ మృతి చెందాడు. నాగలక్ష్మి చికిత్స పొందుతోంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.52 లక్షలు కాజేసిన

మనూ ఉద్యోగిపై కేసు నమోదు

గచ్చిబౌలి: అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి రూ.52 లక్షల నిధులు కాజేసిన మనూ ఉద్యోగిపై కేసు నమోదు చేసిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జాకీర్ హుస్సేన్ అనే వ్యక్తి సంవత్సరం క్రితం కాంట్రాక్ట్ ఉద్యోగిగా మనూ(మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ)లో చేరాడు. బడ్జెట్ విభాగంలో పని చేస్తున్న అతను అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి రూ.52 లక్షల నిధులు తన ఖాతాలో జమ చేసుకున్నాడు. ఇటీవల జరిపిన ఆడిట్‌లో నిధుల గోల్‌మాల్‌ను గుర్తించిన అధికారులు అతడిని విధుల నుంచి తొలగించారు. అధికారుల ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడు.

ముళ్లపొదల్లో మాతృత్వం!

- ఆడ బిడ్డకు జన్మనిచ్చి పొదల్లో పడేసిన తల్లి
- గౌడవెల్లిలో ఘటన





ముళ్ల పొదల్లో శిశువు



తల్లి ఒడిలో పసికందు

మేడ్చల్: ఆడ శిశువు జన్మించగానే పొదల్లో పడేసిన ఓ తల్లి ఏమీ తెలియనట్లుగా భర్తతో కలిసి ఇంటికి వెళ్లిన వైనం మండల పరిధిలోని గౌడవెల్లి గ్రామంలో సోమవారం వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, బీజాపూర్‌కు తులసి, సంతోష్ దంపతులు ఆరేళ్లుగా గౌడవెల్లి పరిధిలోని స్టార్ పౌల్ట్రీ ఫాంలో పని చేస్తున్నారు. వారికి ఓ కుమారుడు ఉన్నాడు. మళ్లీ గర్భం దాల్చిన తులసికి నెలలు నిండడంతో వైద్య పరీక్షల నిమిత్తం సోమవారం భర్త సంతోష్‌తో కలిసి మేడ్చల్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చింది. తిరిగి వెళ్లే క్రమంలో గౌడవెల్లి వరకు ఆటోలో వెళ్లిన వారు రైల్వే బ్రిడ్జి నిర్మాణంలో ఉండటంతో అక్కడి నుంచి నడిచి వెళుతుండగా తులసికి ఒక్కసారిగా పురిటి నొప్పులు రావడంతో ఆమె ట్రాక్ పక్కనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. నిర్మానుష్య ప్రాంతం కావడంతో ఆమెను భర్త సంతోష్ తప్ప ఎవరూ చూడలేదు. ప్రసవం కాగానే శిశువును పక్కనే ఉన్న పొదల్లో పారవేసిన దంపతులు పౌల్ట్రీ ఫామ్‌కు వెళ్లిపోయారు. అదే సమయంలో అటు వైపు వచ్చిన ఆటో డ్రైవర్ శిశువు రోదనలు విని గ్రామ కార్యదర్శి మహిపాల్‌రెడ్డికి విషయాన్ని తెలియజేశాడు. ఆయన గౌడవెల్లి ఆరోగ్య ఉప కేంద్రం ఆశా వర్కర్‌కు సమాచారం అందించడంతో వారు పొదల్లో ఉన్న శిశువును చేరదీసి ఉప కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్సల అనంతరం చిన్నారిని మేడ్చల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గ్రామ కార్యదర్శి సమాచారంతో గౌడవెల్లికి చేరుకున్న పోలీసులు రైల్వే ట్రాక్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న శిశువు తండ్రి సంతోష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పౌల్ట్రీ ఫాంలో ఉన్న తల్లి తులసిని అదుపులోకి తీసుకుని మేడ్చల్ ఆసుపత్రికి తరలించారు. శిశువును తల్లికి అప్పగించి, తండ్రిని పీఎస్‌కు తీసుకెళ్లారు. ఐసీడీఎస్ అధికారులు ఆస్పత్రిలో వారికి కౌన్సెలింగ్ నిర్వహించగా శిశువు చనిపోయిందనుకుని పొదల్లో పడేశానని తల్లి తులసి చెబుతున్నా నమ్మశక్యంగా లేకపోవడంతో ఆమె కోలుకున్నాక కౌన్సెలింగ్ ఇస్తామని అధికారులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



గిరీష్‌కుమార్ (ఫైల్)

మణికొండ: అపార్ట్‌మెంట్‌లో ఒంటరిగా ఉంటున్న యువకుడు ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాంనగర్‌కు చెందిన కె. గిరీష్‌కుమార్ యాదవ్(34) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న అతను ఇద్దరు స్నేహితులతో కలిసి అలకాపూర్ టౌన్‌షిప్ ఎస్ఎండీ గ్రాండీయర్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. సోమవారం తెల్లవారు జామున అతను బెడ్‌రూంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడటంతో స్నేహితులు అదే టౌన్‌షిప్‌లో ఉంటున్న మృతుని సోదరి రామ్యాంకకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఆమె అతని స్నేహితులపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా గిరీష్ ఓ యువతిని ప్రేమిస్తున్నాడని సదరు యువతి ఇతరులతో చనువుగా ఉండటాన్ని భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుని స్నేహితులు తెలిపారు. పోలీసులు మృతుడి స్నేహితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

చీటీ డబ్బులు ఇవ్వకుండా మోసం

శ్రీనిలయ చిట్‌ఫండ్‌పై కేసు నమోదు

సాక్షి,సిటీబ్యూరో: చిట్ డబ్బులు ఇవ్వకుండా ఒక చిట్‌ఫండ్ కంపెనీ మోసానికి పాల్పడిందంటూ రిటైర్డు ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. బోడుప్పల్‌కు చెందిన సత్యనారాయణ రిటైర్డ్ ఉద్యోగి. అతను లక్డీకపూల్‌లోని శ్రీనిలయ చిట్‌ఫండ్‌లో తన స్నేహితుల ద్వారా 40 నెలల కాల పరిమితితో రూ. 20 లక్షల చీటీ వేశాడు. ఈ ఏడాది జనవరిలో దానిని పాడడంతో రూ. 17.2 లక్షలు వచ్చాయి. ఆ డబ్బును చిట్‌ఫండ్ మేనేజింగ్ డైరెక్టర్ బసవ శంకర్ రావు అడప, డైరెక్టర్లు రమేష్ అడప బాబు, రమాదేవి అడప, గీతా రమేష్ అడపలు నిర్ణీత సమయంలో ఇవ్వ లేదు. దీంతో సంస్థ ఎండీని నిలదీయగా తమకు కూడా రూ. 12 కోట్ల వరకు కస్టమర్ల ద్వారా రావాల్సి ఉందని, అవి వచ్చిన తర్వాత ఇస్తామని చెప్పారు. యాజమాన్యం 40 మంది వరకు చీటి డబ్బులను ఇవ్వాల్సి ఉందన్నారు. ఇప్పటికే మూడు శాఖలను మూసేసిన సంస్థ యజమాన్యం ప్రధాన కార్యాలయాన్ని కూడా మూసేస్తుందంటూ బాధితుడు సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

శరవేగంగా విద్యుత్ పునరుద్ధరణ పనులు

- నేల కూలిన 412 విద్యుత్ స్తంభాలు
- దెబ్బతిన్న 13 డీటీఆర్‌లు..
- సీఎండీ ముషారఫ్ ఫరూఖీ వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: ఏకధాటి వర్షాలకు గ్రేటర్ పరిధిలో 412 విద్యుత్ స్తంభాలు నేలకూలినట్లు డిస్కం ప్రకటించింది. చెట్ల కొమ్మలు విరిగి లైన్లపై పడటంతో ఈ విద్యుత్ స్తంభాలతో పాటు 13 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల స్ట్రక్చర్స్ ధ్వంసమైనట్లు పేర్కొంది. అనేక చోట్ల ఫీడర్లు ట్రిప్ కావడంతో సరఫరాలో అంతరాయం ఏర్పడింది. క్షేత్రస్థాయిలోని ఇంజినీర్లు వెంటనే అప్రమత్తమై..మెజార్టీ ప్రాంతాల్లో అర గంట వ్యవధిలోనే సరఫరాను పునరుద్ధరించారు. కొన్ని చోట్ల రెండు గంటల వరకు పట్టింది. జోరున కురుస్తున్న వర్షాన్ని, వరదలను సైతం లెక్క చేయకుండా సిబ్బంది విధినిర్వహణలో మునిగి పోయారు. దెబ్బతిన్న పోల్స్, డీటీఆర్‌ల స్థానంలో కొత్తవి అమర్చినట్లు డిస్కం సీఎండీ ముషారఫ్ ఫారూఖీ తెలిపారు. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో హెడ్‌క్వార్టర్స్‌ను వదిలి ఎవరూ వెళ్లకూడదని క్షేత్రస్థాయి ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేశారు. పునరుద్ధరణ పనులు చేసేటప్పుడు సిబ్బంది తప్పనిసరిగా స్వీయ జాగ్రత్తలు పాటించాలన్నారు. క్షేత్ర స్థాయిలో తగినంత మ్యాన్‌పవర్‌తో పాటు మెటీరియల్ అందుబాటులో ఉందని తెలిపారు. ఈ విపత్కర పరిస్థితులలో ఎవరైనా నిర్లక్ష్యం వహించినట్లు తమ దృష్టికి వస్తే, వారిపట్ల కఠినంగా వ్యవహరించడానికి వెనుకాడబోమని హెచ్చరించారు.

ఘరానా మోసగాడి అరెస్టు

రూ.84 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం

మణికొండ: నగల షాపుల యజమానులను మోసం చేసి బంగారు ఆభరణాలతో ఉడాయిస్తున్న ఘరానా మోసగాడిని మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ మహంతి ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. గండిపేటకు చెందిన గుంటి సుమన్ తన మిత్రులు అజయ్‌కుమార్ సోనీ, రఘుతో కలిసి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. అయితే వ్యాపారం లాభసాటిగా లేకపోవడంతో సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో పథకం వేశాడు. ఇందులో భాగంగా నగలు కొనుగోలు చేస్తానని నగల షాప్‌లకు ఫోన్ చేసి విలువైన నగలను ఇంటికి తీసుకుని రమ్మని చెప్పేవాడు. వారి నుంచి నగలు కొనుగోలు చేసి చెల్లని చెక్కులు ఇచ్చేవాడు. ఆ తర్వాత వారికి కనిపించకుండా తిరుగుతున్నాడు. ఇదే తరహాలో రమాదేవి అనే మహిళను తనకు రూ.2కోట్లు ఇస్తే షార్ట్ ఫిల్మ్‌లలో పెట్టుబడి పెట్టి రెట్టింపు మొత్తాన్ని తిరిగి ఇస్తానని నమ్మించి మోసం చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన రాజేంద్రనగర్ ఎస్ఓటీ, నార్సింగి పోలీసులు వలపన్ని సోమవారం అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.84 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. అతనిపై నార్సింగి, బంజారాహిల్స్, రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లలో నాలుగు కేసులు ఉన్నాయి. నిందితుడిపై గతంలో హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్‌ల పరిధిలో 9 కేసులు ఉన్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

పుట్టిన రోజు వేడుకల్లో అపశృతి

- స్విమ్మింగ్ పూల్‌లో పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అనుమానాస్పద మృతి
- స్నేహితులే తోశారని కుటుంబసభ్యుల ఆరోపణ



అజయ్ తేజ మృతదేహం

ఘట్‌కేసర్: పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అనుమానాస్పద స్థితిలో స్విమ్మింగ్ పూల్‌లో పడి మృతి చెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మాదాపూర్‌లోని ఏష్ టెక్నాలజీలో పని చేసే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌లు సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్ పుట్టిన రోజు నేపథ్యంలో ఆదివారం సాయంత్రం 20 మంది ఘనాపూర్‌లోని వెంకటేశ్‌కు చెందిన ఫామ్ హౌస్‌కు వచ్చారు. పార్టీ కొనసాగుతుండగా అర్ధరాత్రి తర్వాత రంజిత్‌రెడ్డి, సాయికుమార్ అలియాస్ సాయి నిఖిల్ అనే యువకులు అజయ్ తేజ(24)ను స్విమ్మింగ్ పూల్‌లో తోశారు. అయితే అతడికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీనిని గుర్తించిన తోటి స్నేహితులు అతడిని బయటికి తీసి జోడిమెట్లలోని సూర్య ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అందరినీ అదుపులోకి తీసుకున్నారు. మృతుడి మేనమామ కిశోర్ ఫిర్యాదు మేరకు మేనేజర్ శ్రీకాంత్, ఐటీ ఉద్యోగులు రంజిత్‌రెడ్డి, సాయికుమార్, ఫామ్ హౌస్ యజమాని వెంకటేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీఆర్ఎంపీ పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి

సాక్షి,సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో ప్రయాణం సజావుగా సాగేందుకు కాంప్రహెన్సివ్ రోడ్ మెయింటనెన్స్ ప్రోగ్రామ్(సీఆర్ఎంపీ) పథకంలో భాగంగా చేపట్టి పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ ఇంజనీరింగ్ అధికారులు, ఏజెన్సీలను ఆదేశించారు.సోమవారం సాయంత్రం మాసబ్ ట్యాంక్ లోని టీయూఎఫ్ఐడీసీ కార్యాలయంలో జీహెచ్ఎంసీ కమిషనర్ కాట ఆమ్రపాలి, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్, సంబంధిత ఇంజనీర్లు, ఏజెన్సీ ప్రతినిధులతో సీఆర్ఎంపీ, ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారి పనులతో పాటు సెంట్రల్ మీడియన్, లేన్ మార్కింగ్, కెర్బ్ పెయింటింగ్‌లు, సైన్‌బోర్డుల ఏర్పాటు, గుంతల పూడ్చివేత పనులను చేపట్టాలన్నారు. రోడ్ల పైన రాళ్ల లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.నాలాల అభివృద్ధికి చేపట్టిన ఎస్ఎన్‌డీపీ పథకంలో పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సిగ్నల్ ఫ్రీ సిటీలో భాగంగా ఎస్ఆర్‌డీపీ కింద చేపట్టిన పనుల్లో పూర్తి కాగా మిగిలిన పెండింగ్ పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు సర్కిల్‌ల పరిధిలో పర్యవేక్షక , కార్యనిర్వాహక, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్‌లు, ఏజెన్సీ ప్రతినిధులు ఉదయం పూట క్షేత్ర స్థాయిలో పర్యటించాలన్నారు. క్షేత్ర స్థాయి పురోగతి తో కూడిన ఫోటోలను వాట్సాప్ గ్రూప్ లో షేర్ చేయాలన్నారు. పనులు చేపట్టక ముందు, పూర్తి అయిన తర్వాత ఫోటోలు, ప్రజల ఫీడ్ బ్యాక్ తో స్లైడ్ లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకూ పూర్తి అయిన పనులకు సంబంధించి ఏజెన్సీ లు ఆడిట్ రిపోర్ట్ అందజేయాలన్నారు. థర్డ్ పార్టీ ఏజెన్సీ లతో కూడా అడిట్ చేయించాలన్నారు. ఈ నెలాఖరులోగా పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. పనులు పూర్తి అయ్యాకే మిగిలిన డబ్బులు చెల్లించాలని చెప్పారు.రోడ్డు నిర్వహణ బాధ్యతలు ముగిశాక సదరు ఏజెన్సీలు జీహెచ్ఎంసీకి అప్పగించే క్రమంలో అన్ని అంశాలలో రోడ్డు కండిషన్ పర్ఫెక్ట్‌గా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు.

తెగిపడ్డ కరెంటు వైర్లు.. విరిగిన విద్యుత్ స్తంభాలు



జర్నలిస్టు కాలనీలో మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

బంజారాహిల్స్: గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి గాలి దుమారం, కుండపోత వర్షం విద్యుత్ శాఖపై తీవ్ర ప్రభావం చూపింది. ముఖ్యంగా ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజక వర్గాల పరిధిలో శనివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పూర్తిగా రోడ్లకే పరిమితం అయి కరెంటు పునరుద్ధరణలో తలామునకలయ్యారు. పలుచోట్ల కరెంటు వైర్లు తెగిపడగా, మరికొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి తీవ్ర ఇబ్బందులు తలెత్తగా వాటిని పునరుద్ధరించడంలో గంటలపాటు శ్రమించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు టీఎస్ఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ డీఈ పరిధిలో 18 చోట్ల కరెంటు వైర్లు తెగిపడటం, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం, స్తంభాలు విరిగిపడటం జరిగింది. డీఈ నరేందర్‌రెడ్డి, బంజారాహిల్స్ ఏడీఈ హైమానంద, తదితరులతో పాటు ఐదారుగురు ఏడీఈలు, తొమ్మిది మంది ఏఈలు , వందమంది విద్యుత్ సిబ్బంది క్షేత్ర స్థాయిలో సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించి 12 నుంచి 15 గంటల పాటు శ్రమించి కరెంటును పునరుద్ధరించారు. సోమవారం కూడా లోటస్‌పాండ్, జర్నలిస్టు కాలనీ, అమీర్‌పేట్ తదితర మూడు ప్రాంతాల్లో చెట్లు కూలి కరెంటు వైర్ల మీద తెగిపడ్డాయి. ఆదివారం 18 ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిచిపోయింది. మొత్తం 19 కరెంటు స్తంభాలు విరిగిపడ్డాయి. ఈ ప్రాంతాల్లో కొత్తవి ఏర్పాటు చేశారు. మూడు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. 43 చోట్ల కేబుళ్లకు మరమ్మతులు చేపట్టారు. 22 సబ్‌స్టేషన్ల పరిధిలో 190 పదకొండు కేవీలైన్లు ఉండగా 6500 ట్రాన్స్‌ఫార్మర్లు పని చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇంకో 24 గంటలు పని చేయడం ద్వారా పూర్తిగా కరెంటు సరఫరాను పునరుద్ధరించడమే కాకుండా శాశ్వత ప్రాతిపదికన ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంటు స్తంభాలు ఏర్పాటు చేస్తామన్నారు.

- పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం
- గంటలపాటు శ్రమించి విద్యుత్ పునరుద్ధరణ
- 48 గంటలుగా క్షేత్ర స్థాయిలోనే అధికారులు
- ఎస్ఈ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- ఎడతెరిపిలేని వర్షంతో పనుల్లో జాప్యం



క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్న డీఈ నరేందర్‌రెడ్డి తదితరులు

కంట్రోల్ రూమ్ నెం. 9491633294
నరేందర్‌రెడ్డి డీఈ, బంజారాహిల్స్

గడిచిన మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చాలా చోట్ల చెట్లు విరిగిపడి,, కొమ్మలు తెగిపడటంతో కరెంటు స్తంభాల వైర్లు తెగిపడ్డాయి. దీంతో కరెంటు సరఫరాలో తీవ్ర జాప్యం ఏర్పడింది. మొత్తం వంద మంది విద్యుత్ సిబ్బందితో పాటు 20 మంది ప్రైవేట్ కాంట్రాక్ట్ సిబ్బందితో పునరుద్ధరణ పనులను చేపట్టాం. 80శాతం కరెంటు సరఫరా పునరుద్ధరించాం. లోపాలు తలెత్తిన చోట్ల తాత్కాలిక ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. కరెంటు సమస్యలున్న వారు కళ్యాణ్‌నగర్ ఎస్ఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 9491633294కు సమాచారం ఇవ్వవచ్చు.

జలమండలికి 432 ఫిర్యాదులు



నీటి సరఫరాను పరిశీలిస్తున్న జీఎం హరిశంకర్

బంజారాహిల్స్: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, చాలాచోట్ల మ్యాన్‌హోళ్లు, డ్రైనేజీలలో వ్యర్థాలు ఇరుక్కపోయి వరదనీరు పొంగి రోడ్లపై పారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షాలపై జలమండలి డివిజన్6 జీఎం హరిశంకర్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, రహ్మత్‌నగర్, ఎర్రగడ్డ, యూసుఫ్‌గూడ, వెంగళ్‌రావునగర్, బోరబండ, సనత్‌నగర్, అమీర్‌పేట ప్రాంతాల్లో సెక్షన్ మేనేజర్లతో పాటు సీవరేజీ, మంచినీటి లైన్‌మెన్లు అప్రమత్తం అయ్యారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధి నుంచి వివిధ సమస్యల పరిష్కారానికి జలమండలికి 432 ఫిర్యాదులు అందాయి. ఇందులో 320 ఫిర్యాదులను పరిష్కరించినట్లు జీఎం తెలిపారు. డ్రైనేజీకి సంబంధించి 197 ఫిర్యాదులు అందాయన్నారు. ఆరు చోట్ల మంచినీటి నల్లాల్లో కలుషిత జలాలు వస్తున్నట్లుగా ఫిర్యాదులు అందడంతో వెంటనే వాటిని పరిష్కరించామన్నారు. మంగళవారం సాయంత్రానికి వందశాతం ఫిర్యాదులు పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

13 చోట్ల వాటర్ లాగింగ్ పాయింట్లు : డీసీ ప్రశాంతి



కేబీఆర్ పార్కు వద్ద వాటర్‌లాగింగ్ పాయింట్లు పరిశీలిస్తున్న డీసీ ప్రశాంతి

బంజారాహిల్స్: గత కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పలుచోట్ల వరద నీరు నిలిచిపోయి ప్రజారవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, షేక్‌పేట, వెంకటేశ్వరకాలనీ డివిజన్ల పరిధిలో డీసీ ప్రశాంతితో పాటు ఇంజినీర్లు, శానిటేషన్ అధికారులు, ఎంటమాలజీ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించారు. సోమవారం వాటర్‌లాగింగ్ పాయింట్లను పరిశీలించిన అనంతరం డీసీ ప్రశాంతి మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో 13 చోట్ల వాటర్ లాగింగ్ పాయింట్లు ఉన్నాయని ఇందులో అయిదింటిని పూర్తిగా నిర్మూలించడం జరిగిందన్నారు. ఇంకో ఎనిమిది ప్రాంతాల్లో నీరు నిల్వకుండా ఎప్పటికప్పుడు మ్యాన్‌హోళ్లలోకి తరలించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది పూర్తిగా రోడ్లకే పరిమితం కావడం జరిగిందన్నారు. అధికారులందరూ లోతట్టు ప్రాంతాల్లో, నాలాల వద్ద పర్యటించి పరిస్థితిని సమీక్షిస్తున్నామన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో తహసీల్దార్ పర్యటన



ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దార్ అనితారెడ్డి

బంజారాహిల్స్: భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు నీట మునగగా నాలాలు పొంగిపొర్లుతూ వరద, మురుగు ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రహదారుల్లో తిష్టవేసి ప్ర జలకు తీవ్ర అసౌకర్యాన్ని కల్గించాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి వారి సమస్యలను తెలుసు కునేందుకు షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి ఆధ్వర్యంలో మండల అధికారులు సోమవారం వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. బస్తీలతో పాటు నాలాల పక్కన ప్రజలను అప్రమత్తం చేశారు. ఫిలింనగర్‌లోని ఎంజీనగర్‌లో బండి విజయలక్ష్మి, బండి వాసుదేవుల ఇల్లు పాక్షికంగా ధ్వంసం కాగా వారిని సమీపంలోని పాఠశాలకు తరలించారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని ఆమె సూచించారు. ఇప్పటి వరకు ఎలాంటి నష్టం జరగలేదన్నారు. కంట్రోల్ రూమ్‌లో అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.

మట్టి గణపతులనే పూజిద్దాం - ఉప్పల శ్రీనివాస్‌గుప్తా



పాటను ఆవిష్కరిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తదితరులు

ఖైరతాబాద్: మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని రక్షించాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా కోరారు. సోమవారం ఖైరతాబాద్ మహాగణపతి ప్రాంగణంలో ప్రముఖ రచయిత, మట్టి గణేష్ షార్ట్ ఫిల్మ్ డైరెక్టర్ దాచేపల్లి దేవేందర్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన దాచేపల్లి రచనలు, సాంగ్ రిలీజ్ కార్యక్రమానికి శ్రీనివాస్‌గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని, ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మట్టి వినాయక విగ్రహాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, దైవాజ్ఞ శర్మ, మహేష్ యాదవ్, రాజ్‌కుమార్, బిల్డర్ రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దయానంద్ మల్లికార్జున్, భాస్కర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం

వెంగళరావునగర్: తల్లితో గొడవపడి తరువాత ఇంటి నుంచి వెళ్లిన కుమార్తె అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌లో నివాసం ఉండే మహిళ ప్రైవేట్ సంస్థలో విధులు నిర్వహిస్తుంది. ఈనెల 31వ తేదీ రాత్రి కొంత మంది బంధువులు ఆమెకు ఫోన్ చేసి తన కుమార్తె వేరే అబ్బాయితో కలిసి ఉన్న ఫొటోలను ఇన్‌స్టాగ్రాంలో చూశామని తెలిపారు. హైటెక్‌సిటీలో ఆఫీస్ బాయ్‌గా విధులు నిర్వహించే బబ్లూ అనే యువకుడు ఈ ఫొటోలను ఇన్‌స్టాగ్రాంలో పోస్ట్ చేశాడని తెలుసుకుంది. ఆమె ఇంటికి వచ్చి తన కుమార్తెతో ఈ విషయం గురించి అడిగింది. ఈ క్రమంలో ఇరువురి మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. అనంతరం ఆమె కుమార్తె ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసును దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..



సరస్వతి

ఖైరతాబాద్: ఇంటి బయటకు వెళ్లిన మహిళ కనిపించకుండాపోయిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం... ఖైరతాబాద్ ఇందిరానగర్‌లో నివాసముండే సరస్వతి (50) సోమాజిగూడ యశోద హాస్పిటల్‌లో అసిస్టెంట్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తోంది. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో ఆమె భర్త ప్రభాకర్ రావు బంధువుల ఇళ్లల్లో, చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ర్యాష్‌గా డ్రైవింగ్ చేసి.. మరో కారును ఢీకొట్టి..

ఒకరికి స్వల్ప గాయాలు

వెంగళరావునగర్: ర్యాష్‌గా డ్రైవింగ్ చేస్తూ మరో కారును ఢీకొట్టిన సంఘటన మధురానగర్ పీఎస్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పిడుగురాళ్ళకు చెందిన ఎం.గోపీ ఎర్రగడ్డలో ఉంటూ కారు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. సోమవారం తన యజమాని నరేందర్‌కుమార్‌ను ఎక్కించుకుని కారులో పెట్రోలు పోయించుకోవడానికి మైత్రీవనం వద్ద యుటర్న్ చేస్తున్నాడు. ఈ సమయంలో వెనుకనుంచి వేగంగా వచ్చిన మరో కారు గోపీ కారును బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో అతనికి స్వల్ప గాయాలు కాగా, కారు ముందు, వెనుకభాగాలు దెబ్బతిన్నాయి. నిర్లక్ష్యంగా కారు నడిపిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ గోపీ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ కీలక ఘట్టం

జలమండలిలో 13 మంది ఉద్యోగులు పదవీ విరమణ



పదవీ విరమణ చేసిన ఉద్యోగిని సన్మానిస్తున్న అధికారులు

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ అనేది కీలకమైన ఘట్టమని ఎండీ అశోక్ రెడ్డి అన్నారు. జలమండలి పరిధిలో పనిచేస్తున్న ముగ్గురు జనరల్ మేనేజర్లు సహా.. 10 మంది ఉద్యోగులకు పదవీ విరమణ సందర్భంగా ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమానికి ఎండీ అశోక్ రెడ్డి హాజరై ప్రసంగించారు జలమండలి లాంటి అత్యవసర సేవల విభాగంలో పనిచేసిన వారికి కుటుంబ సభ్యులతో సమయం గడిపే అవకాశం చాలా తక్కువగా ఉంటుందన్నారు. ఉద్యోగ రీత్యా కుటుంబ సభ్యులతో గడపలేని వాళ్లు.. రిటైర్మెంట్ తర్వాత ఆ లోటును పూడ్చుకోవచ్చన్నారు. జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ మాట్లాడుతూ జలమండలిలో సుదీర్ఘంగా సేవలు అందించి పదవీ విరమణ పొందిన అందరికీ భవిష్యత్తులో మరింత సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం పదవీ విరమణ పొందిన వారిని అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, జీఎం సరస్వతి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు

వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్

బంజారాహిల్స్: వినాయక చవితి ఉత్సవాలను నిర్వాహకులు, ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్ కుమార్ సూచించారు. సోమవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 11లోని లేక్‌వ్యూ బంజారా ఫంక్షన్‌హాల్‌లో వెస్ట్‌జోన్ పరిధిలోని పోలీసు అధికారులు, జీహెచ్ఎంసీ, జలమండలి, శానిటేషన్, ఫైర్, నీటిపారుదల శాఖతో పాటు పలు విభాగాల అధికారులు, మండప నిర్వాహకులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ మండప నిర్వాహకులు నిబంధనలకు లోబడి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని, డీజే, లౌడ్ స్పీకర్లకు అనుమతి లేదని సూచించారు. ఇప్పటి వరకు వెస్ట్‌జోన్‌లో మండపాల ఏర్పాటుకు వెయ్యికిపైగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. చాలా సంవత్సరాల తర్వాత గ్రూప్–1 పరీక్షకు నోటిఫికేషన్ వచ్చిన నేపథ్యంలో జిల్లాల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు చదువుకోవడానికి నగరానికి వచ్చారని వారికి కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా ప్రశాంతంగా నిమజ్జనం రోజున వాహనాలను ముందుకు తీసుకెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులున్నారని అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తారని అన్నారు. ఇప్పటికే తాము పలుమార్లు వివిధ శాఖల అధికారులతో సైతం సమావేశాలు నిర్వహించామన్నారు. మండపాల వద్ద కూడా నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, డీసీలు ప్రశాంతి, రజినీకాంత్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్, ఏసీపీలు వెంకట్‌రెడ్డి, మోహన్‌కుమార్, సీఐలు వెంకటేశ్వర్‌రెడ్డి,, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



లక్డీకాపూల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని పలువురు వక్తలు పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో రక్తం దొరక్క ఎవరూ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. సోమవారం నిమ్స్‌లో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిమ్స్ బ్లడ్ బ్యాంక్ హెచ్ఓడి డాక్టర్ శాంతి ప్రారంభించారు. తెలుగు మొమ్స్ నెట్‌వర్క్, జేసీఐ హైదరాబాద్ మైత్రి, సహజ ఫౌండేషన్, ఏక్ కథం ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరం ఈ నెల12వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతి మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగే ఈ శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యంగా నిమ్స్ వైద్య, నర్సింగ్, టెక్నికల్, అడ్మినిస్ట్రేషన్ సిబ్బందితో పాటు ఇతర శాఖల ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నాలని విజ్ఞప్తి చేశారు. సోషల్ సర్వీస్ సంస్థల అధ్యక్షులు ప్రదీప్తి, శైలజ, అమిత్ శర్మ, బ్రింద, దిలీప్, కోఆర్డినేటర్ సత్యసుధ, డా సుధీర్, డా. మహేష్ , డా. మురళి, శేఖర్, పీజీ విద్యార్థులు, టెక్నికల్ సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

‘నా భర్త మృతికి ఆసుపత్రి వర్గాలే కారణం’

పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు

వెంగళరావునగర్ : తన భర్త మృతికి ఆసుపత్రి వర్గాలే కారణమంటూ మహిళ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం... శ్రీకృష్ణానగర్‌లో నివసించే ముద్రబోయిన పద్మ కూలీ పని చేసుకుంటుంది. ఈమెకు 2001లో దుర్గయ్యతో వివాహమైంది. వారికి ఇరువురు కుమారులు ఉన్నారు. ఈనెల 1వ తేదీన తన భర్తకు జ్వరం రావడంతో యూసుఫ్‌గూడలోని మాక్స్ ఎయిడ్ ఆసుపత్రికి తీసుకెళ్ళి చికిత్స ఇప్పించింది. అయితే అదే రోజు మధ్యాహ్నానికి తన భర్త మరణించినట్లుగా ఆసుపత్రి వర్గాలు ఆమెకు తెలియజేశాయి. ఇదేమని ప్రశ్నించగా యాజమాన్యం సరైన సమాధానం చెప్పలేదు. దీంతో తన భర్త మృతికి ఆసుపత్రి వర్గాలే కారణమని, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే మృతి చెంది ఉంటాడని మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సిటీ సెంటర్ చౌరస్తాలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే దానం, డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి



నివాళులు అర్పిస్తున్న ఫిలింనగర్ కాంగ్రెస్ నేతలు నాగేష్‌సాగర్ తదితరులు

పనిచేస్తున్న ఇంటికే కన్నం వేసిన డ్రైవర్

ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు



పోలీసుల అదుపులో నిందితులు

ఫిలింనగర్: పనిచేస్తున్న ఇంటికే కన్నం పెట్టాడు ఓ ప్రబుద్ధుడు. యజమాని అమెరికాలో ఉండగా యజమానురాలు విధులకు వెళ్లిన అవకాశాన్ని ఆసరాగా చేసుకుని నగదుతోపాటు బంగారు ఆభరణాలను దోచుకెళ్లగా, ప్రధాన నిందితుడితోపాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే... ఫిలింనగర్ ఫేజ్–2లో నివసించే వ్యాపారి ఇంట్లో గత ఆరు నెలలుగా డ్రైవర్‌గా పనిచేస్తున్న ముద్రబోయిన మురళి (22) జల్సాలకు అలవాటుపడి తన తమ్ముడు ముద్రబోయిన నవీన్ (20), అతడి స్నేహితుడు జుత్రు సాంబశివరావు అలియాస్ స్వామి (24)లను ఊరి నుంచి పిలిపించాడు. ముగ్గురూ కలిసి వ్యాపారి ఇంట్లో ఉన్న నగలన్నీ సర్దుకుని విజయవాడ మీదుగా వైజాగ్‌కు ఉడాయించారు. ఈ దొంగతనానికి వారే పాల్పడినట్లుగా పోలీసులు అనుమానించి వారి ఫోన్ లొకేషన్ దొంగతనం జరిగిన సమయంలో అదే ఇంట్లో ఉన్నట్లుగా నిర్ధారించారు. దీంతో వారిని అరెస్టు చేసి వారి నుంచి వజ్రాభరణాలు, ఖరీదైన వాచ్‌లు, సిల్వర్ పూజా సామగ్రి, డాలర్లు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దొంగలను పట్టుకోవడంలో సాంకేతికతను ఉపయోగించి ప్రతిభ కనబరిచిన ఫిలింనగర్ క్రైమ్ ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ జనార్దన్‌నాయక్‌లను ఫిలింనగర్ డీఐ ఎస్.జయరాం ప్రత్యేకంగా అభినందించారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జననేతకు ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న మహేష్ కుమార్ గౌడ్ తదితరులు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నాయకులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ఆర్ హయాంలో పేద, బడుగు, బలహీన సంక్షేమానికి పెద్దపీట వేసి వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఏ పేద గుండెను తడిమిన వైఎస్ఆర్‌ను యాది చేసుకుంటారని తెలిపారు. – బంజారాహిల్స్



నివాళులర్పిస్తున్న డాక్టర్ రవిశేఖర్‌రెడ్డి



కాటూరి రమేష్ ఆధ్వర్యంలో..

విత్తన గణేశ్ విగ్రహాల పంపిణీ

- ఫ్రీడమ్ ఆయిల్ ఆధ్వర్యంలో కార్యక్రమం
- పది వేల విగ్రహాల పంపిణీకి ఏర్పాట్లు



సాక్షి, సిటీ బ్యూరో: పర్యావరణ అనుకూల వాతావరణంలో గణేశ్ ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ సేల్స్, మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్ర శేఖరరెడ్డి అన్నారు. హైదరాబాద్ కార్యాలయ ప్రాంగణంలో విత్తన గణేశ్ విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ విక్రయదారులు, రిఫైనర్స్, జెమినీ ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ (జీఈఎఫ్ ఇండియా) ఆధ్వర్యంలో పది వేల పర్యావరణ అనుకూల విత్తన గణేశ బాక్స్‌లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వాతావరణంలో మార్పులు, ప్రతికూలతల గురించి ప్రజలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. విత్తన గణేశ్ విగ్రహాల నిమజ్జనం సమయంలో నీటి వనరులపై ఎటువంటి చెడు ప్రభావం చూపదన్నారు. బెంగళూరు, రెయిన్‌బో విస్టా(ఫేజ్ 1, 2), మలేషియా టౌన్‌షిప్, అపర్ణ సరోవర్, ఎన్‌సిసి అర్బన్ మాదాపూర్, స్వాన్‌లేక్ అపార్ట్‌మెంట్ మూసాపేట్, రిడ్జ్ టవర్స్, ఐడిపిఎల్, మైహోమ్ జ్యువెల్, ఇండిస్ వన్ సిటీ కేపీహెచ్‌బీ, శాటిలైట్ టౌన్‌షిప్, కొంపల్లి, సత్యనారాయణ ఎన్‌క్లేవ్, చందానగర్ తదితర ప్రాంతాల్లో వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తామన్నారు. వినాయక విగ్రహాల పంపిణీ వాహనాలను మార్కెటింగ్ డీజీఎం చేతన్ పింపాల్‌ఖుటే జెండా ఊపి ప్రారంభించారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం

– కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సాక్షి, సిటీబ్యూరో: ప్రజావాణి కార్యక్రమంతో సమస్యలను త్వరగా పరిష్కరించనున్నట్లు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 111 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీల్లో గృహ నిర్మాణ శాఖకు 89, పింఛన్లు 9, భూసమస్యలు 6, ఇతర సమస్యలపై 7 వచ్చాయని అదనపు కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరవన్, వెంకటాచారి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పూల ధరలు.. ఢమాల్



సాక్షి, సిటీబ్యూరో: శ్రావణమాసంలో పూలు కనిపిస్తే చాలు హాట్ కేకుల్లా అమ్ముడుపోయేవి. గులాబీ, చామంతి, బంతి ఇతర రకాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండేది. కిలో రూ.350కి అమ్ముడుపోయేవి. సరిగ్గా శ్రావణం పోయింది.. పూల ధరలు ఢమాల్ అన్నాయి. నగరానికి ప్రధాన సరఫరాదారుగా ఉన్న గుడిమల్కాపూర్ మార్కెట్‌లో పూలు అడిగేవారు లేరని రైతులు, వ్యాపారులు వాపోతున్నారు. దీంతో తెచ్చిన పూలను పారబోసి తిరుగుముఖం పడుతున్నారు. ధరల మాట దేవుడెరుగు, తెచ్చినందుకు ఖర్చుల మందం వచ్చినా సరిపోతుందని రైతులు ఆలోచిస్తే, కొనుగోలు చేసిన పూలు, లాభం లేకపోయినా నష్టం లేకుండాపోతే సరిపోవని వ్యాపారులు పేర్కొంటున్నారు. వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమయ్యే వరకు మరో వారం రోజుల పాటు పూల ధరలు ఇలాగే ఉంటాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. చవితి పూజలు ప్రారంభమైతే మళ్లీ పూల ధరలకు మంచి రోజులు వస్తాయని అంచనా వేస్తున్నారు.

కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

– బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్



సాక్షి, సిటీబ్యూరో: సమగ్ర కులగణన పూర్తయిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు వినతి పత్రం అందజేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. 60 శాతం ఉన్న బీసీలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, రంగాల్లో అన్యాయమే జరుగుతుందని, జనాభా దామాషా ప్రకారం బీసీలకు న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టరేట్ల ముట్టడిలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. బీసీ విద్యార్థి సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఇంద్రం రజక, ప్రధాన కార్యదర్శి గౌతం ప్రజాపతి, సెక్రెటరీ పూస శివతేజ, అర్జున్, జాయింట్ సెక్రెటరీ సురేష్ ప్రజాపతి, మహేష్ రజక, మనోజ్ యాదవ్, బీసీ విద్యార్థి యువజన నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

నల్లకుంట: ఓయూ దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ(డీడీఎంఎస్) లిటరసీ హౌజ్‌లో వృత్తి నైపుణ్య సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. టైలరింగ్, జ్యూట్ బ్యాగ్ మేకింగ్, పేపర్ బ్యాగ్స్ మేకింగ్, హెర్బల్ ప్రొడక్ట్స్ తయారీ, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందని డీడీఎంఎస్ లిటరసీ హౌజ్ కార్యదర్శి డాక్టర్ బి.నాగలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కిల్ ఇండియాలో భాగంగా ఈ ఉచిత కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికేట్లు అందజేస్తామని, అలాగే మహిళలు స్వయంగా తయారు చేసిన వస్తువులను విక్రయించేందుకు అవసరమైన ఔట్‌లెట్స్ ఏర్పాటుకు సలహాలు, సూచనలు ఇస్తామన్నారు. ఈ నెల 12న దరఖాస్తులకు చివరి తేదీ అని తెలిపారు. వివరాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఫోన్: 99512 10441/97010 98541 నంబర్లలో సంప్రదించవచ్చు.

మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళి




- దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా సాక్షి ప్రధాన కార్యాలయంలో నివాళులర్పిస్తున్న సాక్షి డైరెక్టర్లు ఏఎల్ఎన్ రెడ్డి, వైఈపీ రెడ్డి, కేఆర్‌పీ రెడ్డి, బిమల్(ప్రెసిడెంట్ స్టోర్స్ అండ్ పర్చేజ్), ఎడిటోరియల్ డైరెక్టర్ మురళి, టీవీ మేనేజింగ్ ఎడిటర్ యాదగిరిరెడ్డి, జీఎం(ఐటీ) భాస్కర్‌రెడ్డి, సీనియర్ పాత్రికేయులు కొమ్మినేని శ్రీనివాస్‌రావు తదితరులు.



- బంజారాహిల్స్ రోడ్ నంబర్–1లోని సాక్షి టవర్స్ మెయిన్ గేటు వద్ద విజయ దుర్గ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సాక్షి డైరెక్టర్లు.

నిర్మాణం పూర్తి.. ప్రారంభానికి సుస్తీ..

- నిలోఫర్‌లో రోగి సహాయకుల అవస్థలు వర్ణనాతీతం
- అటెండర్స్ బ్లాక్ నిర్మించినా నిరుపయోగమే..
- మూడేళ్లయినా ప్రారంభానికి నోచుకోని వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



నిరుపయోగంగా అటెండర్స్ భవన సముదాయం

నాంపల్లి: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రముఖ చిన్న పిల్లల ఆస్పత్రి నిలోఫర్‌కి వచ్చే రోగి సహాయకుల బాధలు అధికమయ్యాయి. ఆస్పత్రిలో వీరు తల దాచుకోవడానికి కాసింత చోటు లేని పరిస్థితి నెలకొంది. వేసవి కాలంలో ఆరు బయటే నిద్రించిన ఈ రోగి సహాయకులు వర్షాకాలం, శీతాకాలంలో అవస్థలు పడుతుంటారు. నిలోఫర్ ఆస్పత్రికి అందరూ నిరుపేద రోగులే వస్తుంటారు. ఇక్కడ 1300 పడకలు ఉన్నాయి. వర్షాల కారణంగా విజృంభిస్తున్న విష జ్వరాలతో జ్వరపీడితుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. వీరికి తోడు ప్రమాదాల్లో గాయపడిన చిన్నారులు, కుక్క కాటు బాధితులు, ఇతరత్రా శస్త్ర చికిత్సల కోసం వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఇక్కడకు సుదూర ప్రాంతాలైన జిల్లాల నుంచే కాకుండా అంతర్రాష్ట్ర జిల్లాలకు చెందిన రోగులు వస్తున్నారు. వీరికి తోడుగా రోగి సహాయకులు వెంట వస్తారు. ఇక్కడకు వచ్చే కేసులన్నీ అత్యవసరమే ఉంటాయి. వచ్చిన రోగులందరినీ ఆస్పత్రిలో చేర్చుకుంటారు. బెడ్ల కొరత కారణంగా రోగి సహాయకులు రోగి వెంట ఉండే అవకాశం లేకుండా పోయింది. దీంతో సహాయకులంతా ఆస్పత్రి బయటే ఉండాల్సిన దుస్థితి. రోగి డిశ్చార్జి అయ్యే వరకు సహాయకులు స్నానాలు కూడా చేయకుండా ఉంటున్నారంటే అతిశయోక్తి కాదు.

అటెండర్స్ బ్లాక్.. నిర్మించి మూడేళ్లు..

రోగి సహాయకుల అవసరాలను తీర్చేందుకు నిలోఫర్ ఆస్పత్రిలోనే అటెండర్స్ బ్లాక్ నిర్మాణం చేపట్టారు. ఈ భవనాన్ని జీహెచ్ఎంసీ నిర్మాణం చేసింది. ఎమ్మెల్యే నిధులతో చేపట్టిన ఈ నిర్మాణం పూర్తయ్యి మూడేళ్లు కావస్తోంది. ఏళ్లు గడుస్తున్నా నిలోఫర్‌కు భవనాన్ని అప్పగించలేదు. దీంతో అటెండర్స్ బ్లాక్ ప్రారంభానికి నోచుకోలేదు. అటెండర్స్ బ్లాక్ అందుబాటులోకి రాకపోవడంతో జీ+3 భవనం నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి రోగి సహాయకుల అవస్థలను అర్థం చేసుకుని పూర్తయిన అటెండర్స్ బ్లాక్‌ను నిలోఫర్ అధికారులకు అప్పగించాలని కోరుతున్నారు.

టాయిలెట్ల పరిస్థితి దారుణం..

నిలోఫర్ ఆస్పత్రి బయట పుట్‌ఫాత్‌పై పని చేస్తున్న టాయిలెట్ల పరిస్థితి దారుణంగా ఉంది. ఇది ఒక్కటే ఉండటం, రోగి సహాయకులు ఎక్కువ ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. మరిన్ని టాయిలెట్లు ఏర్పాటు చేయాల్సిన ఉన్నా జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. నాట్కో బిల్డింగ్ ఎదురుగా మరిన్ని మరుగుదొడ్లు ఏర్పాటు చేసుకునే వెసులుబాటు ఉన్నా ఓ స్థానిక నేత అండదండలతో టీ స్టాల్స్, సమోసా స్టాల్స్ ఏర్పాటు చేశారు. నాట్కో బిల్డింగ్ ఎదురుగా ఉండే పుట్‌ఫాత్‌లపై టీ స్టాల్స్‌ను తొలగించి మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని నిలోఫర్ వైద్యాధికారులు జీహెచ్ఎంసీ అధికారులకు ప్రతిపాదనలు పంపినా ప్రణాళికలను సిద్ధం చేయాల్సిన ఇంజినీరింగ్ విభాగం అధికారులు స్థానిక నేతల కనుసన్నల్లో పనిచేస్తున్న కారణంగా అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆదుకునే ప్రయత్నం చేస్తాం



నిలోఫర్‌లో రోగి సహాయకులు ఇబ్బందులు పడుతున్న విషయం వాస్తవమే. వర్షాకాలం, శీతాకాలంలో రోగి సహాయకులు అవస్థలు పడకుండా ఉండేందుకు అటెండర్స్ బ్లాక్ నిర్మాణం చేపట్టాం. భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. నిర్మాణం చేపట్టిన జీహెచ్ఎంసీ అధికారులు ఇంకా నిలోఫర్‌కు అప్పగించలేదు. ఈ విషయమై త్వరలోనే జీహెచ్ఎంసీ అధికారులతో సంప్రదింపులు జరుపుతాం. త్వరితగతిన సమస్య పరిష్కారం అయ్యేలా కృషిచేస్తా.

– డాక్టర్ రవి కుమార్, సూపరింటెండెంట్

అన్నీ ఇబ్బందులే..



నిలోఫర్‌కు వచ్చే రోగి సహాయకులకు వసతి సౌకర్యాలు లేవు. తినడానికి, ఉండటానికి ఏర్పాట్లు లేవు. స్వచ్ఛంద సంస్థలు పంచే ఆహార పదార్థాలే అందుతున్నాయి. బట్టలు మార్చుకునేందుకు, స్నానాలు చేసేందుకు సరైన వసతి గదులు లేవు. జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల నిర్వాహకులు డబ్బులు దోచుకుంటున్నారు. వాటర్‌బాటిల్, సమోసాలు, టీ, బిస్కెట్లు ఇలా ఏది కొనాలన్నా అధిక ధరలే.. ఆస్పత్రి లోనికి వెళ్లాలంటే సెక్యూరిటీకి డబ్బులు ఇవ్వాల్సిందే..

– అబిద్ అలీ, సామాజిక కార్యకర్త

నగరంలో నేడు

- బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్ ఫర్ ఉమెన్ ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో 'రోల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ ఇన్ అచీవింగ్ వికసిత్ భారత్–2047' అంశంపై జాతీయ స్థాయి సదస్సు జరుగుతుంది.

నేడు, రేపు సెయింట్ ఫ్రాన్సిస్‌లో జాతీయ సదస్సు

సనత్‌నగర్: బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్ ఫర్ ఉమెన్ ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఈ నెల 3, 4 తేదీల్లో రెండు రోజుల పాటు జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. 'రోల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ ఇన్ అచీవింగ్ వికసిత్ భారత్–2047' అంశంపై జరిగే ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ఓయూ ఐసీఎస్ఎస్ఆర్–ఎస్ఆర్‌జీ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, విశిష్ట అతిథిగా సెయింట్ మేరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ మాథ్యూజార్జ్, ముఖ్య వక్తగా ఓయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషియాలజీ ప్రొఫెసర్ గణేష్ హాజరవుతారని పేర్కొన్నారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

వెజిటబుల్స్ హైక్

- భారీ వర్షాల కారణంగా..
- నగరానికి భారీగా తగ్గిన దిగుమతి
- పొలాల్లోనే పాడైన కూరగాయలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

సాక్షి, సిటీబ్యూరో: రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నగర మార్కెట్లకు కూరగాయల దిగుమతులు భారీగా తగ్గాయి. దీంతో కూరగాయల ధరలు పెరిగాయి. ఈ వారం కురిసిన వర్షాలతో కూరగాయల పంటకు భారీగా నష్టం జరిగింది. దీంతో గ్రేటర్ శివారు జిల్లాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా నగర మార్కెట్లకు కూరగాయల దిగుమతులు తగ్గాయని అధికారులు చెబుతున్నారు. నగర మార్కెట్ డిమాండ్‌కు తగ్గ కూరగాయల దిగుమతి కావడం లేదని మార్కెట్ అధికారులు చెప్పారు. హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల వద్ద ఉన్న కూరగాయలతో నగర ప్రజల అవసరాలు తీరాయి. కొద్ది మొత్తంలో ఉన్న కూరగాయలకు డిమాండ్ పెరగడంతో వ్యాపారులు ధరలు పెంచేశారు. ఇతర రోజుల్లో టమాటా కిలో ధర రూ.20 నుంచి రూ.30 వరకు విక్రయించారు. మిర్చి కిలో ధరలు పెరగడంతో రూ.50 నుంచి రూ.60 వరకు పలుతుంది. అదేవిధంగా ఇతర కూరగాయల ధరలను కూడా రూ.20 నుంచి రూ.30 వరకు పెంచి బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. వర్షాల కారణంగా కూలీలు పొలాల్లోకి వెళ్లి కూరగాయలు తెంపడం లేదని రైతులు అంటున్నారు. కూరగాయల కొరతతో ధరలు పెరుగుతున్నాయని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. భారీ వర్షాల కారణంగా పొలాల్లో నీళ్లు నిలిచి పంట నష్టం భారీగా పెరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికి వచ్చిన కూరగాయలు పొలాల్లోనే పాడయ్యాయని నిత్యం నగరానికి కూరగాయలు తీసుకువచ్చే చేవెళ్ల రైతు రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు అన్ని కూరగాయల ధరలు కేజీకి రూ.20 నుంచి రూ.40 వరకు పెరిగాయి.

అన్ని శాఖల సమన్వయంతో..

– మేయర్ విజయలక్ష్మి

సాక్షి, సిటీబ్యూరో: మూడు రోజులుగా నగరంలో కురుస్తున్న వర్షాలతో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని శాఖల సమన్వయంతో జీహెచ్ఎంసీ యంత్రాంగం మొత్తం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ తీసుకోవాల్సిన అన్ని చర్యలు తీసుకుంటోందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌ను సోమవారం మేయర్ ఆకస్మికంగా సందర్శించి ఇప్పటి వరకు నగరంలో పడిన వర్షపాతం, అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు, వచ్చిన ఫిర్యాదులు, పరిష్కరించినవి, హుస్సేన్ సాగర్, హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ నీటి మట్టాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జీహెచ్ఎంసీ కమిషనర్ మొదలు అన్ని స్థాయిల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అవసరమైన చర్యలు చేపట్టారని తెలిపారు. వర్షంతో నగరంలో ఎక్కువ చెట్లు పడిపోయాయని, వాటిని ఎప్పటికప్పుడు తొలగించారన్నారు. ఇకపై బలంగా ఎదిగే మొక్కలు నాటేందుకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యక్రమంలో సీసీపీ శ్రీనివాస్, అడిషనల్ కమిషనర్(యూబీడీ) సునంద, కంట్రోల్ రూమ్ ఓఎస్డీ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి



డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి నగరం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి ఉన్నతాధికారులతో కలిసి స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ ఆయా అధికారులకు సమస్యల పరిష్కారానికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఆయా విభాగాల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఎలాంటి జాప్యం లేకుండా సమస్యలు పరిష్కరించి సంబంధిత అర్జీదారులకు తెలియజేయాలని, పరిష్కారం కాకపోతే అందుకు గల కారణాలను లిఖిత పూర్వకంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, సత్యనారాయణ, రఘుప్రసాద్, చంద్రకాంత్‌రెడ్డి, అడిషనల్ సీసీపీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

ఉద్యోగ కల్పన కోసం లీడ్ ఇండియా ఫౌండేషన్ శిక్షణ

సాక్షి, సిటీబ్యూరో: లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు «ఆప్ బడో దేశ్ కో బడావో» పేరుతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కోసం ఉచిత శిక్షణ అందించనున్నారు. మిసైల్ మ్యాన్ మాజీ రాష్ట్రపతి డా.ఏపీజే అబ్దుల్‌కలాం విజన్‌ను మిషన్‌గా స్వీకరించి లీడ్ ఇండియా ఫౌండేషన్ ప్రారంభించామని, ఇందులో భాగంగా దేశభక్తితో, విలువలతో, క్రమశిక్షణతో, గొప్ప ఆలోచనలతో విద్యార్థులను ప్రతిభావంతులుగా మారుస్తామని నిర్వాహకులు ఎస్.ఎస్.రెడ్డి తెలిపారు. ఔత్సాహిక విద్యార్థులు తమ చదువు, అనుభవం సమాచారంతో info.leadindia2047@gmail.comకు మెయిల్ చేయాలని సూచించారు. ఎంపికైన వారికి ఉచిత శిక్షణతో పాటు అప్రెంటీస్‌లో ఉత్తీర్ణులైన వారికి నెలకు గౌరవ వేతనంగా రూ.10 నుంచి రూ.15 వేల వరకు అందిస్తామని తెలిపారు.

విద్యార్థుల రాష్ట్రస్థాయి సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ

కాచిగూడ: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకునేందుకు మంగళవారం రవీంద్రభారతిలో రాష్ట్రస్థాయి విద్యార్థుల సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీసీ విద్యార్థుల రాష్ట్రస్థాయి సదస్సు పోస్టర్‌ను సోమవారం కాచిగూడలో ఆయన విద్యార్థి సంఘం నేతలతో కలిసి ఆవిష్కరించారు. విద్యార్థుల సమస్యలపై తీర్మానాలు చేసి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేస్తామని తెలిపారు. బీసీ విద్యార్థి నేతలు రవి, హరీష్, పవన్, నాగరాజు, దివ్య, హరిత, అర్జున్ పాల్గొన్నారు.

పర్యావరణహితం.. 'స్విద' సర్వీసులు

- కార్పొరేట్ సంస్థల కృషి అభినందనీయం
- ప్రశంసించిన హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి
- 15 మెట్రో స్టేషన్ల నుంచి కార్పొరేట్ సంస్థలకు స్విద సేవలు



సాక్షి, సిటీబ్యూరో: కర్బన ఉద్గార రహితమైన, పర్యావరణహితమైన రవాణా సదుపాయాన్ని ప్రోత్సహిస్తున్న కార్పొరేట్ సంస్థల కృషి అభినందనీయమని హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. నగరంలోని 15 మెట్రో స్టేషన్ల నుంచి కార్పొరేట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన స్విద షటిల్ బస్సుల ద్వారా ప్రతిరోజూ 64 రూట్లలో సుమారు 16 వేల మందికి రవాణా సదుపాయం లభిస్తుందన్నారు. ఇప్పటి వరకు సుమారు 50 లక్షల మంది స్విద షటిల్ సర్వీసుల సేవలను వినియోగించుకున్నట్లు తెలిపారు. హైటెక్ సిటీలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్ఎంజీ స్కైవ్యూ ఐటీ పార్కు, బోష్, బ్రిస్టల్ ఐటీపార్కు, టీటీఈసీ డిజిటల్, విభ్రాంత్ ఎనర్జీ, దివ్యశ్రీ ఎన్ఎస్ఎల్ తదితర సంస్థలకు చెందిన ప్రతినిధులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ కేవీబీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. లాస్ట్‌మైల్ కనెక్టివిటీలో భాగంగా మెట్రో స్టేషన్ల నుంచి కార్పొరేట్ సంస్థలకు ప్రయాణ సదుపాయాన్ని అందజేసేందుకు ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రో సంస్థ స్విద మొబిలిటీ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి ఈ షటిల్ సర్వీసులను అందుబాటులోకి తెచ్చింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కార్పొరేట్ సంస్థలు స్విద సర్వీసులను ప్రోత్సహించాలని ఎన్వీఎస్ కోరారు. కేవీబీ రెడ్డి మాట్లాడుతూ, స్విద మెట్రో షటిల్ సర్వీసులను వినియోగించుకునేందుకు ప్రయాణికులు వాట్సాప్ ద్వారా టిక్కెట్లను బుక్ చేసుకొనే సదుపాయం కూడా ఉందన్నారు. కార్యక్రమంలో స్విద మొబిలిటీ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో సిద్దార్థ్ రవి, సహ వ్యవస్థాపకులు జగ్నేష్ పి.బెల్లాని తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్ల ప్రక్రియ షురూ..

సాక్షి ఎఫెక్ట్

అబిడ్స్: వాణిజ్యపన్నుల శాఖ(జీఎస్టీ) డివిజన్ స్థాయి జాయింట్ కమిషనర్ స్థాయి అధికారుల తీరుపై ఆగస్టు నెల 26వ తేదీన కదలరు.. వదలరు 'సాక్షి' కథనానికి స్పందన లభించింది. కొంతమంది అధికారులు వాణిజ్య పన్నులశాఖ రాష్ట్ర(డీపీసీ)ని కూడా ప్రభావితం చేస్తూ సమావేశం కానివ్వకపోవడంతో వాణిజ్య పన్నులశాఖ మొత్తంలో ప్రమోషన్ల ప్రక్రియ ఆగిపోతుందని 'సాక్షి'లో వచ్చిన కథనానికి వెంటనే స్పందించారు. డీపీసీ అధికారులు సమావేశమై ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టారు. దీంతో సోమవారం రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ జీఎస్టీ రాష్ట్ర కార్యాలయాల పరిధిలో 25 మంది ఏసీటీఓలను డీసీటీఓలుగా, తొమ్మిది మంది డీసీటీఓలకు సీటీఓలుగా, ఐదుగురు సీటీఓలను అసిస్టెంట్ కమిషనర్లుగా, ముగ్గురు అసిస్టెంట్ కమిషనర్లను డిప్యూటీ కమిషనర్లుగా, నలుగురు జాయింట్ కమిషనర్లకు అడిషనల్ కమిషనర్లుగా పదోన్నతులు కల్పించారు. ఆదేవిధంగా డీపీసీ ఉన్నతాధికారులు సమావేశమై కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు పదోన్నతులు కల్పించడంతో 'సాక్షి' కథనానికి పలువురు అధికారులు ధన్యవాదాలు తెలిపారు. జూనియర్, సీనియర్ అసిస్టెంట్ల పదోన్నతులు కూడా వెంటనే కల్పించాలని పలువురు ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

ఉప్పల్ ఎలక్ట్రికల్ ఉద్యోగుల సేవలపై సీఎం ప్రశంస



ఉప్పల్: కుండపోత వర్షంలో విద్యుత్ అంతరాయంపై వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ప్రాణాలకు తెగించి విద్యుత్ పోల్ ఎక్కిన ఎలక్ట్రిక్ ఉద్యోగుల విధులపట్ల వారికి ఉన్న అంకితభావంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసలు కురిపించారు. వర్షంలో విద్యుత్ ఉద్యోగులు స్తంభం ఎక్కి రిపేరు చేస్తున్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సీఎం నేరుగా పోస్టుపై సేవలకు సెల్యూట్ అంటూ స్పందించారు. ఉప్పల్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో అప్రమత్తమైన ఏడీ బాలకృష్ణ డ్యూటీలో ఉన్న ప్రతాప్, భాస్కర్‌కు చెప్పడంతో వారు విద్యుత్ పోల్ ఎక్కి వర్షంలో పనిచేశారు. ఈ ఫొటో చూసిన సీఎం వారిని ప్రశంసించారు.

చర్మ సౌందర్య సాధానాలకు విపరీతంగా డిమాండ్ పెరిగిపోతోంది. ఒకప్పుడు అమ్మాయిలకు మాత్రమే.. కానీ నేడు పురుషులు కూడా అందం కోసం జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీంతో సౌందర్య సాధానాల వాడకం విపరీతంగా పెరిగింది. 2023లో వీటి మార్కెట్ విలువ దాదాపు రూ.135 కోట్లు. 2026 నాటికి రూ.230 కోట్లకు ఎగబాకనున్నదని నిపుణుల అంచనా. నగరాల్లో కాలుష్యం, ఎండ, దుమ్ము కారణంగా అనేక చర్మ సమస్యలు వస్తున్నాయి. వీటి నుంచి రక్షణకు చాలామంది మార్కెట్‌లో దొరికిన అనేక రకాల క్రీములు, జెల్స్, పౌడర్లు, సోప్‌లు, ఫేస్ వాష్‌లు వాడేస్తున్నారు. ఎలాంటి చర్మానికి ఎలాంటి సాధనాలు వాడాలనే విషయంలో చాలా మందికి క్లారిటీ ఉండదు. మరి మన చర్మం తత్వం ఎలా ఉందో తెలుసుకోవడం ఎలా..? అందుకే మన లాంటి వారి కోసమే నేనున్నా అంటూ వచ్చేసింది స్మార్ట్ మిర్రర్. ఇది మన చర్మ సమస్యలను ఇట్టే చెప్పేస్తుంది.. - సాక్షి, సిటీబ్యూరో





మనలాగే.. ఐస్మార్ట్ దర్పణం!

హైదరాబాద్ వైబ్స్

ముఖంపై ముడతలు, నల్ల మచ్చలను గుర్తిస్తుంది

ఇంట్లో ఉండి కూడా మన చర్మం గురించి తెలుసుకోవచ్చు

ప్రస్తుతం నగరంలో పెరుగుతున్న స్మార్ట్ మిర్రర్స్ వాడకం

బ్యూటీ పార్లర్లలో అధునాతన మిర్రర్స్ వినియోగం



సాధారణ అద్దంలో చూసుకుంటే మన ముఖం ఉన్నది ఉన్నట్టు కనిపిస్తుంది. కానీ ఈ స్మార్ట్ మిర్రర్‌లో మాత్రం మన ముఖంలో ఉన్న లోపాలన్నీ కనిపిస్తాయన్న మాట. కళ్ల కింద నలుపు, నల్ల మచ్చలు, రంధ్రాలు, ముడతలు, గీతలు, మన చర్మం స్వభావం వంటి విషయాలు వెంటనే చెప్పేస్తుంది. మన ముఖంలో ఉన్న సమస్యలను కచ్చితత్వంతో పసిగట్టి మనకు విశ్లేషణ అందిస్తుంది. దీన్నిబట్టి మనం ఎలాంటి చికిత్స తీసుకోవాలనే అంచనాకు రావొచ్చు. ఇటీవల పలు బ్యూటీ పార్లర్స్‌లో కూడా దీని వాడకం విరివిగా పెరిగిపోయింది.

చర్మ సమస్యలను ఇట్టే కనిపెట్టేస్తుంది!



సొంతంగానూ వాడుకోవచ్చు..

చాలా కంపెనీలు స్మార్ట్ మిర్రర్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చాయి. ట్యాబ్ పరిమాణంలో ఉండే ఈ స్మార్ట్ మిర్రర్ దాదాపు రెండున్నర కేజీల బరువు ఉంటుంది. దీనికి ఒక హెచ్‌డీ కెమెరా ఉంటుంది. దీని ముందు ముఖం పెట్టగానే కొన్ని ఫొటోలు తీస్తుంది. ఆ ఫొటోలను విశ్లేషించి మన చర్మం తత్వాన్ని చెప్పేస్తుంది. స్మార్ట్ ఫోన్ మాదిరిగానే మన వెంటే తీసుకెళ్లొచ్చు. ఎక్కడైనా వాడుకోవచ్చు. దీని ద్వారా మన చర్మంలో ఎలాంటి మార్పులు సంభవిస్తున్నాయనే విషయాలను గుర్తించి, అందుకు తగ్గ జాగ్రత్తలు తీసుకోవచ్చు.

కాస్త జాగ్రత్త మరీ..

ఏదైనా పరికరంలో కెమెరాలు ఉన్నాయంటే వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగే ప్రమాదం ఉంటుంది. అందుకే దీన్ని వాడనప్పుడు మూసేసి ఉంచడం మంచిది. కాకపోతే కొన్ని స్మార్ట్ మిర్రర్స్ వాడకంలో లేనప్పుడు ఆటోమేటిక్‌గా బంద్ అయిపోతుంది. దీంతో కాస్త వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లకుండా ఉంటుంది. మనం స్మార్ట్ మిర్రర్‌గా వాడనప్పుడు కెమెరాలు క్లోజ్ అయిపోయి.. సాధారణ అద్దంలాగే వాడుకోవచ్చు.

హైటెక్ మిర్రర్ కూడా..

ఇంట్లోనే కాకుండా బ్యూటీ పార్లర్స్‌లో కూడా ఎక్కువగా స్కిన్ అనలైజర్లను ఇటీవల వాడుకలోకి తీసుకొచ్చారు. ఈ మిర్రర్ ఇచ్చిన ఇన్‌పుట్స్ ఆధారంగా శరీర తత్వానికి తగ్గట్టు సౌందర్య సాధనాలను వాడుతున్నారు. ఎలాంటి మేకప్ వేస్తే వారి చర్మానికి సూట్ అవుతుందనే విషయంపై ఓ అవగాహనకు వచ్చి, వారికి అలాంటి ఉత్పత్తులనే వాడుతున్నారు.

పూర్తిస్థాయి పరిష్కారం కాదు..



స్మార్ట్ మిర్రర్స్ ద్వారా ఆయిల్ స్కిన్, పొడి చర్మమా అని చర్మం తత్వం గురించి తెలుస్తుంది. స్కిన్ ఏజింగ్ ప్రాసెస్ మాత్రమే తెలుపుతుంది. ఎండ లేదా కాలుష్యానికి ఎంతగా ప్రభావితమైందో అర్థం అవుతుంది. వీటి ద్వారా చర్మాన్ని ఎలా కాపాడుకోవాలనే అంచనాకు రావొచ్చు. అయితే చర్మ సంబంధిత వ్యాధుల గురించి ఎలాంటి సమాచారం ఇవ్వదు. వ్యాధి నిర్ధారణ విషయంలో స్మార్ట్ మిర్రర్స్‌ను నమ్ముకోవద్దు. అలాంటప్పుడు డెర్మటాలజిస్టును కలిసి చికిత్స తీసుకోవాలి. సొంత వైద్యం చేసుకుంటే మరిన్ని సమస్యలకు దారి తీసే ప్రమాదం ఉంటుంది.
– డాక్టర్ గంగా హరీశ్, డెర్మటాలజిస్టు, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్



హైదరాబాద్ రైజింగ్ ఫార్ములా

బ్లాక్‌బర్డ్స్ రేసర్ అఖిల్ అలీ భాయ్‌కు ట్రోఫీ

ఫార్ములా 4 ఇండియన్ చాంపియన్‌షిప్ రెండో రౌండ్‌లో విజయం

సాక్షి, సిటీబ్యూరో: భారత్‌లో తొలిసారి నిర్వహించిన ఫార్ములా నైట్ రేసింగ్‌లో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ రేసర్ అఖిల్ అలీభాయ్ సత్తా చాటాడు. ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్ 2024 ఎడిషన్‌లో భాగంగా జరిగిన ఫార్ములా–4 ఇండియన్ ఛాంపియన్‌షిప్ రెండో రేసులో అఖిల్ విజేతగా నిలిచాడు. ఈ పోటీలకు హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ యజమాని అక్కినేని నాగచైతన్య, బెంగాల్ టైగర్స్ జట్టు యజమాని, దిగ్గజ క్రికెటర్ సౌరవ్ గంగూలీ హాజరై రేసర్ అఖిల్ అలీభాయ్‌ను అభినందించారు. చెన్నైలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్ట్రీట్ సర్క్యూట్‌లో ఆదివారం రాత్రి జరిగిన ఈ రేసును దక్షిణాఫ్రికాకు చెందిన అఖిల్ అందరికంటే ముందుంగా 30 నిమిషాల 0.3.445 సెకన్లతో పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచాడు. తన కారులో సమస్యల కారణంగా తొలి రేస్‌ను కోల్పోయిన అలీభాయ్ రెండో రేసులో మాత్రం అద్భుత ప్రదర్శన కనబరిచాడు. నాలుగో స్థానం నుంచి పోటీని ఆరంభించిన అతను అద్భుతమైన నైపుణ్యం, మెరుపు వేగంతో దూసుకెళ్లి విజేతగా నిలిచాడు. అహ్మదాబాద్ అపెక్స్ రేసర్స్ జట్టుకు చెందిన దివీ నందన్ (30:03.704 సె) రెండో స్థానం, బెంగళూరు స్పీడ్‌స్టర్స్ రేసర్ జేడెన్ పేట్రియాట్ (30:04.413సె) మూడో స్థానంలో నిలిచారు. మరోవైపు ఇండియన్ రేసింగ్ రెండో రౌండ్‌లో స్పీడ్ డెమన్స్ ఢిల్లీ జట్టు రేసర్ అల్వారో పరాంటే, గోవా ఏసెస్ జేకే రేసింగ్ డ్రైవర్ రౌల్ హైమాన్ అగ్రస్థానం సాధించారు.





షాదీ స్పాన్సర్

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ప్రముఖ తెలుగు మ్యాట్రిమోని వెబ్‌సైట్ తెలుగు షాదీ డాట్‌కామ్ పదో వార్షికోత్సవాల్లో భాగంగా షాదీ ఉత్సవ్ పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. బిగ్ బాస్ ఫేం సిరి హనుమంతుతో ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించామని, అదే విధంగా పలు పోటీల ద్వారా విజేతలను ఎంపిక చేసి, పూర్తి పెళ్లి వేడుకను స్పాన్సర్ చేయడం లాంటి బహుమతితో పాటు, ఇతర ఆఫర్లు కూడా అందిస్తున్నామన్నారు.. ఈ ఉత్సవం అక్టోబరు 14 వరకూ కొనసాగుతుందన్నారు.



రిదా రేడియన్స్ స్కిన్ హెయిర్ క్లినిక్ ప్రారంభం

లక్డీకాపూల్: సినీ సెలబ్రిటీలు మాత్రమే కాదని ప్రస్తుత సోషల్ యుగంలో ప్రతి ఒక్కరు తమ అందాలను మెరుగులు దిద్దుకునేందుకు ప్రయత్నిస్తున్నారని సినీ నటి అనన్య నాగళ్ళ అన్నారు. ఈ క్రమంలో స్కిన్, హెయిర్ రంగాల్లో రకరకాల ప్రయోగాలు చేస్తూనే ఉన్నారన్నారు. సోమవారం గచ్చిబౌలిలో నూతనంగా ఏర్పాటు చేసిన రిదా రేడియన్స్ స్కిన్ హెయిర్ క్లినిక్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా అనన్య మాట్లాడుతూ.. ఒకప్పుడు అందానికి అడ్వాన్స్‌డ్ ట్రీట్‌మెంట్లు కావాలంటే ముంబై, బెంగళూరు, ఢిల్లీ నగరాలకు వెళ్లేవారని, కానీ ఇప్పుడు హైదరాబాద్‌లోనే అంతర్జాతీయ స్థాయి చికిత్సలు అందుబాటులో ఉంటున్నాయన్నారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌తో పాటు పలు ప్లాట్‌ఫామ్‌లలో ఉన్న చాలా మంది ఇప్పుడు సినీ సెలబ్రిటీలకు దీటుగా రీల్స్ చేస్తూ ఆకట్టుకుంటున్నారని, వారందరూ మరింత అందంగా కనిపించేందుకు స్కిన్ క్లినిక్‌లకు బారులు తీరుతున్నారన్నారు. కార్యక్రమంలో రిదా రేడియన్స్ సీఈవో సయ్యద్ కరిష్మా, ప్రముఖ యాంకర్ సునైన, నటుడు రాజేష్, డాక్టర్ శృతి, సీమాఖాన్ పాల్గొన్నారు.

అనాథలకు అండగా.. వీ ఫర్ నీడీ

రెండేళ్లప్పుడు రోడ్డుపై వదిలేసిన తండ్రి

తిండికోసం యాచిస్తూ.. దుర్భర జీవితం

అనాథల హక్కుల కోసం ఉద్యమం..

బాలికలకు విద్యాదానం చేస్తున్న మహిళ

సామినేని నీరజా రాణి స్ఫూర్తి గాథ

ఆమె జీవితం వందలాది మందికి స్ఫూర్తి. అనాథల కోసం ఆమె గొంతుకై నిలిచారు. వారి హక్కుల కోసం ఉద్యమించారు. అనాథ బాలికలు సొంత కాళ్లపై నిలబడేలా సాయం చేస్తున్నారు. ఓ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తూ.. వందలాది మంది జీవితాల్లో వెలుగులు నింపేందుకు తన వంతు కృషి చేస్తున్నారు. ఆమె పేరే నీరజా రాణి. రెండేళ్ల వయసు ఉన్నప్పుడే తండ్రి రోడ్డుపై వదిలేయడంతో అనాథాశ్రమంలోనే పెరిగి.. ఎప్పటికప్పుడు వచ్చే ఆటుపోట్లను ఎదుర్కొంటూ మొక్కవోని ధైర్యం, తెగువతో ఇప్పుడు పది మందికీ సాయం చేసే స్థాయికి ఎదిగారు. ఆమె కష్టాలు వింటే కన్నీళ్లు రాక మానవు. ఆమె జీవిత గాథతో ఎంతోమందిలో స్ఫూర్తి నింపుతున్న నీరజా రాణి గురించి ప్రత్యేక కథనం.
- సాక్షి, సిటీబ్యూరో

బాల్యమంతా అనాథాశ్రమంలోనే..



నీరజా రాణిని తండ్రి రెండేళ్ల ప్రాయంలోనే రోడ్డుపై వదిలేశాడు. ఆ పసికందును చూసిన సిస్టర్ మార్గరెట్ అనే మహిళ చేరదీశారు. హైదరాబాద్‌లోని తొర్రూరు వద్ద ఆమె నడుపుతున్న ఓ అనాథాశ్రమంలోనే ఆశ్రయం కల్పించారు. ఆ తర్వాత నీరజా రాణిని కంటికి రెప్పలా చూసుకున్నారు. పదో తరగతి వరకూ చదువు అక్కడే సాగింది. అన్నీ అనుకున్నట్టు సాగితే జీవితం ఎలా అవుతుంది. కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ అనాథాశ్రమం మూతబడింది. దీంతో అక్కడున్న వారంతా వారి బంధువుల ఇళ్లకి వెళ్లారు. కానీ నీరజా రాణికి ఎటు వెళ్లాలో తోచలేదు. దిక్కుతోచని స్థితిలో దిల్‌సుఖ్‌నగర్ బస్టాండే ఆమెకు దిక్కయ్యింది. మూడు నెలల పాటు రోడ్డుపైనే పడుకున్నారు. ఎంతో మంది ఆమెను వేధింపులకు గురిచేశారు. సాయిబాబా ఆలయం సమీపంలో యాచిస్తూ కడుపు నింపుకున్నారు. ఆమె దయనీయ పరిస్థితిని సమీపంలోని పబ్లిక్ టాయ్‌లెట్స్‌లో పనిచేసే ఓ సెక్యూరిటీ గార్డు గమనించి ఆమెకు చిన్నపాటి ట్యూటర్ ఉద్యోగం ఇప్పించారు. ఆ తర్వాత వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో చేరారు.

ఎక్కడికి వెళ్లినా చీత్కారాలే..

ఆ తర్వాత చదువు కొనసాగించాలని నీరజ ఎంతో ప్రయత్నించారు. కానీ కుదరలేదు. ఇక వేరే ఉద్యోగం కోసం ఎంతగా ప్రయత్నించినా ఆధార్ కార్డు సహా ఏ సర్టిఫికెట్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొందరైతే వాచ్‌మెన్‌తో మెడపట్టి బయటకు పంపిన ఉదంతాలూ ఉన్నాయి. అయినా మొక్కవోని సంకల్పంతో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూ వచ్చారు. అక్కడక్కడా ఉద్యోగాలు చేసుకుంటూ ఎలాగోలా కష్టపడి ఓపెన్ డిగ్రీ పూర్తి చేశారు. ప్రస్తుతం ఓ ఫార్మసీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అయితే అనాథ పిల్లలకు ఏదైనా చేయాలన్న తలంపుతో 'వీ ఫర్ నీడీ' అనే సంస్థను స్థాపించి, అనాథాశ్రమాల నుంచి బయటకు వచ్చి, ఇంకా స్థిరపడని అమ్మాయిలకు ఆర్థిక సాయం చేస్తున్నారు. వారు తమ కాళ్లపై నిలబడే దాకా వారికి కావాల్సిన సాయం అందిస్తున్నారు.



ప్రభుత్వం స్పందించాలి..

అనాథల కోసం ప్రత్యేక చట్టం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చొరవ చూపించాలని కోరుతున్నాం. గత ప్రభుత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన నివేదికను పరిశీలించి చర్యలు తీసుకోవాలి. నేను పడ్డ కష్టం ఏ అనాథా పడకూడదనేదే నా లక్ష్యం. నాకు సాధ్యమైన మేర వారికి సేవ చేస్తూనే ఉంటా. వారికి ఓ అమ్మలా ప్రేమను అందిస్తాను. ఎందుకంటే తల్లి లేని బాధ ఏంటో నాకు తెలుసు. – నీరజా రాణి, వీ ఫర్ నీడీ నిర్వాహకురాలు

అమ్మ పిలుపుకు దూరమై..

ఓ కాలేజీలో పనిచేస్తుండగా, ఆమె సహచర ఉద్యోగి స్నేహితుడు వంశీధర్‌తో ఏర్పడిన పరిచయం పెళ్లి వరకూ వెళ్లింది. అత్తామామలు కూడా ఆమెను ఎంతో బాగా చూసుకునేవారు. మరోసారి ఆమెకు పరీక్ష ఎదురైంది. పిల్లల విషయంలో ఎంతో ఇబ్బందులు పడ్డారు. అయితే ఎంతో మంది అనాథలను అమ్మలా లాలించాలనే ఆలోచనకు వచ్చారు.



అనాథల హక్కుల కోసం..

సామాజికవేత్త గాదె ఇన్నారెడ్డి సాయంతో ఏడాదిన్నర పాటు అనాథల సమస్యలు ఏంటో తెలుసుకోవాలనే ఉద్దేశంతో అధ్యయనం చేశారు. మాజీ ఉపరాష్ట్రపతి సహా అప్పటి కేంద్ర మంత్రులను కలిసి అనాథల కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో వారికోసం చట్టం తేవాలని, వారికి వసతులు కల్పించాలని అప్పటి ప్రభుత్వ పెద్దలను, మంత్రులను కలిసి వినతి పత్రాలు ఇచ్చారు. దీంతో ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని కూడా ఏర్పాటు చేసి, అధ్యయనం చేసి, నివేదిక సమర్పించింది.



అపూర్వ స్నేహం..

సాక్షి, సిటీబ్యూరో: అక్షరాలు దిద్దుకున్న రోజుల్లోనే అల్లుకున్న స్నేహాలవి.. ఆటపాటలతో పాటు ఆనందించిన క్షణాలవి.. ఆ రోజుల్ని గుర్తు చేసుకుంటూ అల్లరి పిల్లలైపోయారు.. వయసును మరిచిపోయారు. సూరత్‌లోని 'సూరత్ మున్సిపల్ శిక్షణా సమితి' పాఠశాలలో 7వ తరగతి వరకూ చదువుకున్న తెలుగు విద్యార్థులు పాతికేళ్ల తర్వాత తిరిగి ఆదివారం (సెప్టెంబరు 1న)కలుసుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా చిన్ననాటి మిత్రులను కలుసుకొని, సంబరాలు జరుపుకున్నారు. అలా 'పాతికేళ్ల క్రితం సూరత్‌లో చదువుకున్న 8 మంది విద్యార్థులలో నగరానికి చెందిన ఎ.వెంకటేశ్, బి.అశోక్, సి.హెచ్.భాస్కర్, ఏ.సతీష్, లలిత, శ్రీదేవి, సరిత ఉన్నారు. 'అప్పటి స్కూల్ ప్రిన్సిపాల్ నాటి ఉమ్మడి వరంగల్ జిల్లా తొర్రూరు వాసి అయిన బుచ్చిరాములతో పాటు ఏడుగురు టీచర్లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు వారికి పూల వర్షంతో ఆహ్వానం పలికి నాటి గురువుల్ని మనస్ఫూర్తిగా సన్మానించుకున్నారు. 'సూరత్‌లో ఉన్న తెలుగువారి కోసం దాదాపు 50 ఏళ్ల క్రితం తెలుగు స్కూళ్లు ప్రారంభించారు. అప్పట్లో చాలా మంది ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లా వాసులు.. ప్రధానంగా మగ్గం పనుల కోసం దాదాపు 5 లక్షల మంది వలస వెళ్లారు. అయితే కాలక్రమంలో కొన్ని కుటుంబాలు నగరానికి తిరిగి వచ్చాయి. అలా వచ్చిన మేం మా స్నేహితులకు దూరం అయ్యాం. తిరిగి కలవాలనుకుని ఏర్పాటు చేసుకున్న మా స్కూల్ రీ యూనియన్ కార్యక్రమానికి 110 మంది హాజరయ్యారు. భిన్న రంగాల్లో రాణిస్తూ ఎంతో ఎదిగిపోయిన చిన్ననాటి స్నేహితుల్ని కలవడం చాలా ఆనందంగా అనిపించింది' అంటూ సూరత్ వెళ్లొచ్చిన నగరవాసులు ఈ సందర్భంగా తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.



'కన్నీటి' వరద

బెజవాడను ముంచేసిన బుడమేరు, బాబు అలసత్వం

ఎటుచూసినా హాహాకారాలు.. అంతా హృదయ విదారకం


నీట మునిగిన విజయవాడలోని సింగ్ నగర్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడ సింగ్‌నగర్ పరిధిలోని వాంబే కాలనీలో నివసించే శ్రావణి రెండు రోజులుగా తన ఇద్దరు బిడ్డల ఆచూకీ తెలియక తల్లడిల్లిపోతోంది. శనివారం ఉదయం కూలి పనుల కోసం వెళ్లిన శ్రావణికి కొద్దిసేపటికే వాంబే కాలనీ మునిగిపోయిందన్న సమాచారం తెలియడంతో గుండెలు అవిసిపోయాయి. 36 గంటల నుంచి తన కుమారుడు, కుమార్తె ఇంట్లో చిక్కుకుని ఉన్నారని.. కనీసం వారి పరిస్థితి ఎలా ఉందో కూడా తెలియడం లేదంటూ విలపిస్తోంది. చిన్నారులు ఇద్దరూ పదేళ్లలోపు వారే కావటంతో ఎలా ఉన్నారో అంతుబట్టక నిద్రాహారాలు లేకుండా కుమిలిపోతోంది. అధికారులకు తన మొర చెప్పుకుందామని వెళ్తే వినిపించుకునే నాథుడే లేకుండా పోయాడని కన్నీరు మున్నీరు అవుతోంది. ''నా కన్నీటిని ఎవరూ పట్టించుకోవటంలేదు. కడుపున పుట్టిన బిడ్డలు విపత్కర పరిస్థితుల్లో ఉన్నారు. ప్రభుత్వ పెద్ద నా సమస్యను ఆలకించడం లేదు..'' అంటూ రోదిస్తోంది!! వరద ప్రాంతాల్లో బాధితుల దుస్థితికి ఇది మచ్చుకు ఓ ఉదాహరణ మాత్రమే. ఎవరిని కదిలించినా ఇలాంటి దీన గాథలే! సహాయ చర్యల్లో సర్కారు వైఫల్యంతో పలు చోట్ల మహిళలు, పిల్లలను వారి బంధువులు, వలంటీర్లు పీకల లోతు నీళ్లలో భుజాలపైకి ఎక్కించుకుని కాపాడి తెస్తున్న దృశ్యాలు కంట తడి పెట్టిస్తున్నాయి. వరద నీటిలో వస్తుండగా కాళ్లకు పాములు, విష జంతువులు చుట్టుకోవడంతో ఆర్తనాదాలు చేస్తున్నారు.

తెల్లారేసరికి ప్రాణాలతో ఉంటారో లేదో..

వరదలు ముంచెత్తిన విజయవాడలోని ముంపు ప్రాంతాల్లో ఎటూ చూసినా హాహాకారాలు .. హృదయ విదారక దృశ్యాలు కన్నీరు తెప్పిస్తున్నాయి. ఎవరిని కదిల్చినా తీవ్ర ఆవేదనే! ''ముందస్తు సమాచారం ఇవ్వకుండా మమ్మల్ని ముంచేశారు.. కనీసం ముందుగా చెబితే కట్టుబట్టలతో ఒడ్డుకైనా చేరేవాళ్లం. ఆదివారం తెల్లారేసరికి నీరు చుట్టుముట్టింది. అప్పటి నుంచి కాలనీలో 7–8 అడుగుల లోతుకుపైగా నీళ్లున్నాయి. సోమవారం సాయంత్రం వరకు బయటికి వచ్చేందుకు మార్గంలేదు. రోజులు గడిచిపోతున్నా ఎవరూ వచ్చిన పాపాన పోలేదు. ఎంతోమంది చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులున్నారు. ఆహారం మాట దేవుడెరుగు.. ప్రాణం కాపాడుకునేందుకు గుక్కెడు మంచినీళ్లు దొరకటం లేదు. చిన్నపిల్లలు పాల కోసం గుక్కపట్టి ఏడుస్తున్నారు. ప్రభుత్వం పైకి మాత్రం గంభీరంగా ప్రకటనలు చేస్తోంది. మెయిన్ రోడ్డు మీద కొన్ని పడవలు తిరుగుతున్నాయి. వాళ్లను ఎంత బతిమాలినా లోపల సందులోకి రావటం లేదు. ఆహారం, పాలు, నీళ్లు.. రోడ్డుపైన ఉన్న కొన్ని ఇళ్ల వారికి మాత్రమే అందుతున్నాయి. లోపల వేలాది కుటుంబాలున్నాయి. తెల్లారేసరికి ప్రాణాలతో ఉంటాయో లేదో! ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు పబ్లిసిటీ కోసం బోట్‌లో వచ్చి వెళ్తున్నారు. అధికారులు అంతా ఆయన వెంటే తిరుగుతున్నారు. దీంతో బాధితులను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కాలనీల్లో కింద గ్రౌండ్ ఫ్లోర్‌లు పూర్తిగా మునిగిపోవడంతో మిద్దెలు, పై ఫ్లోర్లలో తలదాచుకుంటున్నారు. ఏదైనా బోట్ కనిపిస్తే నీళ్ల, పాల ప్యాకెట్లు పైకి వేయాలని వేడుకుంటున్నారు. కట్టు బట్టలతో కొంత మంది ఎలాగోలా బయటపడగా చాలామంది ధైర్యం చాలక మిద్దెలపైన బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వరద ప్రభావిత కాలనీల్లో విద్యుత్తు లేదు. ఫోన్‌లు పనిచేయడంలేదు. రాత్రిళ్లు నరకయాతన అనుభవిస్తున్నారు..'' అంటూ వరద నుంచి ప్రాణాలతో బయటపడ్డ వారు చెబుతుంటే కళ్లు చెమర్చుతున్నాయి. రాజీవ్‌నగర్, కండ్రిక, గుణదల, లూనాసెంటర్, పాయకాపురం, తోటవారివీధి తదితర కాలనీల్లో ఇప్పటికీ సహాయ చర్యలు అందలేదు. పశువుల షెడ్‌లు కూలిపోవడంతో రెండు రోజులుగా మూగజీవాలు నీరు, తిండిలేక రోడ్లపైనే ఉన్నాయి.

బాధితులు లక్షల్లో.. బోట్లు పదుల్లో

వరద బాధితులు లక్షల్లో ఉండగా ప్రభుత్వం తెప్పించామని చెబుతున్న 40 బోట్లు ఏ మూలకూ సరిపోవటం లేదు. రోడ్లపైన బాధితులకు నీరు, పాలు, ఆహారం తరలించేందుకే పరిమితం అవుతున్నాయి. పలు బోట్లకు పంక్చర్లు కావడంతో వెనక్కి వస్తున్నాయి. ఇదే అదునుగా కొందరు ప్రాణాలకు వెల కడుతూ బోట్ల వ్యాపారానికి తెగబడుతున్నారు. కుటుంబం అయితే రూ.5 వేలు, మనిషికి రూ.1,000–1,500 చొప్పున వసూలు చేస్తున్నారు. డబ్బులేని పేదలను మాత్రం బోట్లు ఎక్కనివ్వడం లేదు.

పునరావాస కేంద్రాల జాడేదీ..?

వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిలో కొందరు ఎలాగోలా ధైర్యం చేసి వలంటీర్లు, బంధువుల సాయంతో కర్రలు, తాళ్ల ద్వారా బయటికి వచ్చినా తలదాచుకునేందుకు ప్రభుత్వం కనీసం సహాయ శిబిరాలను కూడా ఏర్పాటు చేయలేదు. అరకొర శిబిరాలు సైతం నీళ్లలో మునగడంతో రోడ్లపై దయనీయంగా ఉన్నారు. తిండి లేక అల్లాడుతున్నారు. సహాయ చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందని మండిపడుతున్నారు. వరద ప్రాంతాల్లో ఇప్పటికీ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కొరవడటంతో బాధితులు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

మంత్రులపై మండిపాటు..
ఫొటోల కోసం టూరిస్టుల్లా వచ్చారా?

సింగ్‌నగర్, రాజీవ్‌నగర్ తదితర ప్రాంతాల్లో మంత్రులు అనిత, సంధ్యారాణి అచ్చెన్నాయుడు, డీజీపీని వరద బాధితులు నిలదీశారు. సహాయ చర్యలు అందటం లేదని, విజయవాడను కాపాడలేనివారు రాష్ట్రాన్ని ఏం కాపాడతారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వలేకపోతున్నారని, టూరిస్టుల్లా బోట్‌లలో వచ్చి ఫొటోలు దిగి వెళ్లిపోతున్నారని నిలదీశారు. మంత్రులు అనిత, సంధ్యారాణి బాధితుల ఆగ్రహం చూసి అక్కడ నుంచి చల్లగా జారుకున్నారు.

ముమ్మాటికీ మానవ తప్పిదమే

చంద్రబాబు తన ఇంటిని కాపాడుకోవడానికే విజయవాడను ముంచేశారు.. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ధ్వజం


విజయవాడలోని సింగ్‌నగర్ వద్ద నీటిలో దిగి బాధితులను పరామర్శించడానికి వెళుతున్న వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: భారీ వరదలకు విజయవాడ మునిగిపోవడానికి మానవ తప్పిదాలే (మ్యాన్ మేడ్ ఫ్లడ్స్) కారణమని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తేల్చి చెప్పారు. సీఎం చంద్రబాబు సర్కారు ఘోర తప్పిదం వల్లే విజయవాడ నగరం విలవిల్లాడుతోందని.. గతంలో ఎన్నడూ ఇంత విపత్తు చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కనీసం మంచినీరు కూడా సరఫరా చేయడం లేదని.. పునరావాస శిబిరాలను ఏర్పాటు చేయలేదని.. ఎలాంటి సహాయక చర్యలూ చేపట్టడం లేదని మండిపడ్డారు. రెండు రోజులుగా వరద బాధితులకు కనీసం ఆహారం కూడా అందడం లేదని.. వారిని తరలించేందుకు తగిన సంఖ్యలో బోట్లు కూడా సమకూర్చలేదని పేర్కొన్నారు. ఇంతకుముందు ఇప్పటికన్నా ఎక్కువ వర్షాలు కురిశాయని.. కానీ ఏరోజూ ప్రజలు ఈ స్థాయిలో బాధ పడలేదని గుర్తు చేశారు. ఇకనైనా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి పరిపాలనపై దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబుకు హితవు పలికారు. వరద బాధితులకు తక్షణమే క్షమాపణలు చెప్పి సహాయ చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబును డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో వైఎస్ జగన్ పర్యటించారు. ఫ్లైఓవర్ మీదుగా వాహనంలో సింగ్ నగర్ వెళ్లేందుకు అనుమతించకపోవడంతో వైఎస్ జగన్ నడుచుకుంటూ సింగ్‌నగర్, ముత్యాలంపాడు, ప్రకాశ్‌నగర్ ప్రాంతాలకు వెళ్లారు. నడుం లోతు నీళ్లలో కూడా నడుచుకుంటూ వెళ్లి వరద బాధితులను వైఎస్ జగన్ వ్యక్తిగతంగా కలుసుకున్నారు. తిండి, నీరు లేక రెండు రోజులుగా తాము నానా ఇబ్బందులు పడుతున్నా.. కనీసం పట్టించుకున్న వారు లేరని, ఎక్కడికైనా వెళ్లిపోదామంటే, బోట్లు కూడా ఏర్పాటు చేయలేదంటూ వరద బాధితులు వైఎస్ జగన్ వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. మీ తరఫున పోరాడుతానని వరద బాధితులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మీడియాతో ఏమన్నారంటే...

చంద్రబాబు ప్రభుత్వ ఘోర తప్పిదం వల్లే..

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావం వల్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని గత నెల 28న ఐఎండీ (వాతావరణ శాఖ) హెచ్చరించింది. రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసింది. 20 సెం.మీ వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అది అత్యధిక వర్షపాతం. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం ఏమాత్రం సీరియస్‌గా తీసుకోలేదు. అతి భారీ వర్షాలు కురుస్తాయన్న ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో వరదను నియంత్రించేలా జలవనరులు, రెవెన్యూ, హోంశాఖ అధికారులతో సీఎం చంద్రబాబు కనీసం సమీక్ష కూడా జరపలేదు. దిగువ ప్రాంతాలే కాకుండా ఎగువన తెలంగాణలోని పలు జిల్లాల్లో కూడా భారీ వర్షాలు కురుస్తాయని.. కర్ణాటక, మహారాష్ట్రల్లోనూ అదే రీతిలో వర్షాలు పడతాయని.. దాని వల్ల కృష్ణా పరీవాహక ప్రాంతంలో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యే ప్రమాదం ఉందని ముందస్తు సమాచారం అందినా కూటమి ప్రభుత్వం అస్సలు పట్టించుకోలేదు.

ఫ్లడ్ కుషన్ ఏర్పాటు చేయలేదు..

ఎగువన ప్రాజెక్టులు పూర్తిగా నిండిన నేపథ్యంలో.. ఆల్మట్టి, తుంగభద్ర, ఉజ్జయిని డ్యామ్‌లలోకి వచ్చిన వరదను వచ్చినట్టుగా దిగువకు విడుదల చేస్తే ఏం చేయాలన్న దానిపై రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం ఆలోచన చేయలేదు. దిగువన వరద ముప్పు తప్పించాలంటే శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులను ఖాళీ చేస్తూ జలాలను విడుదల చేసి 60–70 టీఎంసీల మేర ఫ్లడ్ కుషన్ ఏర్పాటు చేసుకోవాలి. కానీ.. చంద్రబాబు ప్రభుత్వం ఆ పని చేయకపోవడం వల్ల కృష్ణా నదిలో వరద పోటెత్తడంతో గత నెల 28నే ఏకంగా 1.70 లక్షల క్యూసెక్కులు వరద శ్రీశైలంలోకి వచ్చింది. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతలను ఖాళీ చేసి 60–70 టీఎంసీల మేర ఫ్లడ్ ఏర్పాటు చేసుకుని ఉంటే.. ఆ ప్రాజెక్టుల్లోకి చేరే వరదను 30వ తేదీ నుంచి నియంత్రిస్తూ వచ్చి ఉంటే.. ప్రకాశం బ్యారేజ్‌లోకి వచ్చే వరద 8 లక్షల నుంచి 9 లక్షల క్యూసెక్కులకే పరిమితం అయ్యేది. కూటమి ప్రభుత్వ తీవ్ర నిర్లక్ష్యం వల్ల ఏకంగా 11.35 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ప్రభు త్వం పరిపాలనను పూర్తిగా గాలికి వదిలి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ మా పార్టీపై కక్ష సాధింపు చర్యలతో కాలం వెళ్లదీస్తోంది. ఇకనైనా దాన్ని వదిలి పరిపాలనపై దృష్టి పెట్టాలి.

బాబు ఇంటికి ముంపు ముప్పు తప్పించడం కోసమే..

బుడమేరులో వరద పోటెత్తడంతో.. కనీసం ప్రజలను అప్రమత్తం చేసేలా హెచ్చరికలు కూడా జారీ చేయకుండా శనివారం అర్ధరాత్రి వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ నుంచి 11 లాకులు ఎత్తేశారు. దీంతో వరద నీరు విజయవాడ నగరాన్ని ముంచెత్తింది. ఇంతకంటే దారుణం మరొకటి ఉండదు. కేవలం చంద్రబాబు నివాసం ఉంటున్న కరకట్ట అక్రమ కట్టడాన్ని కాపాడుకోవడం కోసమే.. వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ లాకులు ఎత్తేసి బుడమేరు వరదను మళ్లించి విజయవాడను ముంచేశారు.

గతంలోనూ భారీ వర్షాలు కురిసినా..

నిజానికి 11.30 లక్షల క్యూసెక్కుల వరద ఇప్పుడే కొత్తగా వచ్చింది కాదు. సుమారు 120 ఏళ్ల క్రితం 1903లో 11.90 లక్షలు, 2009లో 11.10 లక్షల క్యూసెక్కుల వరద ప్రకాశం బ్యారేజ్‌కు వచ్చింది. మా ప్రభుత్వ హయాంలో కూడా 2019 నుంచి వరుసగా మూడేళ్లు ఇలాంటి వర్షపాతం నమోదైనా.. ఈ స్థాయిలో 11 లక్షల క్యూసెక్కుల పైగా వరదనీరు, ప్రజలు ఇన్ని బాధలు పడడం జరగలేదు. అందుకు కారణం ఫ్లడ్ కుషన్ ఏర్పాటు చేసుకోవడం. అన్ని జాగ్రత్తలు తీసుకోవడమే.

మా హయాంలో అందరికీ సహాయం..

మా ప్రభుత్వ హయాంలో విపత్తులు సంభవించినప్పుడు ఏ ఒక్క బాధితుడూ సహాయం అందలేదని అసంతృప్తి వ్యక్తం చేయలేదు. అప్పట్లో వలంటీర్లు, సచివాలయాల వ్యవస్థ పక్కాగా పని చేసేది. నిత్యం ప్రజలతో మమేకమై ఉండేది. ఎప్పుడు, ఏ విపత్తు సంభవించే అవకాశం ఉన్నా ముందే అప్రమత్తం కావడం, ప్రజలకు జాగ్రత్తలు సూచించడం, సురక్షిత ప్రాంతాలకు తరలించడం, రిలీఫ్ క్యాంప్‌లు ఏర్పాటు చేయడం, ఆర్థిక సాయం అందించడం.. ఇవన్నీ సంతృప్తకర స్థాయిలో జరిగేవి. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తుపాన్ వస్తే కలెక్టర్‌కు ఒక్కటే చెప్పేవాడిని. 'నేను మీకు వారం రోజులు టైమ్ ఇస్తున్నా. వారం తర్వాత వస్తా. ఏ ఒక్కరి నోట్లో నుంచి కూడా కలెక్టర్ స్పందించలేదు, కలెక్టర్ వల్ల మాకు మంచి జరగలేదనే మాట వినపడకూడదని చెప్పేవాడిని. మా కలెక్టర్ బాగా పని చేశాడు. మా కలెక్టర్ మంచివాడు అని వినపడాలని గట్టిగా సూచించేవాడిని..!' ముందుగా చెప్పిన ప్రకారం వారం రోజుల తర్వాత నేను స్వయంగా వెళ్లేవాడిని. అప్పటికే వలంటీర్ల సైన్యం అక్కడ ఉండేది. గ్రామ సచివాలయాల్లో పని చేసే మొత్తం పిల్లలందరూ అక్కడే ఉండేవారు. వారం పాటు వాళ్లంతా కలసి ప్రతి గడపకూ వెళ్లి సహాయ సహకారాలు అందించేవారు. ఇంతకు ముందెప్పుడూ లేనివిధంగా ప్రతి కుటుంబానికీ రూ.2 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించింది కూడా ఒక్క జగన్ హయాంలోనే. అటువంటి కొత్త సంప్రదాయాలు తీసుకొచ్చింది, వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ముందు పెట్టింది మనమే. వాటి ద్వారా ప్రతి గడపకూ సహాయ సహకారాలు అందించగలిగాం.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య


జక్కని సంజయ్ కుమార్‌కు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

కాచిగూడ (హైదరాబాద్): అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి విఫలమయ్యారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ఆరోపించారు. బీసీల డిమాండ్ల సాధన కోసం 9 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్‌కు కాచిగూడలోని ప్రతిమ హాస్పిటల్‌లో సోమవారం కృష్ణయ్య నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. ఆయన మాట్లాడుతూ బీసీ కులగణనను చేపట్టి స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీల సమస్యలను పరిష్కరించకుంటే తెలంగాణ అగ్నిగుండగా మారుతుందని హెచ్చరించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయకుంటే గ్రామాల్లో ప్రజా ప్రతినిధులను అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు, బీసీ నేతలు డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మరో ధర్మాసనానికి హరీశ్‌రావు పిటిషన్ బదిలీ

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఆనంద్ సినీ సర్వీస్ సంస్థకు భూ కేటాయింపులపై హైకోర్టు ఆదేశాలు సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌ను మరో ధర్మాసనానికి బదిలీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌ల ధర్మాసనం ముందుకొచ్చింది. ఈ పిటిషన్‌ను విచారణ చేసేందుకు జస్టిస్ సంజయ్‌కుమార్ నిరాకరించారు. దీంతో జస్టిస్ సంజయ్‌కుమార్ లేని ధర్మాసనానికి బదిలీ చేయాలని సీజేఐ దృష్టికి తీసుకెళ్లాలని జస్టిస్ సంజీవ్‌ఖన్నా రిజిస్ట్రీని ఆదేశించారు. ఈ కేసు తదుపరి విచారణ నవంబరు 4తో ప్రారంభమయ్యే వారానికి వాయిదా వేశారు. ఆనంద్ సినీ సర్వీస్ సంస్థకు 2008లో అప్పటి ప్రభుత్వం ఎకరా రూ.8,500 చొప్పున ఐదెకరాలు కేటాయించడాన్ని హరీశ్‌రావు వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా ఆ వ్యాజ్యాన్ని కొట్టివేసిన సంగతి తెలిసిందే.


వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ జగన్, తల్లి విజయమ్మ, సతీమణి వైఎస్ భారతీరెడ్డి, కుటుంబ సభ్యులు

వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

- మహానేతకు తల్లి, సతీమణితో కలిసి మాజీ సీఎం వైఎస్ జగన్ ఘన నివాళి
- వైఎస్సార్ 15వ వర్ధంతి కార్యక్రమంలో వైఎస్ కుటుంబ సభ్యులు

సాక్షి కడప/వేంపల్లి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌వద్ద ఆయన కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తల్లి వైఎస్ విజయమ్మ, సతీమణి వైఎస్ భారతీరెడ్డితోపాటు ఇతర కుటుంబ సభ్యులు సోమవారం ఉదయాన్నే ఘాట్ వద్ద పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఆయన అభిమానులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలు ఇడుపులపాయకు కదిలివచ్చారు. ముందుగా వైఎస్ జగన్ కుటుంబమంతా ఘాట్ ప్రాంగణంలో దివంగత నేతను స్మరించుకున్నారు. వైఎస్ జగన్‌తోపాటు తల్లి విజయమ్మ నివాళులర్పించే క్షణంలో భావోద్వేగానికి గురయ్యారు.

ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు..

ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద మాజీ సీఎం వైఎస్ జగన్‌తోపాటు కుటుంబ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి పాస్టర్లు దేవుని వాక్యంతోపాటు వైఎస్సార్ హయాంలో జరిగిన మంచి పనులను వివరించారు. వైఎస్సార్ సువర్ణ పాలనలో ప్రజలంతా సంక్షేమంలో మునిగిపోయారని కొనియాడారు.

స్టార్ట్ కెమెరా.. యాక్షన్!

పతాకస్థాయికి సీఎం చంద్రబాబు ప్రచార ఆరాటం

వరద ముంపు అంచనాలో దారుణ వైఫల్యం

తప్పు కప్పిపుచ్చుకునేందుకు చంద్రబాబు హైడ్రామా

- విజయవాడ కలెక్టరేట్‌లో మకాం వేసి ప్రచార హంగామా
- రోజంతా ఫొటోలు, వీడియో షూట్లతో సొంత బాకా.. బిల్డప్ బాబాయ్ పాత్రలో జీవిస్తున్న చంద్రబాబు


తమను ఎవ్వరూ పట్టించుకోవడం లేదంటూ చంద్రబాబును నిలదీస్తున్న బాధితులు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఆ వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం

స్మితా సబర్వాల్‌పై పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ స్మితా సబర్వాల్ దివ్యాంగులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమైనవని హైకోర్టు అభిప్రాయపడింది. ఓ అధికారిగా ఆమె ఎవరి రిజర్వేషన్లను తొలగించలేదని, ఆమె వ్యాఖ్యలతో దివ్యాంగుల రిజర్వేషన్లు తొలగించడం కూడా జరగలేదని స్పష్టం చేసింది. రాజ్యాంగబద్ధంగా వారు రిజర్వేషన్లు పొందుతున్నందున.. ఆమె వ్యాఖ్యలతో ఎవరికీ ఎలాంటి నష్టం వాటిల్లే అవకాశం లేదని తేల్చిచెప్పింది. ఆమెపై చర్యలు తీసుకోవాలంటూ దాఖలైన పిటిషన్‌ను కొట్టేసింది. దివ్యాంగ కోటా కింద నకిలీ సర్టిఫికెట్లతో సివిల్స్‌కు ఎంపికై మహారాష్ట్ర కేడర్‌లో ట్రైనీ ఐఏఎస్‌గా పనిచేసిన పూజా ఖేడ్కర్ వ్యవహారంపై స్మితా సబర్వాల్ 'ఎక్స్'ద్వారా స్పందిస్తూ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపడం తెలిసిందే. 'ఏ విమానయాన సంస్థ అయినా దివ్యాంగులను పైలట్‌గా నియమిస్తుందా? వైకల్యమున్న సర్జన్‌ను ఎవరైనా నమ్మకంతో విశ్వసిస్తారా? ఆలిండియా సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లు క్షేత్రస్థాయిలో పని చేయాల్సి వస్తుంది. ఒక్కోసారి ఎక్కువ గంటల పాటు ప్రయాణం చేయాలి. ప్రజల ఫిర్యాదులు ఓపికగా వినాలి. దీనికి శారీరక దృఢత్వం కూడా అవసరం. ఇలాంటి అత్యున్నత సర్వీసులో ఈ కోటా అవసరమా?'అంటూ ఆమె పేర్కొన్నారు. దీంతో దివ్యాంగులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు ఆమెపై చర్యలు తీసుకొనేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలంటూ హైదరాబాద్‌కు చెందిన సామాజిక కార్యకర్త వసుంధర కొప్పుల హైకోర్టులో పిటిషన్ వేశారు. రిజిస్ట్రీ అభ్యంతరాల నేపథ్యంలో ఈ పిటిషన్‌కు నంబర్ కేటాయించలేదు. నంబర్ కేటాయింపుపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. భావవ్యక్తీకరణ, వాక్ స్వాతంత్ర్య హక్కు రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ ఇచ్చిందని చెప్పింది. స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు దివ్యాంగుల జీవించే హక్కును ప్రభావితం చేసినట్లు ఉన్నాయన్న పిటిషనర్ వాదనను తోసిపుచ్చుతూ పిటిషన్‌ను పరిశీలన దశలోనే కొట్టేసింది.

పీవోపీ విగ్రహాలపై వివరణ ఇవ్వండి: హైకోర్టు


సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని చెరువులు, కుంటల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ) విగ్రహాల నిమజ్జనంపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ నెల 9 వరకు సమయం ఇస్తున్నామని.. ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. వినాయక చవితికి వారం ముందు పిటిషన్ (మధ్యంతర అప్లికేషన్) దాఖలు చేయడంలో పిటిషనర్ తీరుపైనా ఆగ్రహం వ్యక్తం చేసింది. 2021లో వినాయక నిమజ్జనాలపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. హుస్సేన్ సాగర్‌తోపాటు చెరువుల్లో పీవోపీ విగ్రహాలను నిమజ్జనం చేయడానికి వీల్లేదని ఆదేశించింది. పీవోపీ విగ్రహాలను నగరంలో ఏర్పాటు చేసిన కృత్రిమ నీటి కుంటల్లోనే నిమజ్జనం చేయాలని పేర్కొంది. 'హైకోర్టు ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం ఉల్లంఘిస్తోంది. ఈ ఏడాదీ హుస్సేన్ సాగర్‌లో పీవోపీతో చేసిన గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయాలని నిర్ణయించింది. పీఓపీతో తయారైన విగ్రహాల నిమజ్జనానికి సాగర్ చుట్టూ 33 క్రేన్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ విషయంలో కోర్టు ఉత్తర్వులను ప్రభుత్వం పాటించేలా ఆదేశాలు జారీ చేయండి'అని పార్టీ ఇన్ పర్సన్ (పిటిషనర్ కమ్ న్యాయవాది) వేణుమాధవ్ కోరారు.

రవిప్రకాశ్‌పై కేసు ఉపసంహరణ చెల్లదు

- యాంత్రికంగా ఉత్తర్వులు జారీ చేయడం సరికాదు
- కూకట్‌పల్లి మేజిస్ట్రేట్ తీర్పును రద్దు చేయండి
- హైకోర్టులో 'అలందా మీడియా' వాదనలు
- ప్రభుత్వానికి, రవిప్రకాశ్‌కు హైకోర్టు నోటీసులు
- విచారణ ఈ నెల 5కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: నిధుల దుర్వినియోగం, ఫోర్జరీలకు పాల్పడ్డారంటూ టీవీ9 మాజీ డైరెక్టర్ రవిప్రకాశ్‌పై నమోదైన కేసు ఉపసంహరణకు అనుమతించిన కూకట్‌పల్లిలోని మేజిస్ట్రేట్ కోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలని కోరుతూ అలందా మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ పి.కౌశిక్ రావు హైకోర్టును ఆశ్రయించారు. రవి ప్రకాశ్‌పై కేసు ఉపసంహరణకు రాష్ట్ర ప్రభుత్వం 2024, మార్చి 15న జీవో 158 జారీ చేసింది. దీని ఆధారంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెమో దాఖలు చేయగా, కూకట్‌పల్లి కోర్టు తీర్పునిచ్చింది. ఈ ఉత్తర్వులను రద్దు చేయాలని కౌశిక్‌రావు కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ వేణుగోపాల్ సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'రవిప్రకాశ్‌పై క్రిమినల్ కేసును మార్చిలో ప్రభుత్వం ఉపసంహరించుకుంది. దీని ఆధారంగా అనుమతిస్తూ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేయడం చట్టవిరుద్ధం. కేసు పూర్వాపరాలను, ఇతర అంశాలను పరిశీలించకుండానే ఉత్తర్వుల జారీ సరికాదు. క్రిమినల్ కేసు ఎందుకు ఉపసంహరించుకుంటున్నారు?.. కారణాలు ఏమైనా ఉన్నాయా?.. లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకోలేదు. ప్రభుత్వం కేసును ఉపసంహరించుకోవడంతో పడే ప్రభావాన్ని, చార్జిషీట్‌లోని ఆధారాలను, సాక్షుల స్టేట్‌మెంట్లను పరిగణనలోకి తీసుకోకుండా ఉత్తర్వులు ఇవ్వడం చెల్లదు. మేజిస్ట్రేట్ కూడా ఎలాంటి కారణాలను పేర్కొనకుండా మెమోను అనుమతిస్తూ ఉత్తర్వులిచ్చారు. రవిప్రకాశ్.. నిందితుడిగా ఫోర్జరీ పత్రాలు సృష్టించడం, మోసానికి పాల్పడటం లాంటి పనులు చేశారని సాక్షులు వాంగ్మూలంలో పేర్కొ న్నారు. యాంత్రికంగా ఉత్తర్వులు జారీ చేయకూడదన్న సత్యాన్ని మేజిస్ట్రేట్ పాటించలేదు. వీటిని పరిగణనలోకి తీసుకుని మేజిస్ట్రేట్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలి'అని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వం, రవిప్రకాశ్, సాంటినేని శివాజీ, జె. కనక రాజు, జె. తేజవర్మ, మహేశ్ గాంధీకి నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణ ఈ నెల 5కి వాయిదా వేశారు.

ఉన్నత స్థానాల్లోని వారు బాధ్యతగా ఉండాలి



▶ మొదటి పేజీ తరువాయి

సోమవారం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది ఆర్.సుందరం వాదనలు వినిపిస్తూ.. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో ఏసీబీకి ఇన్‌చార్జిగా ఉన్నారని, ఆయన నిందితుడిగా ఉన్న 'ఓటుకు కోట్లు' కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరారు. వేరే రాష్ట్రానికి బదిలీ చేసినప్పటికీ ఇదే పరిస్థితి ఉంటుందేమో అని జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొనగా.. ఏసీబీ అధికారులు సీఎంకు నివేదిక ఇస్తారని, ఎవరిని విచారించాలనేది హోంశాఖ నిర్ణయిస్తుందని, వేరే రాష్ట్రంలో అయితే రేవంత్‌రెడ్డి ఇన్‌చార్జిగా ఉండరని వివరించారు. అయితే.. ఏసీబీ అధికారులు ఓటుకు కోట్లు కేసులో 25 మంది సాక్షులను విచారించి, అన్ని వివరాలు సేకరించారని సీఎం రేవంత్ తరఫు సీనియర్ న్యాయవాది రోహత్గి తెలిపారు.

పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌కు బాధ్యత ఉండదా?

ఇక ఎమ్మెల్సీ కవిత బెయిల్ విషయంలో న్యాయ వ్యవస్థ స్వతంత్రతపై ప్రజల్లో గందరగోళం సృష్టించేలా తెలంగాణ కాంగ్రెస్ సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టులు పెట్టారని పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది సుందరం కోర్టుకు వివరించారు. కోర్టు ఆర్డర్ కాపీని, కవిత తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గి చిత్రాలతో పోస్టుచేశారని.. 'ల్యాండ్ గ్రాబర్స్‌కు ఒక రూల్.. ప్రభుత్వానికి ఒక రూలా? వాట్ ఈజ్ దిస్ మై లార్డ్?' అంటూ పెట్టిన మరో పోస్టును ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై జస్టిస్ బీఆర్ గవాయ్ అసహనం వ్యక్తం చేశారు. అయితే.. ఇందులో రేవంత్‌రెడ్డి పాత్ర లేదని ముకుల్ రోహత్గి పేర్కొనగా.. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డికి బాధ్యత ఉంటుందని సుందరం ధర్మాసనానికి వివరించారు. దీనిపై ఇటీవల రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పారని, న్యాయవ్యవస్థపై తనకున్న గౌరవాన్ని వెలిబుచ్చారని రోహత్గి పేర్కొన్నారు. ఈ దశలో జస్టిస్ బీఆర్ గవాయ్ జోక్యం చేసుకుని.. 'అత్యున్నత పాలనాధికారం కలిగి ఉన్న వారు బాధ్యతగా మెలగాలి. కోర్టులు, న్యాయమూర్తులను రాజకీయాల్లోకి లాగడం సబబు కాదు..' అని స్పష్టం చేశారు. అయితే ఇరుపక్షాల వివరణలు పూర్తయ్యాయని.. బదిలీ పిటిషన్ విచారణను ముగించాలని న్యాయవాది రోహత్గి పేర్కొన్నారు. దీంతో జస్టిస్ కేవీ విశ్వనాథన్ జోక్యం చేసుకుని తెలంగాణలో వరదలను ప్రస్తావిస్తూ.. ప్రభుత్వం ఆ పనుల్లో నిమగ్నమై ఉంటుందని, తాము అన్ని సున్నిత అంశాలనూ పరిశీలిస్తామని తెలిపారు. ఈ వ్యవహారంలో రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం, రేవంత్‌రెడ్డి, సెబాస్టియన్, ఉదయసింహ, సండ్ర వెంకట వీరయ్యలకు నోటీసులిచ్చారు. విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం ॥ 3-9-2024



ప్రీతి పాల్

కొన్ని విజయాలు ఆనందంతో ముడిపడినవి మాత్రమే కాదు. వ్యక్తిగత విజయానికే పరిమితమైనవి కావు. దారి లేని వారికి దారి చూపే విజయాలు. ధైర్యం లేని వారికి అసాధారణ ధైర్యం ఇచ్చే విజయాలు. పారాలింపిక్స్‌లో ఈ 'ప్యారే' అథ్లెట్లు సాధించిన విజయాలు అలాంటివే. చరిత్ర సృష్టించిన విజయాలే కాదు నిస్సహాయులం, అశక్తులం అనుకునే వారికి స్ఫూర్తినిచ్చి శక్తిమంతం చేసే విజయాలు...

పారాలింపిక్స్‌లో... ప్యారే అథ్లెట్స్

బతకడమే కష్టం అంటే... పతకం తెచ్చింది

పరుగు ఏం చేస్తుంది?
'మనం ఊహించని శక్తి మనలో ఉంది అని గుర్తు తెస్తుంది' అంటుంది ఒక ప్రసిద్ధ మాట. ఈ మాట ప్రీతి పాల్‌కు అక్షరాలా సరిపోతుంది. 'ఈ అమ్మాయి బతకడం కష్టం. బతికినా మంచానికే పరిమితం అవుతుంది' అనుకున్న అమ్మాయి 'పరుగు'ను బలం చేసుకుంది. విశ్వ క్రీడా వేదికపై విజేతగా మెరిసింది.

తాజాగా...పారిస్ పారాలింపిక్స్‌లో ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్‌లో రెండు పతకాలు గెలుచుకున్న తొలి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించింది. పారాలింపిక్స్‌లో 100 మీటర్‌ల విభాగంలో కాంస్య పతకం సాధించిన ఆనంద క్షణాలలో...'ఇది కలా నిజామా!' అనుకుంది ప్రీతి.

ఆ ఆనందం నుంచి ఇంకా పూర్తిగా బయటపడక ముందే 200 మీటర్‌ల విభాగంలో కాంస్య పతకంతో మరో పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌పూర్‌లోని ఒక రైతు కుటుంబంలో పుట్టిన ప్రీతికి కష్టాలు పాత చుట్టాలు. బలహీనమైన కాళ్లతో పుట్టింది. ఫలితంగా ఆమె వివిధ వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఎక్కువ. కాళ్లను బలోపేతం చేయడానికి వివిధ సంప్రదాయ చికిత్సలు చేయించారు. అయిదు నుంచి ఎనిమిదేళ్ల వరకు కాలిపర్‌లు ధరించింది ప్రీతి. 'ఈ అమ్మాయి ఇక మంచానికే పరిమితం అవుతుంది'... ఇలాంటి బలహీనమైన మాటలు ఆమె ఆత్మబలం ముందు వెల వెల బోయాయి. ప్రాణాంతక పరిస్థితులను అధిగమించి శక్తిమంతురాలిగా రూపుదిద్దుకోవడానికి తనలో ఆశావాదమే కారణం. 'నా పరిస్థితి ఇలా అయింది ఏమిటి' అనే బాధ కంటే ఏదో సాధించాలనే ఉత్సాహం తనలో ఉరకలు వేసేది. 'ఈ బలహీనమై కాళ్లతో నేను ఏం సాధించగలను' అనే ఆమె సందేహానికి టీవీలో కనిపిస్తున్న పారాలింపిక్స్ దృశ్యాలు సమాధానం చెప్పాయి. ఇక అప్పటి నుంచి పారాలింపిక్స్‌పై ప్రీతికి ఆసక్తి పెరిగింది. పారాలింపిక్ అథ్లెట్ ఫాతిమ పరిచయం ప్రీతి జీవితాన్ని మలుపు తిప్పింది. 'నీలో ప్రతిభ ఉంది' అని ప్రీతిని ప్రోత్సహించడమే కాదు ఆటలోని మెలకువలు నేర్పింది. ఫాతిమ మార్గదర్శకత్వంలో రాష్ట్ర,జాతీయ స్థాయి ఈవెంట్స్‌లో పాల్గొంది ప్రీతి. మీరట్‌లో ప్రాథమిక శిక్షణ తరువాత దిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కోచ్ గజేంద్ర సింగ్ దగ్గర శిక్షణ తీసుకున్న ప్రీతి పాల్‌కు రన్నింగ్ టెక్నిక్‌లు నేర్చుకొని తన ప్రతిభకు సాన పెట్టుకునే అవకాశం వచ్చింది.

గత సంవత్సరం చైనాలో జరిగిన ఆసియా పారా చాంపియన్‌షిప్‌లో 100, 200 మీటర్‌ల ఈవెంట్‌లలో రెండో స్థానం, నాల్గో స్థానంలో నిలిచినప్పటికి ప్రీతి నిరాశపడలేదు. పారిస్ పారాలింపిక్స్ టీ35 100 మీటర్‌ల ఈవెంట్‌లో 14.21 సెకన్‌లలో లక్ష్యాన్ని చేరుకొని కాంస్యాన్ని సాధించింది. తొలి పారాలింపిక్స్‌లోనే పతకం సాధించినందుకు తనలో ఆత్మవిశ్వాసం పెరిగింది. 'పారిస్‌కు రాక ముందు పతకం సాధించాలని గట్టిగా అనుకున్నాను. నా కల నిజమైంది' అన్న ప్రీతి పాల్ రెండో పతకాన్ని కూడా సాధించి చరిత్ర సృష్టించింది. 'పారాలింపిక్స్‌లో భారత్‌కు తొలి ట్రాక్ మెడల్ సాధించినందుకు గర్వంగా ఉంది' అంటుంది ప్రీతి.

శరణార్థి... సీక్రెట్ జిమ్

రెఫ్యూజీ పారాలింపిక్ టీమ్ నుంచి పతకం సాధించిన తొలి పారా తైక్వాండో అథ్లెట్‌గా జకియా ఖుదాదాది చరిత్ర సృష్టించింది. మహిళల 47 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించింది. 'ఇక్కడికి రావడానికి నేను ఎన్నో కష్టాలు పడ్డాను. ఈ పతకం ఆఫ్గానిస్తాన్‌లోని మహిళలందరికీ, ప్రపంచంలోని శరణార్థులందరికీ దక్కుతుంది. ఏదో ఒకరోజు నా దేశంలో శాంతి నెలకొంటుందని ఆశిస్తున్నాను' అంటుంది జకియ. ముంజేయి లేకుండా జన్మించిన జకియ పదకొండు ఏళ్ల వయసులో ఆఫ్గానిస్తాన్‌లోని తన స్వస్థలమైన హెరాత్‌లోని రహస్య జిమ్‌లో రహస్యంగా తైక్వాండో ప్రాక్టీస్ చేసేది. టోక్యో ఒలింపిక్స్ తరువాత జకియ ఖుదాదాది ప్యారిస్‌లో స్థిరపడింది. ఆమె గెలుపు చారిత్రాత్మకం. ఆమె జీవితం ఆసక్తికరం.


జకియ

కాలు, చెయ్యి లేకున్నా చేపలాగా...


ఇయాంగ్ యుయాన్

'సగౌరవంగా కనిపించాలి. గెలుపుపై మెరవాలి' అంటుంది పందొమ్మిది ఏళ్ల చైనీస్ స్విమ్మర్ ఇయాంగ్ యుయాన్. పారిస్ పారాలింపిక్ గేమ్స్‌లో మహిళల 50 మీటర్‌ల ఫ్రీస్టైల్ ఎస్6 ఈవెంట్‌లో స్వర్ణం గెలుచుకున్న ఇయాంగ్ దివ్యాంగులు తమ కలలను సాకారం చేసుకోవడానికి తన వంతుగా స్ఫూర్తి నింపాలని అనుకుంటుంది. టోక్యో పారాలింపిక్స్ ఎస్6 50 మీటర్‌ల బటర్‌ఫ్లై ఈవెంట్‌లో కొత్త వరల్డ్ రికార్డ్ సృష్టించి స్వర్ణం గెలుచుకుంది. తాజాగా... 32.59 సెకన్‌లతో మరోసారి వరల్డ్ రికార్డ్ సృష్టించింది. నాలుగు సంవత్సరాల వయసులో కారు ప్రమాదంలో కుడి చేయి, కాలును కోల్పోయింది ఇయాంగ్. 'నువ్వు ఎలాగైనా గెలవాల్సిందే...అంటూ నాపై ఎవరూ ఎలాంటి ఒత్తిడి పెట్టలేదు. ఈ గేమ్స్‌లో నేను పోటీ పడటాన్ని చాలా మంది దివ్యాంగులు చూస్తారని నాకు తెలుసు. నా గెలుపు వారి గెలుపు కావాలనుకున్నాను' అంటుంది ఇయాంగ్. 'మీరు కలలు కనండి. వాటిని సాకారం చేసుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేయండి' అని దివ్యాంగులకు పిలుపు ఇస్తుంది.

వీల్ చైర్ రగ్బీలో చక్రం తిప్పి...

టీమ్ యూఎస్ వీల్‌చైర్ రగ్బీ అథ్లెట్ సారా ఆడమ్ అమెరికా వీల్‌చైర్ రగ్బీ జట్టులో ఆడిన తొలి మహిళగా, పారాలింపిక్స్‌లో స్కోర్ చేసిన మొదటి అమెరికన్ మహిళగా చరిత్ర సృష్టించింది. తొలి మ్యాచ్‌లో ప్రత్యర్థి కెనడా జట్టుపై అమెరికా వీల్‌చైర్ రగ్బీ జట్టు విజయం సాధించింది. ఈ విజయంలో సారా ఆడామ్ కీలక పాత్ర పోషించింది. 2016లో సారా ఆడమ్‌కు మల్టీపుల్ స్క్లెరోసిస్‌గా నిర్ధారణ అయింది. 'క్రీడారంగంలో ఉన్న మహిళలకు నిజంగా ఇది ఉత్తేజకరమైన కాలం. అభిమానులు ఆటలో మేము చూపించే నైపుణ్యాలను ప్రశంసించడమే కాదు మా నేపథ్యాలు, మేము పడిన కష్టాలను తెలుసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. ఎలిట్ అథ్లెట్‌గా ఎదగడానికి బాగా కష్టపడ్డాను' అని అంటుంది సారా. ఆటల్లోకి అడుగు పెట్టకముందు సారా ఆడమ్ మిస్సోరిలోని సెయింట్ లూయిస్ యూనివర్శిటీలో ఆక్యుపేషనల్ ప్రొఫెసర్.


సారా ఆడమ్

దుర్గాపూజ లిస్ట్

చిన్న కత్తి పెప్పర్ స్ప్రే



కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటన 'మహిళల భద్రత' అంశాన్ని మరో సారి చర్చల్లోకి తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో శ్రేయసి బిస్వాస్ అనే ఇన్‌ఫ్లూయెన్సర్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

'రాబోయే దుర్గా పూజ కోసం మీ షాపింగ్ లిస్ట్‌లో ఉండాల్సిన ఐటమ్స్' అనేది వీడియో సారాంశం. ఇన్‌ఫ్లూయెన్సర్స్ శ్రేయసి 'దుర్గా పూజా జాబితా'లో పండగకు అవసరమైన వస్తువులతో పాటు చిన్న కత్తి, పెప్పర్ స్ప్రే, అలారమ్ కీచైన్... లాంటివి జత చేసింది. 'పెప్పర్‌స్ప్రే, అలారమ్ కీచైన్‌ల మీద వీడియో చేస్తానని ఎప్పుడూ అనుకోలేదు. కానీ కోల్‌కతా దుర్ఘటన నేపథ్యంలో తప్పకుండా చేయాలనిపించింది. మహిళల భద్రత ప్రమాదంలో పడింది. ఎక్కడ ఏ ప్రమాదం పొంచి ఉందో తెలియదు. ఈ నేపథ్యంలో మహిళలు తమ భద్రత గురించి తామే జాగ్రత్త పడాలి. బ్యాగులో సెల్ఫ్-డిఫెన్స్ టూల్స్ తప్పనిసరిగా ఉండాలి' అంటుంది శ్రేయసి బిస్వాస్. సెల్ఫ్-డిఫెన్స్ టూల్స్‌ను ప్రేక్షకులకు చూపుతూ వాటి వల్ల ఉపయోగం ఏమిటో చెప్పింది శ్రేయసి. 'ఈ సెల్ఫ్-డిఫెన్స్ ప్రాడక్ట్స్ అమెజాన్‌లో అందుబాటులో ఉన్నాయి. జస్ట్ సెర్చ్ చేయండి చాలు' అని సలహా కూడా ఇచ్చింది. ఈ వీడియో 7.6 లక్షల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

'కోల్‌కతా దుర్ఘటన తరువాత కొత్త వాళ్లు ఎవరైనా మిల్లీ సెకన్ నా వైపు చూసినా చాలా భయంగా ఉంది' అని ఒక యూజర్ రాసింది. 'మా పరిస్థితి కూడా అదే' అన్నారు చాలా మంది. 'భయపడితే ఎలా! మహిళలలో దుర్గాదేవి అంశ ఉంది. దుర్మార్గుల అంతు చూసే అపార శక్తి ఉంది' అని ఒక యూజర్ రాశారు.

బ్యూటిప్స్

మెడ దగ్గర నలుపు తగ్గాలంటే...



- మెడ భాగం జిడ్డుగా, నలుపుగా మారితే బొప్పాయిపండు గుజ్జును పట్టించి, పది నిమిషాలు మృదువుగా మసాజ్ చేయాలి. తర్వాత శుభ్రపరుచుకోవాలి. వారంలో రెండుసార్లైనా ఇలా చేస్తూ ఉంటే నలుపు తగ్గుతుంది.
- మోచేతుల నలుపు తగ్గాలంటే నిమ్మ ఉప్పును రాసి, అర గంట ఉంచి, శుభ్రపరుచుకోవాలి.
- ఆలివ్ ఆయిల్‌తో మోచేతుల భాగాన్ని మసాజ్ చేసి, ఆ తర్వాత నిమ్మకాయ రసంతో రుద్దితే నలుపుదనం తగ్గుతుంది.
- పెదాలు నలుపు తగ్గాలంటే బీట్‌రూట్ ముక్కతో పెదాలను కొద్దిపాటి ఒత్తిడితో మర్దనా చేయాలి.



వేపతో ఉపాధి

వారంతా వ్యవసాయం చేసుకునే సాధారణ మహిళలు.. కానీ సేంద్రియ ఉత్పత్తులు తయారు చేస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు. వృథాగా భూమిలో కలిసి పోయే వేప గింజల నుంచి విలువైన వేప నూనె, వేప పిండిని తయారు చేసి విక్రయిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వారి విజయ గాథలోకి వెళదాం...


సేంద్రియ ఉత్పత్తులు తయారు చేసే మహిళా బృందం సభ్యులు

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం అల్గోల్ గ్రామంలో సుమారు 15 మంది మహిళలు మూడు స్వయం సహాయక బృందాలుగా ఏర్పడ్డారు. ఐదుగురికి ఒక్కో యూనిట్ చొప్పున మూడు యూనిట్లు స్థాపించుకున్నారు. మహబూబ్‌నగర్, నల్గొండ, వరంగల్ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు వెళ్లి వేప గింజలను కొనుగోలు చేసుకుని తెచ్చుకుంటారు. ఇటు వ్యవసాయం చేసుకుంటూనే సమయం దొరికినప్పుడు వేప నూనె, వేప పిండిని తయారు చేస్తున్నారు.

ఏటా వేప చెట్లకు కాసే వేప కాయలు పండి రాలిపోతుంటాయి. ఇలా రాలిపోయిన గింజలను ఆయా ప్రాంతాల్లోని మహిళలు, గిరిజనులు సేకరిస్తుంటారు. ఇలా సేకరించి తెచ్చిన గింజలకు అంటుకున్న మట్టిని తొలగించి, ఎండబెట్టి ప్రాసెస్ చేస్తుంటారు. క్వింటాలు గింజలకు ఐదు లీటర్ల వరకు వేప నూనె, 70 నుంచి 90 కిలోల వరకు నూనె తీసిన వేప పిండి (కేకు) తయారవుతుంది. గింజల నాణ్యత బాగుంటే నూనె కాస్త ఎక్కువ వస్తుంది. వేప నూనెను వ్యవసాయంలో పంటలపై చీడపీడల నివారణకు పిచికారీ చేస్తుంటారు. ఔషధాల తయారీకి, చర్మవ్యాధుల నివారణకూ వాడుతుంటారు. వేప పిండిని పంటల సాగులో సేంద్రియ ఎరువుగా వినియోగిస్తుంటారు. వివిధ జిల్లాల్లో సేంద్రియ సాగు చేసే రైతులు వచ్చి కొనుగోలు చేసుకొని తీసుకెళుతుంటారు. ఇప్పుడు ఫోన్లో ఆర్డర్ తీసుకొని ఆర్టీసీ కార్గో ద్వారా కూడా పంపుతున్నారు.

దారి చూపిన డీడీఎస్..

చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజ పంటలు సాగు చేసే సేంద్రియ రైతులను ప్రోత్సహించే స్వచ్ఛంద సంస్థ డక్కన్ డవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) వీరికి వేప కాయలతో సేంద్రియ ఉత్పత్తుల తయారీ పద్ధతిని నేర్పించింది. సుమారు రెండు దశాబ్దాల క్రితమే వేప గింజల నుంచి నూనె, వేప పిండి తీసే యంత్రాల కొనుగోలు చేసేందుకు రుణ సహాయం అందించింది. ఇప్పుడు ఆ యంత్రాలు పనిచేయడం లేదు. అప్పటి మహిళలకు వయస్సు మీద పడటంతో వారి కోడళ్లు, కూతుళ్లు ఈ యూనిట్లను నడుపుతున్నారు. పాతయంత్రాలు పనిచేయకపోవడంతో కొత్త యంత్రాలను కొనుగోలు చేయాల్సి వచ్చింది. ఇందుకోసం బ్యాంకుల ద్వారా కొంత మొత్తాన్ని రుణంగా పొందారు. ఈ రుణంపై వడ్డీలు పెరిగిపోతుండటం తమకు భారంగా మారిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ రుణాలను మాఫీ చేసి ప్రోత్సహించాలని, లేదంటే కనీసం రుణంపై వడ్డీనైనా మాఫీ చేయాలని మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు.

– పాత బాలప్రసాద్, సాక్షి, మెదక్ జిల్లా
ఫొటోలు: మాతంశెట్టి మల్లన్న, జహీరాబాద్ టౌన్



వేప గింజల్లో నుంచి రాళ్లు ఏరి శుభ్రం చేస్తున్న మహిళ

అప్పు భారమైంది



ఇటు వ్యవసాయం పని చేసుకుంటూనే ఏడాదిలో 6నెలల పాటు వేప నూనె, వేప చెక్క (కేక్) తయారు చేస్తున్నాం. మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం సాయం చేయాలి. ఎక్కువ ధర వచ్చేలా చూడాలి. ప్రస్తుతం సరైన మార్కెట్ లేకపోవడంతో చేసిన కష్టమంతా వృథా అవుతోంది. బ్యాంకు రుణాలను వడ్డీతో కలిపి చెల్లిస్తే మాకు ఏమీ మిగలడం లేదు. బ్యాంకు రుణం రద్దు చేయాలి. కనీసం వడ్డీ అయినా రద్దు చేయాలి.

– దవలమ్మ, స్వయం సహాయక బృందం సభ్యురాలు

ఆర్టీసీ కార్గో ద్వారా పంపుతాం



జిడ్చర్ల, కోస్గి వంటి ప్రాంతాలకు వెళ్లి వేపగింజలను కొనుగోలు చేసి తెచ్చుకొని వేప నూనె, వేప చెక్క తయారు చేస్తున్నాం. ఇప్పుడు గింజలు దొరకడం కష్టమవుతోంది. ఏడాదిలో ఆరు నెలలు ఈ పనే చేస్తున్నాం. వేప గింజల రేట్లు పెరిగినా వేప నూనె (కిలో రూ.400), వేప చెక్క/కేక్ (కిలో రూ. 35) రేటు పెంచలేదు. వివిధ జిల్లాల్లో సేంద్రియ సాగు చేసే రైతులు ఇక్కడి వచ్చి కొనుగోలు చేసుకొని తీసుకెళుతుంటారు. ఇప్పుడు ఫోన్లో ఆర్డర్ తీసుకొని ఆర్టీసీ కార్గో ద్వారా కూడా పంపుతున్నాం.

– సువర్ణమ్మ (88979 04571), స్వయం సహాయక బృందం సభ్యురాలు

సాగుబడి

పుబ్బ కార్తె: సెప్టెంబర్ 13 వరకు

పొద చిక్కుడు పంటతో ఏనుగులకు చెక్!


తేనెటీగ పెట్టెలతో కూడిన కంచె


'అట్టుకోంబ అమర' చిక్కుడు పంట పొలంలో మహిళా రైతు చింది

ఏనుగులు జనావాసాల్లోకి, పంట పొలాల్లోకి రాకుండా తిప్పికొట్టేందుకు కేరళవాసులు రెండు పద్ధతులను అవలంభిస్తున్నారు. మొదటిది: తేనెటీగల పెట్టెలతో కూడిన కంచెలు నిర్మించటం. రెండోది: ప్రత్యేక వాసనను వెదజల్లే దేశవాళీ పొద చిక్కుడు పంటను సరిహద్దు పంటగా సాగు చేయటం. మొదటి పద్ధతి కన్నా రెండో పద్ధతి ఎక్కువ ప్రభావశీలంగా పని చేస్తోందని రైతులు చెబుతున్నారు.

గ్రామ సరిహద్దుల్లో తేనెటీగల పెట్టెలతో కూడిన కంచెల (బీహైవ్ ఫెన్సెస్)ను ఏర్పాటు చేశారు. ఏనుగులు అడవి నుంచి గ్రామాల వైపు వచ్చే దారిలో ఈ కంచె తీగలను తాకగానే తేనెటీగలు పెద్దపెట్టున శబ్దం చేస్తూ వాటిని చుట్టుముడతాయి. అవి చేసే శబ్దం ఏనుగులకు గిట్టదు. అందువల్ల అక్కడి నుంచి వెనక్కి వెళ్లిపోతాయి. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పరిశోధకురాలు లూసీ కింగ్ 15 ఏళ్ల క్రితం ఈ పద్ధతిని కనుగొన్నారు. కెన్యా, టాంజానియాలలో ప్రయోగాత్మకంగా ఉపయోగించి, తేనెటీగల కంచెలు ఏనుగులను సమర్థవంతంగా బెదరగొట్టగలవని నిర్ధారించారు. ఆ తర్వాత కేరళలో ఏనుగుల బెడద ఎక్కువగా ఉన్న అట్టప్పాడి తాలూకాలో అనేక గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులకు ఏనుగుల నుంచి కొంతమేరకు ఉపశమనం దొరికింది.

కేరళలో గిరిజనులు మరో సంప్రదాయ పద్ధతిలో కూడా ఏనుగుల సమస్యను పరిష్కరించుకునే ప్రయత్నం చేయటం ఇటీవల వెలుగులోకి వచ్చింది. ఆట్టుకొంబ అమర (అట్టాప్పడీ డొలిఖోస్ బీన్ లేదా లాబ్‌లాబ్ బీన్) అనే స్థానిక రకం పొద చిక్కుడు పంటను ఏనుగులు గ్రామాల్లోకి వచ్చే మార్గాల్లో సాగు చేయటం ద్వారా వాటి రాకను సహజ పద్ధతిలో నిరోధించవచ్చని గిరిజన రైతులు గుర్తించారు.

అట్టాప్పడీ తాలూకాలోని మూలకొంబు అనే గ్రామవాసి అయిన చింది అనే 65 ఏళ్ల మహిళా రైతు ఏనుగులను నిరోధించేందుకు చెట్టు చిక్కుడును సాగు చేస్తున్నారు. అడవి ఏనుగుల గుంపును తేనెటీగల కంచెలు పూర్తిగా ఆపలేకపోతున్నాయన్నారు. ఆట్టుకోంబ అమర వంటి దేశవాళీ పొద చిక్కుడు పంట ప్రభావం చాలా బాగుందన్నారు. 'ఈ చిక్కుడు పంటను కంచె పంటగా వేసినప్పటి నుంచి నా పొలం మీద ఏనుగులు దాడి చెయ్యలేదు. అమర చిక్కుళ్లు మంచి ధరకు అమ్ముడు కావటంతో మంచి ఆదాయం కూడా వస్తోంద'ని చింది సంతోషిస్తున్నారు.

ఈ చిక్కుడు రకం పంట వెదజల్లే ఒక రకమైన ఘాటు వాసన ఏనుగులు, తదితర వన్యప్రాణులకు గిట్టకపోవటం వల్లనే అవి వెనుదిరిగి వెళ్లిపోతున్నాయని చెబుతున్నారు. ఈ సంగతి శాస్త్రీయంగా ఇంకా రుజువు కానప్పటికీ, ప్రజలకు ఏనుగుల బెడద మాత్రం తీరింది. కేరళలో అనాదిగా సాగవుతున్న ఆట్టుకొంబ అమర చిక్కుళ్లు విలక్షణమైన రకం కావటంతో మూడేళ్ల క్రితం జాగ్రఫికల్ ఇండికేషన్ (జిఐ) గుర్తింపు వచ్చింది. దీంతో 'బయోసర్టిఫికేషన్' ఉన్న ఈ చిక్కుళ్లకు ఏకంగా కిలోకు రూ. వెయ్యి వరకు ధర పలుకుతుండటం మరో విశేషం. మళయాళంలో 'ఆట్టు' అంటే మేక. 'కొంబు' అంటే కొమ్ము. కేరళ గిరిజన రైతులు సంప్రదాయ విజ్ఞానంతో కూడిన 'మేక కొమ్ము'లతో ఏనుగులను జయిస్తున్నారన్న మాట!


అట్టుకోంబ అమర చిక్కుడు మొక్క

డ్రాగన్ పౌడర్ టెక్నాలజీ రెడీ!



అధికంగా యాంటీఆక్సిడెంట్లు, పీచుపదార్థం, ఇంకా ఇతర పోషకాలతో కూడిన డ్రాగన్ ఫ్రూట్ ఇటీవల కాలంలో సూపర్ ఫ్రూట్‌గా ప్రాచుర్యంలోకి వచ్చింది. ప్రారంభమైన 5–7 ఏళ్లలోనే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పాటు మరో 9 రాష్ట్రాలకు డ్రాగన్ సాగు విస్తరించింది. పింక్/రెడ్, వైట్ పల్ప్ రకాలు సాగవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఈ పంటకు 'కమలం' అని పేరుపెట్టింది. బెంగళూరులోని భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ (ఐఐహెచ్‌ఆర్) గత ఏడాది డ్రాగన్ జ్యూస్ ఉత్పత్తి సాంకేతికతను రూపొందించిన సంగతి తెలిసిందే. తాజాగా, రెడ్/పింక్ డ్రాగన్ ఫ్రూట్‌తో పౌడర్ (పిండి)ని తయారు చేసే టెక్నాలజీని రూపొందించింది. కర్ణాటకలోని కొడగు జిల్లా చెట్టల్లిలోని ఐఐహెచ్‌ఆర్‌కు చెందిన కేంద్రీయ ఉద్యాన పంటల ప్రయోగ కేంద్రం ఈ టెక్నాలజీ అభివృద్ధికి వేదికైంది.

డ్రాగన్ పండ్లతో పిండిగా మార్చే ప్రక్రియలో రెండు పద్ధతులున్నాయి. స్ప్రే డ్రైడ్ పద్ధతిలో తయారైన పిండికి కిలో రూ. 4 వేలు, ఫ్రీజ్ డ్రైడ్ పద్ధతిలో తయారైన పిండికి కిలో రూ. 12 – 15 వేల ధర పలుకుతోంది. ఈ రెండు పద్ధతుల్లో పిండిని వాణిజ్యపరంగా ఉత్పత్తి చేయాలంటే భారీ పెట్టుబడి అవసరం అవుతుంది. అయితే, ఇందులో సగం ఖర్చుతోనే డ్రాగన్ పిండిని ఉత్పత్తి చేసే టెక్నాలజీని బెంగళూరులోని ఐఐహెచ్‌ఆర్ ఇటీవల రూపొందించింది.

మార్కెట్‌లో ఉన్న డ్రాగన్ పిండి కంటే అత్యంత పోషక విలువలతో ఉండే విధంగా ఈ టెక్నాలజీతో డ్రాగన్ పిండిని తయారు చేయవచ్చని, ఈ పిండిని సహజ రంగు పదార్థంగా అనేక ప్రాసెస్డ్ ఆహారోత్పత్తుల్లో కలపవచ్చని ఐఐహెచ్‌ఆర్ తెలిపింది. ఐస్‌క్రీమ్‌లు, మిల్క్‌షేక్‌లు, జ్యూస్‌లు, కేకులు, బిస్కట్లు, టీ బ్యాగ్స్, మఫిన్స్ తయారీలో డ్రాగన్ పిండిని విస్తృతంగా వాడుతున్నారు. ఐఐహెచ్‌ఆర్ రూపొందించిన డ్రాగన్ పొడి సాంకేతికతను అందిపుచ్చుకొని రైతులకు మెరుగైన ఆదాయం తెప్పించేందుకు వాణిజ్య సంస్థలు/ ఎఫ్‌పిఓలు/ కోఆపరేటివ్‌లు కృషి చెయ్యాలి.


డ్రాగన్ పిండి కలిపిన ఉత్పత్తులు

ఇంటర్ కాంటినెంటల్ ఫుట్‌బాల్ కప్: నేడు మారిషస్‌తో భారత్ పోరు

హైదరాబాద్‌లో నేటి నుంచి జరిగే ఇంటర్ కాంటినెంటల్ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో తొలి మ్యాచ్‌లో ఆతిథ్య భారత్... మారిషస్‌తో తలపడుతుంది. 16 ఏళ్ల తర్వాత నగరంలో భారత సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ జట్టు మ్యాచ్ ఆడనుంది. ఈ ముక్కోణపు టోర్నీలో సిరియా మూడో జట్టుగా బరిలోకి దిగుతోంది. నేటి నుంచి 9వ తేదీ వరకు జరిగే టోర్నీ మ్యాచ్‌లన్నీ ఇక్కడి గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరుగుతాయి. ఫుట్‌బాల్ ప్రేక్షకులు ప్రత్యక్షంగా మ్యాచ్‌ను చూడాలనుకుంటే ticketgenie.in వెబ్‌సైట్‌లో రూ.200 చెల్లించి టికెట్లను కొనుగోలు చేయవచ్చు. రాత్రి 7.30 నుంచి మ్యాచ్ జరుగుతుంది. భారత కొత్త కోచ్ మనోలో మార్కెజ్ మాట్లాడుతూ ఈ టోర్నీని 'ఏఎఫ్‌సీ ఆసియా కప్' క్వాలిఫయర్స్‌కు సన్నాహకంగా ఉపయోగించుకుంటామని చెప్పారు. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలలు తమకు చాలా కీలకమని, ప్రతీ మ్యాచ్‌లో పోరాటం చేస్తామని అన్నారు.



పతకాల మోత

భారత్‌కు ఒకే రోజు ఏడు పతకాలు

- బ్యాడ్మింటన్‌లో నితేశ్‌కు... జావెలిన్ త్రోలో సుమిత్‌కు స్వర్ణాలు
- రజతాలు నెగ్గిన సుహాస్, తులసిమతి, యోగేశ్
- ఆర్చరీలో శీతల్-రాకేశ్ జోడీకి కాంస్యం
- షట్లర్ మనీషాకు కాంస్యం


నితేశ్ కుమార్


సుమిత్


యోగేశ్

పారాలింపిక్స్‌లో సోమవారం భారత క్రీడాకారులు పతకాల మోత మోగించారు. రెండు స్వర్ణ పతకాలు, మూడు రజతాలు, రెండు కాంస్యాలతో కలిపి మొత్తం ఏడు పతకాలను సొంతం చేసుకున్నారు. ఒకే రోజు భారత్ ఖాతాలో రెండు పసిడి పతకాలు చేరడం విశేషం. ముందుగా తొలిసారి పారాలింపిక్స్‌లో ఆడుతున్న షట్లర్ నితేశ్ కుమార్ బంగారు పతకంతో అదరగొట్టగా... మూడేళ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం నెగ్గిన జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్ అదే ప్రదర్శనను 'పారిస్'లోనూ పునరావృతం చేశాడు. తద్వారా దేవేంద్ర ఝఝారియా, అవని లేఖరా తర్వాత పారాలింపిక్స్‌లో రెండు స్వర్ణ పతకాలు గెలిచిన మూడో భారత ప్లేయర్‌గా సుమిత్ అంటిల్ గుర్తింపు పొందాడు.

పారిస్: అంచనాలను అందుకుంటూ భారత దివ్యాంగ క్రీడాకారులు సోమవారం పారాలింపిక్స్‌లో అదరగొట్టారు. ఏడు పతకాలతో తమ సత్తాను చాటుకున్నారు. పురుషుల బ్యాడ్మింటన్ సింగిల్స్ ఎస్ఎల్3 కేటగిరీలో నితేశ్ కుమార్ చాంపియన్‌గా అవతరించాడు. డేనియల్ బెథెల్ (బ్రిటన్)తో జరిగిన ఫైనల్లో నితేశ్ 21-14, 18-21, 23-21తో గెలుపొందాడు. నిర్ణాయక మూడో గేమ్‌లో నితేశ్ రెండుసార్లు మ్యాచ్ పాయింట్లను కాపాడుకొని నెగ్గడం విశేషం. పురుషుల బ్యాడ్మింటన్ సింగిల్స్ ఎస్ఎల్4 కేటగిరీలో ఐఏఎస్ ఆఫీసర్ సుహాస్ యతిరాజ్ మరోసారి రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. గత టోక్యో పారాలింపిక్స్‌లోనూ రన్నరప్‌గా నిలిచిన సుహాస్ ఈసారీ రెండో స్థానాన్ని సంపాదించాడు. ఫైనల్లో 41 ఏళ్ల సుహాస్ 9-21, 13-21తో డిఫెండింగ్ చాంపియన్ లుకాస్ మజుర్ (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయాడు. మహిళల బ్యాడ్మింటన్ సింగిల్స్ ఎస్‌యు5 కేటగిరీలో భారత క్రీడాకారిణులు తులసిమతి రజతం పతకం నెగ్గగా... మనీషా రామదాస్ కాంస్య పతకాన్ని సంపాదించింది. ఫైనల్లో తులసిమతి 17-21, 10-21తో యాంగ్ కియు జియా (చైనా) చేతిలో ఓడింది. కాంస్య పతక మ్యాచ్‌లో మనీషా 21-12, 21-8తో కేథరీన్ రొసెన్‌గ్రెన్ (డెన్మార్క్)పై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్4 కాంస్య పతక మ్యాచ్‌లో భారత ప్లేయర్ సుకాంత్ కదమ్ 17-21, 18-21తో ఫ్రెడీ సెతియవాన్ (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయాడు.

'సూపర్' సుమిత్

అథ్లెటిక్స్‌లో భారత్‌కు ఒక స్వర్ణం, ఒక రజతంతో కలిపి రెండు పతకాలు దక్కాయి. పురుషుల జావెలిన్ త్రో ఎఫ్64 కేటగిరీలో డిఫెండింగ్ చాంపియన్ సుమిత్ అంటిల్ తన పసిడి పతకాన్ని నిలబెట్టుకున్నాడు. సుమిత్ రెండో ప్రయత్నంలో జావెలిన్‌ను 70.59 మీటర్ల దూరం విసిరాడు. ఈ ప్రయత్నం సుమిత్‌కు పసిడి పతకాన్ని ఖరారు చేసింది. నిర్ణీత ఆరు త్రోల తర్వాత కూడా ఇతర అథ్లెట్లు సుమిత్ దరిదాపులకు రాలేకపోయారు. అంతకుముందు పురుషుల డిస్కస్ త్రో ఎఫ్56 కేటగిరీలో భారత అథ్లెట్ యోగేశ్ కథునియా రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. యోగేశ్ డిస్క్‌ను 42.22 మీటర్ల దూరం విసిరాడు.


రాకేశ్ శీతల్

శీతల్-రాకేశ్ జోడీకి కాంస్యం

ఆర్చరీ మిక్స్‌డ్ కాంపౌండ్ టీమ్ విభాగంలో శీతల్ దేవి-రాకేశ్ కుమార్ జంట కాంస్య పతకాన్ని దక్కించుకుంది. కాంస్య పతక మ్యాచ్‌లో శీతల్-రాకేశ్ 156-155తో ఎలెనోరా సార్టి-మాటియో బొనాసినా (ఇటలీ) జంటపై గెలిచింది. సెమీఫైనల్లో శీతల్-రాకేశ్ ద్వయం 'షూట్ ఆఫ్'లో ఇరాన్ చేతిలో ఓడిపోయి ఫైనల్ చేరలేకపోయింది. షూటింగ్‌లో నిహాల్ సింగ్, అమీర్ అహ్మద్ భట్ మిక్స్‌డ్ 25 మీటర్ల పిస్టల్ ఎస్‌హెచ్1 కేటగిరీలో క్వాలిఫయింగ్‌లోనే వెనుదిగిరారు. పారిస్ పారాలింపిక్స్‌లో భారత్ 3 స్వర్ణాలు, 5 రజతాలు, 6 కాంస్యాలతో కలిపి 14 పతకాలతో 14వ స్థానంలో ఉంది.

రైలు ప్రమాదం నుంచి ఒలింపిక్ స్వర్ణం వరకు...

పారాలింపియన్ నితేశ్ కుమార్ స్ఫూర్తిదాయక ప్రయాణం

తండ్రి నేవీ ఆఫీసర్... ఆయనను చూసి తానూ అలాగే యూనిఫామ్ సర్వీస్‌లోకి వెళ్లాలనుకున్నాడు... కానీ అనూహ్య ఘటనతో అది సాధ్యం కాలేదు. ఆ తర్వాత చదువుపై దృష్టి పెట్టి ఐఐటీ వరకు వెళ్లాడు... కానీ శరీరం అక్కడ ఉన్నా మనసు మాత్రం ఆటలపై ఉంది... కానీ అనుకోని వైకల్యం వెనక్కి లాగుతోంది... అయినా సరే ఎక్కడా తగ్గలేదు... అణువణువునా పోరాటస్ఫూర్తి నింపుకున్నాడు. బ్యాడ్మింటన్ క్రీడలోకి ప్రవేశించి పట్టుదలగా శ్రమిస్తూ అంచెలంచెలుగా ముందుకు పోయాడు. ఇప్పుడు పారాలింపిక్స్‌లో స్వర్ణం సాధించి తన కలను పూర్తి చేసుకున్నాడు. పారా షట్లర్ నితేశ్ కుమార్ విజయగాథ ఇది.



2009... నితేశ్ కుమార్ వయసు 15 ఏళ్లు. అప్పటికి అతనికి ఆటలంటే చాలా ఇష్టం. ఫుట్‌బాల్‌ను బాగా ఆడేవాడు. అయితే ఆ సమయంలో జరిగిన అనూహ్య ఘటన అతని జీవితాన్ని మలుపు తిప్పింది. విశాఖపట్నం వద్ద జరిగిన రైలు ప్రమాదంలో నితేశ్ తన కాలును కోల్పోయాడు. కోలుకునే క్రమంలో సుదీర్ఘ కాలం పాటు ఆస్పత్రి బెడ్‌పైనే ఉండి పోవాల్సి వచ్చింది. ఆ తర్వాత పరిస్థితి మెరుగైనా ఆటలకు పూర్తిగా గుడ్‌బై చెప్పేయాల్సి వచ్చింది. దాంతో చదువుపై దృష్టి పెట్టిన నితేశ్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), మండీలో సీటు సంపాదించాడు. అక్కడ ఇంజినీరింగ్ చేస్తున్న సమయంలోనే బ్యాడ్మింటన్ ఆటపై ఆసక్తి పెరిగింది. పారా షట్లర్ ప్రమోద్ భగత్‌ను చూసి అతను స్ఫూర్తి పొందాడు. ఆటగాడిగా ఉండాలంటే ఎంత ఫిట్‌గా ఉండాలనే విషయంలో కోహ్లి నుంచి ప్రేరణ పొందినట్లు నితేశ్ చెప్పాడు.

కోల్పోయిన కాలు స్థానంలో కృత్రిమ కాలును అమర్చుకునే క్రమంలో నితేశ్ పుణేలోని 'ఆర్టిఫీషియల్ లింబ్స్ సెంటర్'కు చేరాడు. అక్కడ ఎంతో మంది తనకంటే వయసులో పెద్దవారు కూడా ఎలాంటి లోపం కనిపించనీయకుండా కష్టపడుతున్న తీరు అతడిని ఆశ్చర్యపర్చింది. '40-45 ఏళ్ల వయసు ఉన్నవారు కూడా కృత్రిమ అవయవాలతో ఫుట్‌బాల్, సైక్లింగ్, రన్నింగ్ చేయడం చూశాను. ఈ వయసులో వారు చేయగా లేనిది నేను చేయలేనా అనిపించింది. ఆపై పూర్తిగా బ్యాడ్మింటన్‌పై దృష్టి పెట్టాను' అని హరియాణాకు చెందిన నితేశ్ చెప్పాడు. 2020లో జరిగిన పారా బ్యాడ్మింటన్ జాతీయ చాంపియన్‌షిప్‌లో తొలిసారి నితేశ్ బరిలోకి దిగాడు. తను ఆరాధించే భగత్‌తోపాటు మనోజ్ సర్కార్‌వంటి సీనియర్‌ను ఓడించి స్వర్ణం గెలుచుకున్నాడు. దాంతో ఈ ఆటలో మరిన్ని సాధించాలనే పట్టుదల పెరిగింది. గత ఒలింపిక్స్‌లో భగత్ స్వర్ణం గెలుచుకోవడం చూసిన తర్వాత తానూ ఒలింపిక్స్ పతకం సాధించగలననే నమ్మకం నితేశ్‌కు కలిగింది. ఈ క్రమంలో గత మూడేళ్లుగా తీవ్ర సాధన చేసిన అతను ఎట్టకేలకు అనుకున్నది సాధించాడు. పారిస్‌లో ఆడిన ఐదు మ్యాచ్‌లలోనూ విజయాలు అందుకొని స్వర్ణపతకంతో సగర్వంగా నిలిచాడు. **–సాక్షి క్రీడా విభాగం**

కోకో గాఫ్ అవుట్

ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిన డిఫెండింగ్ చాంపియన్



న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోకో గాఫ్ (అమెరికా) ప్రస్థానం ప్రిక్వార్టర్ ఫైనల్లో ముగిసింది. అమెరికాకే చెందిన 13వ సీడ్ ఎమ్మా నవారోతో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంకర్ కోకో గాఫ్ 3-6, 6-4, 3-6తో ఓడిపోయింది. 2 గంటల 12 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో కోకో గాఫ్ ఏకంగా 19 డబుల్ ఫాల్ట్‌లు చేయడం గమనార్హం. కేవలం 14 విన్నర్స్ కొట్టిన కోకో 60 అనవసర తప్పిదాలు చేసింది. తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయిన కోకో ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. మరోవైపు ఏడో సీడ్ కిన్‌వెన్ జెంగ్ (చైనా), రెండో ర్యాంకర్ సబలెంకా (బెలారస్) కూడా క్వార్టర్ ఫైనల్ బెర్త్‌లను ఖరారు చేసుకున్నారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో కిన్‌వెన్ జెంగ్ 7-6 (7/2), 4-6, 6-2తో డోనా వెకిచ్ (క్రొయేషియా)పై, సబలెంకా 6-2, 6-4తో ఎలీజ్ మెర్‌టెన్స్ (బెల్జియం)పై గెలుపొందారు. పురుషుల సింగిల్స్ విభాగంలో ఆరో సీడ్ ఆంద్రీ రుబ్లెవ్ (రష్యా), ఎనిమిదో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే) ప్రిక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగారు. పురుషుల డబుల్స్ మూడో రౌండ్‌లో రోహన్ బోపన్న (భారత్)-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 1-6, 5-7తో మాక్సిమో-మొల్తాని (అర్జెంటీనా) జోడీ చేతిలో ఓడిపోయింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా


మా లైన్ దాటలేదు

- 'దిల్' రాజు


● 'దిల్' రాజు, సుహాస్, సంగీర్తన

''దిల్' రాజు ప్రొడక్షన్ అంటే కుటుంబంతో కలిసి చూసే సినిమా ఉంటుంది. అయితే 'జనక అయితే గనక' కాస్త భిన్నంగా ఉంటుంది. కానీ మా బేనర్ లైన్ దాటకుండా తీశాం'' అన్నారు 'దిల్' రాజు. సుహాస్, సంగీర్తన హీరో హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'జనక అయితే గనక'. దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌పై శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత ఈ సినిమాను నిర్మించారు. సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో 'దిల్' రాజు మాట్లాడుతూ – ''చేస్తున్న ప్రతి సినిమాకీ ఒక్కో మెట్టు ఎక్కుతున్న సుహాస్ కొత్త కథలు ఎంచుకుంటున్నాడు. సుహాస్ అంటే మినిమమ్ గ్యారెంటీ అని యూఎస్ డిస్ట్రిబ్యూటర్లు కూడా అంటున్నారు. ఇక చిన్న సినిమాలకు ప్రీమియర్లు కలిసి వస్తున్నాయి. మేం సెప్టెంబర్ 6న ప్రీమియర్లు వేస్తున్నాం. ఈ సినిమా చూశాక వినోదంతో పాటు మంచి సందేశం ఇచ్చారనే ఫీల్‌తో థియేటర్ నుంచి బయటకు వస్తారు'' అని అన్నారు. ''ప్రశాంత్ నీల్‌కి ఈ కథ తెలుసు... చాలా బాగుందన్నారు'' అని సందీప్ రెడ్డి చెప్పారు. ''ఈ సినిమాని ఓవర్సీస్‌లో డిస్ట్రిబ్యూట్ చేయాలనుకుంటున్నానని 'దిల్' రాజుగారితో చెబితే ఓకే అన్నారు'' అని సుహాస్ తెలిపారు. ఎడిటర్ కోదాటి, సంగీతదర్శకుడు విజయ్ బుల్గానిన్ పాల్గొన్నారు.

రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'కూలీ'. కళానిధి మారన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమాలో దేవా పాత్రలో రజనీకాంత్ నటిస్తున్నట్లుగా వెల్లడించి, ఆయన కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. నాగార్జున, సత్యరాజ్, ఉపేంద్ర, శ్రుతీ హాసన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.



బిల్లా... రంగ... బాషా


● సుదీప్, అనూప్

'విక్రాంత్ రోణ' వంటి బ్లాక్ బస్టర్ ఫిల్మ్ తర్వాత హీరో కిచ్చా సుదీప్, దర్శకుడు అనూప్ భండారి కాంబినేషన్‌లో రూపొందనున్న తాజా సినిమాకు 'బిల్లా రంగ బాషా' అనే టైటిల్‌ను ఖరారు చేసి, లోగోను రిలీజ్ చేశారు. 'హను-మాన్' ఫేమ్ నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ సినిమాను నిర్మించనున్నారు. 2209 కాలంలో ఈ సినిమా కథనం ఉంటుందన్నట్లుగా కాన్సెప్ట్ వీడియో స్పష్టం చేస్తోంది. సోమవారం (సెప్టెంబరు 2) సుదీప్ బర్త్ డే సందర్భంగా 'బిల్లా రంగ బాషా'ను అధికారికంగా ప్రకటించారు. ''ఈ సినిమా కథాంశాన్ని నిరంజన్ రెడ్డిగారికి చెప్పినప్పుడు ఆయన థ్రిల్ అయ్యారు'' అని అన్నారు అనూప్ భండారి. ''ఈ కథ విన్నప్పుడు మేమే నిర్మించాలనుకున్నాం'' అని నిర్మాతలు తెలిపారు.

దిగోట్‌ని ఎంజాయ్ చేస్తారు

- దర్శకుడు వెంకట్ ప్రభు


● స్నేహా, మీనాక్షి, ప్రశాంత్, వెంకట్ ప్రభు, యువన్, వైభవ్, రవిశంకర్

''ది గోట్: ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్' సినిమా చిత్రీకరణ ఏడాదిలోపే పూర్తయింది. హాలీవుడ్‌లో అయితే ఈ తరహా సినిమా తీయడానికి ఇంకాస్త ఎక్కువ సమయమే పట్టేది. ఇది పొలిటికల్ సినిమా కాదు... పొలిటికల్ డైలాగ్స్ లేవు. అలాంటి డైలాగ్స్ పెట్టమని విజయ్ అడగరు'' అన్నారు దర్శకుడు వెంకట్ ప్రభు. విజయ్ ద్విపాత్రాభినయం చేసిన తాజా చిత్రం 'ది గోట్: ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్'. ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటించగా, స్నేహా, ప్రశాంత్, లైలా, ప్రభుదేవా కీలక పాత్రల్లో నటించారు. వెంకట్ ప్రభు దర్శకత్వంలో ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 5న రిలీజ్ కానుంది. తెలుగు వెర్షన్‌ను మైత్రీ మూవీ మేకర్స్ రిలీజ్ చేస్తోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో బిగ్ టికెట్‌ను మైత్రీ నిర్మాత రవిశంకర్, మైత్రీ డిస్ట్రిబ్యూటర్ శశిలకు అందించారు ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్స్ అర్చనా. అనంతరం దర్శకుడు వెంకట్ ప్రభు మాట్లాడుతూ– ''ఏజీఎస్ సంస్థలో నా తొలి సినిమా ఇది. సపోర్ట్ చేసిన నిర్మాత అర్చనగారికి, ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్న మైత్రీవారికి ధన్యవాదాలు. ఈ మూవీని ఆడియన్స్ ఫుల్‌గా ఎంజాయ్ చేస్తారు'' అన్నారు. ''గోట్' రిలీజ్ కోసం ఏజీఎస్‌తో అసోసియేట్ అయిన మైత్రీ మూవీస్‌వారికి థ్యాంక్స్. మా 'గోట్' విజయ్‌గారు'' అని వెల్లడించారు ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్స్ అర్చనా కల్పాతి. ''వెంకట్ ప్రభుగారు మంచి విజన్ ఉన్న దర్శకుడు. పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్ మూవీగా 'ది గోట్' రాబోతోంది'' అని పేర్కొన్నారు ప్రశాంత్. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ శశి మాట్లాడుతూ– ''విజయ్‌గారి ఫ్యాన్స్ కోసం ఎర్లీ మార్నింగ్ షోలను ప్లాన్ చేస్తున్నాం'' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నటులు వైభవ్, ప్రేమ్ జీ, నటి లైలా, నిర్మాత అర్చనా కల్పాతి, ఈ సినిమా అసోసియేట్ ప్రొడ్యూసర్ ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ ఆర్టిస్టుగా చేశాను

- సుదర్శన్ పరుచూరి


● పరుచూరి వెంకటేశ్వర రావు, సుదర్శన్

ప్రముఖ రచయిత పరుచూరి వెంకటేశ్వర రావు మనవడు సుదర్శన్ పరుచూరి హీరోగా పరిచయం కానున్న చిత్రానికి 'మిస్టర్ సెలబ్రిటీ' టైటిల్‌ని ఖరారు చేశారు. చందిన రవికిశోర్ దర్శకత్వంలో ఎన్. పాండు రంగా రావు, చిన్న రెడ్డయ్య నిర్మించిన ఈ సినిమా విడుదలకు రెడీ అవుతోంది. సోమవారం జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ– ''మా తమ్ముడు (పరుచూరి గోపాలకృష్ణ) మంచి విమర్శకుడు. ఈ సినిమా చూసి సుదర్శన్ బాగున్నాడని, సినిమా బాగుందని మెచ్చుకున్నాడు'' అన్నారు. ''నేను హీరో అవుతానని చెప్పగానే మా తాతగారు కొన్ని పరీక్షలు పెట్టారు. ఎవరికీ చెప్పకుండా నేను జూనియర్ ఆర్టిస్ట్‌గా చేసి, సినిమా కష్టాలు తెలుసుకున్నాను'' అన్నారు పరుచూరి సుదర్శన్. ''సాధారణ వ్యక్తి నుంచి సెలబ్రిటీల వరకు ఇబ్బంది పడే ఓ ఇష్యూని ఈ సినిమాలో చూపించాం'' అని తెలిపారు రవికిశోర్. ''పరుచూరివారి ఇంటి నుంచి హీరోని పరిచయం చేస్తుండటం హ్యాపీ'' అన్నారు చిన్న రెడ్డయ్య. రచయిత సాయిమాధవ్ బుర్రా, ఎడిటర్ శివ, నటుడు రఘుబాబు మాట్లాడారు.

ఓటీటీ ఇది చూడొచ్చు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'ప్రైమల్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

దేవుడా... ఈ స్థితి ఎవరికీ రాకూడదు!



థ్రిల్లర్ చిత్రాలను మనం గతంలో ఎన్నో చూశాం. అదే జోనర్‌లో ఎప్పటికప్పుడు వినూత్న పంథాను ఎంచుకుంటూ వర్ధమాన దర్శకులు వివిధ భాషలలో సినిమాలు తీయడానికి ప్రయత్నిస్తూనే వున్నారు. థ్రిల్లర్ అంటే సినిమా చూసే ప్రేక్షకుడిని తమ స్క్రీన్‌ప్లేతో అలరించాలి... కథను రక్తి కట్టించాలి. 2019లో విడుదలైన హాలీవుడ్ చిత్రం 'ప్రైమల్' ఆ కోవలోనే ఉంటుంది. ఇది ఇటీవలే ఓటీటీలో విడుదలైంది. ప్రముఖ నటుడు నికోలస్ కేజ్ నటించిన ఈ సినిమా ఓ అసలు సిసలైన థ్రిల్లర్ అని చెప్పాలి. నిక్ పావెల్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా కథ 70 శాతం నడి సముద్రంలోని ఓ ఓడలోనే జరుగుతుంది. కథాంశానికొస్తే... వాల్ష్ పాత్రలో నటించిన నికోలస్ కేజ్ ప్రమాద జంతువులను అడవిలో పట్టుకొని నగరంలో జంతు శాలలకు అమ్ముకునే ప్రమాద వృత్తిలో ఉంటాడు. ఈ దశలో అతి ప్రమాదకరమైన వైట్ జాగ్వర్‌ను పట్టుకుని జాగ్వర్‌తో పాటు విషపూరిత పాములు, కోతులు మరికొన్ని జంతువులను కూడా ఓ ఓడలో వేరే దేశానికి తరలిస్తుంటాడు. అనుకోకుండా అదే ఓడలో కరడుగట్టిన నేరస్తుడైన రిచర్డ్ లోఫర్‌ను కూడా అమెరికా పోలీసులు తరలించడానికి వస్తారు. ఓడ ప్రమాదకర జంతువులతో పాటు అతి ప్రమాదకరమైన నేరస్తుడుతో తన ప్రయాణాన్ని ప్రారంభిస్తుంది. సముద్ర మార్గంలో కొంత దూరం ప్రయాణించాక నేరస్తుడు తాను తప్పించుకొని ఓడలో వున్న జంతువులను వాటి చెరసాలనుండి విడిపిస్తాడు. వాల్ష్ తన జంతువులతో పాటు ఓడలో వున్న మిగతా పోలీసులను, అలాగే ఓడను ఆ నేరస్తుడి బారి నుండి ఎలా రక్షించాడన్నదే మిగతా కథ. విలన్ పాత్రలో కెవిన్ తన నటనతో సినిమాకే హైలెట్‌గా నిలిచాడు. ఓ టైమ్‌లో ప్రేక్షకుడు దేవుడా... ఈ స్థితి ఎవరికీ రాకూడదు అని కచ్చితంగా అనుకుంటాడు. స్క్రీన్‌ప్లే నిడివి తక్కువ ఉండి థ్రిల్లర్ జోనర్ ప్రేక్షకులకు సరైన ఎంటర్‌టైనర్ అయిన ఈ 'ప్రైమల్' సినిమా లయన్స్ గేట్ ఓటీటీలో ఉంది. మరింకేం... వాచ్ చేయండి.

– ఇంటూరు హరికృష్ణ

చిన్న కథ కాదు... పిల్లలే హీరోలు

- సృజన్ యరబోలు



''కన్నడలో 'కాంతార', మలయాళంలో 'మంజుమ్మల్ బాయ్స్', తమిళంలో 'మహారాజా' తరహాలో తెలుగులో '35: చిన్న కథ కాదు' సినిమా కూడా విజయం సాధిస్తుంది. బాపు, కె. విశ్వనాథ్, బాలచందర్‌గార్ల సినిమాలను గుర్తు చేస్తుంది'' అన్నారు నిర్మాత సృజన్ యరబోలు. నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం '35: చిన్న కథ కాదు'. నంద కిశోర్ దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో సృజన్ మాట్లాడుతూ– ''ఓ స్కూల్ పిల్లవాడికి లెక్కలు రాకపోతే ప్రత్యామ్నాయంగా ఏం చేయొచ్చని ఓ తండ్రి ఏం ఆలోచించాడు? అన్నదే కథ. ఈ చిత్రకథ తిరుపతి నేపథ్యంలో జరుగుతుంది. చెప్పాలంటే... కథలో తిరుపతి అనే ప్లేస్ కూడా ఓ క్యారెక్టర్‌లా ఆడియన్స్‌కు అనిపిస్తుంది. సినిమాలో మంచి మదర్ సెంటిమెంట్ ఉంది. మదర్ సెంటిమెంట్‌ను మించిన కమర్షియల్ అంశం ఏం ఉంటుంది? ఇంకా తండ్రీకొడుకులు, అన్నాచెల్లెళ్లు... ఇలా చాలా రిలేషన్స్ సినిమాలో ఉన్నాయి. స్కూల్ ఎపిసోడ్స్ బాగుంటాయి. ఓ విధంగా పిల్లలే ఈ సినిమాకు హీరోలనుకోవచ్చు. ప్రస్తుతం 'గతం 2', తరుణ్ భాస్కర్–ఈషా రెబ్బా కాంబినేషన్‌లోని సినిమాలు ఉన్నాయి. 'మహారాజా' తరహాలో ఓ థ్రిల్లర్ మూవీ కూడా ఉంది. రమ్యకృష్ణగారిని అనుకుంటున్నాం'' అని అన్నారు.

నా సినిమాపై ఎమర్జెన్సీ విధించారు!

- కంగనా రనౌత్



''నేనెంతో ఆత్మగౌరవంతో ఈ సినిమాని రూపొందించాను. కత్తెర లేని వెర్షన్‌నే రిలీజ్ చేయాలని నిశ్చయించుకున్నాను. న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాను. అన్‌కట్ వెర్షన్‌నే విడుదల చేస్తాను'' అని కంగనా రనౌత్ అన్నారు. కంగనా రనౌత్ నటించి, స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. భారత దివంగత ప్రధాని ఇందిరా గాంధీ జీవితం నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం ఇది. గత ఏడాది నవంబరులో విడుదల కావాల్సిన ఈ చిత్రం వాయిదా పడుతూ వచ్చింది. ఈ నెల 6న విడుదల కావాల్సి ఉండగా సెన్సార్ సమస్యలు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో కంగనా రనౌత్ మాట్లాడుతూ– ''నా సినిమాపై ఎమర్జెన్సీ విధించారు. ఇది ఘోరమైన పరిస్థితి. మన దేశం విషయంలో చాలా నిరాశగా ఉన్నాను. ఓటీటీలో హింస, అశ్లీలం వంటివి చూపించినా అభ్యంతరం చెప్పరు. ఓటీటీకి అంత స్వేచ్ఛ ఉంది. నా సినిమా విషయంలో ఇందిరా గాంధీ హత్యను చూపించకూడదనీ, భింద్రన్‌వాలేను చూపించవద్దనీ, పంజాబ్ అల్లర్లను చూపించవద్దనే ఒత్తిడి ఉంది. ఇవేవీ చూపించొద్దంటే ఇక చూపించడానికి ఏం మిగిలి ఉంటుందో? కొన్ని సినిమాలు రూపొందించడానికి కొందరికి మాత్రమే సెన్సార్‌షిప్ ఉంటుంది'' అని ఘాటుగా స్పందించారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	194	82,560
నిఫ్టీ ▲	43	25,279

విదేశీ సూచీలు (శుక్ర రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	17,714	▲ 197
డోజోన్స్	41,563	▲ 228
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,364	▼ 13
డాక్స్	18,931	▲ 24
షాంఘై	2,811	▼ 37
నికాయ్	38,701	▲ 53

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,511
బంగారం (99.5 స్వచ్ఛత)	71,225
వెండి (కేజీ)	82,780

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		83.47	84.49
£	బ్రిటన్ పౌండ్		108.99	111.59
€	యూరో		91.65	94.04
¥	జపాన్ ఎన్ (100)		57.34	58.65
AUS	ఆస్ట్రేలియా డాలర్		55.85	57.80
S$	సింగపూర్ డాలర్		61.87	66.54
SAR	సౌదీ రియాల్		21.48	23.04
UAE D	యూఏఈ దిర్హామ్		21.96	23.74
¥	చైనా యువాన్		10.92	12.74

తగ్గిన ఆల్టో, ఎస్‌-ప్రెస్సో ధరలు



న్యూఢిల్లీ: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఎంట్రీ లెవెల్ మోడళ్లు అయిన ఆల్టో కె10, ఎస్‌-ప్రెస్సో ధరలను తగ్గించింది. ఎస్‌-ప్రెస్సో ఎల్‌ఎక్స్‌ఐ పెట్రోల్ రూ.2,000, ఆల్టో కె10 వీఎక్స్‌ఐ పెట్రోల్ వేరియంట్‌పై రూ.6,500 డిస్కౌంట్‌ను కంపెనీ ప్రకటించింది. తాజా నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని కంపెనీ సోమవారం తెలిపింది. వేరియంట్‌నుబట్టి ఎక్స్‌షోరూంలో ఆల్టో కె10 ధర రూ.3.99 లక్షలు మొదలుకుని రూ.5.96 లక్షల వరకు ఉంది. ఎస్‌-ప్రెస్సో ధర రూ.4.26 లక్షల నుంచి రూ.6.11 లక్షల వరకు ఉంది.

ఎండీపీహెచ్‌కు హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్‌పోర్ట్ అవార్డు

ఇండోర్: అగరబత్తీల తయారీలో మైసూర్ దీప్ పర్ఫ్యూమరీ హౌస్(ఎండీపీహెచ్) ఎగుమతుల ప్రోత్సాహక మండలి నుంచి ఉత్తమ ఎగుమతిదారు అవార్డు అందుకుంది. కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్, ఆ శాఖ కార్యదర్శి రచన షా చేతుల మీదుగా ఈపీసీహెచ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్ కే వర్మ అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా కంపెనీ డైరెక్టర్ అంకిత్ అగర్వాల్ మాట్లాడుతూ 'మా ఉత్పత్తులను ప్రపంచం నలుమూలలకు చేర్చేందుకు సహకరించిన ఎగుమతుల ప్రోత్సాహక మండలికి కృతజ్ఞతలు. ఆధునిక కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా సంప్రదాయ అగరబత్తులను మరింత నాణ్యతతో తయారు చేసేందుకు కృషి చేస్తాము' అన్నారు.



జీఆర్‌టీ జ్యువెలర్స్ 'వెడ్డింగ్ అండ్ సెలబ్రేషన్ కలెక్షన్'

హైదరాబాద్: వివాహ వేడుకల కోసం జీఆర్‌టీ జ్యువెలర్స్ సాటిలేని హస్తకళతో ఆభరణాల డిజైన్లను విడుదల చేసింది. బంగారం, వజ్రాలు, ప్లాటినం, వెండి, విలువైన రత్నాలతో రూపొందించిన వివాహ హారాలు, సొగసైన గాజులు సంప్రదాయ పూజా సామగ్రి వంటి తదితర విస్తృత శ్రేణి ఉత్పత్తులు ఇందులో ఉన్నాయి. వధూవరులు, వారి కుటుంబం, ఒక చిరస్మరణీయ వివాహానికి దోహదపడే అన్ని ఆచారాలు గుర్తించి అందుకు తగ్గట్లు డిజైన్లను తయారీ చేశామని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు.



క్లౌడ్ గేమింగ్ సూపర్ 'క్లిక్'!

సరికొత్త వీడియో గేమ్‌లు మార్కెట్లోకి రిలీజ్ అయిన వెంటనే ఆడేయాలని ఎవరికుండదు చెప్పండి! నేటి జెన్ జడ్ యువతరానికి గేమ్స్ అంటే మరీ క్రేజ్. వీటిని ఆడాలంటే హై ఎండ్ **పీసీతో పాటు ఖరీదైన గేమింగ్ కన్సోల్స్ తప్పనిసరి కావడం**తో చాలా మందికి అందని ద్రాక్షగానే ఊరిస్తున్నాయి. అయితే, క్లౌడ్ గేమింగ్ ఎంట్రీతో వీడియో గేమ్స్ ముఖ చిత్రమే మారిపోతోంది. అతి తక్కువ ఖర్చుతో, ఇంట్లో ఉన్న సాధారణ పీసీతోనే అదిరిపోయే లేటెస్ట్ వీడియో గేమ్స్ ఆడే అవకాశం లభిస్తుండటంతో గేమర్స్ క్లిక్.. క్లిక్.. హుర్రే అంటున్నారు!



గేమింగ్ ఆన్ డిమాండ్... గేమ్ స్ట్రీమింగ్.. క్లౌడ్ గేమింగ్... పేరేదైనా కానీ గేమర్ల పాలిట వరంలా మారింది. కేవలం హైస్పీడ్ ఇంటర్నెట్, గేమ్ ప్యాడ్/కంట్రోలర్ ఉంటే చాలు.. ఇప్పుడు ఎవరైనా తమ ఫేవరెట్ గేమ్స్‌ను డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్, మొబైల్ లేదా టీవీలోనే ఎంచక్కా స్ట్రీమ్ చేసేయొచ్చన్నమాట! హై క్వాలిటీ గేమ్‌ను మన సొంత సిస్టమ్‌లో రన్ చేయాలంటే, ఆడటానికి ముందే ఆ గేమ్‌ను ఫిజికల్‌గా ఇన్‌స్టాల్ చేయాల్సి ఉంటుంది. దీనికి పూర్తి భిన్నంగా ఎక్కడో క్లౌడ్ సర్వర్లలో ఉన్న నచ్చిన గేమ్‌ను ఏ డివైజ్ లేదా ప్లాట్‌ఫామ్‌లోనైనా ఆడేందుకు (స్ట్రీమ్ చేసేందుకు) వీలవుతోంది. ఒకేసారి పలు డివైజ్‌లలోనూ గేమ్ ఆడొచ్చు. అంతేకాదు, గేమ్‌ను ఆపిన చోట నుంచే మళ్లీ ఆడుకోవచ్చు కూడా. అందుకే గేమర్స్ దీన్ని 'నెట్‌ఫ్లిక్స్ ఫర్ గేమ్స్' అని కూడా పిలుచుకుంటారు!

రెండేళ్లలో మూడింతలు...

మార్కెట్ రీసెర్చ్ ప్లాట్‌ఫామ్ మార్కెట్.యూఎస్ గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా క్లౌడ్ గేమింగ్ యూజర్ల సంఖ్య 2021లో దాదాపు 10.27 కోట్ల మంది కాగా, 2023లో ఈ సంఖ్య ఏకంగా 29.1 కోట్లకు ఎగబాకింది. అంటే రెండేళ్లలోనే మూడింతలైంది. ఈ డిమాండ్‌కు అనుగుణంగా క్లౌడ్ గేమింగ్ మార్కెట్ కూడా ఫుల్ స్వింగ్‌లో పరుగులు తీస్తోంది. 2030 నాటికి ప్రపంచ క్లౌడ్ గేమింగ్ మార్కెట్ 46.9 శాతం వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్)తో 85 బిలియన్ డాలర్లకు ఎగబాకుతుందని ఫార్చ్యూన్ బిజినెస్ లెక్కగట్టింది. 2022లో ఈ మార్కెట్ విలువ కేవలం 3.37 బిలియన్ డాలర్లు మాత్రమే. మరోపక్క, క్లౌడ్ గేమింగ్‌కు అతిపెద్ద మార్కెట్లలో ఒకటిగా ఉన్న భారత్.. 2033 నాటికి పరిశ్రమ లీడర్‌గా ఎదుగుతుందని బ్లూంబర్గ్ ఇంటెలిజెన్స్ తాజా నివేదిక పేర్కొనడం గమనార్హం. 'అమెరికా, చైనా వంటి అభివృద్ధి చెందిన సీఎస్‌జీ (క్లౌడ్‌-స్ట్రీమ్డ్ గేమింగ్) మార్కెట్లు, ప్రపంచవ్యాప్తంగా అమ్మకాల్లో మూడోవంతుకు పైగా ఆక్రమిస్తున్నాయి. వచ్చే పదేళ్లలో దక్షిణ, ఆగ్నేయాసియా, లాటిన్ అమెరికా మార్కెట్లు భారీగా వృద్ధి చెందనున్నాయి. ముఖ్యంగా యువతరంతో ఉప్పొంగుతున్న భారత్‌లో, 5జీ విప్లవం ఆన్‌లైన్ గేమింగ్ స్వరూపాన్ని సమూలం గా మార్చేయనుంది' అని బ్లూంబర్గ్ ఇంటెలిజెన్స్ ఎనలిస్ట్ నాథన్ నాయుడు పేర్కొన్నారు.

టెల్కోలకు భలే చాన్స్..

దూసుకెళ్తున్న క్లౌడ్ గేమింగ్ మార్కెట్లో టెల్కోలు తమ సహజ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నాయి. ఈ ఏడాది జనవరిలో రిలయన్స్ జియో 'జియో గేమ్స్ క్లౌడ్' ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించింది. నెలకు రూ.199 ప్లాన్‌తో గేమర్లు చెలరేగిపోవచ్చన్నమాట! 30 రోజుల ఉచిత ట్రయల్ కూడా అందుబాటులో ఉంది. వొడాఫోన్ ఐడియా కూడా క్లౌడ్ ప్లే పేరుతో గేమింగ్ సర్వీస్ మొదలుపెట్టింది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ హ్యాండ్‌సెట్లలో ఎలాంటి డౌన్‌లోడ్లు లేకుండానే అదిరిపోయే గేమింగ్ అనుభూతిని యూజర్లకు అందిస్తోంది.

భారత్.. అవకాశాల 'క్లౌడ్'


భారీ అవకాశాల నేపథ్యంలో మైక్రోసాఫ్ట్, ఎన్‌వీడియా, సోనీ మొబైల్ విభాగాలు వర్ధమాన దేశాల మార్కెట్లలో విస్తరణపై దృష్టి సారిస్తున్నాయి. యాపిల్ కూడా తన గేమ్‌-స్ట్రీమింగ్ యాప్‌లను ఈ మార్కెట్లలో అందుబాటులోకి తెస్తోంది. బ్లూంబర్గ్ నివేదిక ప్రకారం ప్రపంచ మార్కెట్లో ఒక్కో గేమింగ్ యూజర్ నుంచి సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) 10% వార్షిక వృద్ధి సాధిస్తుండగా.. భారత్‌లో 15% చొప్పున పెరుగుతుండటం విశేషం. 'మారుమూల ప్రాంతాల్లోనూ ఇంటర్నెట్ లభ్యత, చౌక డేటా ప్లాన్లు, 4జీ/5జీ భారీ విస్తరణ, స్మార్ట్‌ఫోన్ల వాడకం పెరగడం, అవి మరింత చౌక రేట్లతో మరింత పవర్‌ఫుల్ ఫీచర్లతో లభిస్తుండటం వంటి అనేక అంశాలు భారత్‌లో క్లౌడ్ గేమింగ్ జోరుకు దన్నుగా నిలుస్తున్నాయి' అని యాంట్‌క్లౌడ్ సీఈఓ హిమాన్షు జైన్ పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్‌లో సేవలు ప్రారంభించిన ఈ క్లౌడ్ గేమింగ్, పీసీ సర్వీస్ ప్రొవైడర్ ఇప్పటికే 10,000 మంది యూజర్లను సంపాదించింది. ఈ ఏడాది చివరికల్లా 50,000 సబ్‌స్క్రిప్షన్లను లక్ష్యంగా పెట్టుకుంది.

- సాక్షి, బిజినెస్ డెస్క్

జియో గేమ్స్ క్లౌడ్	వొడాఫోన్ ఐడియా క్లౌడ్ ప్లే	యాంట్ క్లౌడ్	వన్‌ప్లే
ప్రారంభం: 2023 జనవరి	ప్రారంభం: 2024 ఏప్రిల్	ప్రారంభం: 2024 జూన్	ప్రారంభం: 2019
సబ్‌స్క్రిప్షన్ ప్లాన్: 30 రోజుల ఫ్రీ ట్రయల్: ఆ తర్వాత నెలకు రూ.199	సబ్‌స్క్రిప్షన్ ప్లాన్: ఫ్రీ శాంపిల్ (ప్రారంభ ఆఫర్) ఆ తర్వాత నెలకు రూ.100	సబ్‌స్క్రిప్షన్ ప్లాన్: నెలకు రూ.199 నుంచి ప్రారంభం (ఇంట్రో): నెలకు రూ.599 (అడ్వాన్స్‌డ్)	సబ్‌స్క్రిప్షన్ ప్లాన్: గంటకు రూ.29 నుంచి ప్రారంభం: నెలకు రూ.799

సెన్సెక్స్ పదో రోజూ పరుగు

- నిఫ్టీకి 13వ రోజూ లాభాలే
- కొనసాగిన వరుస రికార్డుల ర్యాలీ
- ఐటీ, ఫైనాన్స్ షేర్లకు డిమాండ్



ముంబై: ఐటీ, ఫైనాన్స్ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీల రికార్డుల ర్యాలీ సోమవారమూ కొనసాగించింది. ఆర్థిక వృద్ధి ఆశలు, ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు అంచనాలు, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు సెంటిమెంట్‌ను బలపరిచాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 359 పాయింట్ల లాభంతో జీవితకాల గరిష్టం 82,725 వద్ద మొదలైంది. మిడ్ సెషన్ తర్వాత కాస్త అమ్మకాల ఒత్తిడికి లోనైనా.., తిరిగి పుంజుకుంది. చివరికి 194 పాయింట్ల లాభంతో 82,560 సరికొత్త రికార్డు స్థాయి వద్ద ముగిసింది. ఈ సూచీకిది పదో రోజూ లాభాల ముగింపు. అంతకుముందు 2023 సెప్టెంబర్‌లో తొమ్మిది రోజులు పాటు ర్యాలీ చేసింది. వరుసగా 13 రోజులు లాభాలు గడించిన ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 43 పాయింట్లు పెరిగి జీవితకాల గరిష్ట స్థాయి 25,279 వద్ద స్థిరపడింది. ఒక దశలో 98 పాయింట్లు బలపడి 25,334 వద్ద కొత్త ఆల్‌టైం హైని నమోదు చేసింది.

టాటా కర్వ్ పెట్రోల్, డీజిల్ వేరియంట్లు వచ్చేశాయ్...

ప్రారంభ ధర రూ.9.99 లక్షలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్ పెట్రోల్, డీజిల్ ట్రిమ్స్‌లో మిడ్‌సైజ్ ఎస్‌యూవీ కూపే కర్వ్ విడుదల చేసింది. పరిచయ ఆఫర్‌లో భాగంగా ఎక్స్‌షోరూంలో ప్రారంభ ధర పెట్రోల్ రూ.9.99 లక్షలు, డీజిల్ రూ.11.49 లక్షలు. 1.2 లీటర్ టర్బో పెట్రోల్, 1.2 లీటర్ టీ-జీడీఐ టర్బో పెట్రోల్, 1.5 లీటర్ డీజిల్ ఇంజన్ ఆప్షన్స్‌తో రూపుదిద్దుకుంది. 6 స్పీడ్ మాన్యువల్ లేదా 7 స్పీడ్ డ్యూయల్ క్లచ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌తో తయారయ్యాయి. డ్యూయల్ క్లచ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌తో సెగ్మెంట్లో తొలి డీజిల్ కార్ ఇదేనని కంపెనీ తెలిపింది. 12.3 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, 9 స్పీకర్స్ జేబీఎల్ ఆడియో సిస్టమ్, పనోరమిక్ సన్‌రూఫ్, ఆటో క్లైమేట్ కంట్రోల్, ఎయిర్ ప్యూరిఫయర్, ఆరు ఎయిర్‌బ్యాగ్స్ వంటి హంగులు జోడించారు.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..
త్వరలో సింగిల్ ఫైలింగ్ : సెబీ
ఫ్రెషర్లకు ఇన్ఫోసిస్ నియామక పత్రాలు

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 500 అప్రెంటిస్‌లు

ముంబైలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. దేశవ్యాప్తంగా యూబీఐ శాఖల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం ఖాళీల సంఖ్య: 500.
- » ఖాళీల వివరాలు: 500(యూఆర్‌-248, ఎస్సీ-64,ఎస్టీ-32, ఓబీసీ-115,ఈడబ్ల్యూఎస్‌-41).
- » తెలుగు రాష్ట్రాల్లో ఖాళీలు: ఆంధ్రప్రదేశ్‌-50, తెలంగాణ-42.
- » అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి.
- » శిక్షణ వ్యవధి: ఒక సంవత్సరం. -స్టైపెండ్: నెలకు రూ.15,000.
- » ఎంపిక విధానం: ఆన్‌లైన్ టెస్ట్(ఆబ్జెక్టివ్ టైప్), లోకల్ లాంగ్వేజ్ నాలెడ్జ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 28.08.2024.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 17.09.2024.
- » వెబ్‌సైట్: www.unionbankofindia.co.in

డీఆర్‌డీవో, బెంగళూరులో 30 అప్రెంటిస్‌లు

బెంగళూరులోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో)కు చెందిన డిఫెన్స్ బయో ఇంజనీరింగ్ అండ్ ఎలక్ట్రోమెడికల్ ల్యాబొరేటరీ(డీఈబీఈఎల్) గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్ ట్రెయినీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం ఖాళీల సంఖ్య: 30.
- » స్టైపెండ్: నెలకు రూ.9000.
- » అప్రెంటిస్‌షిప్ కాలం: ఒక సంవత్సరం.
- » విభాగాలు: మెకానికల్, బయో మెడికల్, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్, ఇన్‌స్ట్రుమెంటేషన్, కెమికల్ తదితరాలు.
- » అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, బీఎస్సీ, బీకాం ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ముఖ్య సమాచారం

- » దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » దరఖాస్తులకు చివరితేది: 09.09.2024.
- » ఈమెయిల్: hrd.debel.debel@gov.in
- » ఇంటర్వ్యూ తేదీలు:03.10.2024, 04.10.2024
- » ఇంటర్వ్యూ వేదిక: డీఆర్‌డీవో-డీఈబీఈఎల్, సీవీ రామన్ నగర్, బెంగళూరు.
- » వెబ్‌సైట్: www.drdo.gov.in

స్కాలర్‌షిప్స్

ఎస్‌బీఐఎఫ్ ఆశా స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌-2024

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్(ఎస్‌బీఐఎఫ్)..ప్రతిభగల పేద విద్యార్థులకు చేయూతనందించి, వారి విద్యను ప్రోత్సహించేందుకు ఆరో తరగతి నుంచి పీజీ వరకు విద్యార్థులను ఎంపికచేసి వారి చదువులకు ఆర్థిక సాయం అందజేస్తోంది.

- » అర్హత: ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు చదివి ఉండాలి. డిగ్రీ, పీజీ, ఐఐటీ, ఐఐఎంలలో చదువుతున్న భారతీయ విద్యార్థులు ఎవరైనా ఈ స్కాలర్‌షిప్‌కు అర్హులు.
- » గత విద్యా సంవత్సరంలో విద్యార్థులు కనీసం 75 శాతం మార్కులు సాధించి ఉండాలి. దరఖాస్తుదారు కుటుంబ ఆదాయం రూ.3లక్షలు మించకూడదు.

స్కాలర్‌షిప్ వివరాలు

- » ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రూ.15,000.
- » అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు రూ.50,000
- » పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు రూ.70,000.
- » ఐఐటీ విద్యార్థులకు రూ.2,00,000.
- » ఐఐఎం(ఎంబీఏ/పీజీడీఎం) విద్యార్థులకు రూ.7.50 లక్షలు.
- » ఎంపిక విధానం: అకడమిక్ మెరిట్, ఆర్థిక పరిస్థితి ఆధారంగా ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికచేస్తారు. దరఖాస్తులను షార్ట్‌లిస్ట్ చేసిన తర్వాత డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఉంటుంది. షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఎంపికైన అభ్యర్థుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా స్కాలర్‌షిప్ మొత్తాన్ని జమ చేస్తారు. ఇది వన్‌టైమ్ స్కాలర్‌షిప్ మాత్రమే.

ముఖ్య సమాచారం

- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈమెయిల్/మొబైల్ నంబర్ వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 01.10.2024.
- » వెబ్‌సైట్:www.sbifashascholarship.org

గిగ్ కొలువుల కాలం!

రానున్న వరుస పండుగల సీజన్‌లో యువతకు భారీ సంఖ్యలో కొలువులు స్వాగతం పలుకనున్నాయి. ఆసక్తి ఉంటే చదువుకుంటూనే పార్ట్‌టైమ్, తాత్కాలిక ఉద్యోగాల ద్వారా సంపాదించుకునే అవకాశం లభిస్తుంది. ముఖ్యంగా ఈ-కామర్స్ రంగంలోని సంస్థలు పండుగ సీజన్‌లో వినియోగదారులకు సత్వర, నాణ్యమైన సేవలు అందించేందుకు గిగ్ వర్కింగ్(తాత్కాలిక) విధానంలో.. భారీ సంఖ్యలో నియామకాలు జరపనున్నట్లు తాజా అంచనా! ఈ నేపథ్యంలో.. గిగ్ కొలువులు, అర్హతలు, స్కిల్స్, లభించే వేతనాలపై ప్రత్యేక కథనం..

- » కాంట్రాక్ట్, గిగ్ విధానంలో భారీగా నియామకాలు
- » రానున్న పండుగ సీజన్‌లో సేవలకు డిమాండ్
- » ఫ్రెషర్లు, పార్ట్‌టైమ్ ఉద్యోగార్థులకు వరం
- » హోదాను అనుసరించి నెలకు రూ.20 వేల వేతనం



భారీగా నియామకాలు

- రానున్న పండుగల సీజన్‌లో.. ఈ-కామర్స్ సంస్థలు దాదాపు 12.5 లక్షల మంది సిబ్బందిని నియమించుకోనున్నట్లు.. వీరిలో 10 లక్షల మంది గిగ్ వర్కర్లు, 2.5 లక్షల మంది కాంట్రాక్ట్ స్టాఫ్ ఉంటారని ఓ తాజా నివేదిక వెల్లడించింది.
- ఇప్పటికే ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ మీషో ఈ సీజన్‌లో 50 వేల మంది గిగ్, కాంట్రాక్ట్ స్టాఫ్ నియమించుకుంటామని చెప్పింది.
- అదే విధంగా మింత్రా సంస్థ కూడా దాదాపు 18 వేల మంది నియామకాలకు సిద్ధమైనట్లు సమాచారం.
- యూనికార్న్ స్టార్టప్స్‌గా గుర్తింపు పొందిన ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌లు ఈ సంఖ్యపై స్పష్టత ఇవ్వకపోయినా.. భారీ సంఖ్యలో గిగ్, కాంట్రాక్ట్ స్టాఫింగ్‌కు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

గిగ్ వర్కర్స్ అంటే

గిగ్ వర్కింగ్ అంటే.. సదరు వ్యక్తులు తమకు నచ్చిన సమయంలో తాత్కాలిక విధానంలో పని చేసే అవకాశం. ఆన్‌లైన్ విధానంలో ఫ్రీలాన్సింగ్ పద్ధతిలో సంస్థలకు సేవలందించడాన్ని గిగ్ వర్కింగ్‌గా చెప్పొచ్చు. ఈ విధానంలో ఒక వ్యక్తి ఒకే సమయంలో ఒకటి కంటే ఎక్కువ సంస్థలకు పని చేసే వీలుంటుంది. ఆ మేరకు ఆదాయం కూడా లభిస్తుంది. ఉదాహరణకు ఈ-కామర్స్, ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌కు సంబంధించి రోజులో కొంత సమయం ఈ-కామర్స్ సంస్థలకు డెలివరీ అసోసియేట్స్‌గా,మిగతా సమయంలో ఇతర సంస్థలకు రైడర్స్‌గా పనిచేయొచ్చు.

కాంట్రాక్ట్ కొలువు

ఇది ఒప్పందం ఉద్యోగం. గిగ్ వర్కింగ్‌కు కొంత భిన్నంగా ఉంటుంది. కాంట్రాక్ట్ స్టాఫింగ్ విధానంలో.. సదరు వ్యక్తులు నిర్ణీత వ్యవధిలో, నిర్దిష్ట కాలం ఒప్పందం మేరకు సంస్థలో తమకు కేటాయించిన విభాగంలో పనిచేయాల్సి ఉంటుంది. గిగ్ వర్కర్లతో పోల్చితే కాంట్రాక్ట్ సిబ్బందికి సంస్థల నుంచి కొన్ని అదనపు ప్రయోజనాలు లభిస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు.

జాబ్ ప్రొఫైల్స్

ఈ-కామర్స్ రంగంలో.. గిగ్, కాంట్రాక్ట్ స్టాఫ్ నియామకాల్లో భాగంగా పలు జాబ్ ప్రొఫైల్స్ లభిస్తున్నాయి. అవి.. డెలివరీ ఎగ్జిక్యూటివ్స్, వేర్‌హౌస్ వర్కర్స్, కస్టమర్ సర్వీస్ రిప్రజెంటేటివ్స్, ప్యాకేజింగ్ బాయ్స్/ఎగ్జిక్యూటివ్స్, క్వాలిటీ కంట్రోల్ ఎగ్జిక్యూటివ్స్, ఆర్డర్ ఫుల్‌ఫిల్‌మెంట్ పర్సనల్ తదితరాలు. వీటితోపాటు రైడ్ షేరింగ్ సంస్థల్లో(ఉబెర్, ఓలా తదితర) డ్రైవర్స్ వంటి ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. ఈ-కామర్స్ సంస్థల్లో అఫ్లియేట్ మార్కెటింగ్, డిజిటల్ మార్కెటింగ్ తదితర కొలువుల్లో చేరొచ్చు.

ఆకర్షణీయ వేతనాలు

గిగ్, కాంట్రాక్ట్ విధానంలో.. నియామకాలు పొందిన వారికి వేతనాలు కూడా ఆకర్షణీయ స్థాయిలోనే లభిస్తున్నాయి. డెలివరీ అసోసియేట్స్, రైడర్స్ వంటి ఫీల్డ్ లెవల్ ఉద్యోగాలకు నెలకు రూ.20 వేల వరకు అందుతోంది. సంస్థల కార్యాలయాల్లో ఉండి విధులు నిర్వర్తించాల్సిన కొలువులకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు వేతనం లభిస్తోంది.

ఉద్యోగ వేదికలు

గిగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాలు పొందేందుకు మార్గం.. ఆయా సంస్థల వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ జాబ్ పోర్టల్స్. ముఖ్యంగా సంస్థల వెబ్‌సైట్స్‌లో కెరీర్స్/కరెంట్ ఓపెనింగ్స్ కాలమ్స్‌లో ఎప్పటికప్పుడు లేటెస్ట్ రిక్రూట్‌మెంట్స్ సమాచారం తెలుస్తుంది. అదే విధంగా జాబ్ పోర్టల్స్‌లో ప్రొఫైల్ క్రియేట్ చేసుకుని ఈ-కామర్స్‌ను తమ ప్రాధాన్యత సెక్టార్‌గా పేర్కొంటే.. తాజా ఉద్యోగాల నోటిఫికేషన్లను మెయిల్స్, మెసేజెస్ రూపంలో పొందొచ్చు.

నైపుణ్యాలు తప్పనిసరి

అభ్యర్థుల్లో ప్రత్యేక నైపుణ్యాలు ఉండాలని సంస్థలు ఆశిస్తున్నాయి. కోర్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనల్ ఆప్టిట్యూడ్, ఆటిట్యూడ్‌లను పరిగణనలోకి తీసుకుంటున్నాయి. ముఖ్యంగా వినియోగదారులతో నేరుగా సంప్రదించాల్సిన కస్టమర్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్స్, డెలివరీ ఎగ్జిక్యూటివ్స్‌కు సానుకూల దృక్పథం ఉండాలని కోరుకుంటున్నాయి. దీంతో పాటు లాంగ్వేజ్ స్కిల్స్ కూడా తప్పనిసరిగా మారుతున్నాయి. అభ్యర్థులు మాతృ భాషతోపాటు ఇంగ్లిష్, హిందీ కూడా నేర్చుకుంటే నియామకాల్లో ముందంజలో నిలిచే అవకాశం ఉంది.

శాశ్వత కొలువుకు మార్గం

గిగ్, కాంట్రాక్ట్ స్టాఫింగ్ విధానంలో పని చేయడం ద్వారా.. విద్యార్థి దశలోనే సంస్థల కార్యకలాపాలు, విధి నిర్వహణపై అవగాహన ఏర్పడుతుంది. ఉద్యోగ అనుభవం వస్తుంది. క్షేత్ర స్థాయి పరిస్థితులను తెలుసుకునే నైపుణ్యం సొంతమవుతుంది. ఫలితంగా భవిష్యత్తులో శాశ్వత ఉద్యోగాలను సొంతం చేసుకోవడంలో ముందంజలో నిలవొచ్చు. గిగ్, కాంట్రాక్ట్ వర్కింగ్ విధానంలో విధి నిర్వహణలో మంచి పనితీరు కనబరిస్తే.. అదే సంస్థలో పూర్తి స్థాయి కొలువు దక్కించుకోవచ్చు.

ఐటీలో గిగ్ వర్కింగ్

ఇటీవల కాలంలో గిగ్ వర్కింగ్ విధానం ఐటీ తదితర రంగాలకు విస్తరిస్తోంది. ఐటీ కంపెనీల్లో గిగ్ కొలువులకు యూఐ, యూఎక్స్ వంటి సంప్రదాయ స్కిల్స్‌తోపాటు డేటా సైన్స్, డేటా మోడలింగ్ వంటి వాటిపైనా పట్టు సాధించాలి. కస్టమర్స్‌తో సంప్రదింపులు, వర్క్‌ఫోర్స్ కొలాబరేషన్ వంటి అంశాల్లో సమర్థంగా రాణించాలంటే.. క్లౌడ్ కంప్యూటింగ్ మరో కీలకమైన టెక్నికల్ స్కిల్. ఈ నైపుణ్యాలను మైక్రోసాఫ్ట్ ఏఐ స్కూల్,ఐబీఎం,గిట్‌హబ్ వంటి వాటి ద్వారా ఆన్‌లైన్‌లోనే ఉచితంగా నేర్చుకునే అవకాశముంది.

విధులు ఇవే

ప్యాకింగ్ పర్సన్స్

ఒక ప్రొడక్ట్‌ను ఆకర్షణీయంగా, అదే విధంగా ట్రాన్స్‌పోర్ట్ సమయంలో ఎలాంటి డ్యామేజ్ జరగకుండా.. ప్యాకింగ్ చేయడం వీరి పని. ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి అర్హతతోనే ఈ ఉద్యోగాలు లభిస్తున్నాయి.

ట్రక్/వెహికిల్ డ్రైవర్స్

ఆయా ప్రొడక్ట్‌లను వినియోగదారులకు చేర్చేందుకు అవసరమైన వాహనాలకు డ్రైవర్స్ అవసరం ఎంతో ఉంటుంది. పదో తరగతి అర్హత ఉండి హెవీ మోటార్ డ్రైవింగ్ లైసెన్స్ చేతిలో ఉంటే చాలు ఈ ఉద్యోగం ఖాయం.

డెలివరీ ఎగ్జిక్యూటివ్స్

డెలివరీ ఎగ్జిక్యూటివ్స్ సదరు ప్రొడక్ట్‌ను వినియోగదారుడి చేతికి అందించి.. ఆ వివరాలను తక్షణమే సంస్థకు తెలియజేయాల్సి ఉంటుంది. పదో తరగతి, ఇంటర్మీడియెట్ అర్హతతోపాటు.. కాసింత సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కొలువు సొంతం చేసుకోవచ్చు.

వేర్‌హౌస్ మేనేజర్

ఈ-కామర్స్ సంస్థలు భారీ ఎత్తున వేర్‌హౌస్ (గోడౌన్స్)ను ఏర్పాటు చేసుకుంటున్నాయి. సదరు వేర్‌హౌస్‌లో ఏ సెగ్మెంట్ వస్తువులు ఎక్కడ భద్రపరచాలి, ముందుగా ఏ ప్రొడక్ట్‌లను బయటికి పంపాలి వంటి విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అదే విధంగా వేర్‌హౌస్‌లో పని చేసే సిబ్బందిని పర్యవేక్షించాలి. ఈ ఉద్యోగాలను బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులతో భర్తీ చేస్తున్నారు.

ఇన్వెంటరీ మేనేజర్/ఎగ్జిక్యూటివ్

వేర్‌హౌస్‌కు వస్తున్న వస్తువులు, డెలివరీకి వెళ్తున్న వస్తువులకు సంబంధించిన వివరాలను నమోదు చేసే విధులు నిర్వర్తించే వారే.. ఇన్వెంటరీ మేనేజర్/ఎగ్జిక్యూటివ్. ఈ ఉద్యోగానికి కూడా ఏదో ఒక డిగ్రీ ఉండాలి.

నీరటి లేని చెరువు!

రాష్ట్రమంతటా దంచికొడుతున్న వానలు

చెరువులు, కుంటల బాగోగులు చూసేదెవరు

గతంలో 5,679 మంది నీరటిల ఆధ్వర్యంలో చెరువుల నిర్వహణ

ప్రస్తుతం ప్రత్యేక వ్యవస్థ లేక ఇబ్బందులు పడుతున్న రైతులు.. బుంగలు పూడ్చేవారు లేకుండా పోయారు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: కాకతీయులతో పాటు వివిధ రాజులు తెలంగాణలో ఊరూరా నిర్మించిన గొలుసుకట్టు చెరువులతోనే రైతులు పంటలు సాగు చేసేవారు. పటేల్, పట్వారీ వ్యవస్థ కొనసాగిన సమయంలో గ్రామానికి సేవలు అందించేందుకు సుంకరి, మచ్కూరి, నీరటీలు ఉండేవారు. సుంకరి, మచ్కూరీలను గ్రామంలో ఏ అవసరం ఉన్నా వాడుకునేవారు. కానీ నీరటీలు మాత్రం పూర్తిగా చెరువులు, కుంటలకు సంబంధించిన వ్యవహారాలు చూసుకునేవారు. చెరువులు, కుంటల కింద సాగుచేసే పంటలకు అవసరమైన నీటిని తూముల ద్వారా విడుదల చేసి, చివరి ఆయకట్టు వరకు నీరందించేలా చూసుకునేవారు. చెరువు కింద కుల వృత్తుల వారితో పాటు నీరడికి కూడా కొంత భూమిని ఇనాంగా ఇచ్చేవారు. నీరడి అందరి భూములకు నీరు ఇవ్వడంతో పాటు తన భూమిని కూడా సాగుచేసుకునేవాడు. 'నీరడి తన మడి ఎండబెట్టుకోడు'అనే సామెత దాన్నుంచే వచ్చిందని చెపుతారు. చెరువు కాలువలను శుభ్రం చేయడం, తూము నుంచి నీటిని వదలడం, ఆపేయడం, తూము, కట్ట దెబ్బతింటే మరమ్మతులు చేయడంనుంచి ప్రతీది నీరటీయే చూసుకునేవాడు. అయితే ప్రభుత్వాలు మారినప్పుడల్లా విధానాలు మారుతూ వచ్చాయి. నీరటి, సుంకరులను గ్రామ సేవకులుగా, గ్రామ రెవెన్యూ సహాయకులుగా పిలిచారు. గత ప్రభుత్వ హయాంలో రెవెన్యూ వ్యవస్థలో కీలకమైన గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్‌వో), గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ) వ్యవస్థలను రద్దు చేసి, వారందరినీ ఇతర విభాగాల్లో సర్దుబాటు చేశారు. కొందరిని నీటి పారుదల శాఖలో ప్రాజెక్టుల పరిధిలో లస్కర్లుగా నియమించారు.

రాష్ట్రంలో 46,531 చెరువులు..

పూర్వకాలంలో రాష్ట్రంలో లక్ష పైచిలుకు చెరువులు, కుంటలు ఉండేవని, తరువాత సగానికి పైగా చెరువులు విధ్వంసానికి గురై 46,531 చెరువులు, కుంటలు మాత్రమే మిగిలాయని రికార్డులు చెబుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ పేరుతో చెరువులను పునరుద్ధరించే పనులు చేపట్టింది. దీంతో చెరువులకు మహర్దశ వచ్చినట్టేనని భావించారు. అయితే అదే ప్రభుత్వం అవినీతి, అక్రమాల పేరుతో రెవెన్యూ శాఖలో కీలకమైన వీఆర్‌వో, వీఆర్‌ఏ వ్యవస్థలను రద్దు చేసింది. వాళ్లను ఇతర శాఖల్లో సర్దుబాటు చేయడంతో గ్రామంలో భూములే కాదు, చెరువులను చూసుకునేవారు కూడా లేకుండాపోయారు. అప్పటి నుంచి చెరువులు, కుంటలన్నీ అనాథలయ్యాయి. రాష్ట్రంలో వీఆర్‌ఏలు (గ్రామ రెవెన్యూ సహాయకులు) 21,555 మంది ఉండగా, అందులో చెరువులు, కుంటలను చూసుకునే నీరడీలు 5,679 మంది ఉండేవారు. కొన్ని చోట్ల ఒక్కో నీరటి ఐదు నుంచి పది చెరువులను చూసుకునేవాడు. కొన్ని చోట్ల రెండు, మూడు చెరువుల బాధ్యత ఉండేది.

నీరటి లేక కష్టాలు..

చెరువులు, కుంటలకు ఆధారమైన కట్టుకాలువలు, చెరువుల నుంచి పొలాలకు నీటిని పారించే కాలువలు, చెరువు తూములు, అలుగులు, కట్ట పరిస్థితులను ఎప్పటి కప్పుడు పరిశీలించి.. కావలసిన పనులు చేయడానికి నీరటీలు శ్రమించేవారు. వర్షాకాలం సీజన్ వచ్చిందంటే చాలు నీరటి రాత్రి, పగలు చెరువుల రక్షణ కోసం తపించేవాడు. తనవే అన్నట్టుగా చెరువులను చూసుకునేవారు. ప్రస్తుతం రెండు 3 రోజులుగా దంచికొడుతున్న వర్షాలతో చాలా చోట్ల చెరువులకు బుంగలు, కాలువలకు గండ్లు పడుతున్నాయి. అయితే నీరటి ఉన్నపుడు అన్నీ తనే చూసుకునేవాడు. తనతో కాని పక్షంలో ఊరి పెద్దల దృష్టికి తీసుకువెళితే వారు రైతులతో కలసి వెళ్లి వాటిని సరిచేసేవారు. ఇప్పుడు నీరటి లేకపోవడంతో చాలా గ్రామాల్లో చెరువులకు బుంగలు పడి నీరు వృథాగా పోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు అంటున్నారు. ప్రస్తుతం నీటి పారుదల శాఖ అధికారులకు సమాచారం ఇస్తే ఆ ప్రాంతానికి సంబంధించిన ఏఈ వచ్చి.. పరిశీలించి మరమ్మతులకు చర్యలు తీసుకుంటారు. అయితే ఏకబిగిన కురుస్తున్న వర్షాలతో ఒక్క ఏఈ ఆ మండలాన్ని మొత్తం ఎలా చూసుకోగలడని అంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చెరువుల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థను తీసుకురావలసిన అవసరం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

చెరువుతోనే జీవితం..



తాతల కాలం నుంచి నీరడి పని చేసినం. మా జీవితం చెరువుతోనే ముడిపడి ఉండేది. చెరువు మంచీ చెడు మేమే చూసుకునేది. కట్ట, అలుగు, తూము మంచిగ ఉన్నయా? లేదా? అనేది ఎప్పటి కప్పుడు చూసి, ఏమన్న ఇబ్బంది ఉందంటే ముందుగల్లనే బాగ జేసేది. అట్ల చెరువులను కాపాడుకున్నం.

– ఆరుట్ల చంద్రయ్య, నీరటి, అంబారీపేట, దోమకొండ మండలం

వానలు రాకముందే అన్నీ సిద్ధం చేసేటోళ్లం..



వానాకాలం రాకముందే చెరువుల తూములు, అలుగులు, కాలువలను సిద్ధం చేసి పెట్టేవాళ్లం. చెరువులకు వచ్చే నీళ్లను బట్టి ఎప్పుడు నిండుతదో చెప్పేవాళ్లం. చెరువుతో పాటు చెరువు కింది రైతులతోనూ అనుబంధం ఉండేది.

– బొమ్మల నాంపల్లి, నీరటి, కాచాపూర్, భిక్కనూరు మండలం

హైదరాబాద్ విమోచన వేడుకలకు అమిత్ షా?



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 17న హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పాల్గొంటారని పార్టీవర్గాల సమాచారం. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. రెండేళ్ల క్రితం సెప్టెంబర్ 17న పరేడ్‌గ్రౌండ్స్‌లో జరిగిన అధికారిక కార్యక్రమంలో అమిత్‌షా పోలీసుదళాల వందన స్వీకరణతో పాటు జాతీయపతాకాన్ని ఎగురవేసిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో అమిత్‌షాతో పాటు మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఇతర నేతలు పాల్గొన్నారు. గతేడాది కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రిగా కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో గోల్కొండ ఖిల్లాలో హైదరాబాద్ విమోచన వేడుకలను నిర్వహించారు. ఈ ఏడాది మళ్లీ పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహించే కార్యక్రమానికి అమిత్‌షా ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, జనసమీకరణపై చర్చించేందుకు మంగళవారం బీజేపీ కార్యాలయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరగనుంది. ఈ సందర్భంగా.. గత మూడు రోజులుగా రాష్ట్రంలో భారీ వర్షాల కారణంగా వివిధ జిల్లాల్లో తలెత్తిన పరిస్థితులపై చర్చించి క్షేత్రస్థాయి పర్యటనలపై నిర్ణయం తీసుకోనున్నట్టు పార్టీనేతలు చెబుతున్నారు. పార్టీపరంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో నేతల పర్యటనలు, వివిధ జిల్లాల్లో బాధిత ప్రజలకు అందించాల్సిన సహాయం తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.

1,662 మందిని వరదల నుంచి కాపాడాం

అగ్నిమాపక శాఖ డీజీ సూచన



సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాల కారణంగా వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా సహాయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అగ్నిమాపక శాఖ డీజీ వై. నాగిరెడ్డి తెలిపారు. శనివారం నుంచి సోమవారం వరకు అగ్నిమాపక సిబ్బంది మొత్తం 1,662 మందిని కాపాడినట్లు ఆయన 'సాక్షి'కి చెప్పారు. ఒక్క ఖమ్మం జిల్లా పరిధిలోనే 761 మందిని కాపాడినట్టు వెల్లడించారు. వరద ముంపు ప్రాంతాల్లో స్థానిక అగ్నిమాపక శాఖ సిబ్బందితోపాటు అగ్నిమాపక శాఖకు సంబంధించిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు పనిచేస్తున్నాయన్నారు. వరదలో గల్లంతైన మూడు మృతదేహాలను గుర్తించినట్టు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో 11 పడవలతో వంద మంది సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయని చెప్పారు.

101కు సమాచారం ఇవ్వండి

'వరదలో చిక్కుకున్నా.. అగ్నిప్రమాదమైనా.. డయల్ 101కు ఫోన్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను. అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు సైతం క్షేత్రస్థాయిలో ఉంటూ సహాయక చర్యలు పర్యవేక్షించాలని ఆదేశాలిచ్చాం. నాతో సహా అన్ని స్థాయిల అధికారులు సహాయక చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు'అని నాగిరెడ్డి తెలిపారు.

'ప్రైవేటు' విమానాలకు ప్రత్యేక టెర్మినల్



శంషాబాద్: హైదరాబాద్‌లో పెరుగుతున్న వాణిజ్యాభివృద్ధితో ప్రైవేటు జెట్ విమానాల రాకపోకలు సాధారణంగా మారుతున్నాయి. దీంతో రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రైవేటు జెట్ విమానాల వినియోగదారుల ప్రయాణాలను సులభతరం చేసేందుకు జీఎంఆర్ సంస్థ ప్రత్యేక జనరల్ ఏవియేషన్ టెర్మినల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు సోమవారం ప్రత్యేక టెర్మినల్‌ను ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణీకర్ తదితరులు ప్రారంభించారు.

ముందస్తు అప్రమత్తతే.. ముప్పు తప్పించింది

మధిరలో పట్టాలపైకి నీరు రావడంతో మానుకోటలో అప్రమత్తం

- 26 చోట్ల వాచ్‌మన్లు, 32 మంది గస్తీ
- ఎప్పటికప్పుడు సమాచారం కోసం ఆరుగురు అధికారులు
- డ్రైవర్లను అప్రమత్తం చేస్తూ రైళ్ల నిలిపివేత.. ఏ మాత్రం ఆదమరిచినా వేల ప్రాణాలకు ముప్పు



కేసముద్రం-ఇంటికన్నె మధ్య కొట్టుకుపోయిన రైల్వేట్రాక్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాక్షి, మహబూబాబాద్: ప్రమాదాలు జరిగిన తర్వాత సమీక్ష..సమాలోచనలు చేయడం కాదు. వచ్చే ప్రమాదాన్ని అంచనా వేసి అప్రమత్తతతో ఉంటే పెను ప్రమాదాన్ని తప్పించొచ్చని మహబూబాబాద్ రైల్వే అధికారులు, సిబ్బంది రుజువు చేశారు. విజయవాడ- సికింద్రాబాద్ రైల్వేమార్గంలో మూడో లైన్ వేస్తున్నారు. ఈ పనుల నేపథ్యంలో పక్కన ఉన్న ప్రాంతాలు చదును చేసి, చెట్లు తొలగించి శుభ్రం చేస్తున్నారు. దీంతో వరద నీరు పట్టాల కిందకు వెళ్లే అవకాశం ఏర్పడింది. దీనిని గమనించిన అధికారులు వర్షంతో మధిర, రాయినిపాడ్ ప్రాంతంలో పట్టాలపై నీళ్లు వచ్చాయనే సమాచారం తెలుసుకొని ఇక్కడ అప్రమత్తమయ్యారు. మహబూబాబాద్ జిల్లా పరిధి డోర్నకల్- నెక్కొండ రైల్వేలైన్ మార్గంలో 66 చెరువుల ప్రవాహం పట్టాల పైకి వచ్చే అవకాశముందని అంచనా వేశారు. దీంతో ఆయా ప్రాంతాల్లో నిర్మించిన 26 రైల్వే ఎఫెక్టెడ్ ట్యాంక్ బ్రిడ్జి (ఆర్‌ఎఫ్‌టీ)ల వద్ద ప్రవాహాన్ని గుర్తించేందుకు వాచ్‌మన్లను పెట్టారు. 32 మంది గస్తీ సిబ్బందిని నియమించి నిఘా పెంచారు.

డేంజర్ లెవల్ గుర్తింపు

వాచ్‌మన్లు శనివారం ఆర్‌ఎఫ్‌టీ ప్రాంతాల్లో డేంజర్ లెవల్ మార్కును గమనిస్తూ ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చారు. దీంతో మహబూబాబాద్‌లో ఉండే ఎస్ఎస్ఈలు..డోర్నకల్, గార్ల, గుండ్రాతిమడుగు, తాళ్లపూసపల్లి, కేసముద్రం, ఇంటికన్నెల వద్ద జేఈలతో పర్యవేక్షించారు. అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో 575 తాళ్లపూసపల్లి ట్రాక్ వద్ద, 550 ఇంటికన్నె సమీపంలోని ట్రాక్‌ల వద్ద జల ప్రవాహం పెరిగి డేంజర్ కాషన్ వరకు వచ్చింది. దీనిని గమనించిన వాచ్‌మన్లు జగదీశ్, మోహన్‌లు ముందుగా ఎస్ఎస్ఈ రాజమౌళి, శ్రీనివాస్‌కు విషయం చెప్పారు. వారు సౌత్ కాజీపేట ఏడీఈఎన్ సతీష్‌కుమార్‌కు వివరిస్తూ అందరినీ అలర్ట్ చేశారు. దీంతో మహబూబాబాద్ నుంచి వరంగల్ వైపు వెళుతున్న సంఘమిత్ర ట్రైన్, వరంగల్ నుంచి మహబూబాబాద్‌వైపు వెళుతున్న సంఘమిత్ర డ్రైవర్లకు కాషన్ ఇస్తూ పరిస్థితిని వివరించారు. 120 కిలోమీటర్ల వేగంతో నడిచే రైళ్లను 10 కిలోమీటర్ల వేగానికి కుదించారు. ఇలా ఇద్దరు డ్రైవర్లను అప్రమత్తం చేసి డేంజర్ పాయింట్ల వద్ద పరిస్థితిని గమనించమని చెప్పారు. అప్పటికే వరద పెరిగి ఇబ్బందిగా మారిందని చెప్పడంతో రెండు సంఘమిత్ర రైళ్లను కేసముద్రంలో నిలిపివేశారు. అదే విధంగా వెనుక 1,500 మంది ప్రయాణికులతో వస్తున్న మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌ను మహబూబాబాద్‌లో ఆపేశారు. అప్పటికే 418/5, 411/11, 430/18, 423/14 కిలోమీటర్ మార్కు వద్ద వందల మీటర్ల మేరకు, మరో ఆరుచోట్ల పాక్షికంగా పట్టాల కింద గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా మారిన విషయం గుర్తించారు. ఇలా అందరూ సమన్వయంతో పనిచేసి వచ్చే ప్రమాదాన్ని పసిగట్టడంతో అప్, డౌన్ సంఘమిత్ర ట్రైన్లలో సుమారు 2 వేల మంది, మచిలీపట్నం ట్రైన్‌లో ఉన్న 1,500 మంది ప్రయాణికులను ప్రమాదం నుంచి కాపాడారు. వీరిని బస్సుల్లో కాజీపేటకు అక్కడి నుంచి ప్రత్యేక రైళ్లలో గమ్యస్థానాలకు తరలించారు.

అందరూ సమన్వయంతో..



వరద తీవ్రత, పట్టాల పరిస్థితిని ముందస్తుగా అంచనా వేసి.. అన్ని స్థాయిల అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేశారు. దీంతోనే పెద్ద ప్రమాదం తప్పింది. ఎస్ఎస్ఈలు, జేఈలు మొదలుకొని వాచ్‌మన్లు, గస్తీ సిబ్బందిలో ఏ ఒక్కరూ నిర్లక్ష్యంగా ఉన్నా పెను ప్రమాదం జరిగేది.

– ఎస్‌వీఎస్ మోహన్‌కుమార్, రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

కొత్త కల్వర్టుతోనే...

కేసముద్రం పెద్దచెరువు, దామెరచెరువు, ఇంటికన్నె చెరువు మత్తడి పోయడంతో ఆ నీరంతా ఉధృతంగా వచ్చింది. పాత కల్వర్టుకు ముందు నిర్మించిన కొత్తకల్వర్టు గోడలకు వరదనీరు తాకడంతో, రివర్స్‌లో రైల్వేట్రాక్‌పై ప్రభావం చూపింది. దీంతో పెద్దమోరి పక్కనున్న రైల్వేట్రాక్ అడుగుభాగంలో గండి పడటంతో క్రమక్రమంగా సుమారు 200 మీటర్ల మేర కొట్టుకుపోయి ట్రాక్ వంతెనలా మిగిలింది.

ముమ్మరంగా మరమ్మతు పనులు

ఘటన స్థలాన్ని సందర్శించిన రైల్వేజీఎం అరుణ్‌కుమార్‌జైన్

కేసముద్రం: కేసముద్రం-ఇంటికన్నె, మహబూబాబాద్-తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్‌ల మధ్య దెబ్బతిన్న రైల్వేట్రాక్‌ల పనులు శరవేగంగా సాగుతున్నాయి. రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ భారీవర్షాలతో దెబ్బతిన్న రైల్వే ట్రాక్‌లను పరిశీలించారు. పనులను వేగవంతంగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తూనే పలు సూచనలు చేశారు. 50 మంది అధికారులు, 500 మంది కార్మికులు పనిచేస్తున్నట్టు ప్రాజెక్ట్ మేనేజర్ సుబ్రమణ్యం తెలిపారు. ఇంటికన్నె వద్ద 418, తాళ్లపూసపల్లి –మహబూబాబాద్ మధ్యలోని 432, 433 కిలోమీటర్ల వద్ద వరదనీటితో ట్రాక్ దెబ్బతినగా, రూ.10కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. బుధవారం నాటికి రెండు ట్రాక్‌లను పునరుద్ధరించనున్నట్టు సుబ్రమణ్యం తెలిపారు.

హైదరాబాద్- విజయవాడ ప్రధాన రహదారిపై రాకపోకల పునరుద్ధరణ

- రామాపురం క్రాస్ రోడ్డు నుంచి ఒక మార్గంలో వాహనాలకు అనుమతి
- హైదరాబాద్-విజయవాడ రైల్వేమార్గంలో కొనసాగుతున్న మరమ్మతు పనులు
- పాలేరువాగు వంతెనను పరిశీలించిన మంత్రి ఉత్తమ్
- కందకుర్తి త్రివేణి సంగమం వద్ద ఉధృతంగా గోదావరి.. తెలంగాణ–మహారాష్ట్ర మధ్య నిలిచిన రాకపోకలు
- దెబ్బతిన్న 117 పంచాయతీరాజ్, 80 ఆర్‌అండ్‌బీ రోడ్లు

మొత్తంగా 126 రైళ్లు, 512 బస్సుల రద్దు

సాక్షి, హైదరాబాద్/కోదాడ రూరల్ : హైదరాబాద్-విజయవాడ ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలు మొదలయ్యాయి. పాలేరు వాగుకు వరద తగ్గుముఖం పట్టడంతో సోమవారం రాత్రి ఎనిమిదిన్నర నుంచి రామాపురం క్రాస్ రోడ్డు నుంచి ఒక మార్గంలో వాహనాలను అధికారులు అనుమతించారు. దీంతో బస్సులను కూడా రాత్రే పునరుద్ధరించారు. సూర్యాపేట జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఆంధ్రా- తెలంగాణ సరిహద్దులో జగ్గయ్యపేట మండలం గరికపాడు వద్ద పాత బ్రిడ్జి ధ్వంసమైనందున రెండు వైపులా వాహనాలను డైవర్షన్ చేసి కొత్త బ్రిడ్జి పైనుంచి పంపిస్తున్నామన్నారు. వాహనదారులు, ప్రయాణికులు గమనించి బ్రిడ్జిపై నెమ్మదిగా వెళ్లాలని సూచించారు. పాలేరు వంతెనపై కోతకు గురైన ప్రాంతాన్ని మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి పరిశీలించారు. అక్కడే ఉన్న నీటిపారుదలశాఖ అధికారులు, జీఎంఆర్ ప్రతినిధులతో మాట్లాడారు. సాధ్యమైనంత వరకు వంతెన మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. అయితే హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి మిర్యాలగూడ మీదుగా వెళ్లే విధంగా దారిమళ్లించారు. ఈ విషయం తెలియక వచ్చిన వాహనాలు దుర్గాపురం క్రాస్‌రోడ్, చిమిర్యాల క్రాస్‌రోడ్ వద్ద భారీగా నిలిచిపోయాయి.



తెలంగాణ, ఏపీ సరిహద్దులోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండల గరికపాడు వద్ద కోతకు గురైన పాలేరు వంతెన

పలు రైళ్ల దారిమళ్లింపు.. రద్దు

కేసముద్రం సమీపంలో రైల్వేశాఖ యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నా, అక్కడ రైళ్ల రాకపోకలు మొదలయ్యేందుకు మరింత సమయం పట్టేలా కనిపిస్తోంది. అది హైదరాబాద్-విజయవాడ ప్రధానమార్గం కావటంతో సోమవారం కూడా పెద్ద సంఖ్యలో రైళ్లు రద్దు చేయాల్సి వచ్చింది. ప్రత్యామ్నాయ మార్గంగా బీబీనగర్-గుంటూరు మార్గాన్ని ఎంచుకున్నా.. అది సింగిల్ లైన్ కావటంతో, అన్ని రైళ్లు మళ్లించే వీలు లేకుండా పోయింది. సోమవారం 126 రైళ్లను రద్దు చేయగా, 22 రైళ్లను దారిమళ్లించి నడిపారు. మరో రెండింటిని పాక్షికంగా రద్దు చేశారు. కేసముద్రం పరిస్థితి మెరుగుపడుతుందో లేదో అన్న అనుమానంతో మంగళవారం కూడా 86 రైళ్లను రద్దు చేస్తున్నట్టు రైల్వే శాఖ ప్రకటించింది. బుధవారం 67, గురువారం 58, శుక్రవారం 12 రైళ్లను రద్దు చేయాలని ప్రస్తుతానికి నిర్ణయించినట్టు పేర్కొనటం విశేషం. గత మూడురోజుల్లో కలిపి 438 రైళ్లను రద్దు చేసినట్టయ్యింది. మరో 137 రైళ్లను దారిమళ్లించి నడిపింది.

- మహబూబ్‌నగర్–తాండూరు, మధిర–విజయవాడ, నిజామాబాద్–భీమ్‌గల్, మహబూబ్‌నగర్–మద్దూరు, మహబూబాబాద్–వరంగల్, మహబూబాబాద్–నర్సంపేట, మహబూబాబాద్–తొర్రూరు, మహబూబాబాద్–కేసముద్రం మధ్య ఆర్టీసీ బస్సుల రాకపోకలు సోమవారం రాత్రి వరకు కొనసాగలేదు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 512 బస్సులను రద్దు చేశారు. మొత్తం 224 రూట్‌లలో బస్సుల రాకపోకలపై ప్రభావం కనిపించింది. 2,12,230 లక్షల కి.మీ. మేర బస్సులు తిరగలేదు. మంగళవారం ఒకటి రెండు తప్ప అన్ని మార్గాల్లో తిప్పే ప్రయత్నం చేస్తామని అధికారులు చెబుతున్నారు.
- నిజామాబాద్ జిల్లాలోని కందకుర్తి త్రివేణి సంగమం వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహించడంతో తెలంగాణ– మహారాష్ట్రల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.



మహబూబాబాద్ జిల్లా పురుషోత్తమాయగూడెం సమీపంలో ఆకేరు వాగు బ్రిడ్జి వద్ద పూర్తిగా ధ్వంసమైన జాతీయ రహదారి.. నిచ్చెన ద్వారా రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

200 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

భారీ వర్షాలతో రాష్ట్రంలోని దాదాపు రెండువందల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పీఆర్ ఆర్డీ శాఖ అంచనాల ప్రకారం .117 గ్రామాలకు వెళ్లే పంచాయతీరాజ్ రోడ్లు, మరో 80 గ్రామాలకు వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్లు దెబ్బతిన్నాయి. ఈ రోడ్ల మరమ్మతుల కోసం రూ. 170 కోట్లు ఖర్చు అవసరం అవుతాయని పీఆర్ శాఖ ప్రాథమిక నివేదిక సిద్ధం చేస్తోంది. మిషన్ భగీరథ సబ్ స్టేషన్లలోకి వరద నీరు చేరడంతో నీటి పంపింగ్‌కు అవసరమైన విద్యుత్ లేక 5,700 ఆవాస గ్రామాలకు మిషన్ భగీరథ నీటి సరఫరాలో సమస్యలు ఏర్పడినట్టు పీఆర్ శాఖ పేర్కొంది.

మరో రెండు రోజులు వానలు

- ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలకు చాన్స్
- రాష్ట్రవ్యాప్తంగా కాస్త తగ్గుముఖం పట్టిన వానలు
- సోమవారం నిర్మల్ జిల్లా అక్కాపూర్‌లో 7.95, ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలో 5.75 సెం.మీ. గరిష్ట వాన

రాష్ట్రంలో వర్షపాతం తీరు ఇదీ..

నైరుతి సీజన్ మొత్తం కురవాల్సిన వాన..	అందులో సెప్టెంబర్ 2 నాటికి కురవాల్సింది..	సోమవారం నాటికి కురిసింది
72.85 సెంటీమీటర్లు	58.71 సెంటీమీటర్లు	80.64 సెంటీమీటర్లు

సగటు వర్షపాతం కంటే అధికంగా కురిసినది 37%

అత్యధిక వర్షపాతం: ఐదు జిల్లాలు
అధిక వర్షపాతం: 23 జిల్లాలు
సాధారణ వర్షపాతం: ఐదు జిల్లాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. తూర్పు విదర్భ, తెలంగాణ ప్రాంతంలో రామగుండానికి ఉత్తర-ఈశాన్య దిశలో సుమారు 130 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్న వాయుగుండం.. సోమవారం సాయంత్రానికి అల్ప పీడనంగా మారిందని వివరించింది. దీని ప్రభావంతో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని, మిగతా జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. మరోవైపు శని, ఆదివారాల్లో రాష్ట్రవ్యాప్తంగా దంచికొట్టిన వానలు.. సోమవారం తగ్గుముఖం పట్టాయి.

37శాతం అధిక వర్షపాతం

నైరుతి సీజన్‌కు సంబంధించి వర్షపాతం గణనీయ స్థాయిలో నమోదైంది. నైరుతి రుతుపవనాల సీజన్ (జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు)లో రాష్ట్రవ్యాప్తంగా 72.85 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాలి. అందులో సెప్టెంబర్ 2 నాటికి 58.71 సెంటీమీటర్లు కురవాలి. అదే ఈసారి ఏకంగా 80.64 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణం కంటే ఇది 37 శాతం అధికం కావడం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని ప్రాంతాల్లో సాధారణాన్ని మించి వర్షాలు కురిశాయని.. ఇకపై పడే వానలన్నీ అధిక వర్షపాతమేనని ప్రణాళిక శాఖ అధికారులు చెప్తున్నారు. నైరుతి సీజన్‌లో ఇప్పటివరకు ఐదు జిల్లాల్లో అత్యధిక వర్షపాతం, ఇరవై మూడు జిల్లాల్లో అధిక వర్షపాతం, ఐదు జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

అత్యధిక సగటు వర్షపాతం నమోదైన జిల్లాలు (సెం.మీ.లలో).. (ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు..)

జిల్లా	వర్షపాతం
కామారెడ్డి	11.98
సిద్దిపేట	10.01
జగిత్యాల	9.45
నిర్మల్	8.60
మెదక్	8.59
నిజామాబాద్	8.06
రాజన్న సిరిసిల్ల	7.55
జనగామ	6.64

సోమవారం అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలివీ (సెం.మీ.లలో)

జిల్లా	ప్రాంతం	వర్షపాతం
నిర్మల్	అక్కాపూర్	7.95
ఆదిలాబాద్	నేరడిగొండ	5.75
నిర్మల్	విశ్వనాథ్‌పేట్	5.43
నల్లగొండ	నల్లగొండ	5.38
నిర్మల్	జామ్	4.70
ఆదిలాబాద్	ఆదిలాబాద్	4.70
ఆదిలాబాద్	గుడిహత్నూర్	4.60
ఆదిలాబాద్	ఇచ్చోడ	4.10
నిర్మల్	కుంటాల	4.00

మీ హయాంలోనే డెంగీ కేసులెక్కువ

- కేటీఆర్ ట్వీట్‌కు మంత్రి దామోదర కౌంటర్
- రాజకీయాల కోసం అసత్య ప్రచారాలు మానాలని హితవు



సాక్షి, హైదరాబాద్: రాజకీయాల కోసం అసత్య ప్రచారాలు చేయడం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మానుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హితవు పలికారు. డెంగీ కేసుల విషయంలో కేటీఆర్ చేసిన ట్వీట్‌కు మంత్రి కౌంటర్ ఇచ్చారు. బీఆర్‌ఎస్ హయాంలో నమోదైన డెంగీ కేసుల కంటే, ఈ ఏడాది తక్కువగా నమోదయ్యాయని తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంత్రి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 2023లో 8,016 డెంగీ కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 6,443 కేసులు మాత్రమే నమోదయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో డెంగీ, వైరల్ ఫీవర్స్ కట్టడికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేసిన మంత్రి.. అన్ని ప్రభుత్వ దవాఖాన్లలో టెస్టింగ్ కిట్లు, మెడిసిన్ అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఆందోళనకు గురికావొద్దని భరోసానిచ్చారు. కాగా, డెంగీ కట్టడిలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అంతకుముందు కేటీఆర్ ట్వీట్ చేశారు.

మెడికల్ క్యాంపులు పెట్టండి

రాష్ట్రంలోని వరద ప్రభావిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని దామోదర రాజనర్సింహ ఆదేశించారు. అవసరమైన వారందరికీ టెస్టులు చేసి, మందులు అందజేయాలని సూచించారు. వరదల తీవ్రత ఎక్కువగా ఉన్న ఖమ్మం జిల్లాలో పది మెడికల్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.




పొలాల పండుగ.. బసవన్నలతో భక్తి నిండుగా

తాంసి: పొలాల అమావాస్య వేడుకలను ఆదిలాబాద్ జిల్లాలో రైతులు సోమవారం ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా బసవన్నలను అందంగా అలంకరించారు. అనంతరం వాటిని ఊరేగింపుగా తీసుకొచ్చి ఆయా గ్రామదేవతల ఆలయాల చుట్టూ భక్తి శ్రద్ధలతో ప్రదక్షిణలు చేయించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

మధ్య వయసు దాటాక చాలామందిలో కంటికి వచ్చే సమస్యల్లో ముఖ్యమైనది క్యాటరాక్ట్. ఈ సమస్యనే వాడుకభాషలో కంటిలో వచ్చే తెల్లముత్యం అనీ, పువ్వు రావడం, పొర రావడం అని అంటుంటారు. ప్రపంచవ్యాప్తంగా 60 శాతం మందిలో క్యాటరాక్ట్ వల్ల అంధత్వం వస్తోంది. ఇప్పటికీ మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో మధ్యవయసులోనే అంధత్వానికి దారితీసే కారణాల్లో ఇదీ ఒకటి. దీనికి కారణాలూ, చికిత్స ఏమిటో తెలుసుకుందాం.



● క్యాటరాక్ట్ అంటే...?

చీకటి పొర చీల్చండి

సాధారణంగా వృద్ధాప్య దశలోనే వచ్చే ఈ క్యాటరాక్ట్... ఇటీవల చాలామందిలో చాలా చిన్నవయసులోనే వస్తోంది. అంధత్వానికి దారితీసే అంశాల్లో క్యాటరాక్ట్ కూడా ఒకటి అని తెలిసినప్పటికీ, సాధారణ శస్త్రచికిత్సతో దీన్ని సరిదిద్దడం సాధ్యమైనప్పటికీ మారుమూల పల్లెవాసుల్లో దీనిపై అంతగా అవగాహన లేకపోవడంతో ఇప్పటికీ దీని వల్ల అంధులయ్యేవారి సంఖ్య ఎక్కువగానే ఉంది. సర్జరీ ద్వారా ఈ పరిస్థితిని పూర్తిగా సరిదిద్ది, దీని ద్వారా వచ్చే అంధత్వాన్ని నివారించడం నూటికి నూరు పాళ్లు సాధ్యమే. అదెలాగో చూద్దాం.

క్యాటరాక్ట్ అంటే ఏమిటి, అందుకు కారణాలు... కంట్లో ఉండే పారదర్శకమైన లెన్స్ పారదర్శకంగా ఉన్నంతసేపే కాంతి నిరాటంకంగా లోపలికి ప్రవేశించి రెటీనా తెరను చేరుకుంటుంది. అయితే కొన్ని కారణాల వల్ల లెన్స్ తన పారదర్శకత కోల్పోయే ప్రమాదముంది. అవి... పెరిగే వయసు, లేదా ఏదైనా ప్రమాదాలు వంటి కారణాలతో ఈ లెన్స్ క్రమంగా మసక మసకబారిపోతూ తన పారదర్శకతను కోల్పోతుంది. దాంతో లెన్స్ గుండా కాంతి సాఫీగా ప్రయణించడం సాధ్యం కాదు. ఫలితంగా క్రమంగా చూపు మసకబారుతుంది. ఈ కండిషన్‌నే క్యాటరాక్ట్ అంటారు.

చికిత్స... క్యాటరాక్ట్ ఉన్నవారికి కంట్లో పారదర్శకత కోల్పోయిన లెన్స్‌ను తొలగించి, దాని స్థానంలో కృత్రిమ (ఆర్టిఫిషియల్) లెన్స్ (ఐఓఎల్ / ఇంట్రా ఆక్యులార్ లెన్స్)ను అమర్చడం ద్వారా చికిత్స చేసేవారు. అయితే గతంలో ఈ లెన్స్‌ను తొలగించేందుకు దాదాపు 13–14 ఎం.ఎం. మేరకు కోత పెట్టేవారు. తర్వాత ఈ గాయానికి కుట్లు వేసేవారు. కాల క్రమంలో శస్త్రచికిత్సల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. అక్రిలిక్ టెక్నాలజీలో వచ్చిన మార్పులతో కృత్రిమ లెన్స్‌ను రూపొందించారు. పాత స్వాభావిక (నేచురల్) లెన్స్ స్థానంలో దీన్ని అమర్చుతారు. దీంతో ఆపరేషన్ తర్వాత కనుచూపు పూర్తిగా మెరుగవుతుంది.

ఫ్యాకో ఎమల్సిఫికేషన్... (పీఈ): కాటరాక్ట్ చికిత్సలో ఫ్యాకో ఎమల్సిఫికేషన్ అనేది ఒక ఆధునిక ప్రక్రియ. ఇందులో అల్ట్రా సౌండ్ ఎనర్జీ సహాయంతో లెన్స్‌ను చిన్న చిన్న ముక్కలుగా చేసి, చిన్న రంధ్రం ద్వారా క్యాటరాక్టస్ లెన్స్ (క్యాటరాక్ట్‌కు గురైన లెన్స్)ను తొలగిస్తారు. అదే చిన్న రంధ్రం ద్వారా ఫోల్డబుల్ అక్రిలిక్ ఇంట్రాక్యులార్ లెన్స్‌ను కంటిలోపల అమర్చుతారు. దీనికి కేవలం 2 – 3 ఎం.ఎం. గాటు సరిపోతుంది. కుట్లు వేయాల్సిన అవసరం కూడా ఉండదు. గాటు చిన్నది కావడం వల్ల గాయం మానేందుకు పట్టే సమయం కూడా తక్కువ. ఈ ప్రక్రియలో రిస్క్ కూడా చాలా తక్కువ. దీనిలో కన్ను ఎర్రబారడం, కళ్ల మంట చాలా తక్కువ. ఫలితంగా బాధితులు చాలా త్వరగా తమ వృత్తి, ఉద్యోగాలకు వెళ్లవచ్చు.

ఫెమ్టో లేజర్ చికిత్స : అత్యాధునికమైన ఫెమ్టో లేజర్ సాంకేతికత ఇప్పుడు క్యాటరాక్ట్‌కు మరో చికిత్స. ఇందులో కాటరాక్టస్ లెన్స్ తాలూకు పరిమాణం, మందం వంటి అంశాలను ఓసీటీ టెస్ట్ ద్వారా కొలిచి లేజర్ చికిత్స ద్వారా అవసరమైనంత పరిమాణంలో ముక్కలు చేసి ఆ మేరకే లెన్స్‌ను తొలగిస్తారు. కచ్చితత్వం, భద్రత... ఈ రెండూ ఈ ప్రక్రియలో ప్రధాన భూమిక పోషిస్తాయి.

లెన్స్‌లలో మరెన్నో రకాలు... లెన్స్‌లలో మోనోఫోకల్, బైఫోకల్, ట్రైఫోకల్, టోరిక్ అనేవి కూడా కొత్తగా వచ్చాయి. ఇవి పేషెంట్ అవసరాలను బట్టి అమర్చుతారు.

మత్తు అవసరం లేదు... నొప్పీ ఉండదు

ఫ్యాకో చికిత్సలోనూ, లేజర్ చికిత్సలోనూ గతంలోలా పూర్తిగా మత్తు ఇవ్వాల్సిన అవసరం కూడా లేదు. కేవలం లోకల్ అనస్థీషియాగా చుక్కల మందు వేసి వెంటనే చేసేందుకు అవకాశం ఉంది. అంతేకాదు... గత ప్రక్రియలతో పోలిస్తే నొప్పి కూడా తక్కువే.


కొనసాగుతున్న పరిశోధనలు...

ఫ్యాకో ఎమల్సిఫికేషన్, ఫెమ్టో లేజర్ దగ్గరే పురోగతి ఆగిపోలేదు. మరింత నాణ్యమైన, సమర్థమైన కృత్రిమ లెన్స్‌ల కోసం కృషి కొనసాగుతూనే ఉంది. ఇందులో ఇంట్రా ఆక్యులార్ లెన్స్ మరింత ఆధునికమైనవి.

● కడుపు - మెదడుకు లింక్

డొక్క శుద్ధి బుర్రకు బుద్ధి

బలమైన అభిప్రాయాన్ని చెప్పేటప్పుడు 'గట్ ఫీలింగ్' అంటుంటారు. అభిప్రాయాలూ, ఆలోచనలు కలగడం మెదడు పని కాబట్టి ఆ మాట మెదడునూ సూచిస్తుంది. గట్ అనే కడుపు (జీర్ణాశయ) భాగాన్ని మెదడుకు ముడిపెట్టే మాటలు ఎందుకోగానీ తెలుగులోనూ చాలానే ఉన్నాయి. ఉదాహరణకు... 'కడుపులోంచి దుఃఖం తన్నుకువస్తోంది'... 'కడుపులో ఎంత బాధ దాచుకున్నాడో'... 'కడుపులో పెట్టుకుని చూసుకుంటాడు'... 'ఆ అమ్మ కడుపు చల్లగా'... వంటి ప్రయోగాలతో పాటు, నేర్పు, విద్యకు సంబంధించి... చదువు, లెక్కలు వంటివి వస్తే 'డొక్కశుద్ధి' ఉందనీ, విద్య లేకపోతే 'పొట్టకోస్తే అక్షరం ముక్క రాద'నీ... ఇలా ఎన్నో. జీర్ణవ్యవస్థకూ, మెదడు చేసే పనులకూ ప్రత్యక్ష పరోక్ష సంబంధాలతో పాటూ కడుపు ఆరోగ్యం బాగుంటేనే మెదడు ఆలోచనలూ, పూర్తి ఆరోగ్యమూ బాగుటుందని ఆధునిక వైద్య నిపుణులూ పేర్కొంటున్నారు. ఆ ఉదాహరణలను చూద్దాం.



కడుపు-మెదడు కనక్షన్ ఇలా...

● కడుపు ఖాళీ అవ్వగానే ఖాళీ అయ్యిందంటూ కడుపు మెదడుకు చెబుతుంది. మెదడు 'గ్రెలిన్' అనే హార్మోన్ విడుదల చేయగానే ఆకలేస్తుంది ● కడుపు నిండగానే 'జీఎల్‌పీ-1' అనే మరో హార్మోన్ విడుదలై ఇక భోజనం చాలనిపిస్తుంది ● తిన్న వెంటనే పేగులకు రక్త ప్రసరణ పెరుగుతుంది.అందుకే తిన్న వెంటనే మందకొడిగా, స్తబ్దంగా మారడానికి ఈ కనెక్షనే కారణం ● ఒత్తిడికీ, లేదా ఆందోళనకూ లోనైనప్పుడు పెద్ద మెదడు నుంచి భిన్నమైన సిగ్నళ్లు వెలువడి రెండో మెదడులా పనిచేసే గట్ బ్రెయిన్ ప్రభావితమవుతుంది.

ఇలా ఎందుకు జరుగుతుందంటే...

మెదడు నుంచి వేగస్ నర్వ్ ద్వారా న్యూరో ట్రాన్స్ మీటర్లు పేగులకు వెళ్తాయి. వేగస్ నాడి మెదడుకు కడుపునకూ (గట్‌కూ) మధ్య టెలిఫోన్ తీగలా పని చేస్తూ ఉంటుంది. దీనికి తోడు పేగులకు కూడా 'ఎంటెరిక్ నెర్వస్ సిస్టమ్' అనే సొంత నాడీ వ్యవస్థ ఉంటుంది. కాబట్టి మెదడు నుంచి అందుకునే సమాచారంతో పేగుల్లోని నాడీ వ్యవస్థ ప్రభావితమవుతూ ఉంటుంది. అందుకునే మానసిక ఒత్తిళ్లు, ఆందోళనలకు గురైనప్పుడు జీర్ణ సమస్యలైన 'ఇరిటబుల్ బవెల్ సింద్రోమ్', వాంతులు, నీళ్లవిరేచనాలూ, కడుపు ఉబ్బరం (బ్లోటింగ్) లాంటి సమస్యలు తలెత్తుతాయి.

గట్ హెల్త్ దెబ్బతింటే...

పేగుల్లో కోటానుకోట్ల బ్యాక్టీరియా నివసిస్తూ ఉంటుంది. ఉజ్జాయింపుగా చెప్పాలంటే పది పక్కన పద్నాలుగు సున్నాలు (టెన్ టు ద పవర్ ఆఫ్ ఫోర్టీన్) సంఖ్య ఎంత పెద్దదో అన్ని సూక్ష్మజీవులుంటాయి. కడుపులోని ఈ సూక్ష్మజీవుల సముదాయాన్నే 'గట్ మైక్రోబియం' అంటారు. ఈ గట్ మైక్రోబియమే రోగనిరోధక వ్యవస్థ మొదలు మెటబాలిజం వరకూ శరీరంలోని పలు జీవక్రియావ్యవహారాలను ప్రభావితం చేస్తుంది. ఈ సూక్ష్మజీవులు సమృద్ధిగా ఉన్నంత కాలం ఎంతటి తీవ్రమైన రుగ్మతలతోనైనా పోరాడటం సాధ్యమవుతుంది. పేగుల్లోని మైక్రోబియం హెచ్చుతగ్గులకు లోనైతే చాలా రకాల వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది. ఉదాహరణకు ఇన్‌ఫ్లమేటరీ సమస్యలు మొదలుకొని మధుమేహం, ఉబ్బసంలాంటి వాటితో పాటు... చివరకు మానసిక వ్యాధుల బారిన పడతారు. అయితే గట్ హెల్త్ దెబ్బతిని మంచి బ్యాక్టీరియా తగ్గిపోయి ఆలోచనలూ, మానసికారోగ్యాలూ, భావోద్వేగాలు ప్రభావితం అవ్వడానికి చాలా కారణాలుంటాయి. అవేమిటంటే...

● **యాంటీబయాటిక్స్:** వీటితో దేహానికి హాని చేసే చెడు బ్యాక్టీరియాతో పాటు మంచి బ్యాక్టీరియా కూడా నశిస్తుంది. ● **ఒత్తిడి:** వృత్తిపరమైన, వ్యక్తిగతమైన ఒత్తిడులు, ఆఫీసుల్లో సహోద్యోగుల వల్ల తలెత్తే ఒత్తిడులు, సామాజిక ఒత్తిళ్లు.. వీటన్నింటి ప్రభావం నుంచి తప్పించుకోవాలంటే మానసికంగా దృఢంగా ఉండాలి.

● **ఆందోళన:** మానసిక ఆందోళన కలగగానే... గ్యాస్ట్రో ఇంటెస్టినల్ ట్రాక్ట్‌కు రక్త సరఫరా సక్రమంగా జరగదు. మానసికాందోళనలు మాటిమాటికీ తలెత్తే వాళ్లలో కొందరిలో పేగుల్లోని గోడలు చిట్లుతాయి. ఈ పరిస్థితినే 'లీకీ గట్' అంటారు. ఆందోళనలు లోనైనప్పుడు విడుదలయ్యే రసాయనాలు (స్ట్రెస్ కెమికల్స్) వ్యాధినిరోధక వ్యవస్థ సామర్థ్యాన్ని తగ్గిస్తాయి. ఫలితంగా దేహానికి హాని చేసే చెడు బ్యాక్టీరియాతో వ్యాధినిరోధకశక్తి పోరాడలేదు. ఆందోళనలకు గురయ్యేవారిలో కడుపులో యాసిడ్ ఉత్పత్తి పెరుగుతుంది. ఇది అదేపనిగా కొనసాగుతుంటే కడుపు, పేగుల్లో పుండ్లు (అల్సర్స్) రావచ్చు. ఒక్కోసారి అక్కడ అల్సర్ మరింతగా పెరిగి కడుపులో రంధ్రం పడవచ్చు.


● **ఇతర మానసిక ఆరోగ్య సమస్యలు:** సెరటోనిన్ ఉత్పత్తి తగ్గడం మూలంగా డిప్రెషన్, యాంగ్జైటీ మొదలవుతాయి. మెదడులోనే ఉత్పత్తి అవుతుందని అందరూ అనుకునే సెరటోనిన్‌లో 95 శాతం పేగుల్లోనే తయారవుతుంది. అంతే కాదు... సెరటోనిన్, డోపమైన్ అనే ఈ హ్యాపీ హార్మోన్ల తయారీకి తోడ్పడే విటమిన్లు, అమినో యాసిడ్లను... నిజానికి పేగుల్లోని మంచి బ్యాక్టీరియానే ఉత్పత్తి చేస్తాయి. కాబట్టి పేగుల్లో మంచి బ్యాక్టీరియా తగ్గితే, సెరటోనిన్ కూడా తగ్గి మానసిక సమస్యలూ మొదలవుతాయి.

గట్ రక్షణకు పరిష్కార మార్గాలివి... :

ఆహారపరమైనవి : పెరుగు తినడం వల్ల పేగుల్లోని మేలు చేసే బ్యాక్టీరియా పెరుగుతుంది. అందుకే మజ్జిగ, పెరుగు వంటి వాటిని 'ప్రో-బయోటిక్స్' అంటుంటారు. వీటితో పాటు పీచు పుష్కలంగా ఉండే ఆకుకూరలు, కూరగాయలు తినడం వల్ల మలబద్ధకం ఉండదు. పొద్దున్నే సుఖవిరేచనం అవుతుంది. దాంతో రోజంతా ఉల్లాసంగా ఉంటుంది. ఇందుకోసం ప్రతి భోజనంలో మూడింట ఒక వంతు కూరగాయలు ఉండేలా చూసుకోవాలి. పండ్లు, డ్రైఫ్రూట్స్‌లో కివి, ఆఫ్రికాట్‌లతో పాటు బ్రోకలీ, కాలీఫ్లవర్, క్యాబేజీ వంటివి తరచూ తింటూ ఉండాలి. ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు పుష్కలంగా తీసుకోవడం మూడ్స్‌ను బాగు చేస్తుంది. ఇందుకోసం చేపలు తినాలి. ● వ్యాయామం ఎండార్ఫిన్స్‌ను వెలువరించడం వల్ల హాయి, సంతోషం లాంటి ఫీలింగ్స్ కలిగించడమే కాకుండా కడుపును తేలిగ్గా ఉంచుతుంది. ఈ జాగ్రత్తలు తీసుకున్న తర్వాత కూడా ఎసిడిటీ, కడుపుబ్బరం, మలబద్ధకంతో మూడ్స్ చెడిపోతుంటే వైద్యులను సంప్రదించాలి.

శరీరంలోని అనేక గ్రంథుల్లో జీవక్రియలకు ఉపయోగపడే అత్యంత కీలకమైన వాటిలో థైరాయిడ్ గ్రంథి అత్యంత ముఖ్యమైనది. దేహంలోని మెడ భాగంలో సీతాకోకచిలుక ఆకృతిలో శ్వాసనాళానికి రెండువైపులా ఉండే ఈ గ్రంథి థైరాయిడ్ స్టిమ్యులేటింగ్ హార్మోన్ (టీఎస్‌హెచ్)ను విడుదల చేస్తుంది. ఈ థైరాయిడ్ గ్రంథి అసాధారణంగా పెరిగిపోయే కండిషన్‌ను 'గాయిటర్' అంటారు.

గాయిటర్ అంటే..?



గాయిటర్ రెండు రకాలుగా ఉంటుంది. మొదటిది డిఫ్యూజ్ గాయిటర్, రెండోది నాడ్యులార్ గాయిటర్. సాధారణ పరిమాణం కంటే థైరాయిడ్ గ్రంథి ఉబ్బిపోయి ఇరువైపులా సమానంగా పెరగడాన్ని డిఫ్యూజ్ గాయిటర్‌గా పరిగణిస్తారు. ఇక రెండోది నాడ్యులార్ గాయిటర్‌ల థైరాయిడ్ గ్రంథి తాలూకు ఒక భాగంలో... ఒకటి లేదా ఇంకా ఎక్కువ సంఖ్యలో గడ్డలు ఏర్పడతాయి. ఇలా గడ్డల్లా పెరగడాన్ని నాడ్యులార్ గాయిటర్ అంటారు. గాయిటర్ సమస్య వచ్చిన కొంతమందిలో థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తి విషయంలో ఎలాంటి మార్పులూ కనిపించవు. కానీ మరికొందరిలో మాత్రం థైరాయిడ్ హార్మోన్లు ఎక్కువ లేదా తక్కువ మోతాదులో ఉత్పత్తి అవుతాయి. హార్మోన్ల ఉత్పత్తి మోతాదులు పెరిగితే దాన్ని 'హైపర్ థైరాయిడిజం' అనీ, తగ్గితే 'హైపోథైరాయిడిజమ్' అని పరిగణిస్తారు. ఇది శరీరంలో అయోడిన్ లోపం వల్ల సంభవిస్తుంది.

నిర్ధారణ పరీక్షలు... పై సమస్యలు ఉన్నవారిలో మామూలుగా గొంతును పరీక్షించడంతో పాటు థైరాయిడ్ ప్రొఫైల్ పరీక్షలైన టీ3, టీ4, టీఎస్‌హెచ్, యాంటీ థైరాయిడ్ యాంటీబాడీస్ వంటి నిర్ధారణ పరీక్షలు చేస్తారు.

చికిత్స... థైరాయిడ్ వైద్యపరీక్షా ఫలితాల ఆధారంగా ఎండోక్రైనాలజిస్ట్ ఆధ్వర్యంలో సమస్యకు తగిన చికిత్స చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం మనకు ఉన్న వైద్యపరిజ్ఞానంతో థైరాయిడ్ వ్యవస్థను సరిచేయడం ద్వారా... అసలు ఎలాంటి శస్త్రచికిత్స అవసరం లేకుండానే థైరాయిడ్ గ్రంథి వాపు (గాయిటర్) సమస్యను పూర్తిగా నయం చేయవచ్చు. కాబట్టి ఇలాంటి రోగులు ఆందోళన పడాల్సిన అవసరం లేదు.

నేటి టీన్... నెక్ పెయిన్

సాధారణంగా మధ్యవయస్కుల్లో కనిపించే మెడనొప్పి, నడుమునొప్పి వంటి సమస్యలు టీనేజర్లలో అంతగా కనిపించకపోవచ్చు. కానీ వాళ్లలోనూ అవి కనిపించేందుకు అవకాశం లేకపోలేదు. ఇటీవల మాత్రం టీనేజర్లలో మెడనొప్పి కేసులు చాలా ఎక్కువే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా మెడ ఒంచి మొబైల్ చూస్తూ ఉండటం, అదే కాకుండా ఆ వయసులోని పోశ్చర్‌కు సంబంధించిన లైఫ్‌స్టైల్ అలవాట్లూ ఇందుకు కారణం. ఉదాహరణకు... స్కూళ్లూ/కాలేజీలలో చాలాసేపు మెడవంచి రాసుకుంటూ, చదువుకుంటూ కూర్చునే ఉండటం, సరైన భంగిమ(పోష్చర్)లో కూర్చోకపోవడం, బల్ల మీద ఉన్న కంప్యూటర్‌కూ, కుర్చీకీ మధ్య సరైన సమన్వయం లేకపోవడం లాంటి ఎన్నో అంశాలు వాళ్లలో మెడనొప్పికి కారణమవుతుంటాయి. ఆ సమస్యలనుంచి విముక్తి ఎలాగో తెలుసుకుందాం.




కేవలం కూర్చునే పోష్చర్ లాంటి అలవాట్లే కాకుండా... కొన్ని ఆరోగ్య సమస్యల వల్ల కూడా మెడనొప్పి రావచ్చు. ఉదాహరణకు చిన్నతనంలో వచ్చే (టైప్-1) డయాబెటిస్, విటమిన్ లోపాలు, జీవక్రియల్లో లోపాల వల్ల కూడా టీనేజర్లలో మెడనొప్పి వచ్చే అవకాశముంది.

నివారణ కోసం... ● స్కూల్ / కాలేజీలో కూర్చునే చోట... డెస్క్ తమ ఎత్తుకు తగినట్లుగా ఉందో లేదో / తమ ఎత్తుకు తగినట్లుగా పోష్చర్ ఉందో లేదో పరిశీలించుకోవాలి ● కంప్యూటర్ల వాడకం లేదా వీడియో గేమ్స్‌లో పోష్చర్ సరిగా లేకుండా కూర్చున్నప్పుడు వెన్నుతో పాటు, దేహంలోని కండరాలపై ఒత్తిడి సరిగా పడాల్సిన విధంగా కాకుండా... ఒక్కోచోట ఎక్కువ ఒత్తిడి పడటం, మరికొన్ని చోట్ల సరిగా పడకపోవడం వంటి సమస్యలతో మెడనొప్పి, వెన్నునొప్పి రావచ్చు. అందుకే స్కూల్లో/కాలేజీలో లేదా ఇంట్లో చదువుల బల్ల / కంప్యూటర్ టేబుల్ వద్ద సరిగా (సరైన పోష్చర్‌లో) కూర్చుండేలా చూడాలి. వెన్నుపై సమాన భారం పడేలా నిటారుగా ఉండాలి. ఏదో ఒక వైపునకు ఒంగిపోకూడదు ● స్థూలకాయం ఉన్న టీనేజీ పిల్లల్లో మెడనొప్పి సమస్య ఎక్కువ. టీనేజర్లలో ఒబెసిటీ తగ్గేలా చర్యలు తీసుకోవాలి. ఒబెసిటీ పెంచే జంక్‌ఫుడ్ /బేకరీ ఐటమ్స్ లాంటివి కాకుండా టీనేజర్లకు అన్ని పోషకాలూ, విటమిన్లు అందేలా సమతులాహారం ఇవ్వాలి. ● ఒకప్పుడు టీనేజీ పిల్లలు ఆరుబయట ఒళ్లు అలిసిపోయేలా ఆటలాడేవారు. కానీ ఇటీవల ఆటలాడటం తగ్గిపోయింది. దాంతో వెన్ను, దాని ఇతర ఎముకలకు తగినన్ని పోషకాలు అందకపోవడం వల్ల కూడా మెడనొప్పి రావడం పెరిగింది. తగినంత వ్యాయామం లేని టీనేజర్లు తమ వర్కవుట్స్‌తో సామర్థ్యం (స్టామినా) పెంచుకోకపోవడం వల్ల త్వరగా అలసిపోతుంటారు. తగినంత వ్యాయామం చేయడం లేదా బాగా ఆటలాడటం ద్వారా స్టామినా పెంచుకుంటే మెడనొప్పి వంటి సమస్యలూ తగ్గిపోతాయి ● పిల్లల్లో విటమిన్ డి లోపం వల్ల కూడా మెడనొప్పి వస్తుంది. అంతేకాదు... దాంతో వ్యాధి నిరోధకత తగ్గడం వల్ల వ్యాధుల రిస్క్ కూడా పెరుగుతుంది. అందుకే టీనేజీ పిల్లలకు లేత ఎండ తగిలేందుకు ఆరుబయట ఆటలాడేలా తల్లిదండ్రులు చూడాలి.

పోష్చర్ సరిచేసుకోవడం, ఆటలాడటం / వ్యాయామం తర్వాత కూడా మెడనొప్పి వస్తుంటే ఇతర ఆరోగ్య సమస్యలేమైనా ఉన్నాయేమో తెలుసుకోడానికి ఒకసారి డాక్టర్‌ను సంప్రదించి, తగిన పరీక్షలు చేయించడం మంచిది.

● ప్రీ-హైపర్‌టెన్షన్

రక్తపోటు లేదా హైపర్‌టెన్షన్ అంటే అందరికీ తెలిసిందే. కానీ... వాస్తవానికి రక్తపోటు వచ్చేందుకు ముందు కొన్ని సూచనల ద్వారా శరీరం హెచ్చరికలు పంపుతుంటుంది. అవేమిటో జాగ్రత్తగా గ్రహిస్తే అసలు రక్తపోటు రాకుండానే చాలాకాలం పాటు ఆలస్యం చేయడమో, అదే క్రమశిక్షణ పాటిస్తే దాదాపుగా నివారించడమో సాధ్యమవుతుంది. దేహం అలా హెచ్చరికలు పంపే దశను 'ప్రీ-హైపర్‌టెన్షన్' దశగా పేర్కొంటారు. నిజానికి ప్రీ హైపర్‌టెన్షన్ దశలోనే జాగరూకతతో వ్యవహరిస్తే ఎన్నో ఆరోగ్య సమస్యలూ, మూత్రపిండాలు, మెదడు లాంటి కీలకమైన ఎండ్ ఆర్గాన్స్ దెబ్బతినకుండా నివారించుకుకోవచ్చు. ఆ 'ప్రీ-హైపర్‌టెన్షన్' ఏమిటో చూద్దాం.



బీ'పీక్స్' పోకముందే చెక్స్

రక్తనాళాల్లో రక్తం నిర్దిష్టమైన వేగంతో ప్రవహిస్తూ ఉంటుంది. ఓ వ్యక్తి తాలూకు రక్తపోటు 120/80 ఉంటే అది పూర్తిగా నార్మల్ కాబట్టి దాని గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదు. కొందరిలో ఈ నార్మల్ కొలత ఖచ్చితంగా ఉండక కొంత అటు ఇటుగా మారుతూ ఉండవచ్చు. ఉదాహరణకు సిస్టోలిక్ రక్తపోటు విలువ 120కి బదులుగా 121 నుంచి 139 ఉండవచ్చు. అలాగే డయాస్టోలిక్ విలువ 80కి బదులుగా 81 నుంచి 89 వరకు ఉండవచ్చు. 120 /80 కి బదులుగా పైన పేర్కొన్న ఆ కొలతలు ఉంటే ఆ దశను రక్తపోటు ఉన్న దశగా చెప్పడం కుదరదు. అలాగని అది నార్మల్ విలువ కూడా కాదు. అందుకే డాక్టర్లు ఆ దశను 'ప్రీహైపర్‌టెన్షన్' (రక్తపోటు రాబోయే ముందు దశ)గా పేర్కొంటారు. ఈ 'ప్రీహైపర్‌టెన్షన్' దశను నిర్లక్ష్యం చేస్తే ముస్ముందు 'హైబీపీ' రావచ్చు. అయితే హైబీపీ నిశ్శబ్దంగా ఎన్నో ఆరోగ్య సమస్యలనూ, అనర్థాలను తెచ్చిపెడుతుందన్న విషయాన్ని గమనంలో ఉంచుకుని, కొన్నిజాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రీ-హైపర్‌టెన్షన్‌లో బాధితులు వెంటనే మందులు వాడాల్సిన అవసరం ఉండదు. ఆ హెచ్చరికలతో అప్రమత్తమై కొన్ని ముందుజాగ్రత్త చర్యలకు పూనుకోవాలి. ప్రీ-హైపర్‌టెన్షన్ దశలోనే తమ తమ వ్యక్తిగత జీవనశైలిలోని అలవాట్లను చక్కబరచుకోవడం ద్వారా రక్తపోటును అదుపులోకి తెచ్చుకునే వెసులుబాటు ఉంటుంది.

హైబీపీ ఓ సైలెంట్ కిల్లర్...

అధిక రక్తపోటును (హైబీపీని) సైలెంట్ కిల్లర్‌గా పేర్కొంటారు. ఎందుకంటే దీనివల్ల ఆరోగ్యానికి కలిగే అనర్థాలు, నష్టాలు వెంటనే బయటకు కనిపించవు. పైగా రక్తపోటు పెరిగి ఉందన్న విషయం బాధితుడికి మొదట్లో తెలియనే తెలియకపోవచ్చు కూడా. అందువల్ల నష్టం జరుగుతూపోతూ... దీర్ఘకాలంలో ఏవైనా అవయవాలు దెబ్బతినప్పుడు, వాటికి సంబంధించిన లక్షణాలు బయటపడేవరకు జరిగిన నష్టం తెలియరాదు. కొన్నిసార్లు నష్టం జరిగిపోయాక మాత్రమే అప్పుడది హైబీపీ వల్ల జరిగిన అనర్థమని తెలుస్తుంది. అందుకే దీన్ని సైలెంట్ కిల్లర్ అంటారు.

హైబీపీకి కారణాలు

హైబీపీకి నివారించలేనివీ, నివారించదగినవనే రెండు రకాల కారణాలుంటాయి.

నివారించలేని కారణాలు : పెరుగుతున్న వయసు, కుటుంబంలో వంశపారంపర్యంగా హైబీపీ ఉన్న మెడికల్ హిస్టరీ వంటివి నివారించలేని కారణాలని చెప్పవచ్చు.

నివారించదగిన కారణాలు : ఉండాల్సిన బరువు కంటే ఎక్కువగా ఉండటం (స్థూలకాయం), ఒకే చోట కూర్చుని పనిచేసే జీవనశైలి, ఆహారంలో ఉప్పు ఎక్కువగా తీసుకోవడం, పొగతాగడం, పొగాకు నమలడం, మద్యం తీసుకోవడం వంటి అలవాట్లు, కొవ్వులు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం వంటి అనేక అంశాలు నివారించదగిన కారణాలు.

ఈ సూచనలు పాటించండి...

కేవలం ప్రీహైపర్‌టెన్షన్ మాత్రమే ఉన్నప్పుడు నివారించదగిన కారణాలను తెలుసుకుని అవి ప్రమాదకరం కాదని నిర్లక్ష్యం చేయకుండా ఈ సూచనలు పాటించాలి ● జీవనశైలిలో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో తగిన జాగ్రత్తలు తీసుకోవడం. అంటే సోడియమ్ మోతాదులు పెరగకుండా ఆహారంలో ఉప్పు తక్కువగా తీసుకోవడం; ● ఉప్పు ఎక్కువగా ఉండే పచ్చళ్లు, చిప్స్, బేకరీ ఐటమ్స్ వంటి వాటికి దూరంగా ఉండటం ● కొవ్వులు ఎక్కువగా ఉండే ఆహారం కంటే ఆకుకూరలు, కాయగూరలు ఎక్కువగా తీసుకోవడం. మాంసాహారంలో వేట మాంసం కంటే వైట్ మీట్ అయిన చికెన్, చేపలు ఎక్కువగా తీసుకోవడం ● అదనపు బరువును ఆహారపు అలవాట్లు, వ్యాయామం ద్వారా నియంత్రించుకోవడం ● ఎప్పుడూ కూర్చుని ఉండే పనుల్లో ఉండేవారు వాకింగ్ వంటి వ్యాయామాలు చేయడం.

ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటూ ప్రీ-హైపర్‌టెన్షన్ దశలోనే జాగ్రత్తవహిస్తే అధిక రక్తపోటును చాలా కాలం పాటు నివారించుకోవచ్చు. దాంతో గుండెపోటు, పక్షవాతం, మెదడుకు సంబంధించిన ఇతర సమస్యలు, మూత్రపిండాలు దెబ్బతినడం వంటి అనేక రకాల ప్రమాదకరమైన పరిస్థితులు రాకుండా చేసుకోవచ్చు.

బిజినెస్ రీల్

ఆగస్టులో 'తయారీ' మందగమనం

• 58.1 నుంచి 57.5కు సూచీ డౌన్

న్యూఢిల్లీ: భారత్ తయారీ రంగం స్పీడ్ ఆగస్టులో మందగించింది. హెచ్ఎస్‌బీసీ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) జూలైలో 58.1 వద్ద ఉంటే, ఆగస్టులో 57.5కు తగ్గింది. అయితే ఈ సూచీ 50పైన ఉంటే, దానిని వృద్ధి ధోరణిగానే పరిగణిస్తారు. ఆ దిగువకు పడిపోతేనే క్షీణతగా భావిస్తారు. తయారీ రంగానికి సంబంధించి ఆగస్టులో ఉత్పత్తి, అమ్మకాలు ఏడు నెలల కనిష్టానికి తగ్గినట్లు గణాంకాలు వెల్లడించాయి.

వృద్ధి పథం వేగవంతం: అరబిందో

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్పెషాలిటీ వ్యాపారాన్ని విస్తరించడం, బయోసిమిలర్ ఉత్పత్తుల అభివృద్ధి వేగవంతం, సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం, వ్యాపారాన్ని పెంచడానికి వృద్ధి మార్కెట్లలో కార్యకలాపాలను తదుపరి స్థాయికి తీసుకువెళ్లడం.. ఇలా వివిధ వ్యూహాత్మక కార్యక్రమాల ద్వారా మార్కెట్ అవకాశాలను ఉపయోగించుకునేందుకు కంపెనీ తన వృద్ధి పథాన్ని వేగవంతం చేస్తోందని ఫార్మా దిగ్గజం అరబిందో ఫార్మా తెలిపింది. కంపెనీ అభివృద్ధి చేస్తున్న 14 బయోసిమిలర్ ఉత్పత్తులు వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించింది. అలాగే యూఎస్‌లో 14 పెప్టైడ్ ఏపీఐ డీఎంఎఫ్‌లను సమర్పించినట్టు వివరించింది. అనుబంధ కంపెనీ థెరానిమ్ బయోలాజిక్స్ ద్వారా ఇటీవలే అరబిందో ఫార్మా బయోలాజిక్స్ కాంట్రాక్ట్ తయారీలో ప్రవేశించింది. ఏటా 25–30 మిలియన్ల వయల్స్ సామర్థ్యంతో బయోలాజిక్స్ తయారీ ప్లాంట్‌ను రూ.1,000 కోట్లతో నెలకొల్పాలని నిర్ణయించింది. పరిశోధన, అభివృద్ధి, తయారీ సామర్థ్యం పెంచుకోవడం, విలువ చేకూర్చే కొనుగోళ్లలో పెట్టుబడులు, సంస్థ యొక్క దృఢమైన దృష్టి.. వెరశి పోటీతత్వాన్ని పొందేందుకు, స్థిర వృద్ధిని కొనసాగించడంలో సహాయపడిందని అరబిందో ఫార్మా వైస్ చైర్మన్, ఎండీ కె.నిత్యానంద రెడ్డి తెలిపారు.

రీజెన్సీ సెరామిక్స్ చేతికి సెగ్నో సెరామిక్స్ ప్లాంటు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ బాపట్లలోని సెగ్నో సెరామిక్స్‌ను వ్యూహాత్మక టేకోవర్ చేస్తున్నట్లు రీజెన్సీ సెరమిక్స్ తెలిపింది. డీల్ ప్రకారం కంపెనీ తయారీ ప్లాంటు ఆగస్టు 22 నుంచి తమ ఆధీనంలోకి వచ్చినట్లు వివరించింది. ఈ ప్లాంటు 50 ఎకరాల విస్తీర్ణంలో, ఏటా 3.6 మిలియన్ చ.మీ. ఉత్పత్తి సామర్థ్యంతో ఉన్నట్లు పేర్కొంది. తూర్పు, దక్షిణాది మార్కెట్లలో స్థానాన్ని పటిష్టం చేసుకునేందుకు ఈ కొనుగోలు ఉపయోగపడగలదని రీజెన్సీ సెరమిక్స్ ఎండీ ఎస్ సత్యేంద్ర ప్రసాద్ తెలిపారు. వచ్చే ఏడాది రూ. 100 కోట్ల ఆదాయ లక్ష్యం పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

3-9-2024	
విశాఖ	505-00
చిత్తూరు	508-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	495-00
విజయవాడ	495-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	465-00
వరంగల్	467-00
రిటైల్ ధర	5.25

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJAJFINSV	1,842.00	3.31
BAJFINANCE	7,420.00	3.05
HCLTECH	1,800.00	2.67
HEROMOTOCO	5,575.00	2.19
SBILIFE	1,887.45	2.01

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HINDALCO	683.5	-2.55
DRREDDY	6,868.00	-2.32
TATAMOTORS	1,093.00	-1.65
NTPC	410.15	-1.45
ONGC	326.3	-1.35

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,274
ఎన్ఎస్ఈ	1,10,147
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,81,303
ఎఫ్ఐఐ	+ 1,735
డీఐఐ	+ 356

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	74.00	$ 73.55
బ్రెంట్	76.93	$ 76.93

త్వరలో సింగిల్ ఫైలింగ్

• ఒక ఎక్స్ఛేంజీలో ఫైల్ చేస్తే రెండో దానిలో ఆటోమేటిక్‌గా అప్‌లోడింగ్
• రూ. 250 నుంచి సిప్ ప్లాన్లు
• సెబీ చీఫ్ మాధవి పురి వెల్లడి



సీఐఐ ఫైనాన్షియల్ 3.0 సదస్సులో మాధవి పురి బుచ్, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ (ఎడమ), బజాజ్ ఫిన్‌సర్వ్ సీఎండీ సంజీవ్ బజాజ్ (కుడి)

ముంబై: లిస్టెడ్ కంపెనీలకు సంబంధించి సింగిల్ ఫైలింగ్ ప్రతిపాదన త్వరలోనే అమల్లోకి రాగలదని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ వెల్లడించారు. దీనితో, లిస్టింగ్ నిబంధనల ప్రకారం కంపెనీలు తాము వెల్లడించాల్సిన సమాచారాన్ని ఒక ఎక్స్ఛేంజీలో ఫైలింగ్ చేస్తే రెండో ఎక్స్ఛేంజీలో కూడా అది ఆటోమేటిక్‌గా అప్‌లోడ్ అవుతుందని పేర్కొన్నారు. పరిశ్రమల సమాఖ్య సీఐఐ నిర్వహించిన ఫైనాన్సింగ్ 3.0 సదస్సులో ప్రత్యేక ప్లీనరీ సెషన్‌లో పాల్గొన్న సందర్భంగా మాధవి ఈ విషయాలు తెలిపారు. సెబీ మాజీ హోల్‌టైమ్ సభ్యుడు ఎస్‌కే మొహంతి సారథ్యంలోని కమిటీ ఈ సిఫార్సులు చేసింది.

మరోవైపు, నెలకు అత్యంత తక్కువగా రూ. 250 నుంచి ప్రారంభమయ్యే సిప్‌ల (సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్) ప్రతిపాదన కూడా త్వరలో సాకారం కాగలదని కాగలదని మాధవి వివరించారు. అన్ని ఆర్థిక సాధనాలను సామాన్యులకు అందుబాటులోకి తెచ్చే దిశగా ఇది కీలక పరిణామం కాగలదని చెప్పారు.

ప్రాంతీయ భాషల్లో ఐపీవో పత్రాలు..: భాషాపరమైన అడ్డంకులను తొలగించేందుకు, ఇన్వెస్టర్లలో అవగాహన పెంచేందుకు ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) పత్రాలను బహుళ భాషల్లో అందుబాటులోకి తేవాలన్న నిబంధనను కూడా ప్రవేశపెట్టే యోచన ఉందని మాధవి చెప్పారు. మరింత మంది ఇన్వెస్టర్లు మార్కెట్లలో పాలుపంచుకునేందుకు ఐపీవో ప్రాస్పెక్టస్ 15–16 ప్రాంతీయ భాష ల్లో ఉండాలని ఆమె పేర్కొన్నారు. ఇన్వెస్టరు తీరుకు అనుగుణమైన వివిధ ఆర్థిక సాధనాలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయ త్నాలు జరుగుతున్నాయని తెలిపారు. మారుతున్న ఇన్వెస్టర్ల అవసరాలకు తగ్గట్లుగా కొత్త సాధనాలను ప్రవేశపెట్టడంపై పరిశ్రమతో కలిసి పనిచేయనున్నట్లు చెప్పారు.

'హోల్డ్'లో జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ 'ఆఫర్'



జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ కంపెనీ జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) దరఖాస్తును సెబీ 'హోల్డ్'లో పెట్టింది. 'పరిశీలన జారీ చేశాం. దీంతో నిలుపుదల చేశాం'అని సెబీ పేర్కొంది. కారణాలను తెలియజేయలేదు. ఈ ఏడాది ఆగస్ట్ 16న ఐపీవో పత్రాలను సెబీకి జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ సమర్పించడం గమనార్హం. ప్రతిపాదిత దరఖాస్తు ప్రకారం.. తాజా షేర్ల జారీ ద్వారా రూ.2,000 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.2,000 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. తాజా షేర్ల జారీ ద్వారా సమకూరిన నిధుల్లో రూ.800 కోట్లతో రాజస్థాన్‌లోని నాగౌర్‌లో కొత్త సిమెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలనుకుంటోంది. ప్రస్తుతం కంపెనీ నిర్వహణలో 19 మిలియన్ టన్నుల వార్షిక సిమెంట్ తయారీ సామర్థ్యం (ఎంటీపీఏ) ఉండగా.. 60 ఎంటీపీఏ చేరుకోవాలన్నది కంపెనీ లక్ష్యం.

ఐపీవోకు ఐడెంటికల్ బ్రెయిన్ స్టూడియోస్: వీఎఫ్ఎక్స్ సేవల కంపెనీ 'ఐడెంటికల్ బ్రెయిన్ స్టూడియోస్' ఐపీవోకి రావాలనుకుంటోంది. ఎన్ఎస్ఈ 'ఎమర్జ్' ప్లాట్‌ఫామ్‌పై (సూక్ష్మ కంపెనీలకు ఉద్దేశించిన) లిస్ట్ అయ్యేందుకు వీలుగా పత్రాలు సమర్పించింది. ఐపీవోలో భాగంగా 36.94 లక్షల షేర్లను తాజాగా జారీ చేయనుంది. సమీకరించే నిధులతో ముంబైలోని అంధేరిలో ఉన్న స్టూడియో, ఆఫీస్ నవీకరణ, అంధేరిలోనే కొత్త శాఖలో సౌండ్ స్టూడియో సెటప్ ఏర్పాటుకు వినియోగించనుంది. లక్నోలో నూతన బ్రాంచ్ ఆఫీస్ ఏర్పాటు చేయనుంది. సినిమాలు, వెబ్ సిరీస్‌లు, టీవీ కార్యక్రమాలకు కావాల్సిన వీఎఫ్ఎక్స్ సేవలను ఈ సంస్థ అందిస్తుంటుంది. 2024 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి రూ.20 కోట్ల ఆదాయంపై, రూ.5.34 కోట్ల లాభాన్ని ప్రకటించింది.

ఐపీవో షేర్లు.. వారంలోనే విక్రయం!

లాభాల స్వీకరణకే ఇన్వెస్టర్ల మొగ్గు

ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)లలో ఉత్సాహంగా పాల్గొంటున్న ఇన్వెస్టర్లలో ఎక్కువ మంది స్వల్పకాల దృష్టితోనే వస్తున్నట్టు సెబీ అధ్యయనంలో వెల్లడైంది. ఐపీవోలో తమకు కేటాయించిన షేర్లలో 54 శాతం మేర (విలువ పరంగా) లిస్ట్ అయిన వారంలోనే విక్రయిస్తున్నారు. ఐపీవో ధరతో పోల్చితే లాభాలతో లిస్టింగ్ అయ్యేవి ఎక్కువ ఉంటుండగా, కొన్ని నష్టాలతో లిస్ట్ కావడం లేదా లిస్ట్ అయిన వెంటనే నష్టాల్లోకి వెళ్లడం సాధారణంగా చూస్తుంటాం. అయితే, నష్టాలతో లిస్ట్ అయిన వాటి కంటే, లాభాలతో లిస్ట్ అయిన వాటిని విక్రయించే స్వభావం ఇన్వెస్టర్లలో కనిపిస్తోంది. ఇటీవలి కాలంలో ఐపీవోలలో వ్యక్తిగత ఇన్వెస్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. రిటైల్ కోటా సైతం పదులు, వందల సంఖ్యలో అధిక సబ్‌స్క్రిప్షన్లను అందుకుంటోంది. దీంతో ఐపీవోల పట్ల ఇన్వెస్టర్ల ధోరణి తెలుసుకునేందుకు సెబీ లోతైన అధ్యయనం నిర్వహించింది. 2021 ఏప్రిల్ నుంచి 2023 డిసెంబర్ మధ్య కాలంలో 144 ఐపీవోలకు సంబంధించిన డేటాను విశ్లేషించింది. యాంకర్ ఇన్వెస్టర్లు మినహా మిగిలిన ఇన్వెస్టర్లు 54 శాతం మేర షేర్లను (విలువ పరంగా) లిస్ట్ అయిన వారంలోనే విక్రయించారు. ఇందులో 50.2 శాతం షేర్లు వ్యక్తిగత ఇన్వెస్టర్లకు చెందినవి కాగా, నాన్ ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు సైతం 63.3 శాతం షేర్లను వారంలోనే విక్రయించారు. ఇక రిటైల్ ఇన్వెస్టర్లు సైతం 42.7 శాతం షేర్లను లిస్ట్ అయిన వారంలోపే విక్రయించి లాభాలు స్వీకరించినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఐపీవోల్లో పాల్గొన్న వ్యక్తిగత ఇన్వెస్టర్లు 70 శాతం మేర తమకు కేటాయించిన షేర్లను ఏడాదిలోపు విక్రయించినట్టు సెబీ అధ్యయనంలో తెలిసింది.



ఫ్రెషర్లకు ఇన్ఫోసిస్ నియామక పత్రాలు

న్యూఢిల్లీ: క్యాంపస్ నియామకాల్లో భాగంగా ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ 1,000 మందికిపైగా అభ్యర్థులకు నియామక పత్రాలు జారీ చేసినట్టు సమాచారం. అభ్యర్థుల ఆన్‌బోర్డింగ్ సెప్టెంబర్ చివర లేదా అక్టోబర్ నుండి ప్రారంభం అవుతుందని తెలుస్తోంది. ఇన్ఫోసిస్ నుంచి దీనిపై ఎటువంటి అధికారిక ప్రకటన వెల్లడి కాలేదు. 2022 బ్యాచ్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు వీరిలో ఉన్నారని ఐటీ, ఐటీఈఎస్ ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుతున్న నాసెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయిస్ సెనేట్ (ఎన్ఐటీఈఎస్) వెల్లడించింది. రెండేళ్లుగా వీరంతా నియామక పత్రాల కోసం ఎదురు చూస్తున్నారని ఎన్ఐటీఈఎస్ ప్రెసిడెంట్ హర్‌ప్రీత్ సింగ్ సలూజా తెలిపారు. 'మేము అప్రమత్తంగా ఉంటాం. ఇన్ఫోసిస్ ఈ నిబద్ధతను గౌరవించడంలో విఫలమైనా, చేరే తేదీని ఉల్లంఘించినా ఇన్ఫోసిస్ కార్యాలయం ముందు నిరసన చేపట్టడానికి వెనుకాడము' అని హెచ్చరించారు. 2022-23 రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో సిస్టమ్ ఇంజనీర్, డిజిటల్ స్పెషలిస్ట్ ఇంజనీర్ పోస్టులకు ఎంపికైన 2,000 మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లను ఆన్‌బోర్డింగ్ చేయడంలో ఆలస్యం చేసినందుకు ఇన్ఫోసిస్‌పై కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖకు ఎన్ఐటీఈఎస్ గతంలో ఫిర్యాదు చేసింది. ఫ్రెషర్లకు ఇచ్చిన ఆఫర్ లెటర్లను కంపెనీ గౌరవిస్తుందని ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్ ఇటీవలే స్పష్టం చేశారు. 'కొన్ని నియామక తేదీలను మార్చాం. అందరూ ఇన్ఫోసిస్‌లో చేరతారు. ఆ విధానంలో ఎటువంటి మార్పు లేదు' అని వెల్లడించారు.

రియల్టీ మార్కెట్‌లో భారీ అమ్మకాలు



• జూన్ క్వార్టర్‌లో రూ.35వేల కోట్లు
• అగ్రస్థానంలో గోద్రేజ్ ప్రాపర్టీస్
• కంపెనీలకు కలిసొస్తున్న డిమాండ్

న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ డెవలపర్లు జూన్ త్రైమాసికంలో రూ.35,000 కోట్ల విలువ చేసే ఇళ్లను విక్రయించారు. ఇందులో గోద్రేజ్ ఇండస్ట్రీస్ అత్యధిక అమ్మకాలతో మొదటి స్థానంలో నిలిచింది. 21 లిస్టెడ్ రియల్ ఎస్టేట్ సంస్థల డేటాను విశ్లేషించగా.. బలమైన వినియోగ డిమాండ్ మద్దతుతో దాదాపు అన్ని సంస్థలు మెరుగైన విక్రయాలు నమోదు చేశాయి. గోద్రేజ్ ప్రాపర్టీస్ జూన్ త్రైమాసికంలో రూ.8,637 కోట్ల విలువైన ఇళ్లను ముందస్తు బుకింగ్‌లలో భాగంగా విక్రయించింది.

- డీఎల్ఎఫ్ సేల్స్ బుకింగ్‌లు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే మూడు రెట్ల వృద్ధితో రూ.6,404 కోట్లుగా ఉన్నాయి.
- ముంబైకి చెందిన మ్యాక్రోటెక్ డెవలపర్స్ (లోధా) సైతం రూ.4,030 కోట్ల బుకింగ్‌లు నమోదు చేసింది.
- గురుగ్రామ్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే సిగ్నేచర్ గ్లోబల్ (ఇటీవలే లిస్ట్ అయిన సంస్థ) రూ.3,120 కోట్ల బుకింగ్‌లను సాధించింది. క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే మూడు రెట్లు అధికం.
- బెంగళూరుకు చెందిన ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ సైతం రూ.3,029 కోట్ల అమ్మకాలు నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే తగ్గాయి.
- బెంగళూరు కేంద్రంగా పనిచేసే శోభ లిమిటెడ్ రూ.1,874 కోట్లు, బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ రూ.1,086 కోట్ల చొప్పున ముందస్తు బుకింగ్‌లు సాధించాయి. అలాగే, పురవంకర లిమిటెడ్ రూ.1,128 కోట్ల అమ్మకాలు నమోదు చేసింది. బెంగళూరుకు చెందిన శ్రీరామ్ ప్రాపర్టీస్ రూ.376 కోట్ల విలువైన ప్రాపర్టీలను విక్రయించింది.
- ముంబైకి చెందిన ఒబెరాయ్ రియాలిటీ రూ.1,067 కోట్ల విలువైన ప్రాపర్టీలను విక్రయించింది. ముంబైకే చెందిన మహీంద్రా లైఫ్‌స్పేస్ డెవలపర్స్ రూ.1,019 కోట్లు, కీస్టోన్ రియల్టర్స్ రూ.611 కోట్లు చొప్పున బుకింగ్‌లు సాధించాయి.
- ముంబైకి చెందిన మరో సంస్థ సన్‌టెక్ రియాలిటీ రూ.502 కోట్ల అమ్మకాలు చేసింది. అలాగే, ఈక్వినాక్స్ ఇండియా డెవలపర్స్ రూ.81 కోట్లు, సూరజ్ ఎస్టేట్ డెవలపర్స్ రూ.140 కోట్ల విలువైన ప్రాపర్టీలను విక్రయించాయి.

బలమైన డిమాండ్..

కరోనా అనంతరం ఇళ్లకు బలమైన డిమాండ్ నెలకొనడమే మెరుగైన అమ్మకాల బుకింగ్‌లకు కారణమని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల నిర్వహణలో మెరుగైన ట్రాక్ రికార్డు కలిగిన బ్రాండ్ల వైపు వినియోగదారులు మొగ్గు చూపిస్తున్నట్టు పేర్కొంటున్నాయి. ఇవన్నీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ అయిన కంపెనీల గణాంకాలు మాత్రమే. అన్ లిస్టెడ్‌లో ఉన్న కంపెనీల విక్రయాలు కూడా కలిపి చూస్తే భారీ మొత్తమే ఉంటుంది. టాటా రియాలిటీ అండ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్, అదానీ రియాలిటీ, పిరమల్ రియాలిటీ, హిరనందానీ గ్రూప్, ఎంబసీ గ్రూప్, కే రహేజా గ్రూప్ అన్‌లిస్టెడ్‌లో ప్రముఖ కంపెనీలుగా ఉన్నాయి.




వేదాంత రూ. 7,821 కోట్ల డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వేదాంత లిమిటెడ్ మూడో విడతగా రూ. 20 డివిడెండ్ ప్రకటించింది. దీని ప్రకారం రూ. 7,821 కోట్ల మేర చెల్లించనుంది. దీంతో ఇప్పటివరకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. రూ. 13,474 కోట్ల డివిడెండ్ చెల్లించినట్లవుతుంది. కంపెనీ మే నెలలో తొలిసారిగా షేరుకి రూ. 4 చొప్పున రూ. 1,564 కోట్ల డివిడెండు ప్రకటించింది. వేదాంత గత ఆర్థిక సంవత్సరంలో షేరు ఒక్కింటికి మొత్తం రూ. 29.5 చొప్పున రూ. 10,966 కోట్ల డివిడెండును వాటాదారులకు అందించింది. ఒక్కింటికి రూ. 11 చొప్పున తొలి మధ్యంతర డివిడెండును ప్రకటించింది. దీని పరిమాణం రూ. 4,089 కోట్లు. జూలై 26న రెండో విడతలో ఒక్కో

బీపీసీఎల్ రూ. 2,413 కోట్ల డివిడెండ్

ఇప్పటివరకూ కేంద్రానికి రూ.15,398 కోట్ల డివిడెండ్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ చమురు దిగ్గజ సంస్థ- బీపీసీఎల్ ప్రభుత్వానికి రూ.2,413 కోట్ల డివిడెండ్‌ను అందించింది. ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (డీఐపీఏఎం) ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024–25) ఇప్పటివరకు 15,389.14 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల (సీపీఎస్ఈ) నుంచి డివిడెండ్‌ల ద్వారా సమకూరినట్లు డీఐపీఏఎం సెక్రటరీ తుహిన్ కాంత పాండే ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) నుంచి రూ. 5,091 కోట్లు, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) నుంచి రూ. 40 కోట్లు, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రూ. 554 కోట్లు , ప్రత్యేక డివిడెండ్‌గా టెలికమ్యూనికేషన్స్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (టీసీఐఎల్) నుంచి రూ. 3,443 కోట్లు వీటిలో ఉన్నాయి. దేశంలోని అతిపెద్ద బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) గత వారం 2023–2024కు సంబంధించి రూ. 3,662.17 కోట్ల భారీ డివిడెండ్‌ను చెల్లించింది. అంతక్రితం మార్చిలో ఈ లైఫ్ ఇన్సూరెన్స్ దిగ్గజం రూ.2,441.45 కోట్ల మధ్యంతర డివిడెండ్‌ను చెల్లించడం గమనార్హం. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో (2023–24) ప్రభుత్వ రంగ సంస్థల నుంచి రూ. 50,000 కోట్ల డివిడెండ్ అందగా, ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ విలువ రూ. రూ. 56,260 కోట్లకు పెరగాలని తాజా బడ్జెట్ నిర్దేశించుకుంది.

ఐఐహెచ్ఎల్ కావాలనే జాప్యం చేస్తోంది

ఆర్‌క్యాప్ వ్యవహారంలో రుణదాతల ఆరోపణ



న్యూఢిల్లీ: రిలయన్స్ క్యాపిటల్ (ఆర్‌క్యాప్)కి సంబంధించి పరిష్కార ప్రణాళికను అమలు చేయకుండా హిందుజా గ్రూప్ సంస్థ ఐఐహెచ్ఎల్ కావాలనే రకరకాల సాకులతో జాప్యం చేస్తోందని ఆర్‌క్యాప్‌కి రుణాలిచ్చిన సంస్థలు ఆరోపిస్తున్నాయి. పారిశ్రామిక విధానం, ప్రోత్సాహక విభాగం (డీఐపీపీ) నుంచి అనుమతులు రావాల్సి ఉందని చెబుతుండటం ఈ వ్యూహాల్లో భాగమేనని రుణదాతలు వ్యాఖ్యానించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వాస్తవానికి రుణ పరిష్కార ప్రణాళిక అమలుకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) నిర్దేశించిన నిబంధనల్లో ఇలాంటిదేమీ లేదని పేర్కొన్నాయి. డీఐపీపీ అనుమతుల కోసం ఐఐహెచ్ఎల్ దరఖాస్తు చేసుకుని 90 రోజులు దాటిపోయినా ఇంతవరకు అది పెండింగ్‌లోనే ఉందని వివరించాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చైనా వంటి పొరుగు దేశాల నుంచి వచ్చే పెట్టుబడులకు కేంద్రం నుంచి ముందస్తుగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఐఐహెచ్ఎల్‌లో కొందరు వాటాదారులు చైనా నియంత్రణలో ఉన్న హాంకాంగ్ నివాసితులు కావడం వల్ల డీఐపీపీ అనుమతులు అవసరమని ఐఐహెచ్ఎల్ చెబుతున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రిలయన్స్ క్యాపిటల్‌కి రూ. 40,000 కోట్ల రుణభారం ఉంది. కార్పొరేట్ గవర్నెన్స్, రుణాల చెల్లింపులో డిఫాల్ట్ కావడం వంటి అంశాల కారణంగా 2021 నవంబర్‌లో కంపెనీ బోర్డును ఆర్‌బీఐ రద్దు చేసింది. ఆ తర్వాత కంపెనీ విక్రయానికి సంబంధించి నిర్వహించిన బిడ్డింగ్‌లో ఇండస్‌ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ (ఐఐహెచ్ఎల్) విజేతగా నిల్చింది. ఐఐహెచ్ఎల్ ప్రతిపాదించిన రూ. 9,861 కోట్ల ప్రణాళికకు ఈ ఏడాది ఫిబ్రవరి 27న ఎన్‌సీఎల్‌టీ ఆమోదముద్ర వేసినప్పటికీ ఇంతవరకు అది అమల్లోకి రాలేదు. దీనిపై సెప్టెంబర్ 19న ఎన్‌సీఎల్‌టీలో తదుపరి విచారణ జరగనుంది.



దక్షిణాదిలో వెల్‌బీ ఫుడ్స్ విస్తరణ

బెంగళూరు: ఆహారోత్పత్తుల డైరెక్ట్–టు–కన్జూమర్ బ్రాండ్ వెల్‌బీ ఫుడ్స్ హైదరాబాద్ మార్కెట్లోకి కార్యకలాపాలు విస్తరించింది. నగరవ్యాప్తంగా 9,000 జనరల్ ట్రేడ్ స్టోర్స్‌లో తమ ఉత్పత్తులు అందుబాటులోకి తెస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. హైదరాబాద్ మార్కెట్లో 50 శాతం వార్షిక వృద్ధి అంచనా వేస్తున్నట్లు పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దక్షిణాదివ్యాప్తంగా 25,000 స్టోర్స్‌కి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కంపెనీ వ్యవస్థాపకుడు గౌరవ్ మన్‌చందా తెలిపారు. పామాయిల్, మైదా వాడకుండా తయారు చేసిన ఖారా సేవ్, మురుకులు, రిబ్బన్ పకోడా వంటి ఉత్పత్తులను సౌకర్యవంతంగా రూ. 10 ఖరీదు చేసే 25 గ్రాముల ప్యాక్‌లలో కూడా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. 2020లో ప్రారంభమైన వెల్‌బీ ఫుడ్స్ ఉత్పత్తులు స్పార్, రత్నదీప్, మోర్ తదితర స్టోర్స్, ఈ–కామర్స్ వెబ్‌సైట్ల ద్వారా విక్రయిస్తోంది.



విశ్వ సముద్ర గ్రూప్‌నకు ఇండియా ఇన్‌ఫ్రా అవార్డు

న్యూఢిల్లీ: మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి విశ్వ సముద్ర ఇంజినీరింగ్ సంస్థ ప్రతిష్టాత్మక డైవర్స్ ఇంపాక్ట్ ఇన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ అవార్డును దక్కించుకుంది. న్యూఢిల్లీలో జరిగిన ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సదస్సులో గ్రూప్ ఈడీ శివదత్త దాస్‌కు కేంద్ర రహదారి రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ పురస్కారాన్ని అందించారు. రహదారులు, సాగు ప్రాజెక్టులు, ఎయిర్‌పోర్ట్ రన్‌వేలు తదితర సంక్లిష్టమైన ప్రాజెక్టులను నిర్మించడంలో సంస్థ సామర్థ్యాలకు ఈ అవార్డు నిదర్శనమని దాస్ పేర్కొన్నారు. వివిధ విభాగాల వ్యాప్తంగా కార్యకలాపాలు సాగిస్తున్న అతి తక్కువ ఇన్‌ఫ్రా కంపెనీల్లో తమది కూడా ఒకటని ఆయన తెలిపారు.

త్వరలోనే కెరీర్‌కు గుడ్‌బై చెబుతా

భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్



న్యూఢిల్లీ: భారత వెటరన్ షట్లర్ సైనా నెహ్వాల్ త్వరలోనే రిటైర్మెంట్‌పై నిర్ణయం వెలువరిస్తానని చెప్పింది. చాన్నాళ్లుగా పోటీలకు దూరంగా ఉంటున్న సైనా అర్థరైటిస్ (కీళ్ల నొప్పుల) నుంచి ఇబ్బంది పడుతోంది. దీనివల్ల రెగ్యులర్ ప్రాక్టీస్, పోటీలు కుదరడం లేదని 34 ఏళ్ల ఈ ప్రపంచ మాజీ నంబర్‌వన్ ప్లేయర్ చెప్పింది. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది చివరికల్లా తన బ్యాడ్మింటన్ భవిష్యత్తుపై తుది నిర్ణయం తీసుకుంటానని ఆమె వెల్లడించింది. మాజీ షూటర్, పారిస్‌లో భారత జట్టుకు చెఫ్ డి మిషన్‌గా వ్యవహరించిన గగన్ నారంగ్ ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 'మోకాలు ఏమాత్రం సహకరించడం లేదు. తీవ్రమైన కీళ్లనొప్పుల సమస్య వెంటాడుతోంది. గంటల తరబడి ప్రాక్టీస్ చేయలేకపోతున్నా. కాబట్టే పోటీల బరిలోనూ దిగడం లేదు. రెండు గంటల ట్రెయినింగ్‌తో ప్రపంచ మేటి షట్లర్లతో ఢీకొట్టడం ఎలా సాధ్యమవుతుంది. క్రీడాకారులకు రిటైర్మెంట్ అనేది తప్పదు. అయితే ఈ రిటైర్మెంట్ నాపై ఎలాంటి ప్రభావం చూపిస్తోందననే ఆలోచిస్తున్నా. ఆటకు టాటా చెప్పడం బాధగానే ఉంటుంది. కానీ... ఎప్పుడో ఒకప్పుడు వీడ్కోలు చెప్పాల్సిందే' అని వివరించింది. సాధారణంగా ఓ క్రీడాకారుడి కెరీర్ చాలా చిన్నదని, తను 9 ఏళ్ల వయస్సు నుంచే షటిల్ ఆడటం మొదలుపెట్టానని, వచ్చే ఏడాది 35 ఏళ్లకు చేరుకుంటానని... సుదీర్ఘ కాలంపాటు దేశానికి ప్రాతినిధ్యం వహించడం గౌరవంగా భావిస్తానని చెప్పింది. 'నేను ఆట కోసం అంకితభావంతో చెమటోడ్చాను. అందుకే మూడు ఒలింపిక్స్‌లు ఆడగలిగాను. పతకం కోసం వందశాతం కృషి చేశాను. ఓ అగ్రశ్రేణి క్రీడాకారులుగా ఎదిగాక మనపై చాలా అంచనాలుంటాయి. ముఖ్యంగా స్పాన్సర్లు, కుటుంబసభ్యులు, కోచ్‌లు, స్నేహితులు ఇలా అందరూ మనం బాగా ఆడాలని ఆశిస్తారు. అథ్లెట్ల కెరీర్ తక్కువ. ఇలాంటపుడు నాలుగేళ్ల విరామం చాలా సుదీర్ఘమైంది. అలాగే కష్టమైంది కూడా! ఇంత గ్యాప్ తర్వాత మళ్లీ అత్యుత్తమ ప్రదర్శన దాదాపు అసాధ్యంగానే మారుతుంది. ఓ అంతర్జాతీయ చాంపియన్‌గా అవతరించాలనుకుంటే ఎల్లప్పుడు కఠిన నిర్ణయాలకు సిద్ధంగా ఉండాలి' అని 34 ఏళ్ల సైనా పేర్కొంది. 2012 లండన్ ఒలింపిక్స్‌లో కాంస్యం నెగ్గిన ఆమె 2010, 2018 కామన్వెల్త్ క్రీడల్లో చాంపియన్‌గా నిలిచింది.

బ్లాక్‌బర్డ్స్ రేసర్‌కు తొలి స్థానం

ఫార్ములా–4 ఇండియన్ చాంపియన్‌షిప్



చెన్నై: ఇండియన్ రేసింగ్ లీగ్‌లో భాగంగా జరిగిన ఎఫ్‌ఐఏ ఫార్ములా–4 ఇండియా చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ రేసర్ అఖీల్ అలీఖాన్ సత్తా చాటాడు. ఆదివారం చెన్నై నైట్ సర్క్యూట్‌లో జరిగిన ఈ పోటీల రెండో రౌండ్‌లో దక్షిణాఫ్రికాకు చెందిన అలీఖాన్ విజేతగా నిలిచాడు. కారులో సాంకేతిక లోపం కారణంగా తొలి రౌండ్ నుంచి అనూహ్యంగా బరి నుంచి తప్పుకున్న అలీ రెండో రౌండ్‌లో అంచనాలకు అనుగుణంగా రాణించాడు. గ్రిడ్‌లో నాలుగో స్థానం నుంచి మొదలుపెట్టిన అతను వేగంగా దూసుకుపోయాడు. ఈ క్రమంలో ఇద్దరు భారత రేసర్లు దివీ నందన్, జేడెన్ పారియట్‌ను అతను అధిగమించాడు. తొలి రౌండ్‌లో విజేతగా నిలిచిన హ్యూజ్ బార్టర్ (గాడ్‌స్పీడ్ కొచ్చి టీమ్) రెండో రౌండ్ క్వాలిఫయింగ్‌లో విఫలమై గ్రిడ్‌లో చివరి స్థానంనుంచి మొదలుపెట్టాడు. చివరకు ఐదో స్థానంతో అతను రేస్‌ను ముగించాడు. ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగ చైతన్య హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ టీమ్‌కు యజమానిగా ఉన్నాడు.



ధనుశ్

ధనుశ్ పసిడి గురి

న్యూఢిల్లీ: ప్రపంచ బధిరుల షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న హైదరాబాద్ షూటర్ ధనుశ్ శ్రీకాంత్ స్వర్ణ పతకంతో మెరిశాడు. జర్మనీలోని హనోవర్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో ధనుశ్ పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో విజేతగా నిలిచాడు. క్వాలిఫయింగ్‌లో ధనుశ్ 632.7 పాయింట్లతో కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. అనంతరం ఫైనల్లో ధనుశ్ 251.7 పాయింట్లు స్కోరు చేసి కొత్త ప్రపంచ రికార్డు సృష్టించడంతోపాటు పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. భారత్‌కే చెందిన శౌర్య సైనీ 249.9 పాయింట్లతో రజతం, 226.2 పాయింట్లతో మొహమ్మద్ ముర్తజా కాంస్యం సాధించారు. ఇదే టోర్నీ మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో భారత షూటర్లు మాహిత్ సంధూ, నటాషా జోషి వరుసగా రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు.

క్లీన్‌స్వీప్ దిశగా బంగ్లాదేశ్

- లక్ష్యం 185; ప్రస్తుతం 42/0
- పాక్ రెండో ఇన్నింగ్స్‌లో 172 ఆలౌట్
- నిప్పులు చెరిగిన హసన్, నహిద్



రావల్పిండి: పాకిస్తాన్‌ను వారి సొంతగడ్డపై బంగ్లాదేశ్ క్లీన్‌స్వీప్ చేసే ప్రదర్శనను వాన చినుకులు ఆటంకపరిచాయి. ఇంకా ఆఖరి రోజు ఆట మిగిలుండగా స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బంగ్లా ఓపెనర్లు జకీర్ హసన్ (31 బ్యాటింగ్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), షాద్‌మన్ ఇస్లామ్ (9 బ్యాటింగ్) చక్కని ఆరంభం ఇచ్చారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 9/2తో నాలుగో రోజు సోమవారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన పాకిస్తాన్ 46.4 ఓవర్లలో 172 పరుగులకే కుప్పకూలింది. ఆట మొదలైన కొద్దిసేపటి తర్వాత ఓపెనర్ అయూబ్ (20; 3 ఫోర్లు), కెప్టెన్ షాన్ మసూద్ (28; 4 ఫోర్లు), అనుభవజ్ఞుడైన బాబర్ ఆజమ్ (11; 1 ఫోర్) స్వల్ప వ్యవధిలో అవుటయ్యారు. టస్కిన్ అహ్మద్ ఓవర్లో అయూబ్ నిష్క్రమించగా, యువ సీమర్ నహిద్ రాణా... మసూద్, బాబర్‌లతో పాటు సౌద్ షకీల్ (2)ల వికెట్లను పడగొట్టాడు. దీంతో 21వ ఓవర్లలో 81 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన పాక్ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో రిజ్వాన్ (73 బంతుల్లో 43; 5 ఫోర్లు), సల్మాన్ ఆగా (71 బంతుల్లో 47 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. ఏడో వికెట్‌కు 55 పరుగులు జోడించాక రిజ్వాన్‌ను హసన్ మహ్మూద్ అవుట్ చేయడంతో మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. హసన్, నహిద్ టెయిలెండర్ల పనిపట్టడంతో పాక్ ఆలౌటయ్యేందుకు ఎంతోసేపు పట్టలేదు. రెండో టెస్టు ఆడుతున్న 24 ఏళ్ల పేసర్ హసన్ మహ్మూద్ (5/43), మూడో టెస్టు ఆడుతున్న 21 ఏళ్ల సీమర్ నహిద్ రాణా (4/44) పాక్‌ను చావుదెబ్బ కొట్టారు. 12 పరుగుల తొలిఇన్నింగ్స్ ఆధిక్యం కలుపుకొని బంగ్లా ముందు 185 పరుగుల లక్ష్యం ఉండగా... వర్షంతో ఆట నిలిచే సమయానికి బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 7 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 42 పరుగులు చేసింది. ఓపెనర్లు జకీర్ హసన్, ఇస్లామ్ అజేయంగా క్రీజులో ఉన్నారు. వర్షం వల్ల నాలుగో రోజు కేవలం 50 ఓవర్ల ఆటే సాధ్యమైంది. ఇదే వేదికపై జరిగిన తొలి టెస్టులో బంగ్లాదేశ్ 10 వికెట్ల తేడాతో గెలిచింది.

డేవిస్ కప్ మ్యాచ్‌కు నగాల్ దూరం



న్యూఢిల్లీ: స్వీడన్‌తో ఈనెల 14, 15వ తేదీల్లో జరిగే డేవిస్ కప్ టీమ్ టెన్నిస్ మ్యాచ్‌కు భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ దూరమయ్యాడు. వెన్నెముక గాయంతో సతమతమవుతున్న అతను ఈ ఏడాది వరుసగా రెండోసారి డేవిస్ కప్ టోర్నీకి గైర్హాజరు కానున్నాడు. పాకిస్తాన్‌లో ఫిబ్రవరిలో జరిగిన ఈవెంట్‌లోనూ అతను బరిలోకి దిగలేదు. దీంతో రిజర్వ్ ప్లేయర్‌గా ఉన్న ఆర్యన్ షాను ప్రధాన జట్టులోకి తీసుకున్నారు. మానస్ ధామ్నేను స్టాండ్‌బై ప్లేయర్‌గా ఎంపిక చేశారు. స్టాక్‌హోమ్‌లో జరిగే వరల్డ్ గ్రూప్–1 పోరులో ఆతిథ్య స్వీడన్‌తో భారత్ తలపడుతుంది. ఇదివరకే అఖిల భారత టెన్నిస్ సంఘం (ఐటా) భారత జట్టును ప్రకటించింది. జాతీయ మాజీ చాంపియన్ అశుతోష్ సింగ్‌ను కోచ్‌గా నియమించింది. 'స్వీడన్‌తో జరిగే పోరుకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని భావించాను. కానీ దురదృష్టవశాత్తూ కొన్ని వారాలుగా వెన్నునొప్పి బాధిస్తోంది. దీంతో డాక్టర్లు కనీసం రెండు వారాల పాటు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఇలాంటి పరిస్థితుల్లో సన్నద్ధమయ్యేందుకు సరైన సమయంలేదు. కాబట్టే స్వీడన్ ఈవెంట్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నా. ఇటీవల యూఎస్ ఓపెన్ ఆడుతున్నప్పుడు కూడా వెన్ను సమస్య వేధించింది. ఏదేమైనా డేవిస్ కప్ టోర్నీకి దూరమవడం చాలా బాధగా ఉంది. ఆ టోర్నీలో ఆడబోయే జట్టు రాణించాలని ఆకాంక్షిస్తున్నా' అని నగాల్ సోషల్ మీడియా వేదికగా వివరణ ఇచ్చాడు.



అట్లాంటా (అమెరికా): ప్రొఫెషనల్ గోల్ఫ్ అసోసియేషన్ (పీజీఏ) సీజన్ ముగింపు ప్రతిష్టాత్మక టోర్నీ టూర్ చాంపియన్‌షిప్‌లో భారత సంతతి అమెరికన్ గోల్ఫర్ తీగల సాహిత్ రెడ్డి ఆకట్టుకున్నాడు. –24 అండర్ స్కోరుతో సాహిత్ మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ ప్రదర్శనకుగాను సాహిత్‌కు 75 లక్షల డాలర్లు (రూ. 62 కోట్ల 93 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. సాహిత్ తల్లి

గోల్ఫర్ సాహిత్‌కు రూ. 62 కోట్ల ప్రైజ్‌మనీ

దండ్రులు మురళీధర్, కరుణ 1980 దశకంలో హైదరాబాద్ నుంచి అమెరికాకు వచ్చి స్థిరపడ్డారు. సాహిత్ కాలిఫోర్నియాలో జన్మించి అక్కడే పెరిగాడు. అమెరికాకే చెందిన స్కాటీ షెఫ్లర్ –30 అండర్ స్కోరుతో విజేతగా నిలిచి 2 కోట్ల 50 లక్షల డాలర్లు (రూ. 209 కోట్లు) ప్రైజ్‌మనీని దక్కించుకోగా... కొలిన్ మొరికావా –26 అండర్ స్కోరుతో రన్నరప్‌గా నిలిచి 1 కోటీ 25 లక్షల డాలర్ల (రూ. 104 కోట్లు) ప్రైజ్‌మనీని సొంతం చేసుకున్నాడు.

హెప్టాథ్లాన్ చాంప్ నందిని



బెంగళూరు: జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మహిళల హెప్టాథ్లాన్ ఈవెంట్‌లో తెలంగాణకు చెందిన అగసార నందిని స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఏడు క్రీడాంశాల సమాహారమైన హెప్టాథ్లాన్‌లో నందిని మొత్తం 5526 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. మహిళల 200 మీటర్ల విభాగంలో రైల్వేస్‌కు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ అమ్మాయి నిత్య గంధే (23.51 సెకన్లు) పసిడి పతకాన్ని సాధించింది. మహిళల లాంగ్‌జంప్‌లో రైల్వేస్ తరఫున బరిలోకి దిగిన ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ భవాని యాదవ్ (6.25 మీటర్లు) కాంస్య పతకాన్ని దక్కించుకుంది. పురుషుల 200 మీటర్ల విభాగంలో రైల్వేస్‌కు ఆడుతున్న ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ నల్లబోతు శ్రీనివాస్ (20.67 సెకన్లు) రజత పతకాన్ని గెలిచాడు.

'దులీప్' తొలి మ్యాచ్‌కు సూర్యకుమార్ దూరం



ముంబై: భారత టెస్టు జట్టులో మళ్లీ స్థానాన్ని ఆశిస్తున్న బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ ప్రయత్నాలకు మరోసారి ఎదురు దెబ్బ తగిలింది. ఈ నెల 5 నుంచి జరిగే దులీప్ ట్రోఫీ తొలి మ్యాచ్‌కు అతను చేతి గాయం కారణంగా దూరం అయ్యాడు. నాలుగు రోజుల మ్యాచ్ ప్రాక్టీస్ కోసం ఇటీవలే బుచ్చిబాబు టోర్నమెంట్‌లో ఆడేందుకు వచ్చిన సూర్య అదే టోర్నీ తొలి మ్యాచ్‌లోనే ఫీల్డింగ్ చేస్తూ గాయపడ్డాడు. దాంతో అతను రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు కూడా దిగలేదు. ఈ గాయం నుంచి అతను కోలుకునేందుకు తగిన విరామం అవసరమని వైద్యులు నిర్ణయించారు. ముందు జాగ్రత్తగా జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)కు చేరిన సూర్యకుమార్ ప్రస్తుతం అక్కడే ఉన్నాడు. భారత టి20 జట్టు కెప్టెన్‌గా ఉన్న సూర్యకుమార్ తన కెరీర్‌లో ఏకైక టెస్టు మ్యాచ్‌ను 2023 ఫిబ్రవరిలో ఆస్ట్రేలియాపై ఆడాడు. గత ఏడాది కాలంగా అతను ఒక్క ఫస్ట్ క్లాస్ మ్యాచ్ కూడా ఆడలేదు. మరో వైపు ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి పూర్తి ఫిట్‌గా మారినట్లు ఎన్‌సీఏ ప్రకటించింది. దులీప్ ట్రోఫీలో అతను ఇండియా 'బి' జట్టు తరఫున బరిలోకి దిగుతాడు.

ఇజ్రాయెల్‌తో యుద్ధం... లెబనాన్ తరమా?



"తలకు మించిన నానారకాల సమస్యలతో లెబనాన్ ఇప్పటికే తీవ్రంగా సతమతమవుతోంది. ఇంట గెలవలేని ఈ పరిస్థితుల్లో ఇజ్రాయెల్‌తో యుద్ధానికి దిగి నెలా నెగ్గుకురాగలదు? చైనా, రష్యా, ఇరాన్ నుంచి సమీకరించిన ఆయుధ సంపత్తి భారీగానే ఉన్నా ఇజ్రాయెల్ దాడులను హెజ్బొల్లా మిలిటెంట్లు తట్టుకుని నిలవడం దుస్సాధ్యమే"

- అంతర్జాతీయ పరిశీలకులు

ఆర్థిక సంక్షోభం, సమస్యల సుడిగుండంలో విలవిల • 2006లో ఇజ్రాయెల్‌తో యుద్ధంలో అపార నష్టం

నాలుగైదు రోజుల నాటి ముచ్చట. లెబనాన్‌లోని హెజ్‌బొల్లా మిలిటెంట్లు ఇటీవల ఇజ్రాయెల్‌పై భారీ దాడికి సిద్ధపడ్డారు. కానీ దీన్ని ఇజ్రాయెల్ ముందే పసిగట్టింది. వాళ్లు కాలూచేయీ కూడదీసుకోకముందే వందలాది యుద్ధ విమానాలతో విరుచుకుపడింది. లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై మెరుపుదాడి చేసింది. అనంతర అందుకు ప్రతిగా హెజ్బొల్లా కూడా వందలాది క్షిపణులతో విరుచుకుపడ్డా ఆ దాడులను సమర్థంగా కాచుకుంది. ఈ ఉదంతం పశ్చిమాసియాలో ఇప్పటికే చెలరేగుతున్న యుద్ధ జ్వాలలను మరింతగా ఎగదోసింది. ఇజ్రాయెల్‌పై పూర్తిస్థాయి యుద్ధానికి లెబనాన్ సిద్ధపడుతోందంటూ జోరుగా వార్తలొస్తున్నాయి. కానీ ఇజ్రాయెల్ వంటి అజేయ సైనిక శక్తిని ఓడించే సత్తా లెబనాన్‌కు ఉందా? దేశ ఆర్థిక పరిస్థితి అందుకు సహకరిస్తుందా...?!

- సాక్షి, నేషనల్ డెస్క్

లెబనాన్ చాన్నాళ్లుగా పెను రాజకీయ, ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కొంటోంది. అప్పుల కుప్ప కొండంత పెరిగిపోయింది. దేశంలో సరైన విద్యుత్ సరఫరా వ్యవస్థకే దిక్కు లేదు. బ్యాంకింగ్ వ్యవస్థ సరేసరి. పేదరికం విజృంభిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఇజ్రాయెల్‌పై యుద్ధానికి దిగి నెగ్గుకు రావడం లెబనాన్ సాధ్యపడే పని కాదంటున్నారు. 18 ఏళ్ల క్రితం ఇరు దేశాలు నెల పాటు భీకరంగా తలపడ్డాయి. చివరికది అర్ధంతరంగా ముగిసినా లెబనాన్‌కు తీరని నష్టాలే మిగిల్చింది.

దశాబ్దాల అవినీతి, రాజకీయ అస్థిరత

లెబనాన్‌లో చాన్నాళ్లుగా రాజకీయ అస్థిరత నెలకొంది. అవినీతి పెచ్చరిల్లింది. అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. ఆధునీకరణకు నోచుకోక బ్యాంకింగ్ వ్యవస్థ అధ్వాన్నంగా తయారైంది. విద్యుత్ రంగం పూర్తిగా ప్రైవేట్ డీజిల్ జనరేటర్ ఆపరేటర్లు, చమురు సంస్థల చేతుల్లో చిక్కుకుపోయింది. ప్రభుత్వ సంస్థలు కూడా అంతర్జాతీయ రుణదాతల దయాదాక్షిణ్యాలపై నెట్టుకొస్తున్న పరిస్థితి! ఆర్థిక సాయానికీ, ఆహారానికీ విదేశాల మీదే ఆధారపడుతోంది. కోవిడ్ సంక్షోభం దెబ్బకు 2020 నుంచి లెబనాన్ పరిస్థితి పెనంనుంచి పొయ్యిలోకి చందంగా మారింది. బీరూట్ నౌకాశ్రయంలో రసాయన నిల్వల భారీ పేలుడు దెబ్బకు వాణిజ్య రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. అంతో ఇంతో ఆదుకుంటున్న పర్యాటక రంగమూ ఇజ్రాయెల్ దాడులతో నేల చూపులు చూస్తోంది.

నిల్వలు 3 నెలలకు మించవ్!

2022లో ఇజ్రాయెల్ దాడుల్లో ధాన్యాగారాలు చాలావరకు ధ్వంసం కావడంతో లెబనాన్ ఆహార నిల్వ సామర్థ్యం దారుణంగా పడిపోయింది. దాంతో విదేశీ దిగుమతులపైనే ఆధారపడుతూ నెట్టుకొస్తోంది. ''ఆహార, చమురు నిల్వలు దాదాపు నిండుకున్నాయి. రెండు మూడు నెలలకు మించి లేవు. అవీ అయిపోతే పరిస్థితి తలచుకుంటేనే భయంగా ఉంది'' అని అంతర్జాతీయ సహాయ సంస్థ మెర్సీ కార్ప్స్ ఆందోళన వ్యక్తం చేసింది. రన్‌వేల పాక్షిక పునరుద్ధరణ తర్వాత ఎయిర్‌పోర్ట్ కాస్త అందుబాటులో వచ్చింది.

శరణార్థుల బెడద

లెబనాన్‌కు ఉన్న ఏకైక విమానాశ్రయాన్ని 2006లో ఇజ్రాయెల్ పూర్తిగా ధ్వంసం చేసింది. దాంతో సరుకు వాయు రవాణాను పూర్తిగా బ్రేకులు పడ్డాయి. నాటి దాడుల్లో మౌలిక వసతులన్నీ ధ్వంసమై లెబనాన్‌కు ఏకంగా రూ.26 లక్షల కోట్ల మేరకు నష్టం వాటిల్లిందని ప్రపంచబ్యాంక్ అంచనా వేసింది! ఇజ్రాయెల్ గనక ఇప్పుడు మళ్లీ పూర్తిస్థాయి దాడికి దిగితే లెబనాన్ఇంకెంతటి నష్టం చవిచూడాల్సి ఉంటుం దో అనూహ్యమే.

పైగా 2006 యుద్ధమప్పుడు శరణార్థుల బాధ లేదు. సిరియాలో అంతర్యుద్ధం దెబ్బకు ఇటీవల కోటి మందికి పైగా లెబనాన్‌కు పోటెత్తారు. ఈ శరణార్థులకు అందుతున్న అంతర్జాతీయ సాయం కూడా ఆగి ఆర్థిక భారం మరీ పెరిగింది.

ఐరాస పెదవి విరుపు

డ్రోన్ల వాడకంతో ఇప్పుడు ఆధునిక యుద్ధరీతులు సమూలంగా మారిన నేపథ్యంలో ఈసారి ఇజ్రాయెల్‌తో యుద్ధమంటూ వస్తే మరింత భీకరంగా ఉండొచ్చు. అందుకు కావాల్సిన సన్నద్ధత లెబనాన్‌కు ఏమాత్రమూ లేదని ఐరాస, లెబనాన్ సంయుక్త ముసాయిదా పత్రమే పరోక్షంగా తేల్చేయడం విశేషం. అదేం చెప్పిందంటే...

- గాయపడే సైనికులు, పౌరుల కోసం ఆస్పత్రుల్లో ఔషధాలు, అత్యవసర చికిత్స, సదుపాయాలను భారీగా సమకూర్చుకోవాలి.
- 2006లో మాదిరి చిన్నపాటి యుద్ధమైనా కనీసం 2.5 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి.
- వారికి కనీస సదుపాయాల కల్పనకు నెలకు కనీసం రూ.420 కోట్లు కావాలి.
- అదే పూర్తిస్థాయి భీకర యుద్ధమైతే కోటి మందికి పైగా శాశ్వతంగా నిర్వాసితులైపోతారు.
- అప్పుడు వారి బాగోగులకు ఎంత లేదన్నా నెలకు రూ.838 కోట్లు కావాలి.
- కొన్ని నెలలుగా ఇజ్రాయెల్–హెజ్‌బొల్లా పరస్పర దాడుల దెబ్బకు సరిహద్దు ప్రాంతాల్లోని లక్ష మంది ఇప్పటికే వేరే చోట్లకు తరలారు. వారి బాగోగులకు నెలకు రూ.209 కోట్ల కోసమే లెబనాన్ నానా అపసోపాలు పడుతోంది.

స్టార్ లైనర్ నుంచి వింత శబ్దాలు

- నాసా కంట్రోల్ మిషన్‌కు తెలిపిన బచ్ విల్మోర్
- ఆ శబ్దాన్ని నేరుగా విన్న నిపుణులు
- 6న భూమికి తిరిగి రానున్న స్టార్ లైనర్
- కౌంట్‌డౌన్ కొనసాగుతుందని అధికారుల స్పష్టీకరణ



హూస్టన్: సెప్టెంబర్ 6వ తేదీన వ్యోమగాములు లేకుండానే భూమికి తిరిగి రానున్న బోయింగ్ స్టార్ లైనర్ అంతరిక్ష నౌకకు సంబంధించిన మరో పరిణామం. వివిధ సమస్యలతో ఇప్పటికే మూడు నెలలుగా ఐఎస్ఎస్‌తోపాటే ఉండిపోయిన స్టార్‌లైనర్ నుంచి వింతశబ్దాలు వస్తున్నాయని వ్యోమగామి బచ్ విల్మోర్ చెప్పారు. ఆయన తాజాగా హూస్టన్‌లోని నాసా మిషన్ కంట్రోల్‌తో టచ్‌లోకి వచ్చారు. వ్యోమనౌకను బయటి నుంచి ఎవరో తడుతున్నట్లుగా, జలాంతర్గామిలోని సోనార్ వంటి శబ్దాలు పదేపదే వస్తున్నాయని చెప్పారు. స్టార్ లైనర్ అంతర్గత స్పీకర్‌ను తన మైక్రోఫోన్‌కు దగ్గరగా పెట్టి ఈ శబ్దాలను నాసా నిపుణులకు సైతం ఆయన వినిపించారు. ఆ శబ్దాలు ఎక్కడి నుంచి, ఎందుకు వస్తున్నాయో అంతుపట్టడం లేదని, తెలుసుకునేందుకు పూర్తి స్థాయిలో పరిశీలన జరుపుతున్నామని నాసా తెలిపింది. విద్యుదయస్కాంత తరంగాల ప్రభావం లేక ఆడియో సిస్టమ్ వల్ల ఈ వింత శబ్దాలు వచ్చే అవకాశముందని నిపుణులు అంటున్నారు.

భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్‌తో కలిసి బచ్ విల్మోర్ బోయింగ్ జూన్ 5వ తేదీన చేపట్టిన మొట్టమొదటి మానవ సహిత ప్రయోగం ద్వారా స్టార్ లైనర్ స్పేస్‌క్రాఫ్ట్‌లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)నకు చేరుకోవడం తెలిసిందే. వారు 8 రోజులపాటు అక్కడే ఉండి పలు ప్రయోగాలు చేపట్టిన అనంతరం భూమికి తిరిగి రావాల్సి ఉంది. అయితే, స్టార్ లైనర్‌లో థ్రస్టర్ వైఫల్యం, హీలియం లీకేజీ వంటి తీవ్ర సమస్యలు ఉత్పన్నం కావడంతో ఐఎస్ఎస్‌లోనే చిక్కుబడిపోయారు. ఆ ఇద్దరినీ మరో అంతరిక్ష నౌకలో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో భూమికి తీసుకురావాలని ఇటీవలే నాసా నిర్ణయం తీసుకుంది. స్టార్‌లైనర్‌ను మాత్రం వ్యోమగాములు లేకుండానే ఖాళీగా ఈ నెల 6న తిరిగి రప్పించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది. స్టార్‌లైనర్ పునరాగమనంపై దీని ప్రభావం ఉండకపోవచ్చని నాసా తెలిపింది.

సీబీఐ దర్యాప్తు పూర్తయినా 6,900 కేసులు కోర్టుల్లోనే పెండింగ్

- వీటిలో 361 కేసులు 20 ఏళ్లుగా విచారణకు ఎదురుచూపు
- సీవీసీ వార్షిక నివేదికలో దిగ్భ్రాంతికర వాస్తవాలు

న్యూఢిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ దర్యాప్తు చేసిన 6,900కుపైగా అవినీతి కేసులు వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో 361 కేసులు ఏకంగా 20 ఏళ్లుగా కోర్టుల్లోనే మూలుగుతున్నాయి. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్(సీవీసీ) తన వార్షిక నివేదికలో ఈ దిగ్భ్రాంతికర నిజాలను వెల్లడించింది. 2023 డిసెంబర్ 31వ తేదీ నాటికి అందిన వివరాలను అందులో పేర్కొంది. సీబీఐ విచారణ కోసం ఎదురు చూస్తున్న 658 అవినీతి కేసుల్లో 48 కేసులు ఐదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. దిగువ కోర్టుల్లోని మొత్తం 6,903 కేసులకు గాను 1,379 కేసులు మూడేళ్ల లోపు, 875 కేసులు మూడు నుంచి ఐదేళ్లుగా విచారణ కోసం ఎదురు చూస్తున్నాయని తెలిపింది. మరో 2,188 కేసులు ఐదు నుంచి పదేళ్లుగా విచారణకు నోచుకోలేదని పేర్కొంది. దాదాపుగా 2,100 అవినీతి కేసులు దర్యాప్తు ముగిశాక కూడా పదేళ్ల నుంచి 20 ఏళ్లుగా కోర్టుల్లో నానుతున్నాయని, మరో 361 కేసులు 20 ఏళ్లకు పైగా పెండింగ్‌లో ఉండటం మరీ దారుణమని పేర్కొంది. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న మొత్తం 6,903 కేసులకుగాను 2,461 కేసులు 10 ఏళ్లకు పైగా విచారణకు నోచుకోకపోవడం ఆందోళనకర పరిణామమంటూ వ్యాఖ్యానించింది. సీబీఐతోపాటు నిందితులు దాఖలు చేసిన 12,773 అప్పీళ్లు, రివిజన్ పిటిషన్లు సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయని సీవీసీ వివరించింది. ఇందులోని 501 అప్పీళ్లు, రివిజన్ పిటిషన్లు 20 ఏళ్లుగా ఆయా కోర్టుల్లో మూలుగుతున్నాయంది. అధిక పని ఒత్తిడి, సిబ్బంది కొరత, సంబంధిత అధికారుల నుంచి విచారణ అనుమతుల్లో జాప్యం వంటివి దర్యాప్తు సకాలంలో ముగించడానికి అవరోధాలుగా ఉన్నాయని వివరించింది. సీబీఐకి మంజూరైన 7,295 పోస్టులకుగాను 2023 డిసెంబర్ 31వ తేదీ నాటికి 1,610 పోస్టులు ఖాళీగా ఉన్నాయని సీవీసీ నివేదిక తెలిపింది. అదే సమయంలో సీబీఐ అధికారులపై 82 శాఖాపరమైన చర్యలు పెండింగ్‌లో ఉన్నట్లు కూడా తెలిపింది.

ఇజ్రాయెల్‌లో సార్వత్రిక సమ్మె

కోర్టు ఆదేశాలతో కొన్ని గంటల్లోనే విరమణ

టెల్ అవీవ్: హమాస్ చెరలో ఉన్న ఆరుగురు బందీల దారుణ హత్యపై ఇజ్రాయెలీలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. బందీలను సురక్షితంగా విడిపించడంలో బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వం విఫలమైందంటూ సోమవారం ఇజ్రాయెల్ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మె జరిగింది. కార్మిక సంఘాల పిలుపు మేరకు బ్యాంకులు, ఆరోగ్య విభాగాలు, రవాణా సంస్థలు సహా చాలా వరకు మూతబడ్డాయి. కొన్ని ప్రాంతాల్లోని స్కూళ్లు కొద్దిసేపు మాత్రమే పనిచేశాయి. ప్రధానమైన బెన్ గురియెన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉదయం 8–10 గంటల మధ్య టేకాఫ్ సేవలు నిలిచిపోయాయి. వేలాదిగా పౌరులు వీధుల్లోకి వచ్చారు. టెల్‌అవీవ్‌తోపాటు దేశవ్యాప్తంగా జరిగిన ర్యాలీల్లో కనీసం 5 లక్షల మంది పాలుపంచుకున్నారు. హమాస్‌తో ఒప్పందం కుదుర్చుకున్న పక్షంలో వారంతా సురక్షితంగా వెనక్కి వచ్చి ఉండేవారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ బందీలుగా ఉన్న 100 మందిని వెనక్కి తీసుకువచ్చేందుకు వెంటనే హమాస్‌తో ఒప్పందం చేసుకోవాలన్నారు. అయితే, సమ్మె రాజకీయ ప్రేరేపితమంటూ ప్రభుత్వం వేసిన పిటిషన్‌పై కార్మిక న్యాయస్థానం సానుకూలంగా స్పందించింది. సమ్మెను మధ్యాహ్నం 2.30 గంటలకల్లా ముగించాలని స్పష్టం చేసింది. కోర్టు నిర్ణయాన్ని శిరసావహిస్తామని దేశంలోని అతిపెద్ద కార్మిక సంఘం హిస్తాదుట్ నేత అర్నాన్ బ్రార్ డేవిడ్ తెలిపారు. తమ వారిని వెంటనే విధుల్లోకి చేరాలని కోరారు. సమ్మె కారణంగా ప్రధాన సేవలకు అంతరాయం ఏర్పడలేదని వివరించారు.

ఒప్పందానికి నెతన్యాహు సానుకూలంగా లేరు: బైడెన్

ఇజ్రాయెల్‌లో పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హమాస్‌తో ఒప్పందం కుదుర్చుకుని, బందీలను సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చేందుకు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆసక్తి చూపడం లేదన్నారు. హమాస్, ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంపై సలహాదారులతో వైట్‌హౌస్‌లో జరిగిన సమావేశానికి హాజరైన అధ్యక్షుడు బైడెన్ మీడియాతో మాట్లాడారు. కాల్పుల విరమణ ఒప్పందానికి అతి చేరువలో ఉన్నామన్నారు.

మ్యూజియం మళ్లీ పిలిచింది

నాలుగేళ్ల చిన్నారి మనసు గెలుచుకుంది

ఇజ్రాయెల్‌లో ఓ మ్యూజియంలో ఇటీవల 3,500 ఏళ్ల నాటి మట్టి కూజాను పొరపాటున కింద పడేసిన నాలుగేళ్ల ఏరియల్ గెలర్ గుర్తున్నాడా? అంతటి పురాతన కూజాను పగలగొట్టినా మ్యూజియం సిబ్బంది ఆ బాలున్ని కనీసం తిట్టకపోవడం, గాభరా పడ్డ అతని తల్లిదండ్రులను 'మరేం పర్లేదం'టూ కూల్ చేసి అందరి మనసూ గెలుచుకోవడం తెలిసిందే. అంతేగాక మ్యూజియం చీఫ్ స్వయంగా దగ్గరుండి మరీ ఆ చిన్నారికి అన్ని వస్తువులనూ తిప్పి చూపించారు. ఈ సంఘటన దక్షిణ ఇజ్రాయెల్‌లోని హైఫా యూనివర్సిటీలో హెక్ట్ మ్యూజియంను 10 రోజుల క్రితం జరిగింది. అయితే కూజాను పగలగొట్టిన కంగారులో మ్యూజియంలోని వస్తువులను బాలుడు సరిగా చూడలేదని భావించిన సిబ్బంది అతన్ని మరోసారి ఆహ్వానించారు. ఆ మేరకు ఏరియల్ గత శుక్రవారం తల్లిదండ్రులతో పాటు వెళ్లి సందర్శించాడు. ఈ సందర్భంగా ఒక మట్టి కూజాను వెంట తీసుకెళ్లి మ్యూజియానికి ప్రత్యేకంగా బహూకరించాడు! దాని వెనక దాగున్న ఆ పసిహృదయపు మనోభావాలను గౌరవిస్తూ సిబ్బంది దాన్ని ఆనందంగా స్వీకరించారు. మ్యూజియం క్యూరేటర్లు బాలునితో చాలాసేపటిదాకా గడిపారు. ఇలా పగిలిన వస్తువులను ఎలా అతికిస్తారో అతనికి ప్రత్యక్షంగా చూపించారు.

సిబ్బందికి హేట్సాఫ్: తల్లిదండ్రులు

మ్యూజియం వర్గాలకు ఏరియల్ తల్లిదండ్రులు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు.



రెండోసారి మ్యూజియం సందర్శన సందర్భంగా సిబ్బందితో కలిసి విరిగిన కూజాలను అతికిస్తున్న నాలుగేళ్ల ఏరియల్

''మేముండే ప్రాంతం లెబనాన్‌కు అతి సమీపంలో ఉంటుంది. నిత్యం బాంబు దాడులే. ఆ ఆందోళనల నుంచి కాస్త ఊరట కోసం 10 రోజుల కింద మ్యూజియానికి వెళ్తే అనుకోకుండా ఇలా జరిగింది. దాంతో మా పని అయిపోయిందనుకున్నాం. దానికి నష్ట పరిహారం చెల్లించేందుకు కూడా సిద్ధమయ్యాం. కానీ మ్యూజియం సిబ్బంది మా వాడిని గానీ, మమ్మల్ని గానీ ఆ రోజు పల్లెత్తు మాట కూడా అన్లేదు. వాస్తవానికి నరకప్రాయంగా మారాల్సిన ఘటనను మాకో మర్చిపోలేని అనుభూతిగా మిగిల్చారు'' అంటూ ఆనందం వెలిబుచ్చారు. ఈ మొత్తం ఉదంతం బాలల్లో చరిత్ర పట్ల ఉత్సుకత, ఆసక్తి రేకెత్తిస్తే తమకు అంతకంటే కావాల్సిందేమీ లేదని మ్యూజియం డైరెక్టర్ ఇనబల్ రివ్లిన్ అన్నారు. ఏరియల్ మ్యూజియం పునః సందర్శన తాలూకు వీడియో వైరల్‌గా మారింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

అందుబాటులోనే ఉండాలి!

పగిలిన కూజాను మ్యూజియం నిపుణులు 3డీ టెక్నాలజీ ద్వారా అతికిస్తున్నారు. వారం రోజుల్లో అది తిరిగి పూర్వరూపు సంతరించుకుని మళ్లీ ప్రదర్శనకు అందుబాటులోకి వస్తుందని రిస్టొరేషన్ నిపుణుడు రో షెఫర్ తెలిపారు. ''ఇలాంటి పురాతన వస్తువులు సందర్శనకు వచ్చేవారికి చేతికందేంత సమీపంలోనే ఉండాలి తప్ప అద్దాల అరల్లో కాదన్నదే ఇప్పటికీ మా అభిప్రాయం. వాటిని తాకి చూస్తే చరిత్ర, పురాతత్వ శాస్త్రాల పట్ల పిల్లల లేత మనసుల్లో గొప్ప ఆస్తకి పుట్టవచ్చు. ఎవరికి తెలుసు?!'' అని ఆయన అభిప్రాయ పడటం విశేషం.

సెబీ చీఫ్ వేతనం ఐసీఐసీఐ నుంచి..!

- మాధబి పురి బుచ్‌పై కాంగ్రెస్ పార్టీ ఆరోపణ
- తోసిపుచ్చిన ఐసీఐసీఐ

సాక్షి, న్యూఢిల్లీ: సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) చైర్‌పర్సన్ మాధబి పురీ బుచ్‌పై కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు ఎక్కుపెట్టింది. సెబీలో కీలక బాధ్యతల్లో కొనసాగుతూనే ఆమె ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి నెలనెలా వేతనాలు పొందారని కాంగ్రెస్ ఆరోపించింది. సెబీ చీఫ్‌గా కేంద్ర ప్రభుత్వం నుంచి మాత్రమే కాకుండా ఆమె ఐసీఐసీఐ నుంచి వేతనం తీసుకుని పరస్పర విరుద్ధ ప్రయోజనాలు పొందారని కాంగ్రెస్ నేత పవన్ ఖేడా సోమవారం ఢిల్లీలో పత్రికా సమావేశంలో వ్యాఖ్యానించారు. 'మాధబి సెబీలోని సెక్షన్ 54ను ఉల్లంఘించారు. సెబీలో 2017 ఏప్రిల్ 5వ తేదీన ఆమె సభ్యురాలిగా చేరారు. 2022 మార్చి 2వ తేదీన సెబీ చైర్‌పర్సన్ అయ్యారు. 2017 నాటి నుంచి చూస్తే ఐసీఐసీఐ నుంచి ఆమె ఇప్పటిదాకా రూ.16.8 కోట్లు పొందారు. అదేకాలంలో సెబీ నుంచి ఆమెకు అందిన మొత్తం జీతభత్యాలు కేవలం రూ.3.3 కోట్లు. సెబీ నుంచి పొందిన దానికంటే ఐసీఐసీఐ నుంచి పొందిన లబ్ధి ఏకంగా 5.09 రెట్లు ఎక్కువ. 2021–23 కాలంలో ఎంప్లాయీ స్టాక్ ఓనర్‌షిప్ ప్లాన్ (ఈఎస్ఓపీ)లో టీడీఎస్ ప్రయోజనాల రూ.1.10 కోట్ల లబ్ధి చేకూరింది. ఇలా ఆమె మరో రూ.50 లక్షల పన్ను భారం నుంచి తప్పించుకున్నారు.

ఇప్పటిదాకా ఆమె ఐసీఐసీఐ, ప్రుడెన్షియల్, ఈఎస్ఓపీల ద్వారా ప్రయోజనాలు పొందారు''అని పవన్ ఆరోపించారు. కాంగ్రెస్ మీడియా సమావేశం తర్వాత కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ప్రధాని మోదీపై మండిపడ్డారు. ఈ మేరకు మోదీని ఉద్దేశిస్తూ సోమవారం సామాజిక మాధ్యమం'ఎక్స్'లో ఒక పోస్ట్‌చేశారు. ఈ ఆరోపణల నుంచి మోదీ–షా ద్వయం తప్పించుకోలేరన్నారు. వీటిని ఐసీఐసీఐ తోసిపుచ్చింది. ''ఐసీఐసీఐలో మాధబి రిటైరయ్యాక ఆమెకు ఎలాంటి జీతభత్యాలు చెల్లించలేదు. పదవీవిరమణ ప్రయోజనాలు మాత్రమే చెల్లించాం. ఈఎస్ఓపీ పథక ప్రయోజనాలను పదేళ్లలోపు ఎప్పుడైనా రిటైర్ ఉద్యోగి వాడుకోవచ్చు. బ్యాంక్ స్టాక్ ఆప్షన్ల నిబంధనలు ఉద్యోగి రిటైర్ అయినా కొన్నేళ్లపాటు వర్తిస్తాయి. రిటైర్డ్ ఉద్యోగులు 10 ఏళ్లలోపు ఎప్పుడైనా వాడుకోవచ్చు''అని ఐసీఐసీఐ స్పష్టంచేసింది.



దక్షిణాఫ్రికా పొమ్మంది.. నైజీరియా పట్టం కట్టింది

లాగోస్: దక్షిణాఫ్రికాలో విదేశీయురాలని తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్న చిడిమా అడెత్సీనా మిస్ యూనివర్స్ నైజీరియాగా ఎన్నికైంది. నవంబరులో మెక్సికోలో జరిగే మిస్ యూనివర్స్ అందాల పోటీల్లో నైజీరియాకు ప్రాతినిధ్యం వహించనుంది. జాతీయతకు సంబంధించి ఆన్‌లైన్‌లో తీవ్రదాడి జరగడంతో అడెత్సీనా కిందటి నెల మిస్ సౌతాఫ్రికా పోటీ నుంచి వైదొలిగింది. నైజీరియాలో పోటీపడాల్సిందిగా వచ్చిన ఆహ్వానాన్ని మన్నించింది. నైజీరియా తండ్రి, మొజాంబిక్ మూలాలున్న దక్షిణాఫ్రికా తల్లికి జన్మించిందనే కారణంతో మిస్ సౌతాఫ్రికా పోటీల్లో పాల్గొనడానికి అడెత్సీనాకు అర్హత లేదనే వాదన మొదలైంది. ఆమె జాతీయతను దక్షిణాఫ్రికన్లు ప్రశ్నించారు. దాంతో అంతర్జాతీయ వేదికపై తండ్రి పుట్టినగడ్డకు ప్రాతినిధ్యం వహించే అవకాశంగా నైజీరియా అడెత్సీనాకు తమ ఆహ్వానాన్ని అభివర్ణించింది. చివరకు అదే నిజమైంది. 'నా కల నిజమైంది. ఇదో అందాల కిరీటం కాదు. ఆఫ్రికా ఐక్యతకు పిలుపు' అని అడెత్సీనా ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందించింది.

ఫిలిప్పీన్స్‌ను వణికిస్తున్న యాగి

వివిధ ఘటనల్లో 14 మంది మృతి



రిజాల్ ప్రావిన్స్‌లో వరద తీవ్రతకు ఉదాహరణ

మనీలా: ఫిలిప్పీన్స్‌ను 'యాగి'తుపాను వణికిస్తోంది. పలుప్రాంతాలను వరదలు ముంచెత్తాయి. కొండచరియలు విరిగి పడిన ఘటనల్లో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. రాజధాని మనీలాలో మరికినా నది ఉప్పొంగి లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది. మనీలాతోపాటు అత్యధిక జనసాంద్రత కలిగిన లుజాన్ ప్రాంతంలో అధికారులు ముందు జాగ్రత్తగా విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించారు. క్వెజాన్ ప్రావిన్స్‌లోని ఇన్ఫాంటా పట్టణంలో ఈదురుగాలుల తీవ్రతకు నివాసాలు దెబ్బతిన్నాయి. రిజాల్ ప్రావిన్స్‌లోని అంటిపోలో సిటీలో ఇళ్లు కూలిన ఘటనల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా మరో నలుగురు నీట మునిగారు. సమర్ ప్రావిన్స్‌లోని సెబులో కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో నలుగురు చనిపోగా 10 మంది గాయపడినట్లు అధికారులు తెలిపారు. కామరిన్స్ సుర్ ప్రావిన్స్‌లోని నాగా నగరంలో వరద నీటిలో మరో ముగ్గురు చనిపోయారు. మనీలాకు దక్షిణాన ఉన్న కావిట్ ప్రావిన్స్‌లో నివాస ప్రాంతాల్లోకి నడుములోతుకు పైగా వరద చేరడంతో యంత్రాంగం బోట్ల ద్వారా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. తుపాను కారణంగా పలు నౌకాశ్రయాల్లో 3,300 మంది ఫెర్రీ ప్రయాణికులు, సిబ్బంది చిక్కుబడి పోయారు. పలు దేశీయ విమాన సర్వీసులను రద్దు చేశారు. మనీలాలోని నవోటాస్ పోర్టులో రెండు ఓడలు ఢీకొన్నాయి. అనంతరం ఒక ఓడ బలమైన గాలుల తీవ్రతకు వంతెనను ఢీకొనడంతో తీవ్రంగా దెబ్బతింది. ఓడలో మంటలు చెలరేగడంతో అందులోని సిబ్బందిని కాపాడారు.

పసిఫిక్ రింగ్‌ఆఫ్ ఫైర్ ప్రాంతంలో ఉన్న ఫిలిప్పీన్స్‌పై ఏటా 20కి పైగా తుపాన్లు ప్రభావం చూపిస్తుంటాయి. 2013లో సెంట్రల్ ఫిలిప్పీన్స్‌లో సంభవించిన భీకర తుపాను హయియాన్‌తో కనీసం 7,300 మంది చనిపోవడమో లేక గల్లంతవ్వడమో జరిగింది. మరో 50 లక్షల మంది నిరాశ్రయులయ్యారు.

కెనడాలో భారతీయ విద్యార్థులకు ఆర్థిక కష్టాలు!

- క్యాంపస్ బయట పనిచేసే సమయం కుదింపు
- ఇకపై ఒక వారంలో 24 గంటలపాటే పనిచేసే అవకాశం

ఒట్టావా: కెనడాలో విద్యనభ్యసిస్తూ పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేసే భారతీయ విద్యార్థులను ఆర్థిక కష్టాలు చుట్టుముట్టనున్నాయి. ఇకపై ఒక వారమంతా కలిపి 24 గంటలపాటు మాత్రమే కాలేజీక్యాంపస్ బయట పనిచేసే అవకాశం కల్పిస్తామని కెనడా ప్రభుత్వం ప్రకటించడమే ఇందుకు కారణం. కోవిడ్ సంక్షోభకాలంలో చిరు ఉద్యోగాల్లో తీవ్రమైన కొరత నెలకొనడంతో ఉద్యోగసంక్షోభాన్ని నివారించేందుకు కెనడా ప్రభుత్వం విద్యార్థులపై ఉన్న 'వారానికి 20 గంటల పని'పరిమితిని ఎత్తేసింది. దాంతో అక్కడి భారతీయ విద్యార్థులు ఎక్కువ గంటలపాటు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేసేవారు. దీంతో విద్యార్థుల అద్దె, సరుకులు, ఇతరత్రా ఖర్చుల భారం కాస్తంత తగ్గింది. వారానికి 20గంటల పని పరిమితికి ఇచ్చిన సడలింపు ఈ ఏడాది ఏప్రిల్ నెలలోనే ముగిసింది. ఈ పరిమితికి మరో నాలుగు గంటలు జత చేసి 'వారానికి 24 గంటల నిబంధన'ను తీసుకొస్తున్నారు. ఇది ఈ వారం నుంచి అమల్లోకి రానుంది. దీంతో కెనడాలోని భారతీయ విద్యార్థులను ఆర్థిక కష్టాలు మళ్లీ చుట్టుముట్టనున్నాయి. 2022 ఏడాదిలో కెనడాకు 5.5 లక్షల మంది అంతర్జాతీయ విద్యార్థులు రాగా అందులో 2.26 లక్షల మంది భారతీయులేకావడం గమనార్హం. విద్యార్థి వీసాల మీద ప్రస్తుతం కెనడాలో 3.2 లక్షల మంది భారతీయులు విద్యనభ్యసిస్తున్నారు. వీరంతా తాత్కాలిక ఉద్యోగులు(గిగ్ వర్కర్లు)గా పనిచేస్తూ కెనడా ఆర్థికవ్యవస్థ బలోపేతానికి తమ వంతు కృషిచేస్తున్నారు. ఆఫ్–క్యాంపస్ ఉద్యోగాలతో అక్కడి విదేశీ విద్యార్థుల చేతికొచ్చే చిన్న మొత్తాలు.. విద్యార్థుల నెలవారీ కనీస అవసరాలు తీర్చేవి. పనివేళల నిబంధనల ప్రకారం ఒకేసారి డ్యూటీలో గరిష్ఠంగా 8 గంటలే పనిచేయొచ్చు. ఈ లెక్కన కొత్త నిబంధన ప్రకారం భారతీయ విద్యార్థులకు వారంలో కేవలం మూడ్రోజులే పని దొరికే అవకాశం ఉంది. భారతీయ విద్యార్థులకు ఈ ఏడాది మే నెల నుంచి కొత్త నిబంధనల ప్రకారం గంటకు 17.36 కెనడియన్ డాలర్ల కనీస వేతనం చెల్లిస్తున్నారు. గత ఏడాది ఈ వేతనం 16.65 కెనడియన్ డాలర్లుగా ఉండేది. దీంతో టొరంటో వంటి ఖరీదైన నగరాల్లో చదువుకుంటూ అక్కడే ఉండే మన విద్యార్థులకు ఆర్థిక ఇక్కట్లు పెరిగే ప్రమాదముంది. ''ఇంత తక్కువ గంటల పనితో చేతికొచ్చేదెంత? నెలవారీ సామగ్రి కొనడం కూడా కష్టమే''అని భారతీయ విద్యార్థి నీవా ఫతర్‌ఫేకర్ ఆందోళన వ్యక్తంచేశారు. ''యార్క్ యూనివర్సిటీలో పబ్లిక్ రిలేషన్స్‌లో సర్టిఫికెట్ కోర్సు చేస్తున్నా. ఇప్పుడున్న ఖర్చులతో విడిగా అద్దెకుండటం చాలా కష్టం. అందుకే స్నేహితుల గదిలోకి మారా. అక్కడే సెనేకా కాలేజీలో బ్రాండ్ మేనేజ్‌మెంట్ చదువుకుంటా'అని నీవా చెప్పారు. ''కనీస ఆదాయం ఉంటేనే విద్యార్థులు చదువుకోగలరు. ఎలాంటి వ్యవస్థలోనైనా సమానత్వం పాటించాలి''అని బార్బరా షెలిఫర్ స్మారక క్లినిక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, లాయర్ అయిన దీపా మాటో చెప్పారు.



ఇదేం చావురా దేవుడా!

అకాల ముంపు ఆయువు తీసింది. విగతజీవిని మోసుకెళ్లేందుకు సాయం కరువైంది. కనుచూపు మేరలో పడవలు రాక.. గంటల కొద్దీ నీళ్ల మధ్య మృతదేహాలు కనిపిస్తున్నాయి. తమలో ఒకరు దూరమయ్యారనే కన్నీటి ఘోషలో.. అంతిమ సంస్కారం చేయలేక ఆ కుటుంబాలు విలవిల్లాడుతున్నాయి. సోమవారం సింగ్‌నగర్ ఫ్లైఓవర్ వద్ద థర్మాకోల్ పెట్టెలో ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఓ మహిళ మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యమే దీనికి నిదర్శనం. కనీసం మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు స్ట్రెచ్చర్, సమీపంలో అంబులెన్స్ సౌకర్యం కూడా ఏర్పాటు చేయలేని అమానవీయ పాలనకు అద్దం పట్టింది. ఓ వృద్ధురాలు మృతిచెంది 12గంటలైనా మృతదేహం పాడైపోతున్నా.. వరద నుంచి బయటకు తీసుకురాలేక మరో కుటుంబం తీవ్ర మనోవేదనకు గురైంది. – సాక్షి బృందం, విజయవాడ



'జల'జీవన పోరాటం!

చుట్టూ వరద.. బయటకు వెళ్లలేని స్థితి. రెండు రోజులుగా ఆకలి దప్పులు. ప్రభుత్వం రాదు.. ఆహారం ఇవ్వదు. కుటుంబం కోసమైనా కష్టాలను ఎదురీదాలి. ఎంతటి ముంపునైనా ఎదురించాలి. ఇదీ సింగ్‌నగర్‌లో సగటు జీవి బతుకుపోరు గాథ. సోమవారం సింగ్‌నగర్ ఫ్లైఓవర్ కింద కాలనీల్లో పీకల్లోతు నీళ్లు నిలిచే ఉన్నాయి. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఒక్క పడవ కూడా వెళ్లలేదు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని కుటుంబాలకు.. కుటుంబాలు కట్టుబట్టలతో మేడలు, మిద్దెలపై కాలం వెళ్లదీస్తున్నాయి. చిన్నారులు, వృద్ధులు ఆకలికి అలమటిస్తుంటే చూడలేక కుటుంబ సభ్యులు కర్రలు, ట్యూబులు, థర్మాకోల్ పెట్టెలు, నీటిలో తేలియాడే వస్తువుల సాయంతో ఫ్లైఓవర్‌పైకి చేరుకోవడానికి ప్రాణాలను సైతం లెక్కచేయక సాహసం చేస్తున్నారు. – సాక్షి బృందం, విజయవాడ

నదిలో కొట్టుకుపోతున్న యువకులను పడవలోకి లాగుతున్న మత్స్యకారులు



నాగాయలంకలో పడవ బోల్తా

కృష్ణా జిల్లా నాగాయలంక వద్ద త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. శ్రీరామ పాదక్షేత్రం పుష్కరఘాట్ ఎదురుగా ఉన్న నది మధ్యలో సోమవారం ఉదయం పడవ బోల్తా పడి నలుగురు మత్స్యకారులు కృష్ణా నదిలో పడిపోయారు. వారిని వెంటనే తోటి మత్స్యకారులు రక్షించారు. వరద ఉధృతి తీవ్రం కావడంతో నదికి అవతలి వైపున్న లంక ప్రాంతంలో ఉన్న పడవను, మరో చిన్న బోట్‌ను సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు నలుగురు మత్స్యకారులు మరో పడవలో బయలుదేరారు. ఈ క్రమంలో మత్స్యకారుల పడవ బోల్తాపడింది. దీంతో మత్స్యకారులు నది ప్రవాహ ఉధృతికి దిగువకు కొట్టుకెళ్లారు. ఘాట్ వద్ద ఉన్న మత్స్యకారులు ఇది గమనించి.. వెంటనే మూడు మోటారు బోట్‌లలో వెళ్లి నలుగురు మత్స్యకారులను రక్షించారు. –నాగాయలంక(అవనిగడ్డ)

క్లుప్తంగా...

తాగునీటి కోసం వరద నీటిలో ఈత

- జక్కంపూడి వాసుల వేదన వర్ణనాతీతం
- కాలనీని వదిలి వెళ్తున్న కుటుంబాలు



సరుకులు, మంచినీటి కోసం చిట్టినగర్‌కు వచ్చిన జక్కంపూడి కాలనీ వాసులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ) : తాగునీటి కోసం వరద నీటిలో రెండు కిలో మీటర్ల మేర ఈదుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి. పిల్లా పాపలు, పెద్దవాళ్లు అన్నం తిని రెండు రోజులవుతోంది. కనీసం తిండి గింజలు, కూరగాయలు తెచ్చుకోవాలన్నా జక్కంపూడి కాలనీ నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న చిట్టినగర్‌కు రావాల్సిందే. కాలనీ నుంచి సరుకుల కోసం, మంచినీటి కోసం వచ్చే వారు కేటీ రోడ్డుపై నాలుగు అడుగుల మేర ప్రవహిస్తున్న వరద నీటిలో ఈదుకుంటూ రావాల్సి వచ్చింది. కాలనీలో ఉన్న వందలాది కుటుంబాలకు కనీసం తాగు నీరు కూడా ఇవ్వలేకపోయిన ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మెయిన్‌రోడ్డు వెంబడి ఉన్న వారికి మాత్రమే ఆహార పొట్లాలు, మంచినీటి ప్యాకెట్లు అందాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, గడిచిన రెండు రోజులుగా వరద నీటిలో ఉన్న జక్కంపూడి కాలనీవాసులు సోమవారం నుంచి ఆ ప్రాంతాన్ని ఖాళీ చేస్తున్నారు. కాలనీలో సోమవారం ఉదయానికి కొంత మేర వరద తగ్గడంతో ఇళ్ల నుంచి బయటకొస్తూ బంధువులు, తెలిసిన వారి ఇళ్లకు పిల్లా పాపలతో బయలుదేరడం కనిపించింది. మరో వైపున కాలనీలో నివాసం ఉంటున్న ఇతర రాష్ట్రాలకు చెందిన వారు తిండి గింజలు, పాలు, ఇతర సరుకుల కోసం సమూహంగా చిట్టినగర్‌కు వెళ్లి వస్తున్నారు.

ముంపులో 700 నర్సరీలు

- రూ.50 కోట్లకుపైగా నష్టం
- ఆదుకోవాలంటున్న నర్సరీ గ్రోయర్స్ అసోసియేషన్

సాక్షి, అమరావతి : భారీ వర్షాలు, వరదలు నర్సరీ రైతులను తీవ్ర నష్టాలపాలు చేశాయి. విజయవాడ, గుంటూరు, బాపట్లతో పాటు విశాఖపట్నం జిల్లాలో 700కు పైగా నర్సరీలు ముంపు బారిన పడగా రూ.50 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్టు అంచనా వేస్తున్నారు. నష్టపోయిన నర్సరీ రైతులను ఆదుకోవాలని ఏపీ నర్సరీ గ్రోయర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు ఆకుల చలపతిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైపరీత్యాల వేళ ఎక్కువగా నర్సరీ రైతులే నష్టపోతున్నారని, అయినా ప్రభుత్వం నుంచి కనీస చేయూత లభించడంలేదని తెలిపారు. నర్సరీ రైతుల కోసం ప్రత్యేక సహాయ నిధి ఏర్పాటు చేయాలని కోరారు.

వైవీ సుబ్బారెడ్డి పిటిషన్‌పై సీబీఐకి 'సుప్రీం' నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ :ఏపీ హౌసింగ్ బోర్డు భూములను 2005లో అప్పటి ప్రభుత్వం ప్రైవేటు ప్రాజెక్టులకు కేటాయింపులు చేసిన అంశంలో సీబీఐ తనని నిందితుడిగా చేర్చడంపై వైవీ సుబ్బారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సీబీఐ కేసు క్వాష్ చేయాలన్న పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేయడాన్ని సవాల్ చేస్తూ సుబ్బారెడ్డి దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ హృషీకేష్‌రాయ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం విచారించింది. అనంతరం, పిటిషన్‌పై కౌంటరు దాఖలు చేయాలని సీబీఐకి నోటీసులు జారీచేసింది. వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌కు ఈ పిటిషన్ జత చేస్తున్నట్లు పేర్కొంది.



ప్రకాశం బ్యారేజ్ చరిత్రలో.. రెండో గరిష్ట వరద

సోమవారం 11,43,201 క్యూసెక్కుల ప్రవాహం.. 1903 అక్టోబర్‌లో 11.90 లక్షల క్యూసెక్కులు రాక

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్ : కృష్ణా నది మహోగ్ర రూపం దాల్చడంతో ప్రకాశం బ్యారేజ్ చరిత్రలో రెండో గరిష్ఠ వరద ప్రవాహం నమోదైంది. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు 11,43,201 క్యూసెక్కుల ప్రవాహం వచ్చింది. 1903 అక్టోబర్ 7న 11.90 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వచ్చింది. ఆ తర్వాత ఇదే గరిష్టస్థాయి వరద. ఇక్కడ రెండో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. సోమవారం రాత్రి 9 గంటల సమయానికి బ్యారేజ్ వద్ద 11,14,326 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీనిలో 11,13,826 క్యూసెక్కులు సముద్రంలోకి వదులుతున్నారు. 500 క్యూసెక్కులు కాలువలకు విడుదల చేశారు. శ్రీశైలం జలాశయానికి భారీ వరద కొనసాగుతోంది. సెల్ఫ్ క్యాచ్‌మెంట్ వర్షాలతో పాటు ఎగువ ప్రాజెక్టుల నుంచి వరద నీరు వస్తుండడంతో స్పిల్‌వే ద్వారా కూడా నాగార్జునసాగర్‌కు నీటిని వదులుతున్నారు. ఆదివారం నుంచి సోమవారం వరకు ఎగువ నుంచి శ్రీశైలానికి 5,16,179 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. సోమవారం సాయంత్రానికి 3,25,284 క్యూసెక్కులు శ్రీశైలానికి వస్తోంది. 10 రేడియల్ క్రస్ట్‌గేట్లను 20 అడుగులకు తెరచి స్పిల్ వే ద్వారా 4,71,730 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. ప్రస్తుతం జలాశయంలో 210.51 టీఎంసీలు నిల్వ ఉండగా.. నీటి మట్టం 884.10 అడుగులుగా నమోదైంది. నాగార్జున సాగర్ జలాశయంలోకి 5,40,503 క్యూసెక్కులు వస్తుండగా స్పిల్‌వే మీదుగా 5,03,268 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన ద్వారా 28,582 క్యూసెక్కులు మొత్తం 5,31,850 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. జలాశయంలో ప్రస్తుతం 586.80 అడుగుల వద్ద 304.46 టీఎంసీల నీరు ఉంది. పులిచింతల ప్రాజెక్టు నుంచి సోమవారం సాయంత్రానికి 5,43,617 క్యూసెక్కులు ప్రకాశం బ్యారేజీకి వదులుతున్నారు.

నిలకడగా గోదావరి వరద

పోలవరం రూరల్: ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టు సమీపంలో గోదావరి వరద నిలకడగా ఉంది. నదీ పరీవాహక ప్రాంతంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఉప నదుల నీరు, శబరి నీరు కూడా నదిలోకి స్వల్పంగా చేరుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద సోమవారం సాయంత్రానికి నీటిమట్టం 30.04 మీటర్లకు చేరుకుంది. స్పిల్‌వే నుంచి 4.91 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తోంది.

తీరికలేనప్పుడు ఎందుకొచ్చారు?

మంత్రులు అనిత, సంధ్యారాణిపై వరద బాధితుల ఫైర్



మంత్రులు సంధ్యారాణి, వంగలపూడి అనితను నిలదీస్తున్న రాజీవ్‌నగర్ ముంపు బాధితులు

(విజయవాడ వరద ప్రాంతం నుంచి 'సాక్షి' బృందం)

ముంపు ప్రాంతాల పర్యటనలో భాగంగా కండ్రిక, రాజీవ్‌నగర్ కాలనీలను పరిశీలించేందుకు వచ్చిన మంత్రులు సంధ్యారాణి, వంగలపూడి అనితలకు స్థానికుల నుంచి చేదు అనుభవం ఎదురైంది. వారిని చూడగానే ముంపు బాధితులు ఒక్కసారిగా ఫైర్ అయ్యారు. మూడ్రోజులుగా వరద నీటిలో అవస్థలు పడుతుంటే ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని, కనీసం తాగునీరు, భోజన వసతులు కల్పించడంలో పూర్తి విఫలమయ్యారని మండిపడ్డారు. అనారోగ్యంతో ఉన్నవారిని సురక్షిత ప్రాంతానికి తరలించడానికి నానా అగచాట్లు పడుతున్నామని విరుచుకుపడ్డారు. రాజీవ్ నగర్, కండ్రిక, గుణదల వంద అడుగుల రోడ్డు, గుణదల ఫ్లిప్‌కార్ట్ గోదాము, బ్రిటానియా గోదాములతో పాటు గుణదల రోడ్డు వంటి ప్రాంతాల్లో సహాయక చర్యలులేక ఇబ్బందులు పడుతున్నామన్నారు.

తీరికలేనప్పుడు రావడమెందుకు?

మంత్రి సంధ్యారాణితో వచ్చిన ఆహార పొట్లాల వాహనాన్ని ఆమె చేతుల మీదుగా ఇప్పించేందుకు టీడీపీ శ్రేణులు యత్నించారు. అయితే, బాధితులు అప్పటికి భోజనంలేక మూడ్రోజులుగా ఇబ్బందులు పడుతుండటంతో ఆహార పొట్లాల వాహనం వద్దకు గుంపులుగా చేరుకున్నారు. దీంతో టీడీపీ వారు ఆహార పొట్లాలను గాలిలోకి ఎగరేయడంతో తీవ్ర విమర్శలపాలయ్యారు. ఇలా మంత్రులు కొద్ది దూరం ట్రాక్టర్‌పై వెళ్లి ఆ తర్వాత వెనుదిరిగారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.42 కోట్లు

సింహాచలం: విశాఖ జిల్లా సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గత 33 రోజులకు గాను రూ.2.42 కోట్లు వచ్చినట్టు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. నగదుతోపాటు 143 గ్రాముల బంగారం, 13.550 కిలోల వెండి లభించినట్టు పేర్కొన్నారు.

రత్నగిరీశునికి ప్రత్యేక పూజలు

అన్నవరం: అన్నవరం సత్యదేవునికి జన్మ నక్షత్రం 'మఖ' సందర్భంగా సోమవారం అన్నవరంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సత్యదేవునికి జన్మ నక్షత్ర పూజలు, మూలవిరాట్‌కు అభిషేకాలు, ఆయుష్య హోమం నిర్వహించారు. ఆలయాన్ని తెల్లవారు జామున రెండు గంటలకు తెరిచి ఈ క్రతువులు జరిపారు. అనంతరం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుల మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం దేవతామూర్తులకు ముత్యాల కవచాల (ముత్తంగి సేవ) అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటల నుంచి భక్తులను దర్శనాలకు అనుమతించారు.

శ్రీ భద్రకాళీ సమేతుడికి పల్లకీ సేవ

రాయచోటి టౌన్: అన్నమయ్య జిల్లా రాయచోటి శ్రీ భద్రకాళీ సమేతుడికి అత్యంత భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ చేశారు. సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్ల మూల విరాట్‌లకు అభిషేకాలు నిర్వహించి అందంగా అలంకరించి భక్తుల దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు కూడా అభిషేకాలు, పూజలు నిర్వహించిన ఆలయ ప్రధాన అర్చకులు అందంగా అలంకరించి ఆలయ మాఢవీధులలో, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఈ పల్లకీ సేవలో స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 74,498 మంది స్వామివారిని దర్శించుకోగా 25,355 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.06 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.



విఘ్నేశ్వరునికి కళన్యాస పూజలు

అయినవిల్లి: కోనసీమ జిల్లా అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారికి వేదపండితుల ఆధ్వర్యంలో సోమవారం కళన్యాస పూజలు జరిపారు. ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకం, లక్ష గరిక పూజలు, లఘున్యాస, ఏకాదశ అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

త్రిముఖ లింగేశ్వరునికి బూరెల అభిషేకం

బిక్కవోలు: తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొంకుదురు బుడతల మామిడి వద్ద కొలువైన బాలాత్రిపుర సుందరి సమేత త్రిముఖ లింగేశ్వరస్వామికి మాస శివరాత్రి పురస్కరించుకుని ఆదివారం రాత్రి ఆరువేల బూరెలతో అభిషేకం చేశారు. అర్చకులు రమణశర్మ, భాస్కర శర్మ మాట్లాడుతూ శివునికి బూరెలతో అభిషేకం చేస్తే సకాల వర్షాలు కురిసి, పాడి పంటలు వృద్ధి చెందుతాయన్నారు. అనంతరం బూరెలను భక్తులకు పంపిణీ చేశారు.

డ్రగ్స్‌కు తలవంచితే జీవితం అంధకారమే

తిరుపతి సిటీ: యువత డ్రగ్స్‌కు తలవంచితే జీవితం అంధకారమేనని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి హెచ్చరించారు. పద్మావతి మహిళా వర్సిటీ, మహిళా అధ్యయన కేంద్రం, స్టూడెంట్ అఫైర్స్, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం వర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆదాయం కోసం బంగారం లాంటి యువత జీవితాలను నిర్వీర్యం చేస్తున్నవారిని కఠినంగా శిక్షించాలన్నారు.

తైక్వాండో పోటీల్లో సంస్కృత వర్సిటీకి 14పతకాలు

తిరుపతి సిటీ:జాతీయ సంస్కృత వర్సిటీ వేదికగా చిత్తూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఏపీ ఓపెన్ సీనియర్ మెన్ అండ్ ఉమెన్ తైక్వాండో ఛాంపియన్ షిప్ టోర్నమెంట్‌లో సంస్కృత వర్సిటీ విద్యార్థులు 14పతకాలు సాధించారు. ఇందులో స్వర్ణపతకం ఒకటి, రజిత పతకాలు 5, ఎనిమిది కాంస్య పతకాలు సాధించారు.

ఏయూ రిజిస్ట్రార్‌కు అభినందన

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ ధనుంజయరావుకు సోమవారం ఉత్తరాంధ్ర విద్యార్థి నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. జియాలజీ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ అనేక పదవులు విజయవంతంగా నిర్వహించి రిజిస్ట్రార్‌గా నియమితులవడం గర్వకారణమన్నారు. ఆయన సారథ్యంలో ఏయూ అగ్రగామిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



నేడు జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కల్పనాధికారి, నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ జిల్లా మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రముఖ కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎ.సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభి టెక్నాలజీస్, అమర్‌రాజా గ్రూప్, అల్ డిక్సన్, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, నవత ట్రాన్స్‌పోర్టు కంపెనీల్లో వివిధ పోస్టులకు ఈ మేళా నిర్వహిస్తున్నారన్నారు.

ప్రభుత్వ స్కూల్స్‌లో చదివినవారికి మెడికల్ సీట్లు

యానాం: పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్‌లలో 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకూ ప్రభుత్వ స్కూల్స్‌లో చదివిన విద్యార్థులకు మెడికల్ కోర్సులైన ఎంబీబీఎస్ సీట్లలో 10 శాతం రిజర్వేషన్లు ఈ ఏడాది అమలు చేసినట్లు సీఎం కార్యాలయం నుంచి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన 32 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే దాంట్లో 10 దరఖాస్తులు ఆమోదం పొందలేదన్నారు. మిగిలిన 22 మందిలో 8 మంది నీట్ నిర్దేశించిన మార్కులు సాధించలేదన్నారు. చివరికి 14 మంది మెడికల్ సీట్లకు ఎంపికయ్యారన్నారు.

నాడు ఆహ్లాదం.. నేడు ఆహారం

నమీబియాలో వన్యప్రాణులను వధిస్తున్న అక్కడి ప్రభుత్వం



శతాబ్దంలోనే భయంకర కరువుతో అల్లాడుతున్న ప్రజలు

- నేషనల్ పార్కుల్లోనూ వన్య ప్రాణులకు మేత, నీరుకు గడ్డు పరిస్థితులు
- దీనిని అరికట్టేందుకు ఉద్యానవనాల్లో జీవుల సంఖ్యను తగ్గించే ప్రణాళిక
- వాటిని చంపడం ద్వారా పేదల కడుపు నింపే ప్రయత్నం

సాక్షి, అమరావతి: నమీబియాలో కరువు విజృంభిస్తోంది. గడిచిన శతాబ్దంలో ఎన్నడూ లేనంతగా దుర్భిక్షం తాండవిస్తోంది. ఇది మనుషుల నుంచి వన్య ప్రాణులకు వరకు కబళిస్తోంది. నైరుతి ఆఫ్రికాలోని నమీబియా..వన్యప్రాణులతో కూడిన ఉద్యానవనాలు, సఫారీలకు పెట్టింది పేరు. ఒకప్పుడు స్వేచ్ఛగా విహరిస్తూ పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచిన వన్యప్రాణులు ఇప్పుడు కరువు కారణంగా మనుషులకు ఆహారంగా మారుతున్నాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో మేత, నీళ్లు లభించక వన్యప్రాణులు విలవిల్లాడుతున్నాయి. దీనిని అరికట్టేందుకు అధిక వన్యప్రాణి జనాభా కలిగిన ఉద్యానవనాల్లోని జీవులను అక్కడి ప్రభుత్వం వధిస్తోంది. వాటిని చంపడం ద్వారా ఉద్యానవనాల్లో మేత, నీళ్ల సమస్యలను తగ్గించి పేద ప్రజలకు ఆహారంగా వినియోగిస్తున్నట్లు ప్రకటించింది.

సంఖ్యను తగ్గిస్తూ..జంతువులను వధిస్తూ

నమీబియాలో ఏటా వచ్చే కరువు ఈసారి మరింత తీవ్రంగా మారింది. గతంలో కరువు ముప్పు నుంచి ఉద్యానవనాలను తప్పించేందుకు జంతువులను ప్రభుత్వం వేలం వేసేది. వచ్చిన సొమ్ముతో ఉద్యానవనాలను నిర్వహించేది. కానీ, ఇప్పుడు పరిస్థితి చేయిదాటిపోవడంతో ఏనుగులు, హిప్పోలు, జీబ్రాలతో సహా అనేక జంతువులను వధించేలా నమీబియా లైవ్లీహుడ్ వల్నెరబిలిటీ అసెస్‌మెంట్ అండ్ ఎనాలిసిస్ రిపోర్ట్‌ను అక్కడి ప్రభుత్వం తీసుకువచ్చింది. దీంతో 83 ఏనుగులు, 30 హిప్పోలు, 100 ఎలాండ్స్, 300 జీబ్రాలతో సహా సుమారు 700కు పైగా జంతువులను వధించడానికి చర్యలు తీసుకుంది. జంతువుల సంఖ్య అధికంగా ఉన్న నేషనల్ పార్కులలో మేత, నీరు సరిపోవడం లేదు. మేత కరువును, నీటి లభ్యతను నివారించడంలో ఈ వన్యప్రాణుల సంఖ్యను తగ్గించే విధానం తమకు సహాయపడుతుందని నమీబియా ప్రభుత్వం భావిస్తోంది.

హెచ్చరికలు..ఆంక్షలు

నమీబియాలో దుర్భిక్షంతో వ్యవసాయం తీవ్రంగా దెబ్బతింది. దేశంలో మే నెలలో అత్యవసర పరిస్థితిని విధించారు. 30 లక్షల మంది జనాభాలో దాదాపు సగం మంది ప్రజలు తీవ్ర ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నారు. ఆహారం దొరక్క ఏనుగులు, ఇతర వన్యప్రాణులు మనుషులపై దాడులు చేసే పరిస్థితి తలెత్తింది. ఈ క్రమంలోనే వన్యప్రాణులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోకి ప్రజలు వెళ్లవద్దని ప్రభుత్వం అప్రమత్తం చేస్తోంది. రాత్రిపూట ఆయా ప్రదేశాల్లో తిరగడం, నదుల్లో ఈత కొట్టడం, స్నానాలు చేయడం, పశువులను విచ్చలవిడిగా వదిలిపెట్టడం చేయవద్దని హెచ్చరికలు జారీ చేస్తోంది. నమీబ్ నౌక్లఫ్ట్ పార్క్, మంగెట్టి నేషనల్ పార్క్, బ్వాబ్వాటా నేషనల్ పార్క్, ముడుమో నేషనల్ పార్క్, న్కాసా రూపారా నేషనల్ పార్కుల్లోని వన్యప్రాణులను తీసుకువచ్చి వధించి..పేదలకు ఆహారంగా అందిస్తోంది.

‘గుర్తింపు’ దక్కేదెప్పుడు?

ఎన్నికలు నిర్వహించి ఎనిమిది నెలలు పూర్తి

గెలిచిన కార్మిక సంఘానికి అందని ధ్రువీకరణ పత్రం

నాలుగేళ్ల కాలపరిమితి కోసం ఏఐటీయూసీ పట్టు

సాక్షి, పెద్దపల్లి: సింగరేణి సంస్థలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరిగి ఎనిమిది నెలలు గడిచిపోయాయి. రహస్య బ్యాలెట్ పద్ధతిన పోలింగ్ నిర్వహించారు. అయితే, ఇప్పటివరకు ఎన్నికల్లో విజయం సాధించిన ట్రేడ్ యూనియన్‌కు అధికారిక గుర్తింపు దక్కలేదు. గుర్తింపు కార్మిక సంఘంగా ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘంగా ఐఎన్టీయూసీ గెలుపొందాయి. వాటికి రీజినల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ), సింగరేణి యాజమాన్యం ఇప్పటివరకు అధికారిక ధ్రువీకరణ ప్రతాలు జారీచేయలేదు. దీంతో కార్మికుల సమస్యలపై చర్చించే అవకాశం ఏ యూనియన్‌కూ లేకుండా పోయింది.



ఓటుహక్కు వినియోగించుకున్న కార్మికులు (ఫైల్)



పార్లమెంట్ ఎన్నికలతో..

సింగరేణి యాజమాన్యమే గుర్తింపు పత్రం అందించాలని కేంద్ర కార్మిక శాఖ స్పష్టం చేసింది. ఈలోగా పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఈ అంశంలో జాప్యం జరిగింది. అధికారిక పత్రాల జాప్యంతో అధికారికంగా నిర్వహించాల్సిన స్ట్రక్చరల్ సమావేశాలు మూలనపడ్డాయి. ప్రమాదాల నివారణకు కీలకంగా వ్యవహరించే రక్షణ త్రైమాసిక సమావేశాలు కూడా నిర్దేశిత సమయంలో నిర్వహించడంలేదు. ఫలితంగా బొగ్గు గనుల్లో ప్రమాదాల సంఖ్య పెరిగిపోతోందని కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంస్థవ్యాప్తంగా పని చేస్తున్న సుమారు 40 వేల మంది ఉద్యోగుల అంశాలపై ఒప్పందాలు కూడా చేసుకోవాల్సి ఉంది. దీనిపై యాజమాన్యం స్పందించడం లేదని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి.

1998 నుంచి ఎన్నికలు

సింగరేణిలో తొలిసారి 1998లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించారు. తొలి మూడు పర్యాయాలు రెండేళ్ల కాలపరిమితి విధించారు. ఆ తర్వాత నాలుగేళ్ల కాలపరిమితితో రెండుసార్లు ఎన్నికలు నిర్వహించారు. 2017లో రెండేళ్ల కాలపరిమితికే అని నిర్ణయించినా, గుర్తింపు కార్మిక సంఘంగా ఎన్నికైన తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) నాలుగేళ్ల కాలపరిమితిని డిమాండ్ చేసింది. ఆ తర్వాత వివిధ కారణాలతో అది ఐదేళ్ల పాటు గుర్తింపు కార్మిక సంఘంగా కొనసాగింది. ఆరేళ్ల అనంతరం 11 ఏరియాల్లో 2023 డిసెంబర్ 27న ఎన్నికలు నిర్వహించారు. 13 కార్మిక సంఘాలు బరిలో నిలిచాయి. 39,773 మంది కార్మికులు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. జాతీయ కార్మిక సంఘాలైన ఏఐటీయూసీ ఐదు, ఐఎన్టీయూసీ ఆరు ఏరియాల్లో ప్రాతినిధ్య సంఘాలుగా గెలిచాయి. అత్యధిక ఓట్లు సాధించిన ఏఐటీయూసీ గుర్తింపు కార్మిక సంఘంగా గెలుపొందింది.

కాలపరిమితితో..

రెండేళ్ల కాలపరిమితితోనే ఎన్నికల నోటిఫికేషన్ జారీచేసి ఎన్నికలు నిర్వహించారు. అయితే, ఎన్నికల ఘట్టం ముగిశాక రెండేళ్ల కాలపరిమితిని నాలుగేళ్లకు పెంచాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఇదే గుర్తింపు కార్మిక సంఘం ధ్రువీకరణ పత్రం జారీలో గందరగోళ వాతావరణం నెలకొనేందుకు దారి తీసిందని కార్మికులు అంటున్నారు. తొలుత రెండేళ్ల కాలపరిమితికి అంగీకరించి ఆ తర్వాత నాలుగేళ్లకు పెంచాలనే వాదనతోనే కాలయాపన జరుగుతోందని మిగిలిన కార్మిక సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

సమావేశాలు లేవు..

అధికారిక గుర్తింపు పత్రాలు అందిస్తే యాజమాన్యం కార్పొరేట్ స్థాయిలో జేసీసీ సమావేశాలు ఏర్పాటు చేస్తుంది. దీంతోపాటు డివిజన్ల వారీగా స్ట్రక్చరల్ సమావేశాలు నిర్వహిస్తుంది. కార్పొరేట్ స్థాయిలో నిర్వహించే సమావేశాలకు గుర్తింపు కార్మిక సంఘం నుంచి ఎనిమిది మంది సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తుంటారు. యాజమాన్యం నుంచి సంస్థ చైర్మన్‌తోపాటు జీఎంలు పాల్గొని సమస్యలపై చర్చించి పరిష్కారానికి నిర్ణయిస్తారు. మరుసటి రోజే గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలతో జేసీసీ సమావేశం నిర్వహించి అందులో సమస్యలపై చర్చించి నిర్ణయం తీసుకుంటారు. అధికార పత్రాలు లేకపోవడంతో కార్మికుల సమస్యలపై చర్చించే అవకాశమే లేకుండా పోతోంది.

ఇప్పటివరకు గెలిచిన సంఘాలు	
1998, 2001 ఏఐటీయూసీ	2003 ఐఎన్టీయూసీ
2012, 2017 టీబీజీకేఎస్	2023 ఏఐటీయూసీ

రాజకీయం చేస్తోంది...



నచ్చిన యూనియన్ గెలువలేదని సింగరేణి యాజమాన్యం రాజకీయం చేస్తోంది. గతంలో సింగరేణి నాలుగేళ్ల గడువుతో గుర్తింపు సర్టిఫికెట్ ఇచ్చింది. ఈసారి కూడా అలానే ఇవ్వాలని కోరాం. అయినా ఇవ్వకుండా తాత్సారం చేస్తోంది. సెంట్రల్ లేబర్ కమిషనర్ (సీఎల్‌సీ) సూచనల మేరకు గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం పత్రాలను యాజమాన్యమే ఇస్తోంది. మేము ప్రశ్నించే యూనియన్ అని జాప్యం చేస్తోంది. త్వరలో ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చి, యాజమాన్యం వైఖరి ఎండగడతాం.

- వాసిరెడ్డి సీతారామయ్య,
అధ్యక్షుడు, ఏఐటీయూసీ

లోహం కరిగించి... ప్రతిమలకు ప్రాణం పోసి..



లోహం కరిగించి విగ్రహాలు తయారు చేస్తుండగా ఆసక్తిగా చూస్తున్న అన్నారం గ్రామస్తులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ఎక్కడినుంచో వచ్చిన ఆ జంట ఆ ఊరి నడుమ అల్యూమినియం (సీమెండి) లోహాన్ని కరిగించి విగ్రహాలు తయా రు చేస్తుంటే ఆ ఊరి జనం అంతా ఆసక్తిగా చూశా రు. ఇంట్లో వాడుకున్న అల్యూమినియం పాత్ర లు, వైర్లు.. మరేదైనా ఇస్తే కరిగించి కోరుకున్న విగ్రహాన్ని ఇస్తున్నారు. చిన్న విగ్రహాలకు రూ.వంద, కాస్త పెద్దవైతే రూ.150 తీసుకుంటున్నారు. దీంతో ఊరి జనం తమకు ఇష్టమైన విగ్రహాలు చేయించుకున్నారు. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలంలోని మారుమూల గ్రామమైన అన్నారంలో సోమవారం ఉదయం నుంచి ఓ ముస్లిం జంట లోహం కరిగించి విగ్రహాలు తయారు చేసి ఇస్తున్నారు. దీన్ని గమనించిన 'సాక్షి'వారిని వాకబు చేయగా తమది కర్ణాటక లోని బీదర్ అని చెప్పారు. మహబూబ్, మహరూన్‌బీ దంపతులు తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్ గ్రామం వద్ద ఉంటూ, రోజూ గ్రామాలకు వెళ్లి విగ్రహాలను తయారు చేసి ఇస్తున్నట్టు చెప్పా రు. కాగా తమ కళ్ల ముందే తాము ఇచ్చిన లో హంతో విగ్రహాలను తయారు చేసి ఇస్తుండడంతో గ్రామస్తులు ఆసక్తిగా గమనించారు. మట్టిలో విగ్రహాల నమూనాలను పెట్టి సాంచె తయారు చేయడం, కరిగించిన లోహాన్ని అందులో పోయగానే విగ్రహ రూపం తయారవడం అంతా పదిపదిహేను నిమిషాల్లోనే జరిగిపోతుంది. హిందూ దేవుళ్ల విగ్రహాలకు జీవం పోస్తున్న ముస్లిం జంటను గ్రామస్తులు అభినందించారు.



మట్టిలో రూపుదిద్దుకున్న విగ్రహాలు



సన్నటి మట్టిలో విగ్రహ నమూనాలతో సాంచె తయారీ చేస్తున్న దృశ్యం

బీఆర్ఎస్ వరదలను కూడా రాజకీయం చేస్తోంది

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్

సాక్షి, హైదరాబాద్: ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు అండగా ఉండాల్సిన ప్రతిపక్ష పార్టీలు, అధికార పార్టీపై బురద చల్లేందుకు ప్రాధాన్యమివ్వడం ఆశ్చర్యం కలిగిస్తోందని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి.రియాజ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ వరదలను కూడా రాజకీయం చేస్తోందని ఆయన దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి, మంత్రులు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నారని, బాధితులకు అండగా ఉంటూ, కలెక్టర్లు, ఇతర అధికారులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఏమీ చేయడంలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించడం తగదన్నారు. సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధులు భవానీరెడ్డి, సంధ్యారాణి, వచన్ కుమార్‌లతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా సంభవించిన వరదల కారణంగా తెలంగాణకు తీవ్ర నష్టం జరిగిందని, ఈ నేపథ్యంలో రాష్ట్రానికి సాయం అందించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఉన్నా ప్రభుత్వం ప్రకటించిన టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి అవసరమైన సాయం పొందాలని రియాజ్ విజ్ఞప్తి చేశారు.

ప్రాణ నష్టానికి ప్రభుత్వానిదే బాధ్యత

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో సర్కారు విఫలం: మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వరదల కారణంగా సంభవించిన మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి అన్నారు. వరదల్లో చిక్కుకుని మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, పార్టీ నేత గట్టు రామచందర్‌రావుతో కలసి సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు ప్రభుత్వం ప్రజల మధ్య ఉండాలన్నారు. కానీ ఖమ్మంలో బాధితులు ప్రభుత్వ సాయం కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సి వచ్చిందన్నారు. చివరకు గజఈతగాళ్లకు ప్రజలే డబ్బులు ఇచ్చి ప్రాణాలు కాపాడుకున్నారన్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా 20 జిల్లాల పరిధిలో వర్ష ప్రభావం ఉన్నా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నా ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఆయన అన్నారు.

భద్రత చర్యలు తప్పక పాటించాలి

హోటళ్ల యాజమాన్యాలతో సమావేశంలో శిఖాగోయల్

సాక్షి, హైదరాబాద్: హోటళ్లలో భద్రత చర్యలు అన్నీ పాటించాలని యాజమాన్యాలకు మహిళా భద్రత విభాగం డీజీ శిఖాగోయల్ సూచించారు. హోటల్ యాజమాన్యాలు చట్టబద్ధంగా వ్యాపారం కొనసాగించడమే కాకుండా హోటల్ పరిసరాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అడ్డుకోవాలన్నారు. సోమవారం డీజీపీ కార్యాలయం సమావేశ మందిరంలో హైదరాబాద్ నగరంలోని ప్రముఖ హోటళ్ల యాజమాన్యాలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై హోటల్ యాజమాన్యాలకు సూచనలు ఇచ్చారు. హోటల్‌కు వచ్చే అతిథుల భద్రతకు సంబంధించి తీసుకుంటున్న చర్యలను శిఖాగోయల్ అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకించి మహిళలు, చిన్నారుల భద్రతపై దృష్టి పెట్టాలని సూచించారు. గుర్తింపు కార్డుల తనిఖీ, హోటల్ సీసీటీవీ స్టోరేజీ బ్యాకప్ సమయాన్ని 90 రోజులకు పెంచడం, అన్ని సీసీటీవీ కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకోవడం, డయల్ 100 సహా ఎమర్జెన్సీ కాంటాక్ట్ నంబర్లకు సంబంధించిన బోర్డులు హోటల్ గదులలో, రిసెప్షన్ ప్రాంతాల్లో కనిపించేలా పెట్టడం, మహిళా అతిథుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి శిక్షణసహా పలు చర్యలను తీసుకోవాలని హోటల్ యాజమాన్యాలకు శిఖాగోయల్ సూచించారు. సమావేశంలో మహిళా భద్రత విభాగం డీఐజీ రెమారాజేశ్వరి, పలు హోటల్ యాజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో జోక్యం చేసుకోకండి

టీపీసీసీ నేతలకు ఏఐసీసీ సూచన

సాక్షి, హైదరాబాద్: యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ కలగజేసుకోవద్దని ఏఐసీసీ సూచించింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, సీనియర్ నేతలు తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ పాల్గొనవద్దని స్పష్టం చేసింది. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గం కోసం జరిగే ఎన్నికలు పారదర్శకంగా జరగాలంటే టీపీసీసీ నేతల ప్రమేయం ఉండకూడదని వెల్లడించింది. ఈ మేరకు టీపీసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏఐసీసీ సూచనలు పాటించడం ద్వారా యువజన కాంగ్రెస్ ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేలా సహకరించాలని టీపీసీసీ నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు.



జలవిద్యుత్ ప్రాజెక్టు గురించి డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కకు వివరిస్తున్న సింగరేణి సీఎండీ బలరాం (ఫైల్)

జలవిద్యుత్ ప్రాజెక్టు సమాచారం

ప్రాజెక్టు పేరు	పంప్‌డ్ స్టోరేజీ ప్లాంట్(పీఎస్‌పీ)
ప్రతిపాదిత ప్రాంతం	మేడిపల్లి ఓసీపీ క్వారీ
విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం (మెగావాట్లు)	500
వార్షిక ఉత్పత్తి లక్ష్యం (మిలియన్ యూనిట్లు)	1,560
సోలార్‌పవర్ వ్యయం (యూనిట్‌కు రూ.లలో)	3.00
పంప్‌డ్ స్టోరేజ్ వ్యయం (యూనిట్‌కు రూ.లలో)	6.75
పీక్ అవర్‌లో విక్రయం (యూనిట్‌కు రూ.లలో)	10
ఒక యూనిట్‌పై లాభం (రూ.లలో)	3.25
వార్షిక టర్నోవర్ (రూ.కోట్లలో)	1,134
వార్షిక లాభాలు (రూ.కోట్లలో)	425
అవసరమయ్యే స్థలం (ఎకరాల్లో)	261
జీవితకాలం (ఏళ్లలో)	40
ప్రాజెక్టు నిర్మాణం గడువు (ఏళ్లలో)	3.5
ప్రాజెక్టు వ్యయం (రూ.కోట్లలో)	2,961
రోజూ అవసరమయ్యే కార్మికులు	2,000
ప్రాజెక్టు ఆపరేషన్ కోసం కార్మికులు (రోజూ)	90

రూ.3వేల కోట్లు.. 500 మెగావాట్లు

ఏటా రూ.425కోట్ల లాభాలు

వార్షిక టర్నోవర్ రూ.1,134కోట్లు

సింగరేణి పంప్‌డ్ స్టోరేజీ జలవిద్యుత్ లక్ష్యం

గోదావరిఖని: సింగరేణి బొగ్గు గనుల సంస్థ సుమారు రూ.3వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన 500 మెగావాట్ల జలవిద్యుత్ కేంద్రం స్థాపనకు ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించడంతో పనుల్లో వేగం పెరిగింది. డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క గత శనివారం ప్రాజెక్టు ప్రతిపాదిత స్థలం సందర్శించడం, అధికారుల పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ను తిలకించడం, ఆ తర్వాత సానుకూలంగా స్పందించడం చకచకా సాగిపోయాయి. ప్రాజెక్టు నివేదిక రూపొందించి సమర్పించాలని సూచించడంతో ప్రణాళిక తయారీలో సీఎండీ, ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు.

పంప్‌డ్ స్టోరేజీ పద్ధతిలో..

పంప్‌డ్ స్టోరేజీ ప్లాంట్ పద్ధతిన సింగరేణి పవర్ ప్లాంట్ నిర్మించేందుకు సిద్ధమైంది. సంస్థలోనే ఇది ప్రయోగాత్మకం. పెద్దపల్లి జిల్లా రామగుండం రీజియన్‌లోని మేడిపల్లి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు(ఓసీపీ)ని ఇందుకు ఎంచుకుంది. ఇప్పటికే థర్మల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో సింగరేణి దూసుకుపోతోంది. ఇప్పుడు జలవిద్యుత్ ఉత్పత్తి.. అదికూడా పంప్‌డ్ స్టోరేజీ పద్ధతిన రూ.2,961కోట్ల వ్యయంతో 500 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మించబోతోంది. దీనికి డిటేల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్(డీపీఆర్) సమర్పించాలని టాటా కన్సల్టెన్సీకి కాంట్రాక్టు బాధ్యతలు అప్పగించింది. సాధ్యాసాధ్యాలపై ఇప్పటికే అధ్యయనం చేసిన ఆ సంస్థ సింగరేణికి డీపీఆర్ సమర్పించింది. భారీ విద్యుత్ మోటార్లతో క్వారీలోని నీటిని ఓవర్ బర్డెన్(మట్టికుప్పలు)పైకి సుమారు 157 మీటర్ల ఎత్తు)కు పంపింగ్ చేస్తారు. అక్కడ నిర్మించిన రిజర్వాయర్ ద్వారా మళ్లీ దిగువకు విడుదల చేస్తారు. ఇవి టర్బైన్‌లపై పడడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.

జలవిద్యుత్ ఇలా..

మేడిపల్లి ఓసీపీలో బొగ్గు నిల్వలు అడుగంటిపోయాయి. గతంలోనే దానిని మూసివేశారు. అందులోని క్వారీని ప్రాజెక్టు కోసం ఎంపిక చేశారు. ఇందులో 0.5టీఎంసీ నీటి నిల్వలు ఉన్నాయి. అవసరం మేరకు ఇంకా పెంచేందుకు సమీపంలోని గోదావరి నీటికి కూడా తరలిస్తారు. ఉదయం సోలార్ విద్యుత్‌ను వినియోగించి భారీ మోటార్లతో క్వారీలోని నీటినిపైకి పంపింగ్ చేస్తారు. రాత్రి దిగువకు వదులుతారు. సోలార్ విద్యుత్ ద్వారా తక్కువ వ్యయంతో నీటిని పంపింగ్ చేసి రాత్రి విడుదల చేయడం ద్వారా జలవిద్యుత్ తయారు చేస్తారు. ఇలా తయారైన విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించడం ద్వారా ఆదాయం సమకూర్చుకుంటారు. సోలార్ విద్యుత్‌ను కూడా సింగరేణి సొంతంగా తయారు చేస్తోంది.

ఏటా రూ.425 కోట్ల లాభాలు

జలవిద్యుత్ ప్లాంట్ ద్వారా సింగరేణికి భారీగా లాభాలు వస్తాయని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈప్లాంట్ ద్వారా రూ1,134కోట్ల వార్షిక టర్నోవర్ ఉంటుందని, ఇందులో రూ.425కోట్లు లాభాలు ఉంటాయని అంటున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా అధికంగా ఉంటాయని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు చెబుతున్నారు.

షోకాజ్ నోటీసులుగా పరిగణించండి

రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని పిటిషనర్లకు ఆదేశం

చట్ట ప్రకారం ముందుకువెళ్లాలని అధికారులకు హైకోర్టు స్పష్టం



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేట్ అమర్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సహా ఇదే మండలంలోని మరికొందరు పిటిషనర్లకు జారీ చేసిన నోటీసులపై చట్టప్రకారం ముందుకు వెళ్లాలని ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. నోటీసులను షాకాజ్‌గా పరిగణించి రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని పిటిషనర్లను ఆదేశించింది. వారి వాదనలను వినాలని శేరిలింగంపల్లి తహసీల్దార్‌కి సూచించింది. ఈ అంశంలో మెరిట్‌లోకి వెళ్లడం లేదని వ్యాఖ్యానిస్తూ.. పిటిషన్లలో విచారణ ముగించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేట్ అమర్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలోని ప్లాట్ నంబర్ 63కు సంబంధించి ఆగస్టు 3న తహసీల్దార్ జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ ఇందు ఫార్చ్యూన్ ఫీల్డ్ నివాసి బోడ ప్రియతమ్‌రెడ్డితో పాటు కావూరి హిల్స్‌కు చెందిన మరికొందరు ఇలాంటి పిటిషన్లనే హైకోర్టులో దాఖలు చేశారు. వాల్టా చట్టం కింద తమవి అక్రమ నిర్మాణాలంటూ తహసీల్దార్ జారీ చేసిన నోటీసులు, తదుపరి చర్యలపై స్టే ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు రాయ్‌రెడ్డి, ప్రతాప్‌కుమార్, ఎం.ప్రగతి, ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ రాహుల్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ తరఫున కె.రవీందర్‌రెడ్డి వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం.. చట్ట ప్రకారం ముందుకు వెళ్లాలని తహసీల్దార్‌కు చెబుతూ, విచారణ ముగించింది.

తదుపరి విచారణ వరకు కూల్చొద్దు..

తదుపరి ఉత్తర్వులు జారీ చేసేవరకు పిటిషనర్లకు చెందిన నిర్మాణాలను కూల్చవద్దని సర్కార్‌కు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఉస్మాన్‌సాగర్ మ్యాప్ వివరాలను తెప్పించి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ను నిర్ధారించాలని చెప్పింది. వాటిని న్యాయస్థానానికి కూడా సమర్పించాలని స్పష్టం చేసింది. గతంలో తనిఖీలు చేసి ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇళ్ల స్థలాలు లేవని అధికారికంగా పత్రాలు ఇచ్చాక.. ఇప్పుడు నోటీసులు ఇవ్వడమేంటని ప్రశ్నించింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం ఖానాపూర్‌లో తమ ఇళ్ల కూల్చివేతకు అధికారులు జారీ చేసిన నోటీసులను జి. విద్యాధర్‌రెడ్డి, అనుపమ వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ టి.వినోద్ కుమార్ సోమవారం విచారణ చేపట్టారు.

తమ వినతులపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే అధికారులు కూల్చివేత చర్యలు తీసుకుంటున్నారని పిటిషనర్ న్యాయవాది వాదించారు. గత నెల 3న అధికారులు నోటీసులు జారీ చేస్తే తమ స్థలాలకు నిర్మాణాలకు ఉన్న హక్కుల అధికార పత్రాలను ఆగస్టు 13న సమర్పించామని చెప్పారు. దీనిపై అధికారుల నుంచి స్పష్టత వ్యక్తం కాలేదని, ఈలోగా గత నెల 18న పాక్షిక కూల్చివేత చర్యలు చేపట్టారన్నారు. వాదనల తర్వాత స్టే ఉత్తర్వులు జారీచేసిన హైకోర్టు తదుపరి విచారణను 3 వారాలకు వాయిదా వేసింది. ఈలోగా ప్రభుత్వం పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

ప్రపంచంలోనే అతి ప్రాచీన గ్రంథం?

ఆర్యుల రాకతోనే భారతదేశంలో చారిత్రక యుగం ప్రారంభమైంది. ఈ కాలం నుంచే భారతదేశ చరిత్రకు సంబంధించిన లిఖిత ఆధారాలు లభిస్తున్నాయి. 'ఆర్య' అనేది భాషకు సంబంధించిన పదం. ఆర్య భాషను ఉపయోగించడం వల్ల వీరిని ఆర్యులనీ, వీరి నాగరికతను 'ఆర్య నాగరికత' అని అంటారు. ఈ నాగరికతకు ప్రధానాధారం వేద సాహిత్యం. అందువల్ల దీన్ని 'వేద నాగరికత' అంటారు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

వైదిక నాగరికత

భారతదేశ చరిత్రలో క్రీ.పూ. 1500-600 మధ్య కాలాన్ని వైదిక యుగంగా పేర్కొంటారు. ఈ కాలంలో వైదిక నాగరికత విలసిల్లింది. ఈ నాగరికత నిర్మాతలు ఆర్యులు. ఈ నాగరికత కాలాన్ని రెండు దశలుగా విభజిస్తారు. క్రీ.పూ. 1500 నుంచి 1000 మధ్య కాలాన్ని 'తొలివేద నాగరికత' లేదా 'రుగ్వేద నాగరికత'గా, క్రీ.పూ. 1000 నుంచి 600 మధ్య కాలాన్ని 'మలివేద నాగరికత'గా వ్యవహరిస్తారు.

ఆర్యులు నార్డిక్ జాతికి చెందినవారు. వీరి జన్మస్థలంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. దీనికి కారణం స్పష్టమైన ఆధారాలు లేకపోవడం. ఆర్యుల జన్మస్థలంపై ఉన్న వాదనల్లో ముఖ్యమైనవి..

1. **మధ్య ఆసియా వాదం:** ఇండో-యూరోపియన్ భాషల తులనాత్మక అధ్యయనం ఆధారంగా మాక్స్‌ముల్లర్ ఆర్యుల జన్మభూమి మధ్య ఆసియా అని పేర్కొన్నారు. మిగిలిన వాదనల కంటే ఇది అర్థవంతంగా ఉండటంతో అత్యధికుల ఆమోదం పొందింది.
2. **జర్మనీ వాదం:** ఆర్యుల జన్మభూమి జర్మనీ అని పెంకాతో పాటు ఇతర యూరోపియన్ చరిత్రకారులు వాదించారు.
3. **ఆర్కిటిక్ వాదం:** ఆర్యులు ఆర్కిటిక్ ప్రాంతం నుంచి భారతదేశానికి వలస వచ్చారని బాల గంగాధర్ తిలక్ అభిప్రాయపడ్డారు. దీన్నిపై ఆయన 'ఆర్కిటిక్ ది హోం ఆఫ్ ఆర్యన్స్' అనే గ్రంథాన్ని రాశారు.
4. ఆస్ట్రో - హంగేరీ ప్రాంతమే ఆర్యుల జన్మస్థలమని డాక్టర్ గైల్ అనే చరిత్రకారుడు వాదించారు.
5. **టిబెట్ వాదం:** ఆర్యుల జన్మభూమి టిబెట్ అని దయానంద సరస్వతి వాదన.
6. **స్వదేశీ వాదం:** ఆర్యులు భారతదేశంలోని సప్త సింధూ ప్రాంతానికి చెందిన స్థానికులే అని డాక్టర్ ఎ.సి.దాస్ అభిప్రాయం. ఆర్యులు విదేశీయులు, బయటి ప్రాంతాల నుంచి భారత్‌కు వలస వచ్చారు అనే వాదనలను ఆయన ఖండించారు.

ఆర్యుల సాహిత్యం

'వేదసాహిత్యం' భారతదేశంలో లభిస్తున్న అత్యంత ప్రాచీన సాహిత్యం. దీన్ని వెలువరించినవారు ఆర్యులు. వేద సాహిత్యాన్ని శ్రుతి సాహిత్యం, స్మృతి సాహిత్యం అని రెండు రకాలుగా విభజించారు.

1. **శ్రుతి సాహిత్యం:** ఇందులో నాలుగు వేదాలతో పాటు బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు ఉన్నాయి.
   వేదాలు: వేదాలను 'అపౌరుషేయాలు' అంటారు. అంటే ఇవి మానవమాత్రులు రచించినవి కావు, దివ్యగ్రంథాలు అని అర్థం.

రుగ్వేదం: ఇది భారతదేశంలోనే కాకుండా మొత్తం ఇండో-యూరోపియన్ సాహిత్యంలోనే అతి ప్రాచీనమైంది. తొలి వేదకాలం గురించి తెలుసుకోవడానికి ఇది ప్రధాన ఆధారంగా ఉంది. ఇందులో మొత్తం 1028 శ్లోకాలున్నాయి. దీన్ని 10 మండలాలుగా విభజించారు. పదో మండలంలోని పురుష సూక్తంలో చాతుర్వర్ణ వ్యవస్థ తొలి ప్రస్తావన ఉంది. మూడో మండలంలో ప్రసిద్ధమైన గాయత్రి మంత్రం ఉంది.

సామవేదం: ఇందులో 1600కు పైగా శ్లోకాలున్నాయి. ఇది సంగీత ప్రధానమైంది. యజ్ఞాల సమయంలో పఠించే మంత్రాలకు అనువుగా ఈ సంగీతాన్ని రూపొందించారు. భారతీయ సప్త స్వరాలకు మూలం దీంట్లోనే ఉన్నట్లు చెబుతారు.

యజుర్వేదం: ఈ గ్రంథంలో యజ్ఞయాగాలు, క్రతువులు, కర్మకాండలు, బలిదానాలు తదితర సందర్భాల్లో పఠించే మంత్రాలు ఉన్నాయి. రాజులు నిర్వహించే రాజసూయ, వాజపేయ లాంటి యాగాలకు సంబంధించిన తొలి ప్రస్తావన ఇందులో కనిపిస్తుంది. తొలి రెండు వేదాలకు భిన్నంగా దీన్ని పద్య, గద్య శైలి రెండింటిలోనూ రాశారు. దీంట్లో సుమారు రెండువేల శ్లోకాలున్నాయి.

అధర్వణ వేదం: ఇది మంత్రతంత్రాలతో కూడిన గ్రంథం. దీన్ని ఆర్యేతరులకు సంబంధించిందిగా భావిస్తున్నారు. ఆర్యేతరుల ఆచారాలు, సాంప్రదాయాలు ఇందులో కనిపిస్తాయి. దీంట్లో దుష్టశక్తులను పారదోలడానికి, వ్యాధులను నివారించేందుకు ఉపయోగించే మంత్రతంత్రాలున్నాయి. ఇందులో మొత్తం 711 శ్లోకాలున్నాయి. దీన్ని రెండు భాగాలు గా విభజించారు. అవి: పైప్పలాద, సౌనక.



బ్రాహ్మణాలు: ఇవి పూజా ప్రార్థనలు, యజ్ఞయాగాలు, బలిదానాలు, ఉత్సవాలకు సంబంధించిన గ్రంథాలు. నాలుగు వేదాలకు అనుబంధంగా మొత్తం ఏడు బ్రాహ్మణాలు ఉన్నాయి. ఇవి నాటి ప్రజల ఆచార వ్యవహారాలు, సామాజిక జీవితాలను ప్రతిబింబిస్తున్నాయి. వీటిలో అతి పురాతనమైంది 'తాండ్యమాహ బ్రాహ్మణం'. అన్నిటికంటే ముఖ్యమైనది 'శతపథ బ్రాహ్మణం'. ప్రతి బ్రాహ్మ ణం ఏదో ఒక వేదంతో అనుబంధమై ఉంది.

అరణ్యకాలు: వీటిని వేదాలు, బ్రాహ్మణాలు, ఉపనిషత్తులకు మధ్య అనుసంధానాలుగా భావిస్తారు. బ్రాహ్మణాలు వేదాలకు అనుబంధంగా ఉంటే అరణ్యకాలు బ్రాహ్మణాలకు అనుబంధంగా ఉన్నాయి. ఇవి అడవుల్లో నివసించే రుషులను ఉద్దేశించినవి. వీటిలో ప్రధానాంశం సన్యాసవాదం. వీటిలో నైతిక విలువలకు అధిక ప్రాధాన్యమిచ్చారు. ముఖ్యమైన అరణ్యకాలు-ఐతరేయ, కౌసితాకి.

ఉపనిషత్తులు: యజ్ఞ యాగాలకు బదులుగా భక్తి, జ్ఞానానికి ప్రాధాన్యమిచ్చే తాత్విక గ్రంథాలివి. భారతీయ తత్వ శాస్త్రానికి మూలం ఇవేనని భావిస్తున్నారు. శంకరాచార్యులు, రామానుజాచార్యుల తత్వ సిద్ధాంతాలకు కూడా మూలం ఇవే. పునర్జన్మ సిద్ధాంతానికి సంబంధించిన ప్రస్తావన మొదటగా వీటిలోనే కనిపిస్తుంది. ఉపనిషత్తుల మొత్తం సంఖ్య 108. వీటిలో చాందొగ్య, బృహదారణ్యక, ముండక, జబల, ఐతరేయ, కౌసితాకి, శ్వేతాశ్వేతార, కథ, కేన లాంటివి ముఖ్యమైనవి. జబల ఉపనిషత్తులో తొలిసారిగా నాలుగు ఆశ్రమాల ప్రస్తావన కనిపిస్తుంది. ముండకోపనిషత్తులో 'సత్యమేవ జయతే' అనే ప్రముఖ శ్లోకం కనిపిస్తుంది. ఉపనిషత్తులు కూడా నాలుగు వేదాలకు అనుబంధంగా ఉన్నాయి.

2. **స్మృతి సాహిత్యం:** ఒక తరం నుంచి మరో తరానికి వారసత్వంగా లభించిన సాహిత్యం కాబట్టి దీన్ని 'స్మృతి సాహిత్యం' అంటారు. ఇందులో వేదాంగాలు, సూత్రాలు, ఇతిహాసాలు, ఉపవేదాలు, పురాణాలు, షడ్దర్శనాలు ఉన్నాయి.

వేదాంగాలు: ఇవి మొత్తం ఆరు. మానవులు రచించినవే కాబట్టి వేదాల్లా ఇవి అపౌరుషేయాలు కావు.

- **శిక్ష:** ఇది ఉచ్చారణకు సంబంధించింది.
- **కల్ప:** ఇది వేదాంగాల్లో అతి ముఖ్యమైంది. క్రతువుల గురించి తెలియజేస్తుంది.
- **వ్యాకరణ:** భాషా వ్యాకరణానికి సంబంధించింది.
- **నిరుక్త:** పద వ్యుత్పత్తిని వివరిస్తుంది.
- **ఛందస్సు:** ప్రాస, లయలకు చెందింది.
- **జ్యోతిష:** ఖగోళ శాస్త్రానికి సంబంధించిన వేదాంగం.

సూత్రాలు: ఇవి మూడు రకాలు.

శ్రౌత సూత్రాలు: ఇవి యజ్ఞ యాగాలు, క్రతువులు, కర్మకాండల గురించి వివరిస్తాయి. సుళ్వ సూత్రాలు ఇందులో ఒక భాగం. సుళ్వ సూత్రాల్లో రేఖాగణిత శాస్త్ర మూలాలు ఉన్నాయి.

గృహ్య సూత్రాలు: గృహస్థు తన జీవిత కాలంలో ఆచరించాల్సిన క్రతువులు, కర్మకాండల గురించి తెలియజేస్తాయి. వీటి ప్రకారం ఒక మనిషి పుట్టుక నుంచి మరణం వరకు మొత్తం 16 క్రతువులు, కర్మకాండలను నిర్వహించాలి.

ధర్మసూత్రాలు: చట్టాలు, ప్రజల ఆచార వ్యవహారాల గురించి తెలియజేస్తాయి. న్యాయశాస్త్రాలకు వీటినే మూలంగా భావిస్తారు. మనుస్మృతి లాంటి వివిధ ధర్మ శాస్త్రాలకు ఇవి ప్రాతిపదికగా ఉన్నాయి. అందువల్ల ఇవి చరిత్రకారులకు అత్యంత ప్రధానమైనవి.

షడ్దర్శనాలు: ఇవి భారతీయ తత్వశాస్త్రానికి సంబంధించిన సిద్ధాంతాలు. ఇవి యజ్ఞయాగాలు, క్రతువులను నిరసిస్తాయి. సచ్ఛీలత, నైతిక విలువలకు ప్రాధాన్యమిస్తాయి. వివిధ సిద్ధాంతాలు - ప్రవచించిన రుషుల వివరాలను కింద గమనించవచ్చు.

- సాంఖ్య దర్శనం - కపిల మహర్షి
- వైశేషిక - ఉలూక కనద రుషి
- న్యాయ - గౌతమ
- యోగ దర్శన - పతంజలి
- పూర్వ మీమాంస - జైమిని మహర్షి
- ఉత్తర మీమాంస - బాదరాయణుడు

ఉపవేదాలు: స్మృతి సాహిత్యంలో నాలుగు ఉపవేదాలున్నాయి. అవి:

1. **ఆయుర్వేదం:** వైద్య శాస్త్రానికి సంబంధించింది.
2. **గాంధర్వ వేదం:** గానం, సంగీతాలకు సంబంధించింది.
3. **శిల్పవేదం:** వాస్తు, శిల్పకళలను వివరిస్తుంది.
4. **ధనుర్వేదం:** ఇది యుద్ధ విద్యలకు ముఖ్యం గా ధనుర్విద్యకు సంబంధించింది.

పురాణాలు: స్మృతి సాహిత్యంలో భాగంగా ఉన్న మొత్తం 18 పురాణాలూ గుప్తుల అనంతర కాలానికి చెందినవే. కానీ వాటిలోని కథలు ప్రాచీనమైనవి. ఇవి ప్రధానంగా ప్రాచీన కాలానికి చెందిన రాజుల వంశానుక్రమాన్ని వివరిస్తాయి. ప్రపంచ సృష్టి, వినాశనం, పునఃసృష్టి, సూర్య, చంద్ర వంశీకుల చరిత్ర మొదలైన అంశాలపై వివరాలను అందిస్తున్నాయి.

ముఖ్యమైన పురాణాలు: వాయు, విష్ణు, బ్రహ్మ, శివ, గరుడ, భాగవత, భవిష్య, పద్మ, స్కంధ పురాణాలు. అష్టాదశ పురాణాల్లో అతి ప్రాచీనమైంది వాయు పురాణం.

ఇతిహాసాలు:

- **రామాయణం:** పురాణాల ప్రకారం దీన్ని క్రీ.పూ. 500 ఏళ్ల కిందట రచించారు. దీనికి తొలిరూపం ఇచ్చిన వారు వాల్మీకి. ఇందు లో మొత్తం 7 కాండాలున్నాయి. మొదటి, చివరి కాండాలు మినహా మిగిలినవి ప్రాచీనమైనవి.
- **మహాభారతం:** వేదవ్యాసుడు రచించారు. భగవద్గీత కూడా ఇందులో అంతర్భాగమే. మహాభారతాన్ని మొదట 'జయసంహిత' అని పిలిచారు. ఇందులో మొత్తం 18 పర్వాలున్నాయి.

ధర్మశాస్త్రాలు (స్మృతులు): మానవుడి జీవితాన్ని నియమబద్ధం చేసేందుకు వీటిని రచించారు. ఇవి చాతుర్వర్ణాలు, వర్ణాశ్రమ ధర్మాలు, షోడష కర్మలు, సంస్కారాలు, ఆచారాలు, వ్యవహారాలు, శిక్షలు లాంటి అనేక అంశాల గురించి వివరిస్తాయి.

ముఖ్యమైన స్మృతులు:

- **మనుస్మృతి:** అత్యంత ప్రాచీనమైన ధర్మశాస్త్రం. తర్వాతి కాలంలో వచ్చిన అనేక ధర్మశాస్త్రాలకు ఇది మూలంగా ఉంది.
- **యాజ్ఞవల్క్య స్మృతి:** యాజ్ఞ వల్క్య మహర్షి రచించారు. దీనిపై క్రీ.శ. 11వ శతాబ్దంలో విజ్ఞానేశ్వరుడు 'మితాక్షర' అనే వ్యాఖ్యానాన్ని రచించాడు.
- **పరాశర స్మృతి:** దీన్ని రచించినవారు పరాశర మహర్షి. ఇందులో కొంత ఆధునిక భావాలు కనిపిస్తాయి. దీన్ని కలియుగానికి అనువైందిగా భావిస్తారు.
- **నారద స్మృతి:** నారద మహర్షి రచించారు. వీటితోపాటు బృహస్పతి స్మృతి, కాత్యాయన స్మృతి కూడా ముఖ్యమైనవి.

మాదిరి ప్రశ్నలు

1. 'ఆర్య' అనేది జాతికి సంబంధించిన పదం అని వాదించిన విదేశీ చరిత్రకారుడు?
   1) పెంకా 2) సర్ విలియమ్ జోన్స్
   3) మాక్స్ ముల్లర్ 4) గైల్
2. రుగ్వేదంలోని గాయత్రీమంత్రం ఏ దైవానికి సంబంధించింది?
   1) అధితి 2) ఉషస్సు
   3) సావిత్రి 4) అరణ్యాని
3. వేదాలు - వాటి పురోహితులకు సంబంధించి కిందివాటిలో సరికాని జత?
   1) రుగ్వేదం- హోత్రి
   2) సామవేదం - ఉద్గాత్రి
   3) యజుర్వేదం - అధ్వర్యు
   4) అధర్వణ వేదం - గ్రామణుడు
4. 'కుటుంబ గ్రంథం'అని ఏ వేదాన్ని పిలుస్తారు?
   1) రుగ్వేదం 2) సామవేదం
   3) యజుర్వేదం 4) అధర్వణ వేదం
5. సుప్రసిద్ధ 'తమసోమా జ్యోతిర్గమయ' శ్లోకం ఏ గ్రంథంలో ఉంది?
   1) ఐతరేయ బ్రాహ్మణం
   2) బృహదారణ్యక ఉపనిషత్తు
   3) యజుర్వేద సంహిత
   4) భాగవత పురాణం
6. ప్రపంచంలోనే అతి ప్రాచీన గ్రంథం?
   1) రుగ్వేదం 2) సామవేదం
   3) యజుర్వేదం 4) అధర్వణ వేదం
7. అష్టాదశ పురాణాల్లో అతి ప్రాచీనమైనది?
   1) విష్ణు పురాణం
   2) భాగవత పురాణం
   3) వాయుపురాణం
   4) గరుడ పురాణం

సమాధానాలు

1) 1; 2) 3; 3) 4; 4) 1;
5) 2; 6) 1; 7) 3.

Language labs are particularly good for..

Model Questions

1. Learning can happen best when it is shared with others. This is the belief of
   1) Communical Approach
   2) Collaborative Approach
   3) Structural Approach
   4) Electic Approach
2. One of the features of Reflective teaching is _____
   1) Predicting 2) Clarifying
   3) Summarizing
   4) Gathering new evidences
3. Computer Assisted Language Learning programmes employ _____.
   1) Communicative method
   2) Grammar-translation method
   3) Direct method
   4) Trilingual method
4. An approach has a_____.
   1) a method behind it
   2) Learning principle behind it.
   3) Some language patterns behind it.
   4) a technique behind it.
5. The function-based and task-centered approach is the_____.
   1) Structural approach
   2) S-O-S approach
   3) Communicative approach
   4) Situational approach
6. B.F. Skinner, an educationist, felt sad and said, our kitchens are more mechanized than our classrooms' because_____.
   1) Some teachers get their learners to prepare teaching learning materials.
   2) Teachers buy the teaching learning materials form the local market.
   3) Most teachers use only the course books in the class-rooms while teaching.
   4) Most teachers use a large number of teaching-learning materials.
7. To remedy spelling errors made by pupils, or to prevent them from making spelling errors, the teacher should_____.
   1) get pupils to learn them by heart every word.
   2) get pupils to write each word ten times.
   3) have lists of English words hung on the class room walls.
   4) help them read books other than their books.
8. Which one of the following is not a technique?
   1) Writing a lesson plan
   2) Oral presentation by the teacher.
   3) Reading the lesson by the teacher.
   4) Oral drills.
9. Identify the correct statement.
   1) We can have some approaches under a method.
   2) There can be some methods based on a certain approach.
   3) There can be some approaches under a technique.
   4) We cannot have some methods under some approach.
10. Language labs are particularly good for_____.
    1) listening to sounds and drilling them.
    2) listening to sounds
    3) learning word stress
    4) practicing communication in artificial situations
11. Arrange the following levels of learners according to their categories in ascending order. 1. Advanced 2. beginner 3. elementary 4. Intermediate
    1) 2, 3, 4, 1 2) 1,2,3,4
    3) 4,3,2,1 4) 1,4,3,2
12. A study of grammar improves__.
    1) Accuracy 2) Fluency
    3) Literacy 4) Articulation
13. Language games are useful ___.
    1) teaching aids in teaching English
    2) teaching techniques to teach English
    3) tools for learners assessment
    4) methods to teach English
14. The method adopted in writing present day school textbooks is
    1) text followed by functional and communicative activities
    2) text followed by comprehension exercises
    3) text followed by grammar and vocabulary
    4) text followed by structures and vocabulary
15. The following method presents grammar through the study of rules
    1) Audio-lingual Method



DSC SPECIAL
ENGLISH METHODOLOGY

    2) Grammar Translation Method
    3) Bilingual Method
    4) Reading Method
16. Micro teaching _____.
    1) does not give any scope for feedback
    2) improves the efficiency of a teacher
    3) makes teaching situation very complex
    4) is planned for 45 minutes of teaching
17. The principle involved in Deductive Method is_____.
    1) specific example to generalization of rule
    2) generic example to generalization of rule
    3) generalized rule to specific example
    4) specific example to special rule
18. Read the following statements. The correct statement is_____
    1) Group method of reading brings in indiscipline.
    2) Role pay is difficult to administer in the classroom.
    3) Audio-lingual method does not consider language skills
    4) Information gap activities promote language used in real-life situations.
19. Practical devices used by the teacher in the classroom are called _____.
    1) Exercises 2) Approaches
    3) Methods 4) Techniques
20. Direct Method does not believe in_____.
    1) exposure to language through situations
    2) examples followed by rules
    3) association of ideas and objects
    4) teaching through translation
21. Reading Method is propounded by_____.
    1) C J Dodson 2) Michael West
    3) Harold Palmer 4) C C Fries
22. Small-group talk among children, and undertaking activities that nurture the abilities to compare and contrast, to wonder and remember, to guess and challenge, to judge and evaluate will facilitate this:
    1) Effective language learning in a stress free environment
    2) Effective reading in a stressful environment
    3) Effective reading in a stress free environment
    4) Ineffective language learning in a stress free environment
23. In Direct Method, the following is not found _____.
    1) Grammar is taught indirectly
    2) Concepts are taught by means of objects or by natural contexts
    3) Oral training helps in reading and writing
    4) Translation
24. In the communicative language teaching context, mistakes are __
    1) Completely ignored
    2) Completely corrected
    3) Noted and addressed as a group later
    4) Noted but never addressed
25. Bangalore Project was undertaken by_____.
    1) West Bengal Government
    2) N. S. Prabhu
    3) CBSE 4) British Council
26. COST stands for_____.
    1) Communication Oriented Situational Teaching
    2) Communication Oriented Structural Teaching
    3) Communication Oral Situational Teaching
    4) Communicative Oriented Situational Teaching
27. _____ employs association of ideas and objects or concepts 'experience with expressions'.
    1) Reading Method
    2) Bilingual Method
    3) Direct Method
    4) Grammar Translation Method
28. _____ establishes a relation between theory and practice.
    1) Approach 2) Method
    3) Technique 4) All
29. A method is an overall plan for the orderly presentation of language material. Within one approach there can be_____.
    1) two methods 2) four methods
    3) many methods
    4) six methods
30. Grammar translation method does not:
    1) give importance to grammar
    2) encourage learning through mother tongue
    3) help learn English grammar
    4) enhance the learner's communicative skills immediately
31. The grammar translation method dominated the field of teaching and learning during this period
    1) 1840 to 1940
    2) 1990 to 2005
    3) 1840 to 1841
    4) 1950 to 2000
32. The three levels of conceptualization identified by Edward Anthony are :
    1) Approach, method and technique
    2) Approach, philosophy and technique
    3) Principle, approach and method
    4) Philosophy, principle and approach
33. Grammar translation method lays stress on :
    1) accuracy 2) similarity
    3) listening skills
    4) hand writing
34. The objective of the Direct method is:
    1) to develop personality
    2) to develop a command over the target language
    3) to develop health
    4) to increase the power of comprehension
35. The following method stresses on the spoken language.
    1) The Translation method
    2) The Reading method
    3) The Direct method
    4) The Communicative method
36. (CLT) Communicative Language Teaching believes that
    1) Language learning happens best when the atmosphere is relaxed and learner receives encouragement
    2) Language learning happens when the atmosphere is rule based
    3) Language learning happens best when the teacher dominates the class while teaching.
    4) Language learning happens when reading is given top priority.
37. Along with 'translation' what is the predominant feature of 'Translation method ?
    1) Comprehension
    2) Comparison 3) Grammar
    4) Explanation
38. What are the given statements associated with -
    - It is not re-teaching
    - It is highly specific and need based
    - It has more practice than theory
    - At the end there is always a test and the achievement is expected to the very high
    1) Micro teaching
    2) Reflective teaching
    3) Remedial teaching
    4) Practice teaching
39. In ________ Mother Tongue is totally banned
    1) Grammar Translation Method
    2) Direct Method
    3) Bilingual Method
    4) Reading Method
40. Language learning is a natural process in ________ approach.
    1) Structural 2) Oral
    3) Communicative 4) Eclectic

KEY

1) 2	2) 4	3) 3	4) 3	5) 3
6) 3	7) 4	8) 1	9) 2	10) 4
11) 1	12) 1	13) 2	14) 1	15) 2
16) 2	17) 3	18) 4	19) 4	20) 4
21) 2	22) 1	23) 4	24) 3	25) 2
26) 2	27) 2	28) 1	29) 3	30) 4
31) 1	32) 1	33) 1	34) 2	35) 3
36) 1	37) 3	38) 3	39) 2	40) 3

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
మంగళవారం : 3-9-2024

'గోల్డెన్ రైస్'ను సృష్టించిన శాస్త్రవేత్త?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

1. 'బయోటెక్నాలజీ' (జీవ సాంకేతిక శాస్త్రం) అనే పదాన్ని మొదటిసారిగా ఉపయోగించినవారు?
   1) జాన్‌కోల్ రీటర్ 2) వాక్స్‌మెన్
   3) కార్ల్ ఎరికే 4) లీవెన్ హక్
2. కిందివాటిలో సరైన వాక్యాలు ఏవి?
   ఎ) 'డాలి'.. ప్రపంచంలో మొదటిసారిగా సృష్టించిన క్లోన్డ్ గొర్రెపిల్ల. దీన్ని 'రోసేలిన్ ఇన్‌స్టిట్యూట్' శాస్త్రవేత్త ఇయాన్ విల్మట్ సృష్టించారు
   బి) 'ఈవ్'.. మొదటి క్లోన్డ్ బేబీ. దీన్ని సృష్టించిన సంస్థ 'సియోల్ నేషనల్ యూనివర్సిటీ'
   సి) సంరూప, గరిమా అనే పెయ్య దూడలను సృష్టించింది నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌డీఆర్‌ఐ), కర్నాల్ (హర్యానా)
   1) ఎ, బి 2) బి, సి
   3) ఎ, సి 4) ఎ, బి, సి
3. 'ఇంటర్‌ఫెరాన్'లను ప్రధానంగా ఏ జీవులు ఉత్పత్తి చేస్తాయి?
   1) అకశేరుకాలు 2) సకశేరుకాలు
   3) బ్యాక్టీరియాలు 4) శిలీంధ్రాలు
4. ఇంటర్‌ఫెరాన్‌లను కనుగొన్నవారు?
   1) గిల్‌బర్ట్, వీస్‌మన్
   2) కోహ్లర్, మిల్‌స్టీన్
   3) నాథన్స్ 4) థామ్సన్
5. కిందివాటిలో జన్యు పరివర్తిత మొక్కకు ఉదాహరణ?
   1) వరిలో IR - 8 2) గోల్డెన్ రైస్
   3) సజ్జలో పూసా మోతి
   4) వేరుశనగలో TMV - 3
6. కిందివాటిలో 'బ్యాక్టీరియల్ పెస్టిసైడ్' ఏది?
   1) బాసిల్లస్ ఆంత్రాసిస్
   2) బాసిల్లస్ పాలిమిక్సా
   3) క్లాస్ట్రీడియం బొట్యులినమ్
   4) బాసిల్లస్ థురింజియాన్సిస్
7. 'తైపేయి' అనేది ఏ పంట రకం?
   1) జొన్న 2) గోధుమ
   3) వరి 4) సజ్జ
8. 'గోల్డెన్ రైస్'ను ఏవిధంగా ఉత్పత్తి చేస్తారు?
   1) వరిలోని పూసా రకాన్ని IR-8 రకంతో సంకరణం చేయడం ద్వారా
   2) తైపేయి అనే వరి రకంలో 'విటమిన్-ఎ'ను ఉత్పత్తి చేసే మూడు జన్యువులను ప్రవేశపెట్టడం ద్వారా
   3) అధిక దిగుబడిని సాధించడానికి వరిలోని 'అనామిక' రకంలోకి జన్యువులను ప్రవేశపెట్టడం ద్వారా
   4) వరిలోని 'బీరాజ్' రకంలో ఉత్పరివర్తనాలను కలిగించడం ద్వారా
9. సూక్ష్మజీవులను ఉపయోగించి.. నేల లేదా నీటి నుంచి అనవసర వ్యర్థ పదార్థాలు, కాలుష్య కారకాలను తొలగించే పద్ధతిని ఏమంటారు?
   1) బయోఇన్ఫర్మేటిక్స్
   2) ప్రోటియోమిక్స్
   3) బయోరెమిడియేషన్4) జీనోమిక్స్
10. జున్ను ఉత్పత్తికి ఉపయోగించే జంతు ఎంజైమ్ ఏది?
    1) పపేన్ 2) రెన్నెట్
    3) లైపాక్సిజినేజ్ 4) లైపేజ్
11. మాంసం మృదుత్వానికి, తోళ్లను మెత్తబరచడానికి ఉపయోగించే ఎంజైమ్‌లు వరసగా?
    1) పపేన్, రెన్నెట్
    2) పపేన్, ప్రోటియేజ్
    3) ప్రోటియేజ్, ట్రిప్సిన్
    4) రెన్నెట్, లైపేజ్
12. 'గోల్డెన్ రైస్'ను సృష్టించిన శాస్త్రవేత్త?
    1) కొహ్లెర్ 2) నాథన్స్
    3) నార్మన్ బోర్లాగ్ 4) ఇంగోపాట్రికస్
13. కిందివాటిలో జన్యుపరివర్తిత మొక్కకు ఉదాహరణ?
    1) బంగారు వరి 2) బంగారు వేరుశనగ
    3) బి.టి. పత్తి 4) పైవన్నీ
14. కణజాలవర్ధనం (టిష్యూ కల్చర్) ప్రధానంగా ఏ సూత్రంపై ఆధారపడి పనిచేస్తుంది?
    1) కణ సిద్ధాంతం
    2) సెల్యులార్ టోటిపొటెన్సీ



    3) కణ వంశానుక్రమ సిద్ధాంతం
    4) ఆమ్నిస్ సెల్యులా - ఇ - సెల్యులా
15. 'సెల్యులార్ టోటిపొటెన్సీ' అంటే..?
    1) ఒక కణం క్షయకరణ విభజన చెందగలిగే శక్తి
    2) సరైన నియంత్రణ పరిస్థితుల్లో.. ఆక్సిన్ - సైటోకైనిన్‌లను ఉపయోగించి ప్రకాండ వ్యవస్థను ప్రేరేపించడం
    3) అతి శీతల అభిచర్య జరిపి ఒక మొక్కలో పుష్పోత్పత్తిని ప్రేరేపించడం
    4) అనుకూల పరిస్థితుల్లో కొత్త మొక్కను ఏర్పర్చగలిగే కణం అంతర్గత సామర్థ్యం
16. తొలిసారిగా 'టోటిపొటెన్సీ' అనే పదాన్ని ఉపయోగించినవారు?
    1) మోర్గాన్ 2) స్టీవార్డ్
    3) ముల్లర్ 4) హేబర్ లాండ్
17. 'కణజాలవర్ధన పితామహుడు' ఎవరు?
    1) ఎఫ్.సి. స్టీవార్డ్ 2) మోర్గాన్
    3) హేబర్ లాండ్ 4) ముల్లర్
18. కణజాలవర్ధనంలో యానకం pH విలువ ఏ విధంగా ఉండాలి?
    1) 3.0 - 5.0 2) 7.2 - 8.0
    3) 5.6 - 6.0 4) 6.3 - 7.4
19. కణజాలవర్ధనంలో ఎక్కువగా ఉపయోగించే యానకం ఏది?
    1) B.S. యానకం 2) S.M. యానకం
    3) M.S. యానకం 4) L.S. యానకం
20. మౌలిక (బేసిక్) యానకంలో లోపించేవి?
    1) సూక్ష్మ మూలకాలు 2) విటమిన్‌లు
    3) కార్బోహైడ్రేట్‌లు
    4) వృద్ధి నియంత్రకాలు
21. కణజాలవర్ధనంలో ఏర్పడే 'అవయవ విభేదనం' చెందని కణాల సముదాయాన్ని ఏమంటారు?
    1) కాలస్ 2) కాలోస్
    3) క్లోన్ 4) ఎక్స్‌ప్లాంట్
22. 'సోడియం ఆల్జినేట్'తో రక్షణ కవచాలను ఏర్పర్చి, గుళికలుగా మార్చే నిర్మాణాలను ఏమంటారు?
    1) ప్లాస్మిడ్‌లు 2) ప్లాస్టిడ్‌లు
    3) సంశ్లేషిత/ కృత్రిమ విత్తనాలు
    4) సైటోప్లాస్ట్‌లు
23. జతపరచండి.

    జాబితా - I
    a) సోడియం హైపోక్లోరైట్
    b) మెర్క్యూరిక్ క్లోరైడ్
    c) సోడియం ఆల్జినేట్
    d) సాయిల్ రైట్

    జాబితా - II
    i) విత్తనాల ఉపరితలాన్ని సూక్ష్మజీవ రహితం చేయడం
    ii) వర్ధనం చేసిన మొక్కలను నాటడం
    iii) ఎక్స్‌ప్లాంట్‌ను సూక్ష్మజీవరహితం చేయడం
    iv) పిండాలను గుళికలుగా మార్చడం

	a	b	c	d
1)	iii	i	iv	ii
2)	iii	i	ii	iv
3)	iv	ii	iii	i
4)	i	iii	ii	iv

24. జతపరచండి.

    జాబితా - I
    a) సోమాక్లోనల్ వైవిధ్యాలు
    b) సూక్ష్మ వ్యాప్తి
    c) శాఖీయ పిండోత్పత్తి
    d) అక్లిమటైజేషన్ (వాతావరణానుకూలత)

    జాబితా - II
    i) కాలస్ నుంచి పిండాల లాంటి నిర్మాణాల అభివృద్ధి
    ii) కణజాలవర్ధనంలో ఏర్పడిన మొక్క ప్రదర్శించే వైవిధ్యాలు
    iii) కణజాలవర్ధనం ద్వారా పెద్దమొత్తంలో తక్కువ స్థలంలో మొక్కలను ఉత్పత్తి చేయడం
    iv) కణజాలవర్ధనం ద్వారా ఏర్పడిన మొక్కలు వాతావరణ అనుకూలతను ప్రదర్శించడం

	a	b	c	d
1)	ii	iii	iv	i
2)	ii	iii	i	iv
3)	i	ii	iii	iv
4)	ii	i	iii	iv

సమాధానాలు

1) 3	2) 3	3) 2	4) 1	5) 2
6) 4	7) 3	8) 2	9) 3	10) 2
11) 2	12) 4	13) 4	14) 2	15) 4
16) 1	17) 3	18) 3	19) 3	20) 4
21) 1	22) 3	23) 1	24) 2	

డీఎన్‌ఏ ఫింగర్‌ప్రింటింగ్

డీఎన్‌ఏ అణువులోని నత్రజని క్షారాల వరస క్రమాన్ని శాస్త్రీయంగా విశ్లేషించి, ఆ డీఎన్‌ఏ ఇతర ఏ వ్యక్తి డీఎన్‌ఏతో పోలి ఉంటుందో నిర్ధారించే పరీక్షను 'డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్' అంటారు. ఇంగ్లండ్‌లోని లీచెస్టర్ యునివర్సిటీకి చెందిన అలెక్ జెఫ్రీస్ 'డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ ప్రక్రియ'ను మొదటిసారిగా 1985లో రూపొందించాడు.

ఏ ఇద్దరు వ్యక్తుల డీఎన్‌ఏ వరస క్రమం కచ్చితంగా ఒకే విధంగా(సమరూప కవలల్లో తప్ప) ఉండదు. అయితే మానవుడి డీఎన్‌ఏ అణువులో ఉండే 3 బిలియన్ల న్యూక్లియోటైడ్‌లలో 99.9% ఇతర వ్యక్తుల డీఎన్‌ఏను పోలి ఉంటుంది. ఇద్దరు వ్యక్తుల మధ్య ఉండే వ్యక్తిగత వైవిధ్యాలు కేవలం 0.1 శాతం న్యూక్లియోటైడ్‌లలోమాత్రమే ప్రధానంగా కనిపిస్తాయి. ఈ విధంగా ఒక వ్యక్తి డీఎన్‌ఏలోని న్యూక్లియోటైడ్‌ల వరస క్రమంలోని వైవిధ్యం డీఎన్‌ఏ ఫింగర్‌ప్రింటింగ్‌కు మూలాధారం.

డీఎన్‌ఏ ఫింగర్‌ప్రింటింగ్‌లో 4 రకాల డీఎన్‌ఏ మార్కర్‌లను ఉపయోగిస్తారు.

అవి.. RFLP, VNTR, STR, SNP.

సేకరించే నమూనాలు

నేరం జరిగిన ప్రదేశంలో లభించే రక్తం (ముఖ్యంగా తెల్ల రక్త కణాలు), తల వెంట్రుకల మూలాలు, వీర్యం, యోని స్రావం, చర్మంలోని కొంత భాగం లేదా చాలా కాలం కిందట పూడ్చిపెట్టిన శవం ఎముకల నుంచి డీఎన్‌ఏను సేకరిస్తారు.

దోషిని గుర్తించే పద్ధతి

సేకరించిన డీఎన్‌ఏను పీసీఆర్ ప్రక్రియ ద్వారా అనేక వందల రెట్లు పెంచి ఆ నేరానికి సంబంధించిన అనుమానిత వ్యక్తి రక్తం నుంచి సేకరించిన డీఎన్‌ఏ స్వరూపంతో సరిపోల్చి నేరాన్ని నిర్ధారిస్తారు.

భారత్‌లో డీఎన్‌ఏ ఫింగర్‌ప్రింటింగ్

మనదేశంలో ఈ పద్ధతిని మొదటిసారిగా ఉపయోగించి, వ్యాప్తిలోకి తెచ్చినవారు సీసీఎంబీ డైరెక్టర్ డా.లాల్జీసింగ్. ఈయన కేరళలోని న్యాయస్థానంలో దాఖలైన అత్యాచార కేసులో దోషిని గుర్తించడంలో ఈ పరిజ్ఞానాన్ని ఉపయోగించారు.

ఈ పరీక్ష జరిపే 'సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్‌ప్రింటింగ్' సంస్థను హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఏర్పాటు చేశారు.

అనువర్తనాలు

1. ఫోరెన్సిక్ విశ్లేషణ ద్వారా దొంగలు, హంతకులు, అత్యాచారం చేసినవారిని గుర్తించవచ్చు. తల్లిదండ్రులు - పిల్లల మధ్య ఉన్న రక్త సంబంధాన్ని నిర్ధారించవచ్చు.
2. అంతరించిపోయే జాతుల సంరక్షణకు దీన్ని ఉపయోగిస్తున్నారు.
3. మెడికో, లీగల్ వివాదాల పరిష్కారాల్లో డీఎన్‌ఏ ఫింగర్‌ప్రింటింగ్ ద్వారా మాతృత్వం, పితృత్వాన్ని కచ్చితంగా కనుక్కోవచ్చు.
4. జంతువులు, మానవుల వర్గ వికాస చరిత్రను తెలుసుకోవచ్చు.

ఉద్యోగాలు

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, ముంబైలో వివిధ ఉద్యోగాలు

ముంబైలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ షిప్‌రిపేర్ యూనిట్‌లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 08.
- పోస్టుల వివరాలు: ప్రాజెక్ట్ ఆఫీసర్(మెకానికల్)-04, ప్రాజెక్ట్ ఆఫీసర్ (ఎలక్ట్రికల్)-03, ప్రాజెక్ట్ ఆఫీసర్(ఇన్‌స్ట్రుమెంటేషన్)-01.
- అర్హత: కనీసం 60 శాతం మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ(మెకానికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- వేతనం: నెలకు మొదటి ఏడాదికి రూ.37,000, రెండో ఏడాది రూ.38,000, మూడో ఏడాది రూ.40,000.
- ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ, పని అనుభవం ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం:

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 28.08.2024.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 27.09.2024.
- వెబ్‌సైట్: https://cochinshipyard.in

పీడీఐఎల్‌లో 22 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు

నోయిడాలోని ప్రాజెక్ట్స్ అండ్ డెవలప్‌మెంట్ ఇండియా లిమిటెడ్(పీడీఐఎల్) పీడీఐఎల్ కార్యాలయాలు/ప్రాజెక్ట్ సైట్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 22.
- పోస్టుల వివరాలు: మేనేజ్‌మెంట్ ట్రైనీ (ప్రాసెస్-కెమికల్)-10, రెగ్యులర్ పోస్టులు (ఫైనాన్స్/హెచ్ఆర్/మెకానికల్/సివిల్)-12.
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ, గేట్-2024 స్కోరు, సీఏ/ఐసీడబ్ల్యూఏ, పీజీ, పీజీ డిప్లొమా, డిప్లొమా, ఐటీఐ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 16.08.2024.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 11.09.2024.
- వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేదీలు: అక్టోబర్ మొదటి లేదా రెండో వారం 2024.
- ఇంటర్వ్యూ వేదిక: పీడీఐఎల్ భవన్, నోయిడా.
- వెబ్‌సైట్: https://www.pdilin.com

హైదరాబాద్ సంస్థానంలో 'పోలీసు చర్య' ఎప్పుడు జరిగింది?

మాదిరి ప్రశ్నలు



1. తూర్పు ఇండియా వర్తక సంఘంతో సైన్య సహకార ఒప్పందానికి అంగీకరిస్తూ మొట్టమొదటగా సంతకం చేసిన స్వదేశీ సంస్థానం ఏది?
   1) తంజావూరు 2) ఔధ్
   3) హైదరాబాద్ 4) మైసూరు
2. 'అట్ ది ఫీట్ ఆఫ్ ది మాస్టర్' గ్రంథాన్ని ఎవరు రచించారు?
   1) జిడ్డు కృష్ణమూర్తి 2) సర్వేపల్లి రాధాకృష్ణ
   3) అనిబీసెంట్ 4) సి.ఆర్. రెడ్డి
3. కింద పేర్కొన్న ప్రముఖుల జాబితాలో భిన్నమైన వ్యక్తిని గుర్తించండి.
   1) రావి నారాయణ రెడ్డి
   2) బద్దం ఎల్లారెడ్డి 3) వి. ఆళ్వారు స్వామి
   4) రామానంద తీర్థ
4. హైదరాబాద్ రాష్ట్రంలో 'ఇత్తెహాద్-ఉల్-ముస్లిమీన్' ఏ సంవత్సరంలో ఆవిర్భవించింది?
   1) 1927 2) 1930
   3) 1938 4) 1940
5. ఇండియన్ యూనియన్‌తో హైదరాబాద్ ప్రభుత్వం యథాతథ ఒప్పందాన్ని ఏ తేదీన కుదుర్చుకుంది?
   1) 1947 నవంబర్ 27
   2) 1947 నవంబర్ 28
   3) 1947 నవంబర్ 29
   4) 1947 నవంబర్ 30
6. ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని ఏ సంవత్సరంలో నెలకొల్పారు?
   1) 1916 2) 1917
   3) 1918 4) 1919
7. 'హిస్టరీ ఆఫ్ తెలంగాణ ఆర్మ్‌డ్ స్ట్రగుల్' (తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర) గ్రంథాన్ని ఎవరు రాశారు?
   1) బి. రామకృష్ణారావు
   2) దేవులపల్లి రామానుజరావు
   3) రావి నారాయణ రెడ్డి
   4) రామానంద తీర్థ
8. హైదరాబాద్ రాష్ట్రంలో జరిగిన 'చాందా రైల్వే స్కీమ్' ఆందోళన దేన్ని సూచిస్తుంది?
   1) రాష్ట్రంలో ప్రజా చైతన్యం ఆరంభం
   2) ప్రభుత్వ ఉదార విధానం
   3) ముస్లిం ప్రభువర్గాల వైఖరి
   4) పైన పేర్కొన్నవేవీ కావు
9. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'వందేమాతర ఉద్యమం' ఏ సంవత్సరంలో జరిగింది?
   1) 1905 2) 1921
   3) 1935 4) 1938
10. హైదరాబాద్ రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీని ఏ సంవత్సరంలో బహిష్కరించారు?
    1) 1943 2) 1944
    3) 1945 4) 1946
11. హైదరాబాద్ నిజాం 1932లో అరవముదు అయ్యంగార్ అధ్యక్షతన నియమించిన కమిటీ వేటికి సంబంధించింది?
    1) సాంఘిక సంస్కరణలు
    2) రాజకీయ సంస్కరణలు
    3) విద్యారంగ సంస్కరణలు
    4) మత సామరస్యం
12. శ్రీకృష్ణ దేవరాయ ఆంధ్రభాషా నిలయాన్ని ఎవరు నెలకొల్పారు?
    1) కొమర్రాజు లక్ష్మణరావు
    2) మాడపాటి హన్మంతరావు
    3) బూర్గుల రామకృష్ణారావు
    4) ఆదిరాజు వీరభద్రరావు
13. హైదరాబాద్‌లోని 'సాలార్‌జంగ్ మ్యూజియం'లో ప్రదర్శిస్తున్న వస్తువులను ప్రధానంగా ఎవరు సేకరించారు?
    1) మీర్ మొమిన్ 2) మొదటి సాలార్ జంగ్
    3) రెండో సాలార్ జంగ్
    4) మూడో సాలార్ జంగ్
14. అద్దంకి గంగాధర కవి ఏ పాలకుడి కొలువులో ఉన్నారు?
    1) సింగ భూపాలుడు
    2) అబుల్ హసన్ తానీషా
    3) ఇబ్రహీం కుతుబ్ షా
    4) కాకతీయ ప్రతాపరుద్రుడు
15. 'రామప్ప దేవాలయం'ను ఏ సంవత్సరంలో నిర్మించారు?
    1) క్రీ.శ. 1162 2) క్రీ.శ. 1191
    3) క్రీ.శ. 1206 4) క్రీ.శ. 1213
16. పాలంపేటలో ప్రసిద్ధ 'రామప్ప దేవాలయం'ను ఎవరు నిర్మించారు?
    1) గణపతిదేవుడు 2) రేచర్ల రుద్రుడు
    3) జాయప నాయకుడు
    4) ప్రతాపరుద్రుడు
17. నిజాం-ఉల్-ముల్క్ ఏ మొగల్ పాలకుడిని ఓడించి, హైదరాబాద్ మొదటి నిజాం అయ్యాడు?
    1) అబుల్ హసన్ తానీషా
    2) హసన్ కులీ ఖాన్
    3) ముబారిజ్ ఖాన్ 4) అజయ్ షా
18. 'పచ్చల సోమేశ్వర దేవాలయం' ఎక్కడ ఉంది?
    1) వరంగల్ 2) అలంపూర్
    3) వేములవాడ 4) పానగల్
19. భారతదేశంలో బ్రిటిషర్లు మొట్టమొదటి స్థావరాన్ని ఎక్కడ నిర్మించుకున్నారు?
    1) బొంబాయి 2) మద్రాసు
    3) హుగ్లీ 4) సూరత్
20. కోరమాండల్ తీరం నుంచి దచ్చివారి ప్రధాన ఎగుమతి ఏది?
    1) నేత సరకు 2) నీలి మందు
    3) మసాలా దినుసులు 4) సురేకారం
21. హైదరాబాద్ సంస్థానంలో 'పోలీసు చర్య' ఎప్పుడు జరిగింది?
    1) డిసెంబరు 1947 2) సెప్టెంబరు 1948
    3) డిసెంబరు 1948 4) మార్చి 1949
22. మహమ్మద్ కులీ కుతుబ్ షా గోల్కొండ సింహాసనాన్ని ఏ సంవత్సరంలో అధిష్టించాడు?
    1) క్రీ.శ. 1512 2) క్రీ.శ. 1518
    3) క్రీ.శ. 1580 4) క్రీ.శ. 1591
23. హైదరాబాద్ సంస్థానంపై జరిపిన సైనిక చర్య పేరేమిటి?
    1) ఆపరేషన్ బ్లూస్టార్
    2) ఆపరేషన్ భజరంగ్
    3) ఆపరేషన్ పోలో 4) ఆపరేషన్ జీరో
24. బ్రిటిష్ తూర్పు ఇండియా వర్తక సంఘం మచిలీపట్నంలో స్థావరం (ఫ్యాక్టరీ) స్థాపించుకోవడానికి అనుమతి ఇచ్చిన పాలకుడు ఎవరు?
    1) ఇబ్రహీం కుతుబ్ షా
    2) అబ్దుల్లా కుతుబ్ షా
    3) మహమ్మద్ కులీ కుతుబ్ షా
    4) మహమ్మద్ కుతుబ్ షా
25. 'హైదరాబాద్‌లో ఆర్య సమాజం'ను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
    1) 1890 2) 1892
    3) 1895 4) 1896
26. 1906లో హైదరాబాద్‌లో స్థాపించిన 'వివేక వర్ధిని' పాఠశాలతో కింది వారిలో ఎవరికి సంబంధం లేదు?
    1) కేశవరావ్ కొరాట్కర్
    2) వామన రావ్ నాయక్
    3) గణపతిరావ్ హార్డికర్
    4) స్వామీ రామానంద తీర్థ
27. హరిజనుల సముద్ధరణ కార్యక్రమంలో భాగంగా మహాత్మాగాంధీ హైదరాబాద్‌ను ఏ సంవత్సరంలో సందర్శించారు?
    1) 1930 2) 1931
    3) 1932 4) 1936
28. వైస్రాయ్ ఆఫ్ ఇండియా 'లార్డ్ రిప్పన్' హైదరాబాద్ నగరాన్ని ఏ నిజాం కాలంలో సందర్శించాడు?
    1) మీర్ ఉస్మాన్ అలీఖాన్
    2) నిజాం అలీఖాన్ 3) అఫ్జలుద్దౌలా
    4) మీర్ మహబూబ్ అలీఖాన్
29. హైదరాబాద్‌లో హైకోర్టు, ఉస్మానియా జనరల్ ఆసుపత్రిని ఏ నిజాం కాలంలో నిర్మించారు?
    1) నిజాం అలీఖాన్
    2) మీర్ మహబూబ్ అలీఖాన్
    3) సికిందర్ జా 4) మీర్ ఉస్మాన్ అలీఖాన్
30. 'ది ట్రాజెడీ ఆఫ్ హైదరాబాద్' గ్రంథకర్త?
    1) సయ్యద్ అలీ బిల్‌గ్రామి
    2) లాయక్ అలీ 3) గులాం యాజ్‌దాని
    4) మహమ్మద్ బిల్‌గ్రామి
31. గండిపేట చెరువు, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ లాంటి చెరువులను ఏ నిజాం కాలంలో తవ్వించారు?
    1) నాసిరుద్దౌలా
    2) మీర్ ఉస్మాన్ అలీఖాన్
    3) అఫ్జలుద్దౌలా 4) సికిందర్ జా
32. ఆర్థిక సంస్కరణల్లో భాగంలో హైదరాబాద్‌లో 'హాలీసిక్కా' అనే రూపాయి నాణేన్ని ఎవరు ప్రవేశపెట్టారు?
    1) మీర్ ఉస్మాన్ అలీఖాన్
    2) మొదటి సాలార్ జంగ్ (తురాబ్ అలీఖాన్)
    3) లాయక్ అలీ 4) సికిందర్ జా
33. 'అసఫ్ జాహీ పతాకం ఢిల్లీ ఎర్రకోటపై ఎగరాలి. బంగాళాఖాతం తరంగాలు హైదరాబాద్ నవాబు పాదాలు కడగాలి' అని ఎవరు వ్యాఖ్యానించారు?
    1) సాదర్ జంగ్ అలీ
    2) షోయబుల్లాఖాన్
    3) మీర్ ఉస్మాన్ అలీఖాన్
    4) కాశీం రజ్వీ
34 రాజధానిని ఔరంగాబాద్ నుంచి హైదరాబాద్‌కు మార్చిన పాలకుడెవరు?
    1) నిజాం అలీఖాన్ 2) సికిందర్ జా
    3) మీర్ ఉస్మాన్ అలీఖాన్
    4) నాసిరుద్దౌలా
35. 1765లో ఉత్తర సర్కార్ ప్రాంతాలను ఆంగ్లేయులకు ఇవ్వడానికి హైదరాబాద్ నవాబు నిజాం అలీఖాన్ తిరస్కరించాడు. ఆ సందర్భంలో ఆంగ్లేయులకు, నిజాంకు మధ్య సంధానకర్తగా ఎవరు వ్యవహరించారు?
    1) రుకినుద్దౌలా 2) సలాబత్ జంగ్
    3) బసాలత్ జంగ్
    4) కాంద్రేగుల జోగిపంతులు
36. హైదరాబాద్ రాజ్యంలో 'వహాబీ' ఉద్యమానికి ఎవరు నాయకత్వం వహించారు?
    1) ముబారిజుద్దౌలా 2) నాసిరుద్దౌలా
    3) నిజాం అలీఖాన్ 4) సికిందర్ జా
37. 1857 సిపాయిల తిరుగుబాటు కాలంలో హైదరాబాద్ సంస్థాన పాలకుడెవరు?
    1) మీర్ ఉస్మాన్ అలీఖాన్
    2) నాసిరుద్దౌలా 3) అఫ్జలుద్దౌలా
    4) మహబూబ్ అలీఖాన్
38. కింద పేర్కొన్న వారిలో 'వందేమాతరం గీతం' ఆలపించడంలో తెలంగాణలో ప్రసిద్ధి పొందిన నాయకుడు ఎవరు?
    1) మాడపాటి హన్మంత రావు
    2) వెల్దుర్తి మాణిక్యరావు
    3) రామచంద్రరావు 4) బండి యాదగిరి
39. హైదరాబాద్‌లో 'ఆంధ్ర సారస్వత పరిషత్' ను ఎవరు స్థాపించారు?
    1) ధవళ శ్రీనివాసరావు
    2) దేవులపల్లి రామానుజరావు
    3) కాళోజీ నారాయణరావు
    4) బిరుదు వెంకట శేషయ్య
40. హైదరాబాద్‌లో 'నిజాం కళాశాల'ను ఏ సంవత్సరంలో స్థాపించారు?
    1) 1887 2) 1886
    3) 1885 4) 1884
41. తెలంగాణ ప్రాంత ప్రజలను రాజకీయంగా జాగృతం చేయడానికి 1913లో 'మానవతా సంఘం (Humanitarian League)'ను ఎవరు నెలకొల్పారు?
    1) అఘోరనాథ ఛటోపాధ్యాయ
    2) రాయ్ బాలముకుంద్
    3) వామనరావ్ నాయక్
    4) సరోజినీ నాయుడు
42. 1905లో 'ఆంధ్ర సంవర్ధినీ గ్రంథాలయం'ను ఎక్కడ స్థాపించారు?
    1) సికింద్రాబాద్ 2) నల్లగొండ
    3) మహబూబ్ నగర్ 4) హైదరాబాద్
43. తెలంగాణ ప్రాంత ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకురావడానికి 1921లో హైదరాబాద్‌లో నిర్వహించిన 'ది నిజాం స్టేట్ సోషల్ కాన్ఫరెన్స్'కు ఎవరు అధ్యక్షత వహించారు?
    1) మహర్షి కార్వే 2) కేశవరావ్ కొరాట్కర్
    3) మాడపాటి హన్మంతరావు
    4) రామానంద తీర్థ
44. తెలంగాణలో తెలుగు భాషా ప్రాముఖ్యాన్ని గుర్తిస్తూ 'ఆంధ్ర జనసంఘం'ను ఏర్పాటు చేయడంలో కింది వారిలో ముఖ్య కారకులు?
    1) బూర్గుల రామకృష్ణారావు
    2) మాడపాటి హన్మంతరావు
    3) ఆదిరాజు వీరభద్రరావు
    4) అల్లంపల్లి వెంకటరామారావు
45. 1906లో హైదరాబాద్‌లో 'విజ్ఞాన చంద్రికా మండలి' వ్యవస్థాపకులు ఎవరు?
    1) రామానంద తీర్థ
    2) సురవరం ప్రతాపరెడ్డి
    3) కొమర్రాజు లక్ష్మణరావు
    4) మాడపాటి హన్మంతరావు
46. హైదరాబాద్ రాష్ట్రంలో 'జిల్లా బందీ పద్ధతి'ని ఏ సంవత్సరంలో ప్రవేశపెట్టారు?
    1) 1862 2) 1863
    3) 1864 4) 1865
47. పశ్చిమ చాళుక్యులు నిర్మించిన దేవాలయాలు తెలంగాణలో ఎక్కడ ఉన్నాయి?
    1) వేములవాడ 2) ఓరుగల్లు
    3) అలంపురం 4) పిల్లలమర్రి
48. కిందివాటిలో సరికాని జత ఏది?
    1) నన్నెచోడుడు-కుమార సంభవం
    2) సోమనాథుడు-పండితారాధ్య చరిత్ర
    3) వేములవాడ భీమకవి-బసవ పురాణం
    4) మల్లికార్జున పండితారాధ్యుడు-శివతత్త్వసారం
49. 1182లో జరిగిన పల్నాటి యుద్ధంలో నలగాముడికి సహాయంగా పల్నాడుకు సైన్యాన్ని పంపిన కాకతీయ చక్రవర్తి?
    1) రుద్రమదేవి 2) ప్రతాపరుద్రుడు
    3) రుద్రదేవుడు 4) గణపతిదేవుడు
50. 'ఆంధ్ర సురత్రాణ' అనేది ఎవరి సుప్రసిద్ధ బిరుదు?
    1) ప్రోలయనాయకుడు 2) అనవేమారెడ్డి
    3) కాపయనాయకుడు 4) గన్నయ
51. ఎర్రాప్రెగడ ఎవరి ఆస్థానంలో విద్యాధికారి?
    1) అల్లాడరెడ్డి 2) అనవేమారెడ్డి
    3) ప్రోలయవేమారెడ్డి 4) అనవోతారెడ్డి
52. కాకతీయ రాజ్యంలో ముఖ్యమైన ఓడరేవు ఏది? 1) నెల్లూరు 2) మచిలీపట్నం
    3) మోటుపల్లి 4) ధరణికోట
53. రుద్రమదేవి పాలనాకాలంలో ఆంధ్రదేశాన్ని సందర్శించిన విదేశీ యాత్రికుడు?
    1) డొమింగో పేస్ 2) నికోలోకోంటి
    3) మార్కోపోలో 4) జోర్డానస్
54. హన్మకొండలోని వేయిస్తంభాల గుడి ఎవరి పోషణలో నిర్మితమైంది?
    1) రుద్రదేవుడు 2) రుద్రమదేవి
    3) గణపతి దేవుడు 4) ప్రతాపరుద్రుడు
55. తొలితరం కాకతీయ పాలకులు పోషించిన మతం ఏది?
    1) జైనం 2) శైవం
    3) బౌద్ధం 4) వైష్ణవం

సమాధానాలు

1) 3	2) 1	3) 4	4) 1	5) 3
6) 3	7) 2	8) 1	9) 4	10) 4
11) 2	12) 1	13) 4	14) 3	15) 4
16) 2	17) 3	18) 4	19) 4	20) 3
21) 2	22) 3	23) 3	24) 3	25) 2
26) 4	27) 1	28) 4	29) 4	30) 2
31) 2	32) 2	33) 4	34) 1	35) 4
36) 1	37) 3	38) 3	39) 4	40) 1
41) 2	42) 1	43) 1	44) 4	45) 3
46) 2	47) 3	48) 3	49) 3	50) 3
51) 3	52) 3	53) 3	54) 1	55) 1